5413

23


262
4B

1100
4

Missing ... 1943

1943
From ... 550 to

5413



పొలిమేర

సంపుటము 20
సంచిక 1

భారతి

చిత్రభాను పుష్యము
1943 జనవరి

స్వవిషయము

అనంతకాలవాహినిలో మరొక్క యేడు గడచినది. కాలపురుషుని ఆయుఃపరిమాణసంపుటిలో మరొక్క ఆకు తిరిగిపోయినది.

నేటితో భారతి ఇరువదియవయేట ప్రవేశించినది. పందొమ్మిదేండ్లు నిరంతరాయముగా గడచిపోయి, ఇరువదియవయేట ప్రవేశించిన ఈదినము భారతికి పర్వదినము. పత్రికానిర్వహణము బహుభంగుల అగ్నిపరీక్ష కాహుతియవుచున్న ఈసమయమున నిట్టిది గర్వించి, సంతసింపదగిన విశేష మనక తప్పదు. కీర్తిశేషులు పూజ్య శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి సంకల్పబలమువల్లను, భగవంతుని ఇచ్ఛాశక్తివల్లను, కవిపండితుల ఆదరణవల్లను భారతి కాలదేశావచ్ఛిన్నములైన కష్టనష్టముల నన్నిటిని దాటుకొనుచు, ఈనాటి కింత అభ్యుదయముగాంచి, ఆంధ్రావళి మోదమొందునట్లుగా మెలగుచు మనగలిగినది. ఇంతగా పెంచి పెద్దచేసిన ఆ త్రిమూర్తులకును భారతి ఈపర్వదినమున నతమస్తకముతో నమోవాకము లర్పించుచున్నది.

ఈతరుణములో సింహావలోకనము చేయుటగూడ నిర్వాహకులకు విధియై యున్నది. ఆత్మావలోకనమునకు అదియే పరమోపాయము.

ఆంధ్రసాహిత్యమునకు అభినవ వికాసమును సమకూర్చుటకును, విశ్వసాహిత్యములో దాని కొక విశిష్టస్థానమును సంపాదించుటకును భారతి ఆదినుండి ఆసించినది. దాని కొనమే పాటుపడుచున్నది. అదియే భారతి యేకైకలక్ష్యము. ఇది త్రికాలాబాధితమైన సత్యము. ప్రాచీన నవీనపథముల సమన్వయప్రయత్నముకూడ ఆలక్ష్యములో నొకభాగమై యున్నది. భారతిని వరుసగా పరిశీలించుచున్నవారికి ఈసత్యము గోచరముకాకపోదు.

ఆంధ్రసాహిత్యము వెనుకటి రెండుదశాబ్దులలోను సాటిలేని చైతన్యముతో వీరవిహారముచేసినది. పాటిసారస్వతముల నన్నిటిని త్రోసిరాజుచేసి ముందడుగువేసినది.

ఆ అధ్యాయములనన్నిటిని భారతి యెప్పటికప్పుడు చిత్రించుచునే వచ్చినది. నాటి సాహిత్య వికాసమును భారతిసంపుటములు అద్దములోవలె చూపగలవు. నాటి సాహిత్యస్వరూప మును భారతి తత్తద్దశానుసారము కన్నులవిందుగా ప్రదర్శించుచునే వచ్చినది.

కాని, నేడు ఆంధ్రసారస్వతరంగములో వెనుకటిచైతన్యము కానవచ్చుటలేదు. సాహితీగతి నడక కొంచెము మందగించినది. ఈ మందగమనమునకు వర్తమాన దేశకాల పరిస్థితుల బాధ్యత ప్రధానమై యున్నదనుట ప్రత్యక్షరహస్యము. నేడు ప్రపంచమంతయు సంగ్రామరంగమైపోయినది. వాతావరణము మహాభీకరమై పోయినది. ప్రజానీకమును వివిధసమస్యలు పీడించుచున్నవి. ఈ విలయవేళలో సాహిత్యయాత్ర మందగించుట ఒక అబ్బురముగాదు.

అట్లని, ఆంధ్రసాహితీపరులు నిరాశాపూరితులై చేతులు ముడుచుకొని కూర్చొ లేదు. అబ్బినమట్టుకేనాయె—ఆంధ్రసాహిత్యమునకును, విశ్వసాహిత్యమునకును వియ్యము పొసగించుటకును, ఆంధ్రసాహితీవిజ్ఞానప్రతిభలను దశదిశల చాటుటకును శక్తివంచన లేకుండ పాటుపడుచు, సాహిత్యరంగమున ఎన్నెన్నో క్రొత్తతెన్నులను త్రొక్కుచునే యున్నారు. ఇది నిజముగా గర్వించదగిన యంశము.

వాస్తవమే. కాని, మనము ఈ సాహిత్యయాత్రలో ఇంకను చాలదూర మేగ వలసియున్నది. కావున ఇతోధికమైన ఉత్సాహముతో, ఇతోధికమైన చైతన్యముతో త్వరితగతిని పూనవలసియున్నదనియే మే మిప్పుడు చేయు విన్నపము. వర్తమానస్థితిగతులే ఉట్టికట్టుకొని ఊరేగవు. దేశమునావరించియున్న ఈ గడ్డురోజులు దేవునిదయవల్ల త్వర లోనే తొలగిపోయి దేశము మరల సుభిక్షముగా తేజరిల్లి సుఖశాంతులు అమరకపోవు. ఆంధ్రసాహిత్యరంగము తళతళలీను కాంతులతో తేజరిల్లకను పోదు. ఆ శుభోదర్కమునే మేము మనస్ఫూర్తిగా వాంఛించుచున్నాము. దానికొరకే పాటుపడుచున్నాము. అదియే మా ఏకైకాశయము. ఆంధ్ర కవి పండితబృందము ఇబ్బడించిన యుత్సాహముతో మా కట్టి అవకాశమును కల్పించితీరునని గట్టిగా నమ్ముచున్నాము.

భారతినిర్వహణలో మానవమాత్ర సహజములైన లోటుపాట్లు ఎన్నియో ఉండ వచ్చును. లేవను గుండెనిబ్బరము మా కెన్నటికిని లేదు. అవకాశమున్నంతమట్టుకు అట్టివి తారసిల్లకుండ చేయవలయుననియే మాయత్నము. పొరపాటున సంభవించిన వానిని సాధు హృదయముతో ఉపేక్షించి, సాహిత్యసేవలో మా కితోధికమైన తోడ్పాటు చూపవలెనని మేము సాహితీపరులనందరిని సాంజలిబంధముగా కోరుచున్నాము. వారి వీరవిహారమునకు అవకాశమిచ్చుటకు భారతి సదా సంసిద్ధముగానే యున్నది. అటువంటి సేవాభాగ్యమే భారతి కోరుచున్నది.

భారతి పెంపుసొంపులకు కారణభూతమైన ఆంధ్రమహాజనులందరికిని మరొక్క మారు ప్రణమిల్లి, వారి శుభాశీస్సులకు తలయొగ్గుచున్నాము.

—సంపాదకుడు, భారతి.



కతిపయశబ్దార్థ విచారము

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

కార్తికమాసభారతిలో శ్రీ గర్భాం అప్పారావు గారు ప్రస్తుతము వాడుకలో నున్న యాంధ్ర నిఘంటువులందుఁ గొన్ని దేశ్యపదములు గ్రహింపఁబడ లేదనియుఁ, గొన్ని శబ్దముల యర్థములు సరిపడలే దనియుఁ దెల్పుచు, 'లప్ప', 'మాటాకు', 'కన్నె', 'జోగు' శబ్దముల యర్థములను విమర్శించియున్నారు. దీని విషయమున నాకుఁ దోఁచిన సమాధానము దిగ్రింద వరుసగా నిచ్చుచున్నాను.

'లప్ప'

లప్పశబ్దమునకు శబ్దరత్నాకరమున రాశి యను నర్థ మీయఁబడియున్నది. దాని కుదాహరణముగా 'కస్తురిలప్ప', 'చక్కెరలప్ప' అను పదములును, "మంచులప్పల మించు మండెగమడుపులు పారఁతి బెట్టువగట్టు సురవులయ్యె" అను (నైషధము ౬-౧౨౮) పద్యము నొసఁగఁబడినవి. ఈ యర్థ మన్ని చోటుల సరిపడునా, లేక తద్వ్యతిరేక మను నర్థము కూడఁ గలదా యని సందేహము. ఈ విషయము నిర్ణయించుటకు మఱికొన్ని ప్రయోగములను మన మరయ వలసియున్నది. అందు ముఖ్యముగా నాకు లభ్యమైన వీ క్రింద నిచ్చుచున్నాను.

౧. "కస్తూరిపీఁటెలు కపురంపులప్పలు
నిండిన గృహములు నెరయ దాఁటి
...చూచె నొక దివ్యరత్ననిస్తుల గృహంబు."
(హంసవింశతి, ౧-౮౧)
"...కస్తురిలప్ప సొంపారు పికిలిచెండు."
(నీలాసుందరీపరిణయము, ౨-౨౬)

౨. "ఎక్కడఁ బట్టినం గళల
యిక్కువ లెక్కడ నోరు పోఁకినం
జక్కెరలప్ప లే మనిన
సారసుధారస మెట్టు లుండినన్
జక్కఁదనంబు పెన్నిధులు..."
(కాళహస్తిమాహాత్మ్యము, ౧-౮౩)
"మాటలఁ దేనెగాఱు నటి
మందము చక్కని మేను మించులోఁ
దేటఁ మెఱుంగుంబు చందురుని
తీరగుఁ జక్కెరలప్ప మోవి..."

(ప్రబంధరాజపరవేంకటేశ్వర
శ్రీవేంకటేశ్వరవిలాసము, ౪౫౬)

3. "...చమంగపమ్మై నరకాళ్లఁ బాణలన్
లప్పలుగాఁగఁ జందన ము
లందును........"
(కళాపూర్ణోదయము, ౬-౨౫౨)

'మంచులప్పలు' (నైషధము, ౬-౧౨౪)

ఈ పై ప్రయోగములఁబట్టియు, బ్రౌణ్యనిఘంటువున లప్పశబ్దమునకుఁ గల "A lump (as of sugar or of civet.)" అను నర్థమునుబట్టియు "రాశి, ప్రోగు; కడ్డీ; ముద్ద; గడ్డ" అను నర్థములు యుక్తియుక్తముగాఁ దోఁచుచున్నవి. 'చక్కెర, చక్కెర కడ్డీ' యను నొక విధముగా భక్ష్యములే యగుట నిది యొక భక్ష్యవిశేషముగా వ్రాయవలసిన యావశ్యకత లేదు.

'మా ఆ కు'

'మాఆకు' పదము వ్యస్తమా, సమస్తమా? దీనికి శబ్దరత్నాకరకారుఁ డిచ్చిన 'ప్రాఁకుడుఁగొయ్య, ఉపఘ్నము' అను నర్థము ఉచితమా, అనుచితమా యను సందేహము. కాని, శ్రీ అప్పారావుగారు శబ్దరత్నాకరకారుఁ డుదాహరించిన భాగవతపద్యము ననుసరించియే యిది సమస్తపదమే యనియు, 'మఱియొక యాకు' అను నర్థమే యుండవలె ననియుఁ దెల్పిరి. ఈ విషయమున 'మాఆకు' శబ్దము వ్యస్తమై 'ప్రాఁకుడుఁగొయ్య, ఉపఘ్నము' అను నర్థ మిచ్చుననియు, సమస్తమై 'మఱియొక యాకు' అను నర్థ మిచ్చుననియు నీ క్రింది యుదాహరణల ననుసరించి నిర్ణయింపవచ్చును.

" పాదద్వంద్వము నేలమోపి పవనున్
బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్
మాఆకు హత్తించి ని
ష్ఖేదబ్రహ్మపదావలంబనరతిం
గ్రీడించు యోగీంద్రుమ
ర్యాదన్..."
(భాగవతము, ౫-౬౫)

ఈ పద్యమునకు శ్రీ అప్పారావుగారు తలఁచిన యర్థము సరికాదు. దీని భావము గ్రహించుట కిందలి యలంకారమును గ్రహింపవలెను. గింజ పాతుట, మొక్క మొలచుట, కంచె వేయుట, ప్రాఁకుట కాధారము చూపుట అను దశల తరువాత పందిరియెక్కుట తీఁగకు లక్ష్యము. గింజ మొలకెత్తిన తరువాత పశువులు తినివేయకుండ చుట్టును గంచె వేయవలెను; బయలువెడలిన తీఁగ పైకెక్కుటకు నాధారము కావలెను; ఈ యాధారము ననుసరించి తీఁగ పందిరియెక్కి పుష్పించి ఫలించును. అట్లే యోగీంద్రుఁడును పాదద్వంద్వమును నేలమోపి, పవనుని బంధించి పంచేంద్రియోన్మాదమును బరిమార్చుట— యివియన్నియు వానిని బుద్ధిలతకు మాఆకులే. కాని నిష్ఖేదపదావలంబనరతి యను పందిరి యెక్కుటకుఁ గావలసినది ప్రాఁకుడుఁగొయ్యకాని మాఆకు కాదు. ఇచట మాఆకునకు లోపమే లేదు; ఉపఘ్నము లేనిచో తీఁగ పందిరిపైకి రాఁజాలదు; పైఁగా నేలఁబడి నశించును. నిష్ఖేదబ్రహ్మపదావలంబనరతిశ యను నుపఘ్నసాహాయ్యమున యోగీంద్రుఁడు ముందువశ కేఁగి క్రీడింపఁజాలును.

మఱియు బ్రౌణ్యనిఘంటువున నైతము మాఆకు నకు "A prop, a post for a plant to creep on" అని యున్నది. కనుక, వ్యస్తపదమై పై యర్థమునే యిచ్చుచున్నది. సమస్తపదమున కుదాహరణములు రెండుమూఁడు గలవు:

" గారుడాశ్మచ్ఛటాచ్ఛన్న కనకసౌధ
పాళికల నావితీర్ణవిభ్రాజితుండు
రతులఁ బొలయించె నాశరద్రాజవదన
నతిశయప్రీతిలతిక మాఆకు లిడఁగ."
(వేంకటనాథుని పంచతంత్రము, ౪-౪౦౫)

" అని నగుచు మగువ లందఱు
పనినెపమున నొక్కరొకరె పఱచిన లజ్జా

వీనతౌస్య యనుచు నంగన,
మనమున ననుసిగ్గుదేలె మాటాకొత్తన్."
(వేంకటనాథుని పంచతంత్రము, ౪-౩౧౧)

"విత్తజ్ఞానము పాడు చిత్తము భవా
వేశంబు రక్షాంబువుల్
మత్తత్వంబు తదంకురం బనృతముల్
మాటాకు లత్యంత దు
ర్వృత్తుల్ పువ్వులు పండ్లు మన్మథముఖా
విర్భూతదోషంబులున్
జిత్తాభ్యున్నతనింబభూజమునకున్
శ్రీకాళహస్తీశ్వరా."
(శ్రీకాళహస్తీశ్వరశతకము, ౧౫)

ఈ యుదాహరణములలో స్పష్టముగా మాటాకు లనఁగా నూతనపత్రము లనియు, మాటాకొత్తుట యనఁ జిగురించుట యనియు కన్పట్టుచున్నది.

'కన్నె'

సూర్యరాయాంధ్రనిఘంటువున 'కన్నె' (సం. కర్ణి.) అను దేశ్యపదమునకు 'పశులను గట్టుట కుపయోగించు త్రాడు' అని యిచ్చియున్నారు.

'జోగు'

అందే 'జోగు' అను దేశ్యపదమునకు 'కూలం' అను నర్థము నిచ్చియున్నారు.



కవులు - ప్రమాదములు

= శ్రీ పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి =

ప్రమాదము మహాకావ్యకర్తలగు మహాకవులకే యన నేల, శిష్టశిరోమణులగు మహాత్ములకుఁగూడఁ దప్పినదికాదు. పరశురామాదులవంటి మహానుభావులే యాచారవిషయమునఁ బ్రమాదపడి రని ధర్మశాస్త్రకర్తలు నుడివిరి. ప్రమాదమునకు లోనైన యట్టి యాచారములు మనకుఁ బ్రమాణములు కావనికూడ వారే వ్రాసిరి. పతంజలిభగవానుఁ డిట్టి వాదము నంగీకరించి బుద్ధోక్తుల నిరాకరించెను.

"ప్రమత్తగీత ఏష. తత్రభవతః యస్త్వప్రమత్తగీత స్తత్ప్రమాణమ్."

(మహాభాష్యము, పస్పశాహ్నికము.)

ఇంతయేల, పాణినీయమువంటి మహాశాస్త్రమునకు మూలపురుషుఁడగు పాణినిమహర్షి నే మహాభాష్యకర్త యొకసందర్భమున "ప్రమాదకృత మాచార్యస్య" (మహాభాష్యము, ౮-౨-౧-౩౦) అనినాఁడు. ఇందు దోష మేమి కలదు? ప్రయత్నపడి వ్యాకరణమును సమగ్రముగాఁ జదివియుఁ దదనుశిష్టములగు సాధుశబ్దములఁ బ్రయోగింపఁజాలక వ్యాకరణమునే యెఱుఁగని వారివలె నపశబ్దములనే విరివిగాఁ బ్రయోగించు వైయాకరణుల నెందఱనో ప్రత్యక్షముగా మనము చూచుచున్నాము. ఈవిషయమున మహాభాష్యకర్తయు నిట్లు చెప్పినాఁడు: "కృతప్రయత్నా[1]శ్చాప్రవీణాః[2]" (మహాభాష్యము, పస్పశాహ్నికము).

ఇట్టిచోఁ గవులకుఁ బ్రమాదము లుండవనుట యుక్తియుక్తము కాదు. ధారాశుద్ధితోఁ జక్కని కవిత్వము వ్రాయఁగల కవు లెందఱు మన కిప్పు డగపడుట లేదు? వారి కావ్యములలోఁ బ్రత్యక్షముగాఁ జిత్రవిచిత్రములగు నపశబ్దప్రయోగము లెన్ని మనము చూచుటలేదు? ఇవి కొంతకాలమునకుఁ బ్రాచీనములై మహాకావ్యము లనఁబడక పోవు. ఐనను నందలి తప్పు లొప్పులని యేనాఁడును బరిగ్రహింపఁబడవు. ఇఁక నిందుండు రసభావగర్భితములగు వర్ణనములు, చమత్కారజనకములగు కథాసంవిధానములు, నర్థవంతములగు సాధుశబ్దప్రయోగములు నేనాఁడును నాదరణీయములు కాకపోవు. తెనుఁగున శైవకవులు వ్రాసిన గ్రంథము లీపట్టున మనకు నిదర్శనములు గానోపును. ఈ కావ్యములలో నుపయోగింపఁబడిన యపభ్రంశశబ్దములు పెక్కులు. శ్రీనాథాదులకుఁ బూర్వమే యీ కావ్యములు సుప్రసిద్ధములై యున్నవి. ఐనను శ్రీనాథాది మహాకవులు వీరి కావ్యములనుండి సరసములగు కథాసంవిధానములు, హృద్యములగు వర్ణనములు మున్నగు వానిని హరవిలాసాదులలో గ్రహించిరే కాని విరివిగా వీరు ప్రయోగించిన "మహియ్యాల్, అళ్ధియ్యలే, మహాదేవి, తడియ్యము, యవ్వనము" మున్నగు నపభ్రంశముల గ్రహించి ప్రయోగింప సాహసింపలేదు. మహాకవులు ప్రయోగించినంతమాత్రమున నపశబ్దములు సుశబ్దములు కావు. కావుననే యాంధ్రమహాకవి యగు ధూర్జటి తన 'కాళహస్తిమాహాత్మ్యము'నఁ బరమేశ్వరవిరచితమగు పద్యమునందును దప్పులు గలవని నక్కీరునిచే నీశ్వరునితో వాదము చేయించి గెలిపించినాఁడు. కావ్యరచనాసంప్రదాయములనే యెఱుఁగనివారు కవులుగను, నన్యదేశభాషాసంపర్కమున భాషాస్వరూపమునే తాఱుమాఱొనరింపఁగడఁగువారు భాషాపరిశోధకులుగను, ప్రధానతమమగు సంస్కృతభాషాపరిజ్ఞానమైన నలవడనివారు లక్షణకర్తలుగను, ఉభయభాషాపాండిత్యము మాట యటుండ వర్ణక్రమపరిజ్ఞానమునకైన నోఁచుకొననివారు నిఘంటుకర్తలుగను సంభవించుచుండుటచే నేనాఁటికైన నీదేశభాషల కిట్టి యపభ్రంశములు

---

1. ప్రయత్నాధీతవ్యాకరణాః. 2. శబ్దప్రయోగా దావకుశలాః. (ఉద్ద్యోతము)

ప్రమాణములను వ్యవస్థ పట్టుచేసెనో కాని సంస్కృత మునకుమాత్ర మిట్టి యవస్థ యేవాఁడును బట్టడు. లక్షణజ్ఞానమువలననే సకలలక్ష్యపరిజ్ఞాన మలవడు కొనఁదగు పాణినీయమువంటి విపులమగు వ్యాకరణ మీ భాషకుఁ బ్రాచీనకాలముననే యేర్పడి యున్నది. ఒకరికి ముగ్గురు మహర్షులు శబ్ద ప్రపంచమునంతను జక్కఁగా శోధించి సాధించి యుండుటచే దీనిచే సాధింపఁబడని సాధుశబ్దమే మిగిలినదికాదు. తరువాతి కవులైనను గావ్యభాషకుఁ బ్రధానతమమగు వ్యాకరణము పాణినీయ మనియే తలఁచి దానిని జిహ్వాగ్రమున నుంచుకొనియే తమ కావ్యముల రచించుచువచ్చిరి. వారితరువాతి కవులైనను ఛందోనియమాదులచే నీరెక్కడనేని ప్రమాదపడినప్పుడు పాణినీయమునుబట్టి కవిప్రమాదములుగా వానిని భావించి యాదరింపక త్రోసిపుచ్చిరేకాని ప్రాచీన మహాకవిప్రయోగములుగదా యని ప్రమాణీకరించు కొని తమ కావ్యములలో వానిని దాము ప్రయోగింప లేదు. కావుననే యితరవాఙ్మయములకంటె సంస్కృత వాఙ్మయ మెన్నిరెట్లో పెరిఁగినను పాణినీయమునకు దాఁటిపోఁగల యపభ్రంశము లేకొలఁదిగానో సంభ వించుటయే తటస్థించినది. దీనికి మూలకారణము సంస్కృతమున మహాకవులందఱును వాఙ్మయమున కెల్లఁ బ్రధానతమమగు వ్యాకరణము పాణినీయ మని తలఁచి దానియందుఁ బారంగతులు కానిదే మహా కావ్యరచనకుఁ గడఁగకపోవుటయే.

> కవయ స్తదపేక్షణే తరూ
> న్వ్యథయామాసు రసాధుభిః పదైః,
> పదశాస్త్ర ఇవానధీతినః
> కవయః కర్ణపథాన్విపశ్చితామ్."

అని యొక మహాకవి వచించినట్లు వ్యాకరణ మును జదువక కావ్యకర్తలైనవా రెవరైనఁ గలరేమో కాని సంస్కృతమున వారి వాఙ్మయ మంతగాఁ బ్రబలి ప్రమాణపదము నధిష్ఠింపలేదు.

ఇఁకఁ బ్రకృత మనుసరింతము. మహాకవుల కావ్యములలో గుణదోషవిచారణము సలుపుచుఁ దప్పు లనియు, నొప్పు లనియు వాదులాడుచున్న వారము మనమేకదా! కవు లేసందర్భమున నెట్లు వర్ణించినను నదియెల్ల నాచితీయుక్తమే యని మనము పరిగ్రహిం చుట లేదు. భవభూతివంటిమహాకవి యౌచిత్యమునకుఁ దగఁడని కొన్నిపట్టులలో నిరాకరించుచున్నాము. కాళిదాసుఁ డౌచిత్యమునకుఁ దగినవాఁ డని యొక కావ్యములో నొక సందర్భమున మనము కొనియాడు చున్నాము. మరల నాకవినే యాగ్రంథముననే మఱి యొక సందర్భమున నౌచితిని బోవిడిచె నని మనము విమర్శించుచున్నాము. ఇట్టి యర్థదోషములు కవులకుఁ గలవని మన మొప్పుకొనుచున్నప్పు డర్థముతో నవినా భావసంబంధము గల శబ్దప్రయోగమునమాత్రము వారు పొరపడి రని మన మేల యనఁగూడదు? కావుననే సాహిత్యచక్రవర్తులగు క్షేమేంద్రాదులవంటి మహా కావ్యలక్షణకర్తలు కాళిదాసాదికవిసార్వభౌముల కావ్యములలో నర్థదోషములను, శబ్దదోషములను పెక్కులు గలవని తమ లక్షణగ్రంథములలో నిట్లు దాహరించిరి:

> "నతు యథా కాళిదాసస్య—
> వర్ణప్రకర్షే సతి కర్ణికారం
> దునోతి నిర్గంధతయాస్మ చేతః,
> ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాం
> పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః.

అత్ర కేవలకర్ణికారకుసుమవర్ణనమాత్రేణ విధా తృవాచ్యతాగర్భ్యైన ప్రస్తుతశృంగారానుపయోగినా తదుద్దీపనవిభావోచితం న కించి దభిహితమ్." (ఔచిత్య విచారచర్చ, ౮ పుట)

> "నతు యథా భవభూతేః—
> వృద్ధాస్తే న విచారణీయచరితా
> స్తిష్ఠంతు హుం వర్తతాం,
> సుందస్త్రీదమనేఽప్యఖండయశసో
> లోకే మహాంతో హి తే,
> యాని త్రీణి కుతోముఖాన్యపి పదా
> న్యాసన్ ఖరాయోధనే,
> యద్వా కౌశల మింద్రసూనుదమనే
> తత్రాప్యభిజ్ఞో జనః.

అత్ర ప్రధానస్య రామమూర్తేః కుమారలవస్య పరప్రతాపోత్కర్షాసహిష్ణోర్వీరరసోద్దీపనాయ సకల ప్రబంధజీవితసర్వస్వభూతస్య ప్రధాననాయకగతస్య వీరరసస్య తాటకాదమనఖరరణాపసరణాన్యరణసం సక్తవాలివ్యాపాదనాది జనవిహితాపవాద ప్రతిపాదనేన స్వవచసా కవినా వినాశః కృత ఇత్యనుచితమేతత్".
(ఔచిత్యవిచారచర్చ, ౧౦ పుట)

"గాండీవీ కనకశిలానిభం భుజాభ్యా
మాజఘ్నే విషమ విలోచనస్య వక్షః (భారవిః)

'అత్రో యమహానః.' 'స్వాంగకర్మకాచ్చేత్యనుశాసన బలాదాత్మనేపదస్య హానః స్వాంగకర్మకస్యైవ ఆత్మనే పదం నియమితమ్. ఇహతు తల్లంఘితమితి వ్యాకరణ లక్షణహీనత్వాచ్చ్యుతసంస్కారత్వమ్." (సాహిత్య దర్పణము, ౩౭౫ పుట)

"సూ. మార్గే రాత్మనేపద మలక్ష్మ— చురాదౌ 'మార్గ అన్వేషణే' ఇతి పఠ్యతే 'ఆధృషాద్వా' ఇతి వికల్పితణిచ్కః. తస్మా దాత్మనేపదం దృశ్యతే 'మార్గంతాం దేహభారం' ఇతి తత్ అలక్ష్మ,అలక్షణమ్. పరస్మైపదిత్వా న్మార్గేః. తథాచ శిష్టప్రయోగః-కర కిసలయం ధూత్వాధూత్వా విమార్గతి వాసనీ" (కావ్యా లంకారసూత్రవృత్తి, ౫-౬)

"సూ. ప్రాణిని నీలేతి చింత్యమ్ - కువలయదల నీలా కోకిలా బాల చూతేత్యాదిషు నీలేతి చింత్యమ్. కోకిలా నీలీతి భవితవ్యమ్. నీలశబ్దాత్ 'జానప దేత్యాదిసూత్రేణ 'ప్రాణిని' చేతి జీష్విధానాత్." (కావ్యాలంకారసూత్రవృత్తి, ౫-౪౬).

ఇంతయేల? ప్రమాదములు తమ కావ్యములలోఁ గలవని యా కావ్యములు వ్రాసినవారే యంగీకరించి యున్నారు.

"నతు యథా మమ తన్త్రైవ—
భక్తిః కాతరతాం క్షమా పథయతాం
పూజ్యస్తుతి ర్దీనతాం
శౌర్యం దారుణతాం మతిః కుటిలతాం
విద్యాబలం శ్లోథతాం,
ధ్యానం వంచకతాం తపః కుహకతాం
శీలవ్రతం షండతాం
పైశున్యవ్రతినాం గిరాం కిమివవా
నాయాతి దోషార్థితామ్.

అత్ర పిశునస్వభావే వర్ణ్యమానే భక్త్యాదీనాం గుణానాం వైపరీత్యే ప్రతిపాదితే పిశునానాం వచసాం కింవా దోషార్థితాం నాయాతీ త్యభిహితే స్వయమనార్ద్రస్వభావస్య పరార్ద్రీకరణ మనుచిత మేవ." (ఔచిత్యవిచారచర్చ, ౨౭ పుట)

ఇట్టి వనేకములు గలవు. క్షేమేంద్రాదులు మహాకవులు. బహుగ్రంథకర్తలు. ఇట్లు వారే తమకుఁ బ్రమాదములు కల వనుచుండ మనము లేవనుట పరిహాసాస్పదము.

వస్తుస్థితి యిట్లుండ శ్రీ వజ్ఝల చిన సీతా రామస్వామిశాస్త్రిగారు "కవులకుఁ బ్రమాదము లు లేవు. అనఁగాఁ గావ్యములలో నపశబ్దములు లేవు. కావ్యభాషానుశాసకమగు వ్యాకరణమునఁ గావ్య ములలోఁ గవులు ప్రయోగించిన శబ్దముల నన్నిటిని సాధువు లని సాధింపవలసియున్నది. పాణినీయ మట్లుగాక కావ్యములలోని కొన్ని శబ్దముల న సాధువు లని నిరాకరించినది గనుకఁ బాణినీయము కావ్యభాషానుశాసకము కా" దని వాదించుచు న్నారు. 'ఛాందసత్వా ద్భవిష్యతి' అను మహా భాష్యము నుదాహరించి వీరు 'విషయపరిశోధనము' నను, 'అనుబంధము'నను వ్రాసిన వ్రాఁతలకుఁ గల పరమార్థ మిదియే. కవులకుఁ బ్రమాదములు లేక యప భ్రంశములే కావ్యములలో సంభవింపనినాఁడు కావ్య భాషకు వ్యాకరణావశ్యకతయే లేదు. అపభ్రంశము లివి యని నిరూపించి యవి ప్రయోగార్హములు కావ నియు, సాధుశబ్దము లివి యని నిర్ధారించి యవి ప్రయోగార్హము లనియు మన కెఱుకపఱచుటకే వ్యాకరణము. ఇట్టి కృత్యమునఁ బాణినీయము జాగ రూకత వహింపఁగా నది యొక దోషమని తలఁచి శ్రీ శాస్త్రిగారు "పాణినీయము కావ్యభాషాను శాసకము కా"దని వాదులాడుట యెంతవఱకు సమం జసమో విజ్ఞులే పరిశీలింతురుగాక.

హరవిలాసము : కుమారసంభవము

= శ్రీ బులుసు వేంకటరమణయ్య =

శ్రీనాథమహాకవి రచించిన హరవిలాసములోని 'మదనదహన', 'గౌరీకల్యాణము' లకు మూలము మహాకవి కాళిదాసుని కుమారసంభవము. కుమారసంభవములోని మొదటి నాలుగు సర్గల నాధారముగఁ జేసికొని వ్రాయఁబడిన మదనదహనము మూఁడవ యాశ్వాసమున వర్ణింపఁబడినది; ఐదు, ఆరు, ఏడుసర్గముల నాధారముగఁ జేసికొనిన గౌరీకల్యాణకథ చతుర్థాశ్వాసమున వర్ణింపఁబడినది.

*హరవిలాసపు పీఠికలో పూజ్యపాదులగు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారు శ్రీనాథుని యనువాదమునుగూర్చి యిట్లు వ్రాసియున్నారు:

“తృతీయాశ్వాసకథ మదనదహనమును, తర్వాతి యాశ్వాసకథ గౌరీకల్యాణమును కాళిదాసుని కుమారసంభవ మహాకావ్యమున కించుమించుగాఁ దెలుఁగు సేఁత యనఁదగినట్లు శ్రీనాథుఁడు రచించినాఁడు. కాని కాళిదాసు కుమారసంభవములోని కథాక్రమమిందుఁ గొంత మార్పునొందినది. శ్రీనాథుని గ్రంథమెల్లఁ బ్రాయికముగా నాంధ్రీకరణములే యైనను, ఆ యాంధ్రీకరణము సంస్కృతపు హద్దుపద్దులలో నుండక శ్రీనాథుని యిచ్చకు వచ్చినట్లు విచ్చలవిడిగా నుండును. కొలఁదిపట్టులందు మూలాతిశాయి సౌభాగ్యమున్నను రసోత్తరమైన కాళిదాసుని కుమారసంభవమును దెలిఁగించుటలోఁగూడ జాగ్రత్తవహింపక విశృంఖలముగా వర్తించుట కొన్నిచోట్ల వైరస్యకారణమును నైనది.”

హరవిలాసములో మీఁది కథాభాగము లేకదేశము లగుటచే శ్రీ శాస్త్రిలుగారు “సంస్కృతమూలము ననుసరించి, యందలి విషయమును గొంత విడిచియు, కొంత గ్రహించి సంగ్రహించియుఁ, గొంత పెంచియు, విశృంఖలముగా” శ్రీనాథుఁడు “చేసిన తెలుఁగు చేఁతలు కొన్ని”టినిమాత్రమే పీఠికయందు వివరించియున్నారు. పీఠిక పెంపున కిచ్చగింపక శ్రీ శాస్త్రిలుగారు విడిచిన మఱికొన్ని విషయము లీ వ్యాసమున వివరింపఁబడుచున్నవి.

(౧) “జ్వలన్మణిశిఖాశ్చైనం
వాసుకిప్రముఖా నిశి,
స్థిరప్రదీపతా మేత్య
భుజంగాః పర్యుపాసతే.”

[కుమార. ౨-౩౮]

“ప్రకటస్నేహదశాధురంధరత ప
ర్వంగా నిశీథంబులన్
సకలాంగంబులు నిక్కి దీపకలికా
స్తంభంబులై యుండ్రు పా
యక చూడామణులొప్ప రాక్షసవిభు
ద్ధాంతఃస్థలిన్ శేషవా
సుకికర్కోటకతక్షకప్రముఖచ
క్షుశ్శ్రోత్రబృందారకుల్.”

[హర. ౩-౫]

మూలముకంటె ననువాదము పెరిగి చమత్కృతిని పెంపొందించుకొన్నది. దీపకలికల ప్రకాశమునకు మూలమున కానరాని 'ప్రకటస్నేహదశాధురంధరత' ఆవశ్యకమయినది. దీపకలికలు నిలుచుటకు భుజంగములు 'సకలాంగంబులు నిక్కి... స్తంభంబు' లయినవి.

---

* హరవిలాసము—నూతనముద్రణము. పరిష్కర్తలు: శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. ప్రకాశకులు: ఆర్. వేంకటేశ్వర్ అండ్ కో, మద్రాసు. ౧౯౩౯.

మూలమునందలి 'వాసుకిప్రముఖులు' అనువాదమున 'శేషవాసుకి కర్కోటకతక్షకప్రముఖు'లైరి. ఈ యను వాద మెంతయు రసోచితమయి యున్నది.

(౨)"తదిచ్ఛామో విభో స్రష్టుం
సేనాన్యం తస్య శాంతయే,
కర్మబంధచ్ఛిదం ధర్మం
భవస్యేవ ముముక్షవః."
[కుమార. ౨-౫౧]

"తారకుం డెవ్విధంబున ధ్వంస మొందు,
నెట్లు బ్రదుకుదు మేము, మా కేది దిక్కు ?
చిత్తగింపుము దేవ ! సంశ్రితజనార్తి
హరణపారీణ ! కరుణారసార్ద్రహృదయ !"
[హర. ౩-౧౬]

దేవతలు తారకుని జయింపఁగల సేనానిని సృజింప బ్రహ్మను వేఁడినట్లు మూలమునందుఁ గలదు. తారకవధోపాయమును బ్రార్థించినట్లు అనువాదమున మార్పఁబడినది. ఈ మార్పు మిగుల రమణీయముగ నున్నది. ఆపన్నులు తమ యాశ్రయులను ఆపన్నివారణార్థము ప్రార్థించుట యుచితము; సలహా నిచ్చుట యుచితము కాదు. సేనానిని సృజింపించి, యతఁడు పెరిగి పెద్దవాఁడైన పిదప వానిసాయమున దేవతలు తారకుని గెలువఁగోరుట కోరియే కార్యసంసిద్ధి దూర ముచేసికొనుట యగును.

(౩)"అథావమానేన పితుః ప్రయుక్తా
దక్షస్య కన్యా భవపూర్వపత్నీ,
సతీ సతీ యోగవిసృష్టదేహా
తాం జన్మనే శైలవధూం ప్రపేదే."
[కుమార. ౧-౨౧]

"అటమున్ను దక్షకన్యక తండ్రితో నల్గి
యోగమార్గమున మే నుజ్జగించి
యపరజన్మంబున నజ్ఞాతయోనియై
యఖిలభూధరణక్షితీక్షమంబు
... ...
... ...
కాన మేదేవి కుదయించె మెలఁత యంత."
[హర. ౩-౨౦]

ఇచట "దక్షకన్యక యజ్ఞాతయోనియై మేనకా దేవి కుదయించె"నను ననువాదము పొసఁగదు. మూల మున నీ యజ్ఞాతయోనిత్వము లేదు. ఈ పద్యమునకు ముందుఁగల (ప. ౧౭) సీసపద్యపు తేటగీతిలో "తండ్రి యగు దక్షుమీఁది క్రోధంబుకతన, యోగనిర్ముక్తదేహ యై యుద్భవించి, పెరుగుచున్నది హిమభూమిధర గృహమున" అని చెప్పఁబడిన యంశమే మరల నీ సీసపాదములలోఁ జెప్పుట పునరుక్తము; అననుగుణము.

(౪)"గణా నమేరుప్రసవావతంసా
భూర్జత్వచః స్పర్శవతీ ర్దధానాః,
మనశ్శిలావిచ్ఛురితా నిషేదుః
శైలేయనద్ధేషు శిలాతలేషు"
[కుమార. ౧-౫౫]

"ప్రమథులెల్లరు విడిసి రప్పర్వతమునఁ
జంద్రకాంతశిలామణిస్థలములందు
నమరియుండు నమేరువృక్షములనీడ
భూర్జతరుచర్మపరిధానముల ధరించి"
[హర. ౩-౩౧]

ప్రమథగణములు సురపొన్న పూవులను సిగలఁ దురిమి, మెత్తని (మృదువైన) భూర్జపత్రములను ధరించి ఒడలికి జేగురురంగు పూసికొని, సిలాజిత్తుతో నిండియున్న శిలాతలములపైఁ గూర్చుండిరని మూలము. ప్రమథులు కూర్చుండు శిలాతలము లనువాదమున 'చంద్రకాంతశిలామణిస్థలములు గా' మారినవి. వారి కైసేత విడువఁబడినది. మూలమున లేని 'సురపొన్నల నీడ'ను గణము లనువాదమున ఆశ్రయించిరి! మూల మునఁ గల సౌభాగ్య మనువాదమున కొఱవడినది.

(౫)స మాధవేనాభిమతేన సఖ్యా
రత్యా చ సాశంక మనుప్రయాతః"
[కుమార. ౩-౨౩]

వ. " ... ... మన్మథుండు మధుమాస సహాయుండై హిమవత్పర్వతంబు ... "
[హర. ౩-౫౩]

మూలమున మన్మథుని వెంటనంటి స్థాణ్వాశ్రమ మునకు వెళ్లిన రతీదేవి అనువాదమునఁ గానరాదు.

కాని మునుముందు "ప్రబలాభివంగ సంప్రభవమోహంబున రతిదేవి యవశయై వ్రాలె ధరణి" (3–౮౩) అని వర్ణింపఁబడినది. ఈ నడుమ కామప్రవేశము ఎచ్చటను సూచింపనైన సూచింపఁబడలేదు. ఇది యనువాదముపట్ల శ్రీనాథునకుఁ గల అశ్రద్ధను తెలుపుచున్నది.

(౬) "దృష్టిప్రపాతం పరిహృత్య తస్య
కామః పురశ్శుక్రమివ ప్రయాణే,
... ...
... ..."

[కుమార. 3–౪౩]

వ. "మనోభవుండు ముక్కంటి యెదురం బక్కటిగాని యొక పక్కియగాఁ బురశ్శుక్రంబు నడచువాఁడునుంబోలె మనంబున జంకుచు ..."

[హర. 3–౬౪]

"ప్రయాణికుఁడు చుక్కకెదురగు స్థలమునకుఁ బోకుండునట్లు, మన్మథుఁడు నందికేశ్వరుండున్న యెడకుఁ బోకుండె" నని మూలమునఁ గలదు. "మనోభవుండు ముక్కంటి యెదురఁ బడక ఒక పక్కియగాఁ బురశ్శుక్రంబు నడచువాఁడునుంబోలె" జంకుచు వెళ్లెనని తెలిఁగించుట సందర్భింపకున్నది. ఈ యనువాదము సంగతముగఁ గన్పడదు.

(౭) "తమవేక్ష్య రురోద సా భృశం
స్తనసంబాధ మురో జఘాన చ"

[కుమార. ౪–౨౨]

"క్రుమ్ముడి కై పెక్కు కుసుమంబు లవియము
నవటుప్రదేశంబునందుఁ బొదల,
కేవురించిన రేఁత చెక్కుటద్దంబులఁ
దాటంకయుగళంబు తన్నియాడ
సాక్రోశపరిదేవనాక్షరవ్రాతంబు
కంఠగద్గదికచేఁ గ్రస్తపడఁగ
హరినీలములచాయ నక్షిగోళమ్ముల
సాబుఁగాటుక నీటిసోన కురియ.
ముత్తియంబుల పేరులు ముఱిసిపడఁగ
హస్తముల పీఁగుఁజనుదోయి యడిచికొనుచు.
... ..."

[హర. 3–౮౨]

మూలములోని శ్లోకార్థము అనువాదమున ఇంచుమించు సీసపద్యముగా మాఱినది; ఎక్కువ వన్నెఁ గూర్చుకొని మూలాతిశాయి శోభను ప్రకటించుచున్నది.

(౮) "కృతాభిషేకాం హుతజాతవేదసం
త్వగుత్తరాసంగవతీ మధీతినీమ్,
దిదృక్షవ స్తా మృషయోఽభ్యుపాగమ
న్న ధర్మవృద్ధేషు వయ స్సమీక్ష్యతే."

[కుమార. ౫–౧౬]

"పాశుపతమంత్రదీక్షావిభాసమాన
దివ్యతేజోవిశేషసందీప్తమూర్తి
కా లతాంగికి శతవృద్ధులైన మునులు
ప్రణుతులగుదురు భావిప్రభావశక్తి."

[హర. ౪–౧౩]

మూలములోని వర్ణనము అనువాదమున వింత రీతిని మాఱినది. పార్వతిని జూచుటకు మునులు వచ్చుట "ధర్మవృద్ధులయెడ వయస్సు పరిగణింపఁబడ" దను సామాన్యసిద్ధాంతమున సమర్థింపఁబడినది. ఈ యెడ "పార్వతియొక్క భావి ప్రభావశక్తిని (దివ్యదృష్టిచే) గుర్తెఱిఁగిన మునులు ఆమెకు ప్రణుతు లగుచున్నా" రని వర్ణించుట ఎంతయు ననుచితము.

(౯) "శుచౌ చతుర్ణాం జ్వలతాం హవిర్భుజాం
శుచిస్మితా మధ్యగతా సుమధ్యమా,
విజిత్య నేత్రప్రతిఘాతినీం ప్రభా
మనన్యదృష్టిః సవితార మైక్షత."

[కుమార. ౫–౨౦]

వ. "మండువేసవిం గనగన మండు నగ్నికుండంబు నడుమన నిలిచియు, మధ్యాహ్నకాలంబున నర్కమండలం బాలోకించియు..... "

[హర. ౪–౧౪]

పార్వతి వేసవికాలమున నాల్గువైపులను అగ్నులను వెలిఁగొల్పి, వానినడుమఁ గూర్చుండి సూర్యునిఁ

జూచుచు తపంబొనర్చినట్లు మూలమున వర్ణింపఁబడినది. ఆమె అగ్నిగుండమునడుమ నిలిచి సూర్యావలోకించె ననికల యనువాదము సరియైనది కాఁజాలదు.

(౧౦)"స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః
పయోధరోత్సేధ నిశీర్ణచూర్ణితాః,
వలీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణ నాభిం ప్రథమోదబిందవః"
[కుమార. ౪-౨౪]

వ. "వర్షాకాలంబునఁ బక్ష్మపాళీక్షణ స్థితంబులును, దాడితాధరంబులును, బయోధరోత్సేధనిపాత చూర్ణితంబులును, త్రివళీక్షణస్ఖలితంబులును, నాభిగహ్వరప్రవిష్టంబులు నగు జలధరజలబిందుధారలం దోఁగియు..."

[హర. ౪-౧౪]

వేసవికాలపుఁజివర పడిన మొదటివానచినుకులు పార్వతి కనురెప్పలపై క్షణకాలముండి, చెక్కిళ్లపై జారి, స్తనాగ్రములపైఁ బడుటచేఁ దూలి, వళులలో జారి, చాలసేపటికి ఆమెనాభిప్రదేశమును జేరినవని మూలమునందలి వర్ణనము. ఆమె వర్షాకాలమునం దెట్టి జలబిందుధారలం దోఁగినదని యనువాదము. ఇయ్యది అనుగుణము కాదు. వర్షాకాలమునఁ బడిన వర్షమువలన (జలబిందుధారలవలన) పార్వతి తడిసి, ముద్దకావలసినదే. అప్పుడు మీఁదిరీతి ఉదకబిందువుల దీర్ఘకాలప్రయాణమునకుఁ గాని, నాట్యమునకుఁ గాని అవకాశమే లేదు.

(౧౧)"స్వయం విశీర్ణద్రుమపర్ణవృత్తితా
పరా హి కాష్ఠా తపస స్తయా పునః,
తదప్యపాకీర్ణ మతః ప్రియంవదాం
వదం త్యపర్ణేతి చ తాం పురావిదః"
[కుమార. ౫-౨౮]

వ. "నురకకరువలిం దుల్లిన జీర్ణతరపర్ణంబులును నాహారంబుగా..." [హర. ౪-౧౪]

"గాలికి రాలిన పండుటాకులం దిని, తపం బొనర్చుట గొప్పగాఁ జెప్పఁబడుచున్నది; పార్వతీదేవి ఆ పండుటాకులంగూడ విడనాడి తపస్సుచేయుటచే ఆమెకు 'అపర్ణ' అను అన్వర్థనామము కలిగిన"దని మూలమున నున్నది. శ్రీనాథుఁడు పార్వతిపై జాలిగొని, ఆమెకు నురకకరువలిం దుల్లిన జీర్ణతరపర్ణంబుల యాహారము ననుగ్రహించినాఁడు. దీనితోఁ బార్వతీదేవికిఁ గల అన్వర్థనామధేయము— 'అపర్ణ' అనునది నేఁతిబీరకాయ యైనది.

(౧౨)"అపి త్వదావర్జితవారిసంభృతం
ప్రవాళ మాసా మనుబంధి వీరుధామ్,
చిరోజ్ఝితాలక్తకపాటలేన తే
తులాం యదారోహతి దంతవాససా"
[కుమార. ౫-౩౪]

"మగువా! నీ పెంచినలత
చిగురున ముకుళంబు లుల్లసిల్లెనె చెపుమా?
పగడపుఁగెమ్మోవిపయి
న్నగ వుదయించిన విధంబునం బ్రస్ఫుటమై"
[హర. ౪-౧౯]

"ఓ పార్వతీ! చాలకాలమునుండి లత్తుకను పూయకున్నను మిక్కిలి ఎఱ్ఱగ నున్న నీ యధరముతో సరియగు నెఱ్ఱని చివుళ్లను నీవు పెంచిన లతలు చిగిర్చినవా?" అనునది మూలమునభిప్రాయము. అనువాదమున ప్రవాళోత్పత్తిప్రసంగము విడువఁబడినది. "నీవు పెంచిన లతచిగురున తెల్లని మొగ్గ లుల్లసిల్లినవా? అట్లుల్లసిల్లిన మొడల నవి ఎఱ్ఱని పెదవిపై నుదయించిన తెల్లని నవ్వువలె ప్రకాశించునుగదా?" అని మార్పఁబడినది. పెదవిపయి నగవుదయించుట సహజము; చివురున ముకుళముల్లసిల్లుట అసంభవము. కావుననే కాళిదాసు

"పుష్పం ప్రవాళోపహితం యది స్యా
న్ముక్తాఫలం వా స్ఫుటవిద్రుమస్థమ్,
తతోఽనుకుర్యా ద్విశదస్య తస్యా
స్తామ్రోష్ఠపర్యస్తరుచః స్మితస్య"
[కుమార. ౧-౪౪]

అని వర్ణించియున్నాఁడు. "పూవు చిగురుతోఁ గలిసియుండుటయే తటస్థించినయెడల నది ఎఱ్ఱని పెదవిపైఁ బ్రకాశించు తెల్లని నగవుతో సామ్యమును పొందియుండు"నని దాని యాశయము.

కావున శ్రీనాథకవి వర్ణించిన ఈ సంభవా సంభవముల పోలిక ఉచితమైనది కాఁజాలదు.

(౧౩) "నివార్యతా మాలి కిమప్యయం వటుః
పునర్వివక్షుః స్ఫురితోత్తరాధరః,
....
....
ఇతో గమిష్యా మ్యథవేతి వాదినీ
చచాల బాలా స్తనభిన్నవల్కలా"
[కుమార. ౫-౮౩,౮౪]

వ. "అని జయావిజయలం గనుంగొని యపాం గంబులఁ గెంపుగదుర నీబ్రహ్మచారి శంకరునిగుఱించి నిశ్శంక నింకను వంకరకొంకరమాటలాడ నుంకించుచున్నవాఁ డితని మెడపట్టి నూకుండని పల్కి కోపావేశంబున—

జిలుఁగగు వల్కలాంచలము
చెన్నయి చన్నులమీఁద జాఱఁగా
వలుకఁ దుషారశైలసుత
యవ్వలిమోమయి వాలుగేన్పదం
బులు పని........."
[హర. ౪-౩౪, ౩౫]

"ఈ వటు వింకను ఏవో వంకరకొంకర మాట లాడ నుంకించుచున్నట్లున్నది; అట్లు చేయకుండ నాతని వాఁపుము; లేదా ఆతని వాఁపకేల? నేనే యిం నుండి లేచిపోయిన మేలు" అని పార్వతి చెలిమికత్తెం గుఱించి పలికి వల్కలాంచలము చన్నులమీఁద జాఱఁ గాఁ గదలెనని మూలమునఁ గలదు. అనువాద మీయెడ ఎంతో మాఱినది. ఇందు పార్వతి 'తపః ప్రశాంతికి చెలి తిగా' 'అపాంగంబులఁ గెంపు గదిరె' నది; ఆమె 'యతని మెడపట్టి నూకుం'డని చెలికత్తెలతోఁ 'బల్కి'నది. అంతతోఁ బోక 'కోపావేశంబున జిలుఁగగు......వాలు గేన్పదంబులు పని' నది. ఈమార్పు ఎంతయు నౌచిత్యమునకు దూరమయినది.

వటుఁడు తన్ను వివాహమునకమ్మని పార్వతి నడిగినపుడు (౪-౭౫) పార్వతి యాతని మాటల సేవ గించుకొనక "అమ్మిథ్యావటునకుం దన మనోరథం బెఱిఁగింప నొల్లక వయస్యం గన్నుసన్న సేసిన"ది. అట్టి యవమానముచే నొచ్చిన యమ్మ యిపు డా బ్రహ్మ చారియే మాటలాడ నుంకించుచుండఁగా మర్యాద విడిచి 'యితని మెడపట్టి నూకుం'డని పల్కుట అసంగ తము. మఱియు నట్లాజ్ఞాపించి స్థైర్యముతో నిలువలేక యటనుండి లేచిపోవఁ గారణము కానరాదు. మూల మున నీఘట్టము సముచితముగఁ జూపఁబడినది.

(౧౪) "గగనా దవతీర్ణా సా
యథా వృద్ధపరంపరా,
తోయాంతే ర్భాస్కరాలీవ
రేజే మునిపరంపరా."
[కుమార. ౬-౪౯]

"గగనమునుండి డిగ్గి పఙ్క్తియుక్తి
వెలిఁగె హిమపర్వతాంతరస్థలమునందు
నిర్మలంబైన నీటిలో నీడచూపు
నిందుబింబంబునుంబోలె ఋషిగణంబు"
[హర. ౪-౫౩]

"ఆకాశమునుండి పెద్ద, పిన్నలవరుస ననుసరించి, దిగిన మునులు జలమునఁ బ్రతిబింబించు సూర్యులవలెఁ బ్రకాశించి"రని మూలము. మునులు తేజస్వులగుట వలనను, ఆదిత్యు లనేకు లుండుటవలనను ఈసామ్యము సరియై యున్నదని వ్యాఖ్యాతలగు మల్లినాథసూరిగారు వివరించియున్నారు. అనువాద మున నీ సామ్యము చంద్రపక్షముగఁ జెప్పఁబడినది. 'ఋషిగణం బిందుబింబంబునుంబోలె' అనిన విభిన్న వచనత్వముకూడ సంభవించును. ఒకవేళ 'ఇందుబింబా లియునుబోలె'-లేక 'ఇందు బింబంబులుంబోలె' అని మార్చి యాదోషమును తప్పించుకొనినను, చంద్రు లనేకులు లేనందున సామ్యము పొలుపు చెడక పోవును. ఈ సామ్యమున ఋషులకుఁగల తేజస్వితయు పటాపంచలయినది.

(౧౫) "శైలః సంపూర్ణకామోఽపి
మేనాముఖ ముదైక్షత,
ప్రాయేణ గృహిణీనేత్రాః
కన్యార్థేషు కుటుంబినః."
[కుమార. ౬-౮౫]

"భూమిధర రాజా సంపూర్ణ కాముఁడయ్యె
ముదముతో మేనకాదేవి మొగముఁజూచి,
కన్యకాదానవేళలఁ గలుగు చనవు
క్షితి గృహస్థులకంటె సద్గేహులకు."
[హర. ౪-౬౭]

"హిమవంతుఁడు హరుని వివాహమువఁ దృష్టుఁ డైనను, మేనక యభిమత మేమో కనఁగొనుటకయి యామె మొగముఁ జూచెను; ఏలయన-సాధారణముగ కన్యావివాహవిషయమున గృహస్థులు గృహిణుల మార్గమునే అనుసరింతు" రని మూలము. "మేనక మొగము చూచి హిమవంతుఁడు సంపూర్ణ కాముఁ డయ్యె" ననుట సరికాదు. ఇది యచ్చుపొరపాటైనఁ గావచ్చును. "కాముఁడయ్యె, ముదముతో మేనకాదేవి మొగముఁజూచె" అని యుండిన సరిపోవును.

ఇంతవఱకును శ్రీనాథుఁ డొనరించిన మార్పుల లోని ఔచిత్యానౌచిత్యములు వివరింపఁబడినవి. అతని రచన మిందుమిందు స్వతంత్రముగ సాగినదగుట నింకను పెక్కు పెంపు, కుదింపులు జరిగినవి. కాని యయ్యవి అంత పేర్కొనఁదగినవిగాని, రసాపకర్షకములుగాని కావు. మార్పులలో నందందుఁ గల వైరస్యమును 'కాళిదాసకృతి' తెలుంగక స్వతంత్రముగా శ్రీనాథుని రచననే చూచువారికి అతని శయ్యా సౌభాగ్య సౌశబ్ద్యాది గుణవిశేషములచే కొంత తోఁపనీయనంత హృద్యతతోనే యున్నది.

భోగిమంటలు

•

= శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి =

౧

భుగభుగా భుగభుగా
భోగిమంటలు లేచి
లేతమబ్బుల్లోను
లీనమైనాయి.

౨

హుఁహుఁహుఁహుఁహుఁహుఁహుఁ
హుఁహుఁహుఁహూఁగజగజా [హూఁ
చలిచేత వణకుతూ
జనులు మూగారు.

౩

కోటినాల్కలు చాచి
కొండంతగొంతుతో
"ఆకలాకలి!" యంటు
అరిచాయి శిఖలు.

౪

"ఆకలిట! ఆకలిట!!"
అంటు వెచ్చనిగాడ్పు
చెట్టుచెట్టుకు పోయి
చెప్పివచ్చింది.

౫

జీమూతఖండాలు
జీర్ణస్వరాలలో
అబ్ధితరగలతోటి
"ఆకలిట!" అని చెప్పి,
కొండచాటుకు పోయి
గొల్లుమన్నాయి.

౬

అట వల్లకాటిలో
ఆరిపోయిన మృత
జ్వాలలు మసలి, త్రుళ్ళి
పడి లేచి, బాధతో
"మీకు సైతం మందు
టాకలేనా?" యంటు
దుఃఖాశ్రువులతోటి
తొంగిచూశాయి.

౭

ప్రాసాదశిఖరాగ్ర
వాతాయనమునుండి
"హుఁ హుఁ చలీ! మంటల్ని
హుఁ హుఁ హుఁ ఎగతోయ్యండి,
ఎముకలు కొరికే చలి!
ఎముకల్ని కాల్చండి!!
గుండెల్ బిగిసే చలి!
గుండెల్ని పేల్చండి!!"
అని సన్న సన్నగా
వినిపించినాయి.

౮

వేసంగిగాడ్పులో,
వృష్టిధారల్లోను,
శీతపవనమునందు,
చితులే! భోగే!!
చితులే!!! భోగే!! !!

౯

ప్రళయరుద్రుని భయద
ఫాలాగ్ని జ్వాలలకు
అర్ణవాల్ కాననాల్
ఆజ్యమై సమిధలై
విశ్వాలు కాల్చేసి,
నిశ్వసించినగాని
ఆగిపో దీ చలీ
ఆగిపోదోయి!

౧౦

భుగభుగా భుగభుగా
భోగిమంటలు లేచి
వ్యోమవీథుల్లోను
ఊగుతున్నాయి!

—o—

ఖడ్గతిక్కన

[చరిత్రాత్మక నాటకము - ఏకాంకము]

= శ్రీ నండూరి బంగారయ్య =

చిన్నవోయిన మొగముతో జేరవచ్చి
శౌర్యభిక్షంబునకు చేయిజాపుచున్న
తెలుగుతల్లికి నాజన్మ బలియొసంగి
ఎన్నటికి దీర్చుకొందునో కన్నఋణము?

★

ఈనాటకమున వచ్చు పాత్రములు:

స్త్రీలు :

౧. ప్రోలమ్మ—ఖడ్గతిక్కనతల్లి
౨. చానమ్మ— ఖడ్గతిక్కనభార్య

పురుషులు :

౩. ఖడ్గతిక్కన—కథానాయకుడు. మనుమసిద్ధి దండనాయకుడు
౪. తిక్కన—కవిబ్రహ్మ. కథానాయకుని పినతండ్రి కుమారుడు
౫. సిద్ధన—ఖడ్గతిక్కనతండ్రి
౬. మనుమసిద్ధి—నెల్లూరి (విక్రమసింహపురము)నేలు ప్రభువు
౭. అన్నంభట్టు—బ్రాహ్మణోత్తముడు
౮. పిన్నమనాయడు—పల్లికొండప్రభువు
౯. బ్రహ్మరుద్రయ్య—పిన్నమనాయని మంత్రి. కాటమరాజు సేనలకు నాయకుడు

ఇంకను పౌరులు, బాలురు, వృద్ధులు, పుణ్యాంగనలు, సేవకులు వగైరా.

మొదటి రంగము

[రంగము: పంచలింగాల కొండ ప్రక్కనున్న రణరంగము. ప్రవేశము: పిన్నమనాయుడు, బ్రహ్మరుద్రయ్య.]

పిన్నమ—మంత్రిసత్తమా! అది బంగారపుపువ్వులతో పూజింపవలసిన విగ్రహము! అవి యాంధ్రజాతి యాబాలగోపాలము శిరసావహింపవలసిన పాదములు!

బ్రహ్మ—ప్రభూత్తమా! ఇవి రణరంగమున కనుచితములగు వాక్యములు!

పిన్నమ—(బ్రహ్మరుద్రయ్య మొగమువంక నిదానించి చూచి) మహామంత్రీ! ఏమి చేయమందురు? దర్శనమాత్రముననే నాహృదయము ద్రవించిపోవుచున్నది.

బ్రహ్మ—మహాప్రభూ! మనలను నమ్ముకొని గదా కొటమరాజపుంగవుడు యుద్ధములోనికి దిగినాడు? ఖడ్గమును చేతబూని యాతని కిచ్చిన బాసనైన స్మరింపవలదా?

పిన్నమ—అప్పటికి నేను ఈమహాపురుషుని దర్శనము చేసియుండలేదుగా? ఎంత ప్రయత్నించినను ఖడ్గము తనంత తానుగ హస్తమునుండి జారిపోవుచున్నది. నన్నేమి చేయమందురు?

బ్రహ్మ—మీ యాంతరంగికప్రవృత్తి కనిపెట్టియే ఇంతవరకు మీకు ప్రసక్తి లేకుండ నీడ్చుకొని వచ్చుచున్నాము. యజ్ఞము రవంతలో పూర్తికానున్నది. ఉదయాద్రి ఉమ్మయ్య, గయికొండ గంగరాజు, ప్రభగిరి పద్మశేఖరుడు మున్నగు యోధానయోధులందరును ఒకరివెనుక నొకరుగ నాహుతులైపోయినారు. ఒక్క తిక్కనమాత్రమే మిగిలినాడు. పాటివానిని జంపుటకు చేతులు రాకుండ నున్నవి.—అదిగో ఖడ్గతిక్కనయు, నన్నంభట్టు నిటే వచ్చుచున్నారు. మీ పుణ్యమాయిరి. మీ స్తోత్రములను మాత్రము విజృంభింపనీయకుడు.

పిన్నమ—తనివిదీర మరియొకసారి దర్శింతును. చేతులార మరియొకసారి నమస్కరింతును. మీరలసినట్లున్నారు. ఆ మర్రిచెట్టునీడను రవంత విశ్రమింపుడు. ఇక్కడ నేనున్నాను గదా!

బ్రహ్మ—తీర ప్రణమించి రాగమున బడు రేమో! ఆలోచించుకొనుడు.

పిన్నమ—అంత యలౌక్యముగ వర్తింతునా?

బ్రహ్మ—ఆమాత్ర మభయహస్త మిచ్చిన జాలును. సెలవు.

పిన్నమ—చిత్తము, నమస్కారము. (తనలో) నేనుకూడ ఈ జువ్విచెట్టు చాటున పొంచియుండి వారి సంభాషణమును విని దానివలన అనంతరకర్తవ్యము నిశ్చయించుటకు వీలగునేమో చూచుకొనవలసియున్నది.

(బ్రహ్మరుద్రయ్య నిష్క్రమించును. పిన్నమనాయుడు యథోక్తప్రకారము పొంచియుండును. ప్రవేశము: అన్నంభట్టు, ఖడ్గతిక్కన.)

ఖడ్గ—వైదికోత్తమా! క్రమక్రమముగ బ్రాహ్మణధర్మము మావంశమునుండి సెలవుపుచ్చుకొనుచున్నది.

అన్నం—యోగిపుంగవా! తామట్లు సెలవీయరాదు.

ఖడ్గ—(తన్ను తాను జూచుకొనుచు) చెవులకు కుండలము లేమి, చేతిలో ఖడ్గమేమి? నుదుట విభూతిరేఖలేమి, నెత్తిపై శిరస్త్రాణమేమి? ఏమి యీవైపరీత్యము? ఏనాడు ఉదరపోషణకయి రాజుల కొలువు స్వీకరించినాడో ఆనాడే పోయినది బ్రాహ్మణుని ప్రతిష్ఠ!

అన్నం—ఉదరపోషణకయి కాదు. దేశక్షేమమునిమిత్తము. వైదికధర్మరక్షణమునిమిత్తము.

ఖడ్గ—వైదికధర్మమా? ఇంకను వైదికధర్మమెక్కడ?

కేవలశాంతిహర్మ్యమున
క్రీడ యొనర్చు మయూరివై, సుధీ
ప్లావితసత్త్వవాహినుల
లాస్యమొనర్చు మరాళివై, జగ
త్పావనమూర్తివై వెలుగు
వైదికధర్మమ! ఖడ్గదీప్తులన్
భావము సంచలింప నెడ
బాయకుమమ్ము! మదీయగేహమున్.

అన్నం—ఎంత వింతగ మాటాడుచున్నారు ?
వంశానుగతముగా వలదివచ్చిన వేద
    ఘోషంబు పసిపాటి భాష గాగ
తాతతండ్రులనుండి తరలివచ్చిన యజ్ఞ
    దీక్షలు శ్రీరామరక్ష గాగ
చనుబాల రంగరించిన శాస్త్రచర్చలు
    శైశవదశకు ప్రాశనము గాగ
సంస్కారవశమున జనుదెంచు యోగవి
    ద్యలు చినవాటి నెచ్చెలులు గాగ
పెరుగుచున్నారు మాయింటి పిల్లలెల్ల
పెండెలను వాసములగూడ వీడకుండ
వేదధర్మంబు మాయింట పాదుకొనగ
నిట్లు తర్కింతు రేల యోగీంద్రచంద్ర!

ఖడ్గ—నరహత్య వైదికధర్మమా? రక్తతర్పణము వైదికధర్మమా ?

అన్నం—ద్రోణాచార్యుడు, అశ్వత్థామ మున్నగు పురాణపురుషులుకూడ "ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్ర" మనినవారే కదా!

ఖడ్గ—నక్క యెక్కడ, నాకలోక మెక్కడ? ఎన్ని విధముల హెచ్చరించుకొందమన్నను నీదినమున నది యేమోగాని కర్ణుని రథమువలె నాహృదయము క్రుంగిపోవుచున్నది.

అన్నం—(తనలో) ఈతని రాజసమును రగుల్కొల్పుటకు సాధనమే లభింపదా? (ప్రకాశముగా) అదుగో పిన్నమనాయుడు. ఈతనికంట బడకుండగనే మన మింటికి తరలిపోవుట యుక్తముగదా?

ఖడ్గ—(రోషముతో) ఏమి విప్రోత్తమా! అంత చులకనచేసి మాటాడుచున్నారు? రణతిక్కన ప్రతిపక్షవీరుని పేరు చెప్పగనే పారిపోవునంతటి పంద యని మీయభిప్రాయమా?

అన్నం—ప్రభూ! నాయభిప్రాయ మది యెన్నటికిని ఎంతమాత్రమును గాదు. నరకిన యరటి తోటవలె మన సేనయంతయు నాశన మయిపోయినది గదా! మీరయినను మిక్కిలి యలసియున్నారు.

ఖడ్గ—కానిండు. అంతమాత్రమున వెనుదీయ వలసిన పని యేమున్నది? ఇదిగో నాయిష్టదైవము. (అని ఖడ్గమును జళిపించుచు) ఇది నాచేత నున్నంత దనుక నన్నెవ రేమి చేయగలరు ?

(పిన్నమనాయుడు సమీపించును)

పిన్నమ—బ్రాహ్మణోత్తమా!

ఖడ్గ—ఎవరా బ్రాహ్మణోత్తముడు ?

పిన్నమ—త్రిలోకపూజ్యుడయిన తిక్కన.

ఖడ్గ — యోధాగ్రణీ! పొరపడుచున్నావు. (అన్నంభట్టువంక చూపి) అదిగో! ఆమహనీయుని బ్రాహ్మణోత్తము డనుట యుక్తము. వైదికలక్ష్మి వారి వక్షమున తాండవించుచున్నది.

పిన్నమ—లేదని నేనును వాదింపను. మీహృదయమునకూడ తాండవించుచున్న దనిమాత్రమే నా మనవి.

ఖడ్గ—శూరవతంసా! ఎందుల కీపరిహాసము ?

పిన్నమ—పరిహాసము కాదు. పరమార్థమే.

నిరతాన్నదాతవౌ నీయింటి ముంగిట
    వేదఘోషము సదా వెల్లివిరియు;
నిత్యాగ్నిహోత్రివౌ నీదు నట్టింటనే
    కాపురంబుండును గార్హవహ్ని;
మకరంద మొలుకు నీమధురవాక్కున నిల్చి
    జయగీతికల పాడు శాస్త్రవితతి;
పరహితార్థంబుగా పసువరించిన నీదు
    హృదయంబు విజ్ఞాననిధుల సరియు;
నీవు జనియించుకతమున నిఖిలవిప్ర
జాతియేకాక మాయాంధ్రజగతి యెల్ల
నవవసంతోదయశ్రీల నవధరించె
దివ్యకీర్తిప్రభాతేజ! తిక్కరాజ!

ఖడ్గ — సజ్జనతిలకా! రణరంగమున నిల్చి ప్రతివీరు నగ్గించుట మీ సౌశీల్యమునకు వన్నెదెచ్చుచున్నది. మీరు చేసిన వర్ణనము నా కన్వయింపకున్నను మావంశమున కన్వయించునని నేను సమాధానము చెప్పుకొందును.

పిన్నమ — మహాపురుషులు వినయభూషణులు గదా!

అన్నం — సందేహ మేమి ?

ఖడ్గ — శస్త్రములతో విహరింపవలసిన యీ

సమయమున స్తవములతో కాలక్షేపము చేసి యేమి ప్రయోజనము ?

పిన్నమ — దేని ప్రయోజనము దానిది. సత్పురుషుల గుణములను స్తుతించికదా నాలుక చరితార్థము కావలసియున్నది ?

అన్నం — శుష్క స్తవములకంటె ధర్మపథావలంబనము సజ్జనులకు సంతోషదాయిని.

పిన్నమ — (తీవ్రతతో) వైదికోత్తమా, ఇప్పుడు అధర్మపథము నవలంబించుచున్నవా రెవరు ?

అన్నం — ఎవరో మీరే చెప్పవలెను.

ఖడ్గ — స్వార్థమునుబట్టి దృక్పథము విపరీతమైనపుడు ఎవరి పథము వారికి ధర్మయుక్తముగ గన్పట్టకమానదు.

పిన్నమ — ప్రభూ! ఇందు తమకు స్వార్థమేమున్నది? శిష్యవాత్సల్యమే ప్రధానముగ పోరాడుచున్నారు గాని.

ఖడ్గ—శిష్యు డెవరు ?

పిన్నమ—మనుమసిద్ధి.

ఖడ్గ—అతడు మాకు ప్రభువు. శిష్యుడు కాడు.

పిన్నమ—మీరు మరియొక తీరున పల్కుదురా ? కాని నామనవిని రవంత చిత్తగింపరా ? ఎంత స్వల్పవిషయమునకయి ఎట్టి యమూల్యప్రాణములు నష్టపోయినవి ? నష్టపోవనున్నవి ?

అన్నం— ఈ యంశము ఈనాడే తమకు గోచరించినదా ? నాడు రాయబారమున నేను విశదీకరింపలేదా ?

ఖడ్గ—పుల్లరి నిచ్చెదనని సమయ మేర్పరచుకొనికదా కాటమరాజు పశువులను మేపుకొన్నాడు ? ఇప్పుడు పుల్లరి నీయక పొల్లుమాట లాడిన ప్రయోజన మేమి ?

పిన్నమ—మీ సీమలో నడుగు పెట్టినవెనుక మా పశువు లెన్నివేలు నష్టమైనవో యెరుగరా ?

అన్నం—దైవకృతమున కెవ రేమి చేయగలరు? దాని కంతకును మాప్రభు వెట్లుత్తరవాది కాగలడు ?

పిన్నమ—దైవకృతమా ? దైవకృతమా — బ్రాహ్మణోత్తమా ?

అన్నం—నిజమాడిన నిష్ఠురముగదా ?

ఖడ్గ—ఇది శస్త్రములు తేల్పవలసిన విషయము కాని శాస్త్రములు తేల్పగల విషయము కాదు గదా ? ఇక విలంబన మేల ?

పిన్నమ—ఒక్కటి యాలోచింపుడు. ఎక్కడ ధర్మముండునో అక్కడనే జయశ్రీ నిలచును.

అన్నం—అదేమి మాట ? జయాపజయములు దైవాధీనములు.

ఖడ్గ—తిక్కనకంఠమున ప్రాణ ముండగనే అప్పుడే జయశ్రీ మిమ్ము వరించినదని తలంచుచున్నారా?

పిన్నమ—మిమ్ము మేము శత్రుపక్షమున నెన్నడును లెక్క వేసికొనుట లేదుగా ?

ఖడ్గ—తిక్కనరాజభక్తికి తీరని కళంకము నాపాదింపజూచుచున్నారా ?

పిన్నమ— పరాక్రమమునందు – పాండిత్యమునందు – బ్రహ్మవిద్యయందు రాజాధిరాజులకు మీకు గూడ వైనొక రాజా ?

ఖడ్గ—మీ యభిప్రాయ మేమో నాకు బోధపడుట లేదు.

పిన్నమ—వారైనను మీకు శిష్యులే. మేమైనను మీకు శిష్యులమే. వాత్సల్యముచే మీరు మనుమసిద్ధి యాస్థానము నలంకరించినారుగాని గణపతిదేవచక్రవర్తి కూడ మీచరణముల నారాధించి చరితార్థుడు కావలెనని యాశించుచున్నవాడేకదా ? దక్షిణాపథమున మిమ్ము దైవతములుగ గణించి పూజింపనివా రెవ్వరు ?

అన్నం— నేను మొదటనే చెప్పితిని. ఇట్టి శుష్క వాక్యములు ప్రయోజనకారులు కావని.

పిన్నమ—(చికాకుతో) వైదికోత్తమా ! మీరు రవంత సేపు తాళవలయును.

ఖడ్గ — ఆయనపై నేల చికాకుపడియెదవు ? ఇదిగో యిటు రమ్ము, విక్రమవిహారప్రౌఢి నెఱపుము.

పిన్నమ—యుద్ధము తప్పదా ?

అన్నం—అది మీచేతిలో నున్నది. మమ్మడిగి ప్రయోజన మేమి ? మాపుల్లరిని మాకు చెల్లించినచో ఎవరి తెన్నున వారు నవ్వుకొనుచు పెండ్లికుమారులవలె ఇంటికి బోవచ్చునే!

పిన్నమ—(తనలో) దైవమా! ఈబ్రహ్మహత్యా పాతకమును తప్పించుకొను నుపాయమే లేదా? (ప్రకాశముగా) శమదమప్రధానులయిన బ్రాహ్మణోత్తములు కయ్యమునకు కాలుద్రవ్వుచున్నపుడు తమోమయులగు మావంటి శూద్రులు ఏమి చేయవలసినది?

అన్నమ—మమ్ము నెపపెట్టి ప్రయోజనము లేదు. ఈయుద్ధమునకు బాధ్యత యంతయు మీది.

పిన్నమ—వాగ్వివాదమువలని ప్రయోజన మేమి? ఉభయతారకముగ నే నొక మార్గమును చెప్పెదను. ఆలోచింతురా?

అన్నం—ఏ దది?

పిన్నమ—అదిగో చూచితిరా–సూర్యుడు నెత్తి మీదికి వచ్చినాడు. రెండుజాములు తిరుగుచున్నది. మీరైనను మేమైనను మిక్కిలి అలసియున్నాము. ఇట్టి యవస్థలో యుద్ధమునకు సిద్ధపడుటకంటె–రవంత సేద దేరి–ఆపైని బలాబలములు చూచుకొనుట కాటంక మేమి యుండును?

అన్నం—(అపవారించి, తిక్కనతో) వారు కోరినప్పుడు అంగీకరించితి మేని మనకు శౌర్యలోప మారోపితము కాజాలదుగదా?

పిన్నమ—ఇది ఉభయులకు హైన్యము లేని పద్ధతి. యుద్ధమున మనకు క్రౌర్యముకంటె శౌర్యము గదా ప్రధానము?

అన్నం—అవును. ఇరుపక్షములును పూర్ణముగ సంసిద్ధములైననేగాని రణక్రీడ రక్తికట్టదు.

పిన్నమ — ఇరువురమును రవంత విశ్రాంతి గైకొనినవెనుక మరల దలపడవచ్చును. ఈలోపుగ మీ రింటికి పోయివచ్చినను రావచ్చును. ఈ విరామము మా ప్రార్థనమువిూదగదా మీ రనుగ్రహించుచున్నది?

అన్నం — (అపవారించి, తిక్కనతో) నా ప్రాణములు పోవుచున్నవి. మీరు అంగీకరింపక తప్పదు.

ఖడ్గ — (అపవారించి, అన్నంభట్టుతో) పూజ్యుడా! నీవు యోధుడవు కావుకదా? ఇంటి కేవరకే పోవచ్చునే.

అన్నం — (అపవారించి) ప్రాణము పోయినను సరే మి మ్మిక్కడ నొంటిగ విడచి నే నింటికి పోవుదునా? నానిమిత్త మంగీకరింపరాదా?

ఖడ్గ — (అపవారించి) ఈ పరిస్థితులలో నింటికి పోయినచో మాటదక్కదు.

పిన్నమ — మేమైకదా ఈ విశ్రామవిరామము నిమిత్త మర్థించుచున్నాము?

అన్నం — (తనలో) తల్లీ! ఆంధ్రమాతా! ఈయమూల్యరత్నము నెట్లయిన రక్షించుకొనుము. (ప్రకాశముగా) ప్రభూ! భారమంతయు నాది.

ఖడ్గ — (పిన్నమనాయనితో) మరల మనము కలసికొనుట యెప్పుడు?

అన్నం — (తనలో) ఇప్పటికి మెత్తబడినాడు.

పిన్నమ—(తనలో) దారిలో బడినాడు. (ప్ర) రెండుమూడు గడియలలో–ఈ ప్రొద్దు రవంత వ్రాలిన వెనుక.

అన్నం—తథాస్తు. మహాత్మా, అశ్వమును నే నిచ్చటికి దీసికొని వత్తునా?

ఖడ్గ—లాభము లేదు. ఎంత బలవంతపెట్టినను, జయము చేకొనకుండ ఇంటికి బోవ సమకట్టిన మనతో గలసి అది వెనుకకురాదు.

అన్నం — ఇక్కడ నొంటిగ వదలిపోయినచో ప్రమాదము కాదా?

ఖడ్గ — శత్రువులచేత జిక్కు ననియా? దానిని జీవముండగ గ్రహింపగల మానవుడు లేడు.

పిన్నమ — మీ యశ్వరాజమున కేమాత్రమును భయములేదు. దానిపై నీగ వ్రాలనీయను.

అన్నం — దీనిని 'పుల్లరి నిచ్చెద' మని చేసిన ప్రమాణముతోడనే జతగూర్పవలెనా?

పిన్నమ — మంచికి బోయిన చెడ్డ యెదురగుచున్నది — ఇక మీ చిత్తము — నే నేమి చెప్పగలను?

ఖడ్గ — నామనస్సు సుడిగుండమువలె తిరిగిపోవుచున్నది.

అన్నం—మహాపురుషా! చేసికొన్న సమయము ప్రకారము ఉభయులము మరల యుద్ధమునకు సిద్ధపడుచునేయున్నాముగదా!

ఖడ్గ — ఇది తీర ఎట్లు పరిణమించునో! కాలు ముందుకు సాగకుండనున్నది. హృదయము ఏటి కెదురీదుచున్నది.

అన్నం — తమ రింక సంకోచింపవలసిన పని లేదు.

ఖడ్గ — యజ్ఞపశువు నీడ్చుకొనిపోయిన ట్లీడ్చుకొని పోవుచున్నారు-కానిండు.

(ముందు అన్నంభట్టు, ఆతనివెనుక సాలోచనముగ తిక్కన నిష్క్రమింతురు.)

(ప్రవేశము : బ్రహ్మరుద్రయ్య)

బ్రహ్మ—ఉరుము లెక్కుడయిన మేఘము కురియ దందురు. గర్జించి గర్జించి చివరకు కాలికి బుద్ధిచెప్పినా డేమి ?

పిన్నమ—కొంతవరకు నాబలాత్కృతి. కొంతవరకు—కొంతవరకు అననేల, చాలమట్టునకు—అన్నంభట్టుగారి బలాత్కృతి !

బ్రహ్మ—ఈతిక్కనబ్రదు కిప్పుడును తొందరపాటుతోడనే తెల్లవారుచున్న దేమి ! ఒడ లెరుగకుండ మొదట అంతటి స్వల్పసేనతో వచ్చిపడనేల ? ఇప్పుడు పిక్కబలము చూపనేల ?

పిన్నమ—మొదటిమాటు తొందరపాటే లైయుండవచ్చును గాని ఇప్పుడుమాత్రము నిదానించియే వెనుకకు మరలినాడు. సైన్యమును సాయముదెచ్చుకొనవచ్చునని యాలోచించినాడు. అబ్బో ! రాజనీతిలో నారితేరిన చేయి !

బ్రహ్మ—అట్లయిన నొంటిగ జిక్కిన శత్రువును పోనిచ్చుట ప్రమాదకరము కాదా ?

పిన్నమ—మీతో దాపరిక మేమున్నది ? ఇప్పుడు యుద్ధమే లైనచో ఆతని కాపద తప్పదు. అంతగ వలసిపోయినాడు. చూచిచూచి ఈమహాపురుషుని వధించుటకు చేతులు రాకుండనున్నవి.

నిఖిలాంధ్రకవిలోకమకుటమూర్ధన్యుండు
  తిక్కన యను బ్రువ్వదిట్ట డనుడు
యుద్ధనీతిజ్ఞతాసిద్ధచారిత్రుండు
  సిద్ధనయోగి దూషింప డనుడు
వీరపత్నీమణీవిమలకీర్తిస్ఫూర్తి
  చానమాంబిక కిన్క బూన దనుడు
పుత్రమోహాతీత ప్రోలమాంబిక తపో
  విజ్ఞానగరిమ శపింప దనుడు
భావిజనవాక్య మది మనపక్ష మనుడు
అయిన నేమాయె ? నన్నింటి కధికమగుచు
రంపమున గోయు నాయంతరాత్మ వలని
బాధ క్షణమైన సహియింప బ్రహ్మతరమె ?

బ్రహ్మ—వీరుని పలాయనము సముద్రపు పోటువంటిది. నమ్ముకొని యేమరియుండుటకు వలనుపడదు. మరల పోటునకై యే మనము సంసిద్ధుల మయియుండవలెను.

పిన్నమ—ప్రకృతము గండము గడచినదికదా ! తరువాత చూచుకొందము, రండు. శిబిరమునకు బోయి రవంత విశ్రమింతము.

(నిష్క్రమింతురు—తెర పడును.)

ద్వితీయరంగము

[రంగము: విక్రమసింహపురోపకంఠము. ప్రవేశము : ఖడ్గతిక్కన, అన్నంభట్టు]

ఖడ్గ—నాయాత్మలో నొకవిధమైన ప్రసవవేదన మారంభమైనది.

అన్నం—యోధాగ్రేసరా !

ఖడ్గ—మీ సంబోధనమువలన నాయాత్మ మరింత బాధపడుచున్నది. యుద్ధభూమినుండి పాతి వచ్చినవాడు యోధాగ్రేసరు డెట్లగును?

అన్నం—శివశివా ! ఆత్మతిరస్కృతి మహాపురుషులకు తగదు.

ఖడ్గ—భట్టారకా ! ప్రకృతి యంతయు ఒక్కమ్మడిగ నన్ను తిరస్కరించుచున్నట్లు కనుపట్టుచుండగ ఆత్మతిరస్కృతి యాశ్చర్యకరమా ?

విజయశంఖ మూది వెడలివచ్చెడినాడు
కాళ్లుగడుగ పెన్న క్రేళ్లువారె;
పరులధాటి కోడి పారివచ్చెడి నేడు
నన్ను జూచి పెన్న నవ్వుకొనియె.

అన్నం—మన మనస్సులోని భావములనే ప్రకృతిపయి నధ్యాసించుకొని బాధపడుచుందుము గాని ప్రకృతి కెవ రెట్లు పోయిన నేమి గావలయును ?

ఖడ్గ—అయ్యయ్యో ! స్పష్టముగ గోచరించుట లేదా ?

చిట్టినవ్వులు ముఖసీమ చెంగలింప
తావులను స్వాగత మొసంగు పూవుదోట
మొగ్గవిడలేక లోలోన సిగ్గుపడుచు
వేడిగాడ్పులలో మ్రగ్గి వాడిపోరు.

అన్నం — గ్రీష్మఋతువు–మట్టమధ్యాహ్నము–మరెట్లుండును ?

ఖడ్గ—

గ్రీష్మభానుని తీవ్రత గ్రిందుపరచి
క్రమ్ముకొనియెను కారు మేఘములు మింట;
ఘోరమని యేడ్వలేక నభోవధూటి
పొంగిపొరలెడి శోకంబు మ్రింగజూచు.

అన్నం — మహాపురుషా ! వాచనవు నేమైన చెల్లింతురా ? మీధోరణి మీ దేనా ?

ఖడ్గ — పూజ్యుడా! నాయతిక్రమణమును మన్నింపుము.

అన్నం — అదిగో, సింహపురిని జేరవచ్చుచున్నాము. మనలో మన మెుక నిశ్చయమునకు రావలసియున్నదిగదా?

ఖడ్గ — నిశ్చయమునకు రాకుండగనే ఇంత దూరము వచ్చితిమా ?

అన్నం — ఆ నిశ్చయము మీకు వచ్చినట్లు కనబడదు.

ఖడ్గ — పైకి వచ్చినట్లే కనబడుచున్నది. లోపల నెందుచేతనో నచ్చకుండనున్నది. ద్వంద్వ రోగమువలె విధి విధానమున కందకుండనున్నది.

అన్నం — మరణమే వీరుని జన్మకు పరమావధి కాదుగదా ?

ఖడ్గ — ఇకముందు మనకు సిద్ధింపనున్న యవస్థకంటె మరణమే మేలుకాదా?

అన్నం—అజ్ఞానులు, మూర్ఖులు నగు ప్రజల యభిప్రాయమునకా మనము భయపడవలసినది ?

ఖడ్గ—భట్టారకా ! ప్రజావాక్యము నంతగ నిరసింప వలనుపడదు. దానిలోకూడ నంతర్వాహినియై ధర్మము ప్రవహించుచుండును. అందును విక్రమసింహపురవాసులు వివేకశీలురు.

(తెరలో)

భళీ ! సిద్ధనతిక్కనా ! బళే మగవాడవు !

అన్నం—(అదరిపడి, దృష్టిసారించి, తిక్కనతో) ఏమి యీకుప్రశంకల యాగడము! అప్పుడే యీవార్త రెక్కలుగట్టుకొని ఊరిలో వాలినట్లున్నది! మీపటము నూరేగించు మీపై మిమ్మవమానించుచున్నారు. మీరు నిదానముతో నాత్మనిగ్రహము చూపుటయే కర్తవ్యము. తొందరపడవలదు. భారమంతయు నాపై వదలుడు. మీరు మానము వహించియుండుడు.

ఖడ్గ—ఎన్నటికి సిద్ధపడకున్న మన మీ పురమున కాలుమోపగలము ? ఇట్టి తరుణములలో మానమే భూషణముగదా !

అన్నం—(దృష్టి సారించి) మెడలో పువ్వుల దండలకు మారు పిడుకలదండలా ? పార్శ్వముల వింజామరలకు మారు కాకియీకలా? శిరమున శ్వేతచ్ఛత్రమునకు మారు కుక్కగొడుగా ? మీమనసిట్లు మండిపోవుచున్నదేమి!

ఖడ్గ —అదేమది నన్ను శాంతింపు మని మీ రుగ్రులగుచున్నారు?

అన్నం—మహాప్రభూ! నా కోడలు మండుకొనిపోవుచున్నది. ప్రజాహితజీవనులగు మహాపురుషులకు తుద కిట్టి పారితోషికమే లభించునుకాబోలును ! ఈకుప్రవాంత్రము కదిపిన కందిరీగలతుట్ట. వీరి నెదుర్కొని మనము నెగ్గలేము. వారి నటు పోనిండు. అంతవరకు మన మీయరుగు వెనుక దాగియుందము.

(వారు దాగుకొందురు. పైని చెప్పినప్రకారమలంకరించిన తిక్కనపటము నొక బాలుడు పైకెత్తిపట్టుకొని, తక్కిన బాలురు జిల్లేడుపువ్వులతో దానిని పూజించుచు ప్రవేశింతురు.)

కొందరు బాలురు—జయ్ సిద్ధనతిక్కనజయ్ !

ఒక బాలుడు—సిద్ధనతిక్క నెవడురా ?

ఇంకొకడు—ఉన్నాడులే ఓనపుంసకుడు.

అన్నం—ఓరి కుంకా !

ఇంకొక బాలుడు—కవిత్వంకడతాడే ఆ తిక్కన్న కితడేమి గావాలె ?

మొదటి బాలుడు— (నోరు మూసికొనుచు) అపచారం! అపచారం! ఇద్దరి పేర్లు ఒకచోట ఉచ్చరింపకూడదు.

ఇంకొకడు—పరేలే. ఈ అప్రయోజకుడి పేరు ఉచ్చరిస్తేనేగాని జరగదా?

అన్నం — (చెవులు మూసికొని) శివశివా! నీ ముందుకూడ అప్రయోజకు డయినాడా?

మొదటి — అప్రయోజకుడన్నా అప్రయోజకుడు గాడు. శుద్ధ అప్రయోజకుడు.

(బాలకుల ఉత్సవము నిష్క్రమించును. అన్నంభట్టును,ఖడ్గతిక్కనయూ వీథిలికి వత్తురు.)

అన్నం—మహాప్రభూ! ఈరాజవీథిని ఇంటికి పోవుట దుష్కరము.

(ప్రవేశము: కొందరు పౌరులు)

మొ.పౌ.—శివశివా! ఎంత చెడువార్త?

రెం.పౌ.—ఏమయ్యా! ఎవరైన మృతులైరా?

మొ.పౌ.—మృతుడైనను మేలే!

అన్నం—(చరచర ముందుకు వచ్చి) మీకుమారునిగూర్చి ముచ్చటించుకొనుచుంటిరా?

మొ.పౌ.—నాకుమారుని కర్మ మేమికాలె? ఆతడు యుద్ధభూమినుండి వెనుకంజ వేయలేదే?

రెం.పౌ.—(తిక్కనపై వ్రేలు పెట్టి చూపుచు) అదుగో మహాత్ముడు మౌనముద్ర వహించి నిలువబడినాడు!

ఖడ్గ — (తనలో) దేహమా! భూమిలోనికి క్రుంగిపోకుండ ఇంకను నిలచియుంటివే?

అన్నం—(పౌరులతో) ఆమహాత్ముడు నిలవబడిన ప్రదేశమునుండి అర్ధయోజనము మేరలో నిలువబడుటకు మన కధికార మున్నదా? ఒకప్పుడు మన మందరము శిరమున నుంచుకొని పూజించిన పాదములు గావా యవి?

మొ.పౌ.—ఒకప్పుడు శత్రుశిరములను చెండ్లవలె నెగురవైచిన చేతులు కావా యవి?

అన్నం—ఆత డడుగుపెట్టినచోట నీ వడుగుపెట్టి రొమ్మువిరుచుకొనుదువా?

రెం.పౌ.—అడుగుపెట్టినచోట వడుగుపెట్టను లేదు. మడమద్రిప్పినచోట మడమద్రిప్పను లేదు.

అన్నం—"మడమ ద్రిప్పెను. మడమద్రిప్పె" నని మరిమరి తెగవాగుచుంటివి. ఎందులకు మడమ ద్రిప్పెనో యెరుగుదువా?

మొ.పౌ.—చేతగాక.

మూ.పౌ.—ప్రాణములు తీపయి.

రెం.పౌ.—పౌరుషము చచ్చి.

నా.పౌ.—మగతనముము మంటగలిసి.

అన్నం—కాదు. కానిండు. మీధోరణి కడ్డులేదు.

మొ.పౌ. — మేము కానియ్యనక్కరలేదు. నీవే సెలవిమ్ము. ఎవరి నుద్ధరించుట కీతడు పారివచ్చెనందువు?

అన్నం— మిమ్ము, మీపురమును, మీరాష్ట్రమును, మీరాజును.

మొ.పౌ.—ఈ సారకాయకోతల కింక విరామము లేదుకాబోలును.

అన్నం—ఓరి వజ్రసుంతా! ఇట్టి నాయకరత్నమును యుద్ధభూమిలో గోలుపోయినచో మరలనెన్ని జన్మముల తపస్సు ధారవోసినను ఇట్టివాడు లభించునా?

నా.పౌ.—ఆమాటమాత్రము సత్యము! విక్రమసింహపురము పుట్టినవెనుక నిట్టి దండనాథు డుదయింపలేదు. ఇకముందు ఉదయింపబోడు.

(తెరలో)

సంగరాంగణముల సాహిత్యసీమల
సింగములె జనించు క్షేత్రమగుట
సింహపురమనంగ చెల్వొంది నీ కిందు
తావులేదు తిక్క! మరలిపొమ్ము.

ఒక పౌరుడు—(మెల్లగ నన్నంభట్టుతో) నేను మీమీది యభిమానముచే మీహితము కోరి చెప్పుచున్నాను. ఈరాజవీథిని బోయినచో ఎన్నటికిని మీరిల్లు చేరుకొనలేరు. శిల్పులు, వర్తకులు, రజకులు, క్షురకులు—వారు వీ రననేల, పౌరు లెల్లరు గుంపులు గుంపులుగ వచ్చుచున్నారు. నామాటవిని ఈప్రక్కవీథిని బడి యింటికి పొండు. నే నేదో మిమమీద వీరి దృష్టి మరలింతును లెండు.

పత్రిక పేరు భారతి సంపుటము - 20
ప్రత్యేక సంచిక జనవరి - 1943 సంచిక - 1

అన్నం—(ఖడ్గతిక్కనతో) మహాత్మా! అదే తెల్లగ తోచుచున్నది. ఇంకను జనము పెరుగకుండనే మన మీసందులో బడిన మేలు.

ఖడ్గ—కానిండు. ఎంతగ కర్మము కాలకున్న నిట్టి యవస్థ తటస్థించును ?

(వెనుకటితెర యెత్తగ నొక ప్రక్కవీథి. సౌధములపైనుండి కొందఱు గోమయముకలిపినజలము చల్లుదురు.)

అన్నం—శివశివా! చైత్రయాత్రకు బయలు వెడలినపుడు లాజలు, పుష్పములు, చందనము చల్లిన చేతులతో—

ఖడ్గ—ఇది ప్రాయశ్చిత్తకాండము! గోమయమునకు ప్రసక్తి లేకుండ నడువదు!—వడిగా నడువు వేయుడు. కుఱ్ఱ యెక్కిరియుగ పైపోవుచున్నది. మనము వచ్చుచున్నామని విని మాయిల్లుకూడ వెనుకకు బోవుచున్నదేమో!

అన్నం—అదిగో! మహాత్మా. కైలాసశిఖరమువలె మీసౌధరాజము! ఎట్టకేలకు చేరుకొంటిమి. నమః పావనమూర్తయే నమః.

జీవన్ముక్తుడు సిద్ధమంత్రికి తప
స్సిద్ధిప్రదేశంబు; వి
ద్యావర్ధిష్ణుపు ప్రోలమాంబికకు ని
త్యావాసపీఠంబు; రా
జీవాక్షప్రతిముండు తిక్కనకు కా
శీక్షేత్రతుల్యం బనం
గా వెల్గొందెడి ధన్యగేహము! నమ
స్కారంబు నీ కయ్యెడిన్.

ఖడ్గ—

పిడుగు మొత్తినకరణి పైబడుచునున్న
పురమువారి యవజ్ఞతాభరము మోచి
చేరుకొంటిమి నీయంకసీమ కిపుడు—
కనుల నిప్పులు రాల్పకే కన్నతల్లి!

అన్నం—ఇది సిద్ధాశ్రమము. ఇందు చింతలకు తావులేదు. స్నానము చేసికొని భోజనము చేసి రవంత విశ్రమింపుడు. ఇంతలో నేను సేవలను గొనివత్తును. సెలవు. (నిష్క్రమించును.)

ఖడ్గ—నా యొడలు తూలుచున్నది. మనస్సున నేదో మైకము క్రమ్ముచున్నది. పెంచి పెద్దజేసిన తలిదండ్రులు — ప్రేమించి వరించిన ఇల్లాలు — ఈమాత్ర మర్థము చేసికొనకుందురా ?

(తెరలో)

మంగళము రాజసంస్థానమండనంబ!
మంగళము బ్రహ్మవంశాబ్ధిమౌక్తికంబ!
మంగళము కామినీజనమన్మథాంక!
మంగళము సాధుపుంగవా మంగళంబు.

ఖడ్గ—మాగధులుకూడ నన్నెత్తిపొడుచుచున్నట్లున్నదే? పద్యము చూడగ క్రొత్తది — 'సాధుపుంగవా' యని సంబోధనమా ?

(అంతట చానమ పరుగుపరుగున ప్రవేశించును)

చానమ—నాథా! నేడెంత సుదినము! మీ దర్శనము లభింతునో లభింపనో యని ఈదినమున నే పడిన తహతహ పరమేశ్వరుని కెరుక!

ఖడ్గ—(తనలో) బ్రదికితిని. ఈమె వైఖరిలో హేళనము పొడకట్టుట లేదు — మాగధులు పఠించిన పద్యమునకు నావ్యాఖ్యానము సరియైనది కాదు. 'యోగపుంగవా' యనుటకు మారుగ — పొరపాటున — 'సాధుపుంగవా' యని పఠించియుందురు.

చానమ—అయ్యయ్యో! తూలుచున్నారు.

ఖడ్గ—(తనలో) ఇరువది సంవత్సరములు నాతో కాపురముచేసిన యిల్లాలు — ఆమాత్రము నా యాంతరంగికప్రవృత్తులను కనిపెట్టకుండునా ?

చానమ—ఓరీ! ఎవరురా అక్కడ? అయ్యగారి స్నానమునకు — వలదు, నేనే వచ్చి సర్వమును సిద్ధముచేసెదను.

(నిష్క్రమించును)

ఖడ్గ—తల తిరుగుచున్నది. ఇది కొంత కీడులో మేలు. ఈమాత్రము సౌహార్దమయిన లభ్యమగు ననుకొనలేదు.

చానమ—(తెరలో)మీరు రావచ్చును. సర్వము నిదివరకే సిద్ధమయినది.

(ఖడ్గతిక్కన నాలుగడుగులు వేయగా తెర యెత్తవలెను. నులకమంచము, దానిపై పసుపుముద్ద, ప్రక్క నీళ్లబిందెలు)

ఖడ్గ—(అడుగు వెనుకకు వైచి) ఇ దేమిది ?

చానమ—నేను మన యింట నాడువారి సంఖ్య హెచ్చినదిగాదా ?

ఖడ్గ—క్రొత్తగ బంధువు లెవరైన వచ్చిరా ?

చానమ—ప్రాతబంధువులలో క్రొత్త స్వరూపము వచ్చినది.

ఖడ్గ—నీమాటలు నా కర్థమగుట లేదు.

చానమ—ఆడువారు మగవారుగ మారిపోవుట మీరు వినియుంటిరా? భారతము మీకు కొట్టిన పిండి. మీరు విన కేమి ?

ఖడ్గ—శిఖండినిగూర్చి ముచ్చటించుచుంటివా? అదేదో పురాణగాథ. దాని ప్రసక్తి యేమి వచ్చినది?

చానమ—పురాణగాథలు ముమ్మాటికి నిజమని నేటి చరిత్రగాథలు ఋజువు చేయుచుండుటవలన ప్రత్యక్షకథలను పురస్కరించుకొని పరోక్షగాథల నంతగ పరామర్శింపవలసివచ్చినది.

ఖడ్గ—ప్రత్యక్షకథ లేమి ?

చానమ—ఇప్పుడు మగవా రాడువా రగుచున్నారుగదా ?

ఖడ్గ—చాలు నీవిడ్డూరములు.

చానమ—మీకే విడ్డూరముగ దోచుచున్నదా? ఇంచుక తాళుడు. ఇప్పుడు మన యింటిలో నాడువా రెందరున్నారు ?

ఖడ్గ—దీనికి జనసంఖ్య—లెక్క తేల్పవలె నందువా? నీవును, మాయమ్మయు గాక మరెవ్వ రున్నారు?

చానమ — యుద్ధభూమినుండి పలాయనమొనర్చినవారిని ఆడువారుగ లెక్కవేయవలెనా, మగవారుగ లెక్కవేయవలెనా ?

ఖడ్గ—(ఆగ్రహముతో) ఛీ! ఇంత హద్దుమీరి ప్రవర్తింతువని అనుకొనలేదు.

చానమ—మేముకూడ ఎన్నడు స్వప్నమునసైన అనుకొనని హద్దుమీరిన ప్రవర్తన మొకటి యీదినమున నడచినది కావుననే యింతగ సంతాపింపవలసివచ్చుచున్నది.

ఖడ్గ—(తీవ్రతతో) నేను యుద్ధమునుండి చేతగాక పారివచ్చితి నందువా ?

చానమ—ఆమాట నానోట రాలేదే! అనేక యుద్ధములలో నారితేరిన యతిరథశేఖరులు! పౌరుషలక్షణ మనియే పగరకు వెన్నిచ్చియుండవచ్చును. ఎవరు చెప్పగలరు?

ఖడ్గ—అగ్నిలో బడిన మిడుతవలె నశించుటయే వీరుని జన్మకు పరమావధి యందువా ?

చానమ — కాదు. పలాయనమే పరమావధి. నేడు నాకు విస్పష్టముగ బోధపడుచున్నది.

ఖడ్గ—నీతో మాటాడి ప్రయోజనము లేదు. చెప్పినమాట వినిపించుకొనవు! నీతిక్క చూడగ నాకు నవ్వు వచ్చుచున్నది.

చానమ—నేను క్రొత్తగ వచ్చినది కాదుగా! తలిదండ్రులు పెట్టిన పేరులోనే యున్నది!

ఖడ్గ—పలికించినకొలది నపస్వరములు హెచ్చుచున్నవి. చాలు. ఈపరాభవము చాలును. ఉండియుండి ఒక్కమారుగ నగ్నిపర్వతమువలె విజృంభించినదే! ఎంత దుస్సహము? నాయింటనే నాకు పరాభవమా ? అమ్మా! అమ్మా!

(అని చివాలున వెనుకకు తిరుగును.)

(తెరలో)

నాయనా! వచ్చుచున్నాను.

ఖడ్గ—ఆకంఠధ్వని వినగనే అమృతము చిలికినట్లగుచున్నది.

(ప్రోలమ ప్రవేశించును.)

మాతృదేవో భవ! తల్లీ, నమస్కారము.

ప్రోలమ—ఎంత యలసిపోయితివిరా తండ్రీ! అయ్యయ్యో! వదనము వరువట్లు వట్టినది. దప్పికయగుచున్న దేమో! ఇంచుక తాళుము.

(నిష్క్రమించును)

ఖడ్గ — ఎన్నటికయిన కట్టుకొన్న యాలికిని కన్నతల్లికిని భేద ముండకపోవునా ?

చానమ—(ప్రక్కకు తిరిగి తనలో తాను నవ్వుకొనును.)

ప్రోలమ—(ప్రవేశించి)ఇదిగో పాలు. వీనిని గ్రోలుము.

ఖడ్గ—(పాలపాత్రను చేత బుచ్చుకొని చూచి) అమ్మా! ఈపాలు విరిగిపోయినవి.

ప్రోలమ — అలాగునా? నాయనా, నేను చూడనే లేదు. విపరీతకాలము వచ్చిపడిపోయినది. ఇప్పుడన్నియు విరిగిపోవుచునేయున్నవి.

ఖడ్గ—ఆదేమమ్మా! అట్లనుచున్నావు?

ప్రోలమ—అబ్బే! ఏమియు లేదు నాయనా! చూడు. పసువులు విరిగినవా?

ఖడ్గ—పసువు లెప్పుడు విరిగినవి?

ప్రోలమ—(నవ్వుతో) యుద్ధములో నీకత్తి విరిగినప్పుడే.

ఖడ్గ — (తనలో) ఓహో! ఈవిడధోరణి వేరుగ నున్నది.

ప్రోలమ—పాలకంటెను స్వచ్ఛమయిన మన వంశవిఖ్యాతి నేటితో విరిగిపోయినదా?

ఖడ్గ—(తనలో) ఈమె మరియొక యుపన్యాస మారంభించును కాబోలునురా, భగవంతుడా.

ప్రోలమ— మేరుపర్వతమున కయిన చలన మున్నది కాని దీనికి చలనము లేదని నిశ్చయించుకొన్న నీ విక్రమము విరిగిపోయినదా? మాటాడవేమి నాయనా?

ఖడ్గ—నా బదులుకూడ నీవే మాటాడుచుండగ—

ప్రోలమ— నీకు నవ్వువచ్చుచున్నది కాబోలును.

ఖడ్గ—నేను చెప్పదలచిన మాటలు వినినవెనుక నీమయినను మీ రన్నచో కొంత యర్థ ముండెడిది.

ప్రోలమ—అయిన నింతవరకు నేను చెప్పిన మాట లన్నియు నిరర్థకములే యందువా?

ఖడ్గ — గాయములనుండి రక్తము స్రవించుచున్నది!—

ప్రోలమ — గాయములనుండి రక్తము గాక పన్నీరు స్రవించు ననుకొంటివా వెఱ్ఱితండ్రీ?

ఖడ్గ—(విసుగుదలతో) పదినెలలు దాటని పసికూనగ భావించి నన్ను మీ రాడించుచుండగ నిక నేనేమి చెప్పను?

ప్రోలమ — పసికూనవు గావు, ప్రాజ్ఞుడవే. ఏమి చెప్పదలచితివో చెప్పుము. సావధాన చిత్తతతో విందును.

ఖడ్గ—అలాగున నంటివి- బాగున్నది. వినుము. నేను తీసికొనిపోయిన కొలది యోధవర్గమును యుద్ధమున మడిసెను.

ప్రోలమ—వారందరును ధన్యాత్ములుగనుక - వారిని గన్న తల్లులు వీరమాతలు గనుక.

ఖడ్గ—(తనలో) అబ్బ! ఈ ముసలియామె మాటలు కత్తిపోటులకంటెను వాడిగ నున్నవి! (ప్రకాశముగ) సరేలే! ఎట్లయినను నిడివిమీద ప్రభువుకు విజయము చేకూర్పవలెనుగాని నిష్ప్రయోజనముగ యుద్ధభూమిని మరణించిన నేమి ప్రయోజనమని—

ప్రోలమ—అబ్బ! అంత దూర మాలోచించితివా? నీతో వచ్చిన యోధు లందరు ఎవరి కెన్నవ వారు ఈ తీరుననే యోచించి రక్షకొనుము—అప్పుడేమగును?

ఖడ్గ—అబ్బబ్బ! వారు అనుచరులు. నేను దండనాథుడను. వారివంటివా రెందరు మరణించినను నష్టములేదు.

ప్రోలమ—దండనాథు డనగ నర్థ మిదియా? ఎంత చిత్రముగ నున్నది? తన తొందరపాటువలన అనుచరుల ప్రాణములను బలియిచ్చి ఒడలు దాచుకొనుటకయి తాను పలాయితు డగుటయే దండనాథుని లక్షణము కాబోలును. యోధాగ్రేసరుడవు నీవు చెప్పవలయును. ఇంట గాజులు దాల్చి కూర్చుండిన నాకేమి తెలియును?

ఖడ్గ—నా మాటలకు నీవు విపరీతవ్యాఖ్యానము చేయుచుండగ—

ప్రోలమ—(కోపముతో)

వైపరీత్యంబు గాకేమి వంశ మెల్ల
వెదకిచూచిన నినుబోటి వీరు డున్నె?
గంట మీ నిప్పలో తీకెడు నింట బుట్టి
ఖడ్గ మిటు నీరుగారుట కాలమహిమ!

ఖడ్గ — సగము చచ్చి యింటికి వచ్చినవానిని నీవు పూర్ణముగ వధించుచున్నావు.

ప్రోలమ — (ఉగ్రముగా) ఛీ కుమారా! "సగము చచ్చి" అనుమాట నుపయోగించుట నీ మగ

తనమున కెంత లోపమో ఆలోచించుకొనకుండ నున్నావు. నీవు చేసిన పని యెంత హీనమైనదో ఇప్పటికైన గ్రహింపకుండుట కడుంగడు శోచనీయము. నీకంటెను బలవంతుడను నొక రాక్షసుడు నీ మాతృదేవత నవమానించుచుండగ వానిని జయించుట ఎట్లును అసాధ్యమేగదా యని ఆమెను ఒంటిగ—నసహాయగ — ఆ రాక్షసుని సమక్షమున విడచి పారిపోదువా ?

ఖడ్గ — పారిపోదునా ? ప్రాణములను బలి యిచ్చెదనుగాని —

ప్రోలమ — తల్లుల కెల్లను తల్లి — జగత్తున కాధారభూతమగు సత్యదేవతను ఒక నరాధముడు పరాభవించుచుండగ తగుదునమ్మ యని ఆమెను రక్షించుటకయి యుద్ధమునకు సిద్ధపడి — చేతగాక — ఏవో సాకులు చెప్పుకొనుచు ఆమె నొంటిగ యుద్ధభూమిని విడచి నీ వింటికి విజయంచేసితివా ?

ఖడ్గ — తల్లీ ! మనము క్షత్రియులము కాము గదా !

ప్రోలమ — ఈ యంశము నీ కిప్పుడే గోచరించినదా ? బుద్ధిపూర్వకముగ క్షత్రియధర్మమును వరించి విషమావస్థలో దానిని వర్జించుట బ్రాహ్మణ ధర్మము కాబోలును ! మొదటినుండియు రాజనీతితో సంబంధము వదలుకొని స్వాధ్యాయ మొనర్చుకొనుచు అహింసాధర్మపరుడవై యూర్చుండిన నెవ్వరికిని తగవు లేదు. తీర యుద్ధమధ్యమున ధర్మజిజ్ఞాసయా ? ఎంత చక్కగ నున్నది ? ఉభయ భ్రష్టుడ వగుట కింతకంటె నుత్తమమార్గము లేదు.

ఖడ్గ — అమ్మా ! సహజమార్దవసంపన్నమగు మాతృప్రకృతిని వీడి నీవు చండికాస్వరూపిణి వగుచున్నావు. నిన్ను జూడగ నాకు భయము కైచుచున్నది. నీకు నేను సమాధానము చెప్పలేను. (నిట్టూర్పు విడుచుచు)

ఆపదలపైని యాపద లలముకొనుచు
కుంభవృష్టిగ పిడుగుల గుఱియువేళ
నిలచి తలదాచుకొనుటకు నెలవు తల్లి—
ప్రళయకాలార్కబింబమై ప్రజ్వరిల్లె !

దుర్భరము ! దుర్భరము ! ఇక నొక్కనిముసమైనను ఇక్కడ తాళజాలను. పునర్దర్శనము వీరస్వర్గముననే ! కడసారి తండ్రిగారికికూడ నమస్కరించి మరి పోవుదునా ?

(అని కాలుగదుపులు వేయును. అంత తెర యెత్తగ పారాయణపు బీటపైని భగవద్గీత నుంచి పఠించుకొనుచు బంగారు పీఠమున గూర్చున్న సిద్ధన ప్రవేశము.)

సిద్ధన —

భయా ద్రణా దుపరతం
మన్యంతే త్వాం మహారథాః,
యేషాంచ త్వం బహుమతో
భూత్వా యాస్యసి లాఘవమ్.

ఖడ్గ — (అదరిపడి) ఇంకు నాకు సందేహమేమైన నిమిడియున్నదా ?

సిద్ధన—

అవాచ్యవాదాంశ్చ బహూ
న్వదిష్యంతి తవాహితాః,
నిందంత స్తవ సామర్థ్యం
తతో దుఃఖతరం ను కిమ్.

ఖడ్గ—ప్రకృతము నాయవస్థ కిది యెంత సరిపడియున్నది !

సిద్ధన—

హతో వా ప్రాప్స్యసి స్వర్గం
జిత్వా వా భోక్ష్యసే మహీమ్,
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ
యుద్ధాయ కృతనిశ్చయః.

ఖడ్గ—(వికసించిన ముఖముతో ఉచ్చైస్స్వరముతో) ధర్మజ్యోతి గోచరించినది! ధర్మజ్యోతి గోచరించినది !

సిద్ధన—(తల పైకెత్తి చూచి) కుమారా !

ఖడ్గ—తండ్రీ! నమస్కారము. (అని సాష్టాంగపడి లేచి) చిరకాలమునుండి విడకున్న సంశయ గ్రంథులు నేడు విడిపోయినవి.

సిద్ధన—ఎట్లు ?

ఖడ్గ—బ్రాహ్మణధర్మపక్షపాతముచే బాధపడుచున్న నా యాత్మకు నేడు ముక్తి సిద్ధించినది.

సిద్ధన—ఎందుచేత ?

ఖడ్గ—క్షాత్రధర్మమునకు, బ్రాహ్మణధర్మమునకు సమన్వయము కుదురుటచేత.

సిద్ధన—సంతోషము.

ఖడ్గ—తపోధనుల మహిమ దురూహ్యము. అనుదినము నేనుకూడ భాష్యసహితముగ గీతా పారాయణము చేయువాడనే యయ్యును ఈ ముహూర్తము నందలి విశేష మేమో కాని నా జీవితమున నొక నూతనజ్యోతి యుదయించినది. మూడు శ్లోకములు మీనోట వినగనే ముల్లోకములు జయించిన ట్లయినది.

సిద్ధన — జన్మకు సాఫల్యత నొసంగజాలిన ముహూర్తము లనగ నిట్టివే.

ఖడ్గ — ఈ ధర్మజ్యోతి యిదివరకే గోచరించి యుండినచో నే నింత యపహాస్యమునకు పాల్పడి యుండను.

సిద్ధన—ఇవి దైవాదేశములు. ఏముహూర్తమున నేది యెట్లు జరుగవలయునో అట్లే జరిగి తీరును గాని—

ఖడ్గ—గతజలసేతుబంధన మేల ? ఇప్పటికైనను మించిపోయినది లేదు గదా ?

సిద్ధన—లేదు. నిశ్చయముగ లేదు. నీజన్మము నంతను మహోజ్జ్వలముగ బ్రకాశింపజేయు గడియలు ఇంకను ముందే రానున్నవి.

కంకణ కింకిణీస్వనము
కర్ణ పుటంబు లలంకరింప నీ
వంకకు వచ్చి వ్రాలెడిని
ఖండన భూముల మోహలక్ష్మి; యా
లంకృతమైన ప్రజ్ఞకు ఫ
లంబుగ గాంచిన ధన్యజీవితం
బంకిత మిచ్చి తత్ఫలము
నాంధ్ర ధరిత్రికి బంచిపెట్టుమా !

ఖడ్గ — తండ్రీ ! కాదు కాదు — గురుదేవా! ఈ వరకే జాగైనది. నాకు సెలవు.

తావి మోయగరాకున్న పూవువోలె
నిండురసమున నూగాడు పండువోలె
వలరుచున్నది నాయాత్మ; తెలుగుతల్లి
పాదపీఠంబుకడ నిదే బలియొనర్తు.

(అంతట ప్రోలమ్మయు, చానమ్మయు మంగళ హారతి పళ్లెరముతో బ్రవేశించి తిక్కనకు నీరాజన మిత్తురు.)

ప్రోలమ — కుమారా !

వీరవిహారముల్ సలిపి
విశ్రుతికెక్కిన వంశగౌరవం
బారడివోవ జూచి హృద
యంబు గలంగిన నిష్ఠురోక్తులన్
గాటియ పెట్టి నీ మనసు
ఖడ్గముతో దునుమాడినానొ ! — నా
నేరము సైపగావలయు
నిర్మలధర్మయశోవిభూషణా !

చానమ — నాథా!

రణమున తోడినీడలయి
రాజిలు ఖడ్గము నశ్వమున్ యశో
ధనమును బంచుకోగలుగు
ధన్యత గాంచగ దిష్టిబొమ్మనై
వెనుక నె నిల్చి నాదయిన
జీవిత దేహ మదృష్టదేవతన్
గినియుట నిష్ఫలం బెకద
కీర్తిరమారమణీమనోహరా !

ప్రోలమ — (తిక్కనగడ్డము పట్టుకొని)

పుత్రయజ్ఞదీక్ష బూనిన మీతండ్రి
పూన్కి నేటితోడ బూర్తిచెంద
పుత్రవతుల కెల్ల ప్రోలమాంబిక తల
మానికంబు గాగ మసలు తండ్రి !

ఖడ్గ—తల్లీ !

వేరొక గేహమందు బ్రభ
వించిన తిక్కనపుట్టు వింతగా
గౌరవభాజనం బగుట
కల్గదు; ధర్మనిబద్ధబుద్ధులై
నేరము జూపి చెప్పితిరి —
నిష్ఠురవహ్ని పుటంబుగాంచు బం
గారమువోలె పొందెదను
కాంతిమయ స్థిరసుందరాకృతిన్ !

(చెవియొగ్గి యాలకించి) అదిగో ! భట్టారకుల సైన్యమును సమకూర్చుకొని వచ్చినట్లున్నది.

చెవుల విందుగ భేరులు చెలగి మ్రోగ
పిలచుచున్నది తనయుల పేరుపేర
ననుపమ ప్రేమనిధియైన యాంధ్రమాత
పోయివచ్చెద సెలవిండు పూజ్యులార !

(నిష్క్రమించును)

చానమ—చీకటి...చీకటి...చీకటి.

ప్రోలమ—అమ్మా! అదేమి?

చానమ— అత్తా! నాకనులు చీకటిగ్రమ్ముచున్నవి.

ప్రోలమ—అయ్యో కోడలా! నాగుండె చెరువగుచున్నది. అలసిపోయి యింటికి వచ్చిన బిడ్డకు నవంత దాహమైనను ఈయలేకపోతినే తల్లీ!

చానమ—అదేమో గ్రహణముపట్టినట్లుగ కనబడుచున్నది.

ప్రోలమ—అమ్మా! గ్రహణము పట్టుటతో నాగదే. పెద్ద ఉప్పెనయే వచ్చిపడుచున్నదే.

సిద్ధన—(తల పంకించుచు)

రాడు కుమారరత్న మిక;
రాత్రిరియున్ బవలున్ వృథా మనః
పీడనమే శరణ్యమగు;
ప్రేముడిమై - సకలాంగకంబులున్
వాడిన జీర్ణ దేహమున
వార్ధక భారము సోకకుండ గా
పాడిన పుణ్యమూర్తి యిదె
స్వర్గపథంబుల నిర్గమించెడిన్.

దిగినచో ఈదుఃఖసముద్రమునకు పారమే లభింపదు. నేను ధైర్యము చెప్పకొని వీరికి ధైర్యము చెప్పవలెనుగదా! (కోడలితో) తల్లీ! చేసిన త్యాగము నిష్ఫలమొనరించుకొందువా?

చానమ—మామగారూ! అపరాధము, క్షమింపుడు.

సిద్ధన—తల్లీ! మనకున్న సెన్నిధు లన్నిటిలోను అపురూప మైనదానిని—అమూల్యమైనదానిని దేశమాత కర్పించి ధన్యుల మైతిమి. ఇంకను కొంచెము తరువాయి యున్నది.

చానమ—అదేదో సెలవిత్తురుగాక.

సిద్ధన—ఆత్మయజ్ఞము.

ప్రోలమ—నాకును అదే తోచుచున్నది. పది కాలములపాటు బ్రదికి వర్ధిల్లవలసిన పసికూనను చేజేత మృత్యులక్ష్మిని వరింపబంపి, చివికి శీర్ణమయిన ఈశిథిల దేహములను ఎన్నాళ్లు మోయగలము?

చానమ—(తనలో) వీరు నన్నొంటిగ విడిచి పోవుదురు కాబోలునురా భగవంతుడా! వారి వార్త తెలియువరకైన నాగిన బాగుగ నుందును. (ప్రకాశముగా) అత్తా, అసహాయశూరుడగు మీకుమారుని గూర్చి ఇంతలోనే అధైర్యమా?

ప్రోలమ--అధైర్యపడి కాదమ్మా. ఇంక మాకు ఇహజీవితమున కోరదగిన దేమున్నది? తీరదగిన దేమున్నది?

సిద్ధన--అవలి లోకములనుండి యాహ్వానము వీనులవిందుగ వినవచ్చుచున్నది. అదిగో కైలాస పర్వతము కన్నుల పండువుగ గనవచ్చుచున్నది.

ప్రోలమ--అమ్మా! వారి తపమునకు మన ముపరోధము గల్పింపరాదు; మరల దర్శించుకొందము రమ్మా!

చానమ--అత్తా! ఇంద్రధనుస్సువలె మహాపురుషుల యాంతరంగిక ప్రవృత్తులు క్షణక్షణమునకు నూతనకాంతు లీనుచుండును కాబోలును!

తెలియవుపో తపోధనుల
దివ్యమహత్త్వము లంతరాత్మలన్
గలుషములైన భావములు
గాలిదునంతకు; చింతలన్నిటిన్
గలిచి భవత్సమక్షమున
కేవలకాంతిసుధార్ద్రభూములన్
గొలువగ జేసెదంచునటు
కోడలిపై కరుణింపగాగదే.

(సిద్ధన ధ్యానాసనాసీనుడై యుండగ ప్రోలమ, చానమలు నిష్క్రమింతురు. తెర పడును.)

[మరి రెండు రంగములు మరునటి సంచికలో]

హిమవత్ప్రకృతి

శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి

గడ్డిపొత్తులను నాగటిచాళ్లతొట్ల హాయిగ బిడ్డలటు తల లెత్తునవియు
కమ్మచ్చు దీసిన కలికి తీఁగలలాఁగు కాడల నల్లడల్లవియునవియు
గిలిగింతలను కిలకిల వెలిబుచ్చు నవ్వుల రీతి నెల్లెడఁ బూయునవియు
పెద్దల చెంగటి పిన్నలచందాన వరుసగా నట్టులు వంచునవియు
ఆకుఁబచ్చొద నద్ది ముద్దాడి కంకి-ఫురిటిపిల్లలకుం బాలు వోయునవియు
నగుచుఁ జలికారునందు దృశ్యంబులయ్యె-దేవమాతృక భువిపైర్లు తెలుపిదార్లు.

గరుడపచ్చల మధ్యఁ గనకమ్మువలెఁ జేల సొబగులు ధాన్యరాసులు చెలంగ
దేవమాతృకలు నదీమాతృకలుఁ బరస్పరము సాయమొనర్పఁ బాలుపడియె
మనుజునిఁ గాకరూపునిఁ గాకిని నరాకృతిఁ జేసి చలియగ్నిఁ బాగలు వెంచె
వాననీటను గ్రాఁగి బ్రహ్మాండభాండ మావిరిఁగక్కు-నటు మంచు కురియుచుండె
పుష్యమాసమందు పూనంత వేసంగి-యున్నయట్లు తిలక మనలుకొనియె
పొగఁ బయెర కొంత సాయంసమయమునఁ- జూత మందగించె శీతువునను.

నవీనప్రయోగము

నెమిలి, నెమలి యను రూపములలో నెమిలి యను రూపమే యొప్పనియు, నెమలి యను రూపము తప్పనియు బండితుల యాశయము. శబ్దరత్నాకర నిఘంటు కర్త యగు బహుజనపల్లి సీతారామాచార్యులుగారు నెమిలి యను పదమునకు మయూర మని యర్థము వ్రాయుచు, నెమలి యని వాడుచున్నారు గాని దానికి దగినప్రయోగము కనబడలేదని వ్రాసిరి.

ఇది యిట్లుండ శ్రీనాథమహాకవి విరచితమయిన శ్రీ భీమేశ్వరపురాణమునందు నెమిలి యని ప్రయోగింపబడుటకు బదులు నెమలి యని ప్రయోగింపబడినది. ఇది యతిస్థానమున నుండుటచే నీరూపము శ్రీనాథున కిష్టమయిన దనియు, లేఖకదోషము గాదనియు వచించుటయందు సందేహము లేదు. శ్రీ భీమేశ్వరపురాణము నందు దక్క నితరగ్రంథములయందు నీ ప్రయోగము మృగ్యము. ఈ వింతప్రయోగము గల పద్యము నీ క్రింద వ్రాయుచున్నాడను.

పంచాక్షరీమంత్రపారాయణంబులు జపియించు శారికాసముదయములు
నీలకంఠస్తోత్రకోలాహలప్రౌఢి జూపు నున్మత్త పుంస్కోకిలములు
శతరుద్రపచ్ఛ్రీతిస్వాధ్యాయపాఠంబు బరిఢవించు గిశోరబంధురములు
ప్రణవాక్షరాభ్యాసపరిపాటి ఘటించు నానావిధంబుల నెమలిపిండు
సప్తగోదావరాంబు నిర్ఝరసహస్ర - పారణీపేకసాంతత్య సంప్రవృద్ధ
వివిధతరుగుల్మవల్లికావేల్లమైన - తత్పురోద్యానవీథికాంతంబునందు. [భీమఖండము, 3-౨౫]

కోగంటి దుర్గామల్లికార్జునరావు.

'ఆదికవి' వాల్మీకి - కాళిదాసు

= శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి =

౧

వాల్మీకి ఆదికవి అనీ, సంస్కృతభాషకు ఛందస్సును అనుష్టుబ్రూపముతో తెచ్చిపెట్టినాడనీ సంప్రదాయప్రతీతి కనబడుచున్నది. 'మా నిషాద' అనే శ్లోకము ఈ అర్థపరముగా వ్యాఖ్యచేయబడినది. కాని వైదికవాఙ్మయములోను, ఉపనిషత్తుల లోను అనుష్టుప్ఛందము పెక్కుమారులు ఉపయోగింపబడినది. వేదములో ఛందస్సులను చాలాచోట్ల పేర్కొనినారు :

'త్రిష్టుబ్ గాయత్రీ ఛందాంసి సర్వాతాయమ ఆహితా' ౧

'ఛందాంసి జజ్ఞిరే' ౨

ఇదిగాక అనుష్టుపును వక్కాణించి పల్కియున్నారు :

'అనుష్టుభమను చర్చూర్యమాణం.' ౩

'అనుష్టుభా సోమ ఉక్థైర్మహాస్వాన్' ౪

'అనుష్టుభాయ హవిష్ హవిర్యత్' ౫

ఇంకా ఇటువంటి వెన్నో కనబడుచున్నవి. ప్రాతిశాఖ్యాది గ్రంథములలో సర్వఛందస్సులకు గాయత్రి మూలకారణమనీ, తదుత్పన్నము లన్యములనీ కొక్కి చెప్పబడియున్నది. వరుసగా నాల్గేసి నాల్గేసి అక్షరము లెక్కువ చేసికొనిపోయిన గాయత్రి (౨౪), ఉష్ణిక్ (౨౮), అనుష్టుప్ (౩౨), బృహతీ (౩౬), పంక్తి (౪౦), త్రిష్టుప్ (౪౪), జగతి (౪౮) మొదలైన ఛందస్సులు వచ్చుచున్నవి. శ్రుతివాఙ్మయమే కాక స్మృతివాఙ్మయముకూడా అనుష్టుపునే చేరదీసినది.

వాల్మీకి అనుష్టుపును కనుగొనినాడను ప్రతీతి ఏల వచ్చినది? వైదికవాఙ్మయమును వదలివేసి లౌకిక వాఙ్మయమునుపరీక్షించి ఈకీర్తిని వాల్మీకి కంటగట్టినారని యొకపక్షము. లౌకికము వైదికోత్పన్నమైనచో ఈపేరు ఋగ్వేదకవులకే చెందవలెను. అదిగాక కొందరు పాశ్చాత్యు లన్నట్లు రేఫప్రాధాన్యమైన వైదిక భాష వేరు, లకారప్రాధాన్యమైన ప్రాకృతము వేరు, ఉభయప్రాధాన్యమైన సంస్కృతము వేరు—మూడును సమకాలికోత్పత్తి నంది వెలసినవని అనిన, శ్రుతిస్మృతులతో పరిచయమున్న వాల్మీకి కాకీర్తి పోవుచున్నది.

పూర్తిగా వైదికభాషకుగాని, పూర్తిగా లౌకిక భాషకుగాని చెందని భారతకథ రామాయణాత్ప్రాచీనము. మహాభారతము జాతీయగ్రంథము, ఇతిహాసమున్నూ. రామాయణము మహాకావ్యము. అన్ని పారస్వతములలోను జాతీయేతిహాసములు, పదవాఙ్మయము (Ballad literature) మొదలైనవాని తర్వాతనే కావ్యయుగము కనబడుచున్నది. రామాయణ కథకు సంబంధించిన పదవాఙ్మయము బౌద్ధజాతకకథలలో కొంతగలదు.౬

---

1. ఋ. వే. ౧౦ - ౧౪ - ౧౬; 2. ౧౦ - ౯౦ - ౯; 3. ౧౦ - ౧౨౪ - ౯; 4. ౧౦ - ౧౩౦ - ౪; 5. ౧౦ - ౧౮౧ - ౧.

6. రామాయణకథ వేదమందలిగాథలను స్మరింపజేయుచున్నదని తిలకుగారు తమ 'ఆర్కిటిక్ హోమ్ ఆఫ్ ది వేదాస్' అనే గ్రంథంలో వివరించినారు (౩౪౭-౩౫౦). ఇంద్రుడే రాముడనీ, దశోణీ, దశమాయా, దశరాజ్ఞా ఇత్యాది ఇంద్రశత్రువులే రావణరూపము చెందినారనీ, ౪-౫౬-౬, ౭ లోని నాగటిచాలైన సీతయే సీత అనీ, సీతను లంకనుండి తీసికొనివచ్చు

భారతకథను సంబంధించిన విషయములు వైదిక వాఙ్మయములో విపులముగా కనబడుచున్నవి. ఏ దెలా ఉన్నా, మహాభారతములోని అనుష్టుప్ పంక్తి కేమిటి?

ఈ పైన పేర్కొనబడిన గ్రంథము లేవీ కావ్యములు కావు. కావ్యమున కుపయోగించినవారిలో వాల్మీకి మొట్టమొదటివాడై యుండిన ఆదికవి, ఛందః సృష్టికర్త అనే రెండు ప్రతీతులను ఏదో ఒక విధముగా సమన్వయింపవచ్చును. కాని వాల్మీకి పాణినివ్యాచార్యుని కంటె పూర్వుడా? పాణినినాటికి, పాణినికి ముందు కావ్యప్రపంచము చాల ఉన్నది. పాణిని ఏకారణముతో, దేనికొరకు వ్యాకరణము వ్రాయవలసివచ్చినది? 'ప్రయోగమూలం వ్యాకరణం' అను సూక్తి సారస్వత సంపదనే వ్యాకరణ మాధారముగ చేసికొనునని సుస్పష్టముగ వ్యక్తీకరించుచున్నది. పాణిని వైదికలౌకిక వాఙ్మయముల రెంటికిని సూత్రముల రచించినాడు. లౌకికసారస్వతమే లేకపోయిన వ్యాకరణోదయ మన వసరమే. పైగా పాణినికిముందు శాకటాయన, శాకల్య, ఆపిశలి ప్రభృతులగు వ్యాకరణాచార్యు లున్నారు. అనగా పాణినినాటికే ఎందరో వ్యాకరణాచార్యు లున్నారనీ, వారందరికిని ముందే కావ్యములు బాగుగ వెలసినవనీ తెలియుచున్నది. అందువలన పాణినికిముందు (క్రీ. పూ. ౧౦౦౦ ? ముందు) కావ్యములు లేవనుట భాషాశాస్త్రము నెరుగనట్లు పలుకుటయే యగును.౭ పాణిని బ్రాహ్మణములను సహితము శ్రుతులుగా గ్రహించి, వానిని 'ప్రోక్త' మైన వానిగా పలికినాడు.౮ లౌకికగ్రంథములను'కృత'ము లనినాడు—'కృతే గ్రంథే'. వేరొకచోట వరతంతుమహర్షిని గ్రంథకృత్తుగా పేర్కొనినాడు.౯ భిక్షు,నట,కర్మంద, కృశాశ్వల సూత్రగ్రంథములను సూచించి,౧౦ స్వతస్సిద్ధముగ తమ ప్రతిభావిశేషములతో వ్రాసిన కావ్యములకు 'ఉపజ్ఞ' అనెడు క్రొత్తసంజ్ఞను 'ఉపజ్ఞాతే' అను సూత్రమున చెప్పెను. ఒకచోట 'ఆఖ్యాన' మను సారస్వతరూపము నిక్కగా,౧౧ కాశికలో 'పూర్వరామకం, పూర్వయాయాతం' మొదలైనవి ఉదాహరణములుగ నివ్వబడినవి. భారతము పాణినికి ప్రాచీనము. భారతయుద్ధము నతడుదాహరించినాడు. ౧౨ అదిగాక 'అధికృత్యకృతే గ్రంథే' అనుసూత్రము తత్పూర్వము కావ్యములున్నట్లు చాటుచున్నది. యాయాతం, భారతం మొదలైనవి ఉదాహరణములుగా ఈ సూత్రవ్యాఖ్యలో కనబడుచున్నవి. 'మహాన్ వ్రీహ్యపరాహ్ణ గృష్టీష్వాస జాబాల భార భారత హైలిహిల రౌరవ ప్రవృద్ధేషు' అను సూత్రము మహాశబ్దముయొక్క స్వరవిశేషము చెప్పుచు మహాభారత పద మప్పటికే వాడుకలో ఉన్నట్లు తెలుపుచున్నది. లౌకికవాఙ్మయ ముదయించినతర్వాత పాణిని బయలుదేరినాడు. పాణినికి ముందు

టయే ఉపన్యాసము పునరుద్ధరించుటయనీ, ఇంకా యేమేమో వ్రాసినారు. పెన్నంతర జాతకము, దశరథజాతకము మొదలైనవి చూడుడు. మెక్డొనెలు, వింటర్నిట్జు, యాకోబీ, వైద్యగారల సంస్కృతవాఙ్మయచరిత్రలు పరిశీలనార్హములు.

7. పాణిని క్రీ. పూ. ౫౦౦ వాడని మాక్సుముల్లరుగారి అభిప్రాయము! మెక్డొనెలు కీతులు దీనినే అనుసరించినారు. గోల్డుస్టుకరు వైద్యగారలు క్రీ. పూ. ౧౦౦౦-౯౦౦ వాడని నిర్ధారణ చేసినారు. రామాయణము క్రీ.పూ. మూడవ శతాబ్దమునాటి దని వింటర్నిట్జు, క్రీ.పూ. ఐదవ శతాబ్దమని మెక్డొనెలు, క్రీ.పూ. ఆరవ శతాబ్ద మని కీతు, క్రీ. పూ. ఎనిమిది ఆరు శతాబ్దముల మధ్య యని యాకోబీ అభిప్రాయపడుచున్నారు. మహాభారతము సూత్రకాలమునాటికంటెను పూర్వము. ఈ సందర్భమున ఆశ్వలాయన గృహ్యసూత్రమందలి 'సుమంతు జైమిని వైశంపాయన పైలసూత్రభాష్య భారత మహాభారత ధర్మాచార్యాః తృప్యంతు' అను వాక్యము, మహాభారతమందలి 'సంహితాస్తైః పృథక్త్వేన భారతస్య ప్రకాశితాః' అను పంక్తులు, పాణినివ్యాచార్యుని 'కలాపి వైశంపాయనాంతేవాసిభ్యశ్చ' అను సూత్రము పరిశీలనార్హములు.

8. అష్టాధ్యాయి ౪-౩-౧౦౧.

9. ౪-౩-౧౦౨.

10. ౪-౩-౧౧౦, ౧౧౧

11. ౬-౨-౧౦౩.

12. ౪-౨-౫౬. 'సంగ్రామే ప్రయోజన యోద్ధృభ్యః' ఉదా: భారతః సంగ్రామః.

వైదికభాష లౌకికభాషలోనికి పరిణామము పొందుచున్నది. పాణినితర్వాత పూర్తిగా లౌకికభాషా ప్రాబల్య మేర్పడినది.

కొన్ని శతాబ్దములు గడచినగాని భాష క్రమముగా ఉత్తమ సారస్వతరూపము నందలేదు. ఋగ్వేదమందే రెండుమూడువేలసంవత్సరముల పరిణామము కనబడుచున్నదని తిలకు, వైద్య మొదలగు తచ్ఛాస్త్రవేత్తలు ధ్రువపరచినారు. వాల్మీకికి ముందెన్నియో శతాబ్దముల పరిణామ మున్నగాని రామాయణమువంటి మహాకావ్యము రాలేదు.

ఋగ్వేదమందలి ఖండకావ్యములలోను, ఉపనిషత్తులలోను కవిత్వచ్ఛాయలు సహృదయహృదయాహ్లాదకరములై విపులముగ నున్నవి. కాని సర్వత్ర కవితాసంపద గలిగి, కావ్యమనిపించుకొనదగిన ప్రాచీన మహాకావ్యములలో రామాయణమే ఉత్తమోత్తమ మగుటచే, ప్రాధాన్యము వచ్చియుండవచ్చును. అందువలననే తత్పూర్వకావ్యములను త్రోసిరాజన్నది.

౨

అభినవగుప్తుల గురువులైన తౌతభట్టపాదులవారు, "తథాహి దర్శనే స్వచ్ఛే నిత్యేఽప్యాదికవే ర్మునేః, నోదితా కవితా లోకే యావ జ్జాతా న వర్ణనా" అనినారు. ఉత్తముడైన కవి తత్త్వదర్శనము కలిగి తదనుభవమును వర్ణించువాడు. వర్ణనతో సమ్మిళితమైన దర్శనమే కవిత్వ మనిపించుకొనును. ఆ దర్శనము కవితోపాసనాఫలితము. ఈ సంఘటన ప్రథమమున వాల్మీకిలోనే జరిగిన దని భావము. అందువలననే ఆయన ఆదికవి యైనాడు. వాల్మీకికి పూర్వమున్న శ్రుత్యాదులలోని, లౌకికకావ్యప్రపంచములోని కవితాఘట్టములలో కేవలతత్త్వదర్శనమే కనబడుచున్నదని తౌతభట్టపాదులవారి యభిప్రాయము. ఇది చాలవరకు యుక్తమే యైనను, వర్ణన లేకపోలేదు. బృహదారణ్యకమందలి అశ్వమేధవర్ణన, వేదమందలి సవితృవాయ్వాదివర్ణనలు దర్శనయుతము లైనప్పటికిని, విస్తృతమగు కవితాప్రపంచమున లేవు. తర్వాతి కవులలో గూడ నిదే లోప మైయుండవచ్చును. ఉత్తమకవి కుండవలసిన దర్శన మిళితవర్ణనలక్షణము బాహుళ్య కవితాప్రపంచమున వాల్మీకియందే ప్రథమమున గాన వచ్చుటచే ఆదికవి యను బిరుదు నందినాడు. అంతే కాని తత్పూర్వము కవులు లేరని, సంస్కృతభాషకు ఛందస్సు లేనేలేదని, వాల్మీకియే అనుష్టుప్పును సృష్టించినాడని చెప్పుట అసత్యమున కనతిదూరము.

ఈ గ్రంథము మహాభారతముకన్న చిన్నదగుటచే, ముక్తసరిగ నున్నది. అన్నిఘట్టములును పరస్పరసమ్మేళనము, ఆకర్షణ గలిగి, సర్వత్ర చిద్విశిష్టమైన జీవిని స్మృతికి తీసికొనివచ్చును. ఎక్కువ ఏకరూపత (Uniformity), సామ్యము (harmony) కలిగియున్నది. జాతీయపదవాఙ్మయముతో కలసిన మతసాంఘిక నైతికశాస్త్రముల సంపుటి మహాభారతము. కేవలపదవాఙ్మయముతో కలసిన కవితాసచ్ఛముల సంపద రామాయణము.

రామాయణములో శ్లోకము సమగ్రమైన శుద్ధి నంది పరిపూర్ణముగ పక్వమైనది. తర్వాతివా రుపయోగించుకొనుటకు యోగ్యమై, అనుష్టుప్పు జీవితముగా ఏసందర్భమున ఉపయోగింపవలెనో వ్యక్తీకరించినది. వాల్మీకి మహాకవి తత్పూర్వకవులను తన ప్రతిభావ్యుత్పత్త్యాదులచే మించినవా డగుటచే శాశ్వతనామము సంపాదింపగలిగినాడు.

వాల్మీకి తన గ్రంథమును కావ్యమని,[13] ఆఖ్యానమని,[14] గీతమని,[15] ఇతిహాసమని[16] చెప్పుకొనినాడు; వాల్మీకి కేవలము కవి గాడు; ఆదికవి— అనగా కవులకు కవి (కవీనాం కవిః). తర్వాతికవుల కవిత్వమునకు మూలకారణమై ఆవేశము(Inspiration)

---

13. 'కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్', ౭-౯౩-౫ లోగూడ.

14. 'ఆశ్చర్యమిదమాఖ్యానం మునినా సంప్రకీర్తితం' (౧-౪-౨౧); 'శ్రూయతామిదమాఖ్యానం' (౧-౪-౨౬)

15. 'అభిగీత మిదం గీతం సర్వగీతేషు కోవిదాః' (౧-౪-౨౨)

16. ౬-౧౩౧-౧౧౩

తోపగినాడు. సామాన్యజనులకన్న కవులను ఎక్కువగా మెప్పించి, ఆనందింపజేయగలడు. ఈసంగతిని వాల్మీకియే బాలకాండలో—

"ఆశ్చర్యమిద మాఖ్యానం మునినా సంప్రకీర్తితం,
పరం కవీనా మాధారం సమాప్తంచ యథాక్రమం"

అని పలికినాడు. ఈమహాకావ్యము 'కవీనాం ఆధారం'—కవుల కాధారము. "కావ్యం కావ్యస్య లక్షణ" మ్మను న్యాయానుసారముగా, తన కావ్యము కావ్యనిర్మాణమూలమని చెప్పికొనినాడు. ఇం దతిశయోక్తి ఆవంతైనను లేదు. కవితాదృక్పథమును, కవియొక్క ఆంతరంగిక మానసికప్రవృత్తులను సమగ్రముగ తెలిసికొని, రసాస్వాది కవియొక్క బాహ్యాంతరంగికదృష్టులతో పరిశీలించినగాని, ఈ మహాకావ్యమును ఆనందింపలేడు.[17] ఈ మహాకావ్యమును వ్రాయుటలో ఆనంద మెంత ముఖ్యాశయమని,

"కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే,
ఏతి జీవంత మానందో నరం వర్ష శతాదపి."

అని వాల్మీకి వచించియున్నాడు.

3

స్థాలీపులాకన్యాయముగ నిందలి కొన్ని విశేషములను ఉదాహరించిన 'కవులకు కవి' యను నామ మెట్లు అన్వర్థమగునో విశదమగును. తర్వాతి మహాకవులకు, మహాకావ్యములకు ఆదర్శకరమైన పద్ధతిని చూపినాడు. లంకయొక్క అధిష్ఠానదేవత కాళిదాసులోని మానవాకృతి నందిన అయోధ్యను జ్ఞప్తికి తీసికొనివచ్చును. వర్ణనసంపద అత్యున్నతమై, విపులముగా వాడబడినది. రావణాంతఃపురమందలి నిద్రించుచున్న స్త్రీల వర్ణనలు, వర్షాకాలాదిఋతు వర్ణనలు, చిత్రకూటపర్వతవర్ణన, మందాకినీనదివర్ణన మొదలైనవి తర్వాతి మహాకావ్యములలోని అష్టాదశ వర్ణనలకు మూలములైనవి. ఇంద్రధ్వజమును చూచువారు 'హర్షోత్ఫుల్లనయను'లనీ, కన్నులతో త్రాగుచున్నారనీ పలికినాడు. వాల్మీకిలోని 'లోచనాభ్యాం పిబన్నివ' అను పంక్తి కాళిదాస రఘువంశములోని 'పపౌ నిమేషాలసపక్ష్మపంక్తి రుపోషితాభ్యామివ లోచనాభ్యాం' అను శ్లోకమును స్మరింపజేయును. 'మహా సువర్ణకలశోపమా' అను సామ్యము తర్వాతి గ్రంథములలోనికి సామాన్యముగ గ్రహింపబడినది. గంగానది 'ఫేననిర్మలహాసిని'. మేఘములు 'స్నిగ్ధగంభీర ఘోష' కలిగినవి. ఈ విధమైన అర్థాలంకారములే కాక, అనుప్రాసాదిశబ్దాలంకారములుగూడ అనేకములు కలవు. మచ్చునకు 'దక్షిణా దక్షిణంతీరం' అనుపంక్తి చాలును. అత్యున్నతములై, సౌందర్యోపేతములైన శ్లోకము లనేకములు గలవు. అసంఖ్యాకములైన నక్షత్రములతో విరాజిల్లుచున్న ఆకాశము- చంద్రుడు లేక పోవుటచేత-అనేకాభరణములు ధరించి తిలకరహితయైన స్త్రీవలె నున్నదని అరణ్యకాండలో పలికినాడు. పవిత్రభావములు గలిగిన శ్లోకములు రెండు మూడు చాలును.

ఉదాహరణకు —

"సాగరం చాంబరప్రఖ్య మంబరం సాగరోపమం,
రామరావణయో ర్యుద్ధం రామరావణయోరివ"

"త్వాం కృతోవ్యపరతో మన్యే రూపకర్తా స విశ్వకృత్,
నహి రూపోపమా హ్యన్యా తవాస్తి శుభదర్శనే"

ఆ స్త్రీని సృష్టించినతర్వాత విశ్వకృత్తైన బ్రహ్మకు సౌందర్యమను పదార్థమే లేకపోయినదట! అందువలన తత్తుల్యసౌందర్యవతి లేనేలేకపోయినదని రెండవశ్లోకభావము. ఈ భావము నేదో ఒక విధముగ ఉపయోగింపని కవి లేడు. ముఖ్యముగ కాళిదాసు,

---

17. దీనినే పాశ్చాత్యాద్వైతులలోని సారస్వత విమర్శకులు Imaginative interpretation అని చెప్పెదరు. రసాస్వాదము గోరు విమర్శకుడు కవితో ఏకీకృతుడు కావలెను. అద్వైతుల బ్రహ్మాత్మ భవానుభవము, అభినవగుప్తుల అనిర్వచనీయానందానుభవము ఆసమయమునందే విచక్షణుడైన విమర్శకుని అవతరించును. అందువలననే ఎ. సి. బ్రాడ్లే మహాశయుడు 'Poetry is a spirit' అనినాడు.

"వృత్తానుపూర్వేచ నచాతిదీర్ఘే
జంఘే శుభే సృష్టవత స్తదీయే,
శేషాంగనిర్మాణవిధౌ విధాతు
ర్లావణ్య ముత్పాద్య ఇవాస యత్నః"
(కు. సం. ౧-౩౪)

అని పార్వతిని వర్ణించినాడు. అనురాగవతియైన స్త్రీతో ఉషస్సును పోల్చుచు భావగర్భితమైన —

"చంచచ్చంద్రకరస్పర్శహర్షోన్మీలితతారకా,
అహో రాగవతీ సంధ్యా జహాతు స్వయ మంబరం"

అను శ్లోకమున సమాసోక్తిని ప్రయోగించి, యీ అలంకారమునకు వన్నె తెచ్చినాడు. ఇట్లనేక కవితాసౌందర్యము లీ కావ్యమున పుష్కలముగ వెద చల్లబడినవి. ఈ ఛాయలు కాళిదాసులో నతిముఖ్యముగ ప్రవేశించి క్రొత్తవన్నె నందినవి.

కరుణ (Pathos) నాధారముగ జేసికొని నీతిశాస్త్రమును (Ethics) పోషించినది మహాభారతము; నీతిశాస్త్రము నాధారముగ జేసికొని కరుణను పోషించినది రామాయణ మని యొక విమర్శకుని వాక్యము. ఇదే ఈ రెంటికిని గల తారతమ్యము, సామ్యమును. తన్మూలముననే అతి సున్నితములైన కాంతులతో సర్వరసోపేతమై, కవితావాహినియై రామాయణము వెలసి, వాల్మీకిని కవులకు కవిగా జేసి, ఆదికవి యని పిలిచినది.

౪

కవిత్వసంపదకు దోహదమిచ్చిన కాళిదాసులో వాల్మీకి ఛాయ లనేకము లున్నవి. కాని కాళిదాసు —

"అథవా కృతవాగ్ద్వారే వంశేస్మిన్ పూర్వసూరిభిః,
మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః"

అని రఘువంశమున పూర్వకవుల కృతులను స్మరించినాడు. వాల్మీకిసూచన ఇట గలదని వ్యాఖ్యాతల అభిప్రాయము. కాని వాల్మీకిగ్రంథ మీ వంశజుల చరిత్రకు 'కృతవాగ్ద్వార' యని చెప్పవచ్చునా? రామాయణ మింత నేలబమైన గ్రంథము గాదు. బాగుగ తొలచబడిన మణుల నన్నింటి నొకచో జేర్చి సూత్రమున గ్రుచ్చుచుంటి నని కాళిదాసు చెప్పకొనినాడు. అనగా అంతకుమున్ను సంకీర్ణముగ నున్న పదవాఙ్మయము (Ballad literature) నుంచి తన కావ్యము నల్లినాడని భావము. అదిగాక 'పూర్వకవులచేత' అని బహువచనప్రయోగ మున్నది.

దీనికి తగినట్లు రామాయణబాలకాండలో—

"స యథా కథితం పూర్వం నారదేన మహాత్మనా,
రఘువంశస్య చరితం చకార భగవాన్మునిః"

అని కలదు (౩-౯). తిలక, గోవిందరాజీయ వ్యాఖ్యానములను పరిశీలించినచో రఘువంశశబ్దము 'రఘువు యొక్క వంశమునకు చెందిన' అనునర్థమును సూచించును. కాళిదాసగ్రంథనామార్థము 'రఘువులయొక్క వంశ' మని. ఇదే స్వాభావికమైన యర్థము. బాలకాండలో మరియొకచోట—

"ఏష తే రామ గంగాయా విస్తరోఽభిహితో మయా,
కుమారసంభవశ్చైవ ధన్యః పుణ్యస్తథైవ చ"

అని కలదు (౩౮-౩౧). ఈ రెండుశ్లోకములలోను రఘువంశ కుమారసంభవశబ్దము లున్నవి. వాల్మీకి వీని నుపయోగించుటచే కాళిదాసు తన గ్రంథముల నిట్లు పిలిచినాడా? లేక కాళిదాసకావ్యనామములై ప్రసిద్ధిగాంచినవగుటచే వాల్మీకి వానిని సంగ్రహించినాడా?[18] ఏదెట్లున్నను వాల్మీకి నాదికవి యనుటకీ విషయముల విచారింపనలెను. అనేకసారస్వతగ్రంథములనుంచి యుదాహరణల నిచ్చిన పతంజలి రామాయణమును స్మరింపకపోవుటయేకాక అందలి అపాణినీయములను తలచలేదు.[19] దీనినిబట్టి చూడ వాల్మీకి పతంజలి తర్వాతివాడు. కాళిదాసు పతంజలి కించుమించుగ సమకాలికుడు. ఈ విషయముల నన్నిటిని గమనించిన కాళిదాసు రఘువంశమును పూర్తిగ వ్రాసెనా, లేదా యను సందేహ ముత్పన్నము గాకపోదు. వాల్మీ

18. Annals of Oriental Research, University of Madras, vol 6, Part I. పుట 25 చూడుడు.

19. పి. వి. కాణేగారి కర్పించిన Festschrift 361 పుట చూడుడు.

కికి ముందే కాళిదాసుండెననియు శంక కలుగక పోదు. ౨౦ దీనిని సహృదయులగు వివేచకులాలోచింపవలసియున్నది. సంప్రదాయమునకు విరుద్ధముగ పోవుటకు ముందెంతయో విచారణ ఆవశ్యకరము.

కాళిదాసు రఘువంశమున నెనిమిదిసర్గలే వ్రాసెనను వాద మీమధ్య బయలుదేరినది. అది కొంత యుక్తియుక్తమైనను సమగ్రముగ సమంజసముగ లేదు. కుమారసంభవ మతని యంత్యకావ్యమనియు, కాళిదాసు పూర్తిగ వ్రాయదలచెననియు, కాని యవాంతర కారణముల వలన నందుకూడ నెనిమిదిసర్గలే వ్రాసెననియు పలుకు వచనములు తదనుయాయులు. రఘువంశమందలి ౮: ౫౧-౧౬ శ్లోకములు విశేషమైన మార్పులు లేక కుమారసంభవమున ౮: ౫౬–౬౯ శ్లోకములుగ గనబడుచున్నవి. ఇందేది యేగ్రంథమున ప్రథమమున రచింపబడినదో విచారణార్హము.

ఏ దెట్లున్నను వాల్మీకికాళిదాసు లిరువురును కవులకు కవులే. వాల్మీకి 'పరం కవీనా మాధార' మనినట్లు, కాళిదాసు 'తం సంతః శ్రోతు మర్హంతి' అని పల్కినాడు. వీ రిరువుర నాధారముగ జేసికొనియే తర్వాతి కవిత్వసంపద బయలుదేరినది. "కవికులగురుః కాళిదాసో విలాసః" అని జయదేవుడు కాళిదాసున కంజలి నర్పించినాడు.

---

20. (1) Annals of Oriental Research, University of Madras, Vol 5, Part 2. పుటలు ౧౭-౪౦, (2) Vol .6, Part I, పుటలు ౧-౩౨, (3) పి. వి. కాణేగారి కర్పించిన 'A volume of studies in Indology' పుటలు ౩౫౬-౩౬౧, (4) Indian Historical Quarterly Vol 18 లోని 'Historical Background of the works of Kalidasa' అను నాంగ్ల వ్యాసములను పరిశీలించుడు.

ప్రాకృతగాథలు

[అలంకార గ్రంథములలోనివి మఱికొన్ని]

= ఆంధ్రీకర్త: శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ =

ఒక్కయెడఁ గూర్చు చెలి యేడ్చుచున్నయులి
సమరసన్నాహతూర్యఘోష మొకవంక, [వు
ప్రణయమునకును రణరసంబునకు నడుమ
నూఁగులాడంగఁదొడఁగెను యోధమనసు.

[ధ్వన్యాలోకము, ఉద్యో. 3, పు. ౧౬3]

అడ్డుదారిఁ బుట్టినది ; పండ్లుఁ బూవులా
కులును లేవు ; చూడ గోము లేదు,
రేగుఁజెట్టు ; నవ్వరే నిను ? దీనికి
వేయనేల కంచె ? వెఱ్ఱివాఁడ !

[అదే. 3-౫౯ |

కాని వైనయట్లు, లేనివి యున్నట్లు
వింతయర్థములను వెదకి తెచ్చి
మనసునందు నెలవుకొనఁజేయు కవుల పిం
గడపుఁబల్కు వెలయుఁగాక సతము !

[అదే. ౪-౭3౯ ,]

ప్రాయ మెలమిమీఱఁ జేయూఁత నొసఁగంగ
నీడు గుబ్బదోయి మీఁది కెదిగి,
తరుణి! నిన్నుఁ జేర నరుదెంచు పూవిల్తు
లేచి యెదురుకొనెడు లీలఁ దోఁచు.

[,, ౪-౨౩౬]

వాని కెందు మేర గానము; పునరుక్తి
దోష మించుకైనఁ దోఁప దందు;
వలపుఁజెలులు సూపు వగలును సుకవుల
పలుకు లిచ్చు నర్థములును జూడ.

[,, ౪-౨౪౧]

పెద్దపేరు సూచి బేలువోదురు గాని
గుణము వలచి మెచ్చుకొనరు జనులు;
చెలియమొగము గాంచి చెమ్మవెట్టదుగాని?
చలువతాయి కరఁగుఁ జంద్రుఁ జూచి!

[వ్యక్తివివేకము, విమర్శము ౩, పు. ౧౨౬]

చెలువు జవ్వనంబు తళుకులు బెళుకులుఁ
దోఁచుచుండుఁ గులవధూటిమేనఁ,
జూడు! దయితుఁ డిల్లు సొచ్చినప్పుడు సొచ్చి
వెడలినపుడు వెడలు వడువుగాఁగ.

[ధనికుని దశరూపకవ్యాఖ్య, ప్రకా. ౨, పు. ౫౩]

పలుకు లవియె; కన్నుఁగొలుకులు నవియె; జ
వ్వనము నదియె; కాని పడఁతి కిప్పు
డించువిల్తుమహిమ యించుక నెమ్మేనఁ
జేరి క్రొత్తమూర్తిఁ జేసిపెట్టె!

[ఇది ధనికుని సొంతము. అదే. పు. ౬౪]

మొగడచన్నుదోయి మొలచినంతన చూడు!
దాని మేన నెల్లఁ దళుకుబెళుకు
లెట్లు వెల్లివిరిసె 'నిది చిన్నదా?' యంచుఁ
జాలఁ జెలులుగూడ సంశయింప!

[ఇదియు నతనిదే. అదే. పు. ౬౫]

పాడుగుడులు గలవు; ప్రక్కలఁ బెనుపొదల్
గలవు; వయసుమగలు గలరు చాల;
మగఁడు ముసలి యనుచుఁ బాగులకు; నిను
యూరు సూచి యిచ్చినారు బిడ్డ! [మంచి

[వాగ్భటుని కావ్యానుశాసనము, అధ్యా. ౩]

పచ్చనాకుల గుబురుజొంపముల నీడ
కడలఁ బర్వించి కృష్ణపక్షమునుబోలి,
యూరిసామ్మైన పెనుమఱ్ఱి యుండుదాఁక
నిండుజాబిల్లి నిన్ను గణింతు రెవరు?

[అదే.]

దయితమొగముఁజూడఁ దమకించు తెరువరి!
వేఱుదారిఁ బట్టి వెడలిపొమ్ము;
కాఁపుపెద్దకూఁతు రీపాడుకొంపలోఁ
గలదు మీఱరాని గాల మగుచు.

[హేమచంద్రుని కావ్యానుశాసనము, అ.౧, పు. ౩౧]

* * * *

[శాలివాహనుని గాథా సప్తశతిని బహుమాతృకలం శోధించి పరిమార్చి వీబరుపండితుఁడు జర్మనీలో ౧౮౮౧-వ సంవత్సరమున జర్మనుభాషలో విపుల పీఠిక, టీక, తర్జుమా — వీనితో ముద్రించెను. ఆ ముద్రణపు అందచందములు వర్ణనాతీతములు. తనకు దొరికిన మాతృకలందలి వివిధపాఠభేదములు, అధికపాఠములు మొదలయిన వన్నియు ను, చ తప్పకుండ చేర్చి, ఏర్చి, కూర్చిన కూర్పది. సప్తశతి యను పేరితో అతనికి దొరికిన గాథల మొత్తము ౯౬౪! ఇది చాలదని ఆ చాదస్తపుపండితుఁడు కొన్ని యలంకారగ్రంథములనుండి మఱి ౩౬ పద్యములను జేర్చి గాథాసంఖ్య మొత్తానకు సహస్రము పరిచేసినాఁడు! అందులో ఆంధ్రదేశమునకు చేరిన మాతృకలే రెండు తెగలవి గలవఁట! ఈ గాథావాఙ్మయమున తెలుఁగువారికిఁ గల అమితప్రీతి, కొంతవఱకైనను వారి కైవాడమును పైవిషయము స్థాపించును. పై ముద్రణమునుండి నాకు నచ్చిన — చేతనైన — కొన్ని గాథలకు తెలిఁగింపు ఈ క్రిందిపద్యము మొదలు—]

కడిమిపూఁదావి తెమ్మెర లడువ సొమ్మ
సిలి వినదుగాని, అదియును నేమమయ్యె !
కాకయుండిన నీతోలు కార్మొగిల్ల
యఱుము లూరకపోవునే యుసురుగొనక !

[పుట ౩౭౯, ప. ౬౧౧]

వయసుమగ లిందె పలువు రుండియును దిక్కు-
మాలినట్టులె యీయూరు కాలిపోయె ;
చెలియ ! సందడిలోఁ బైఁట తొలఁగియాడు
నీదు గుబ్బచన్దోయిదిగాదె తప్పు ?

[౩౮౦ - ౬౧౪]

చూచినపుడు మరలి చూడదు ; మఱి పల్క-
రింప దతని సరళరీతి గలిగి ;
ఉవిద చేయ దింత యుపచారమైన ; జా
ణలకు దాని మనసు తెలిసె దాన.

[౩౮౪ - ౬౨౦]

తనువునిండ మెండుకొను గగుర్పాటుతో
వడఁకుతోడ నూర్పువగలతోడ
వలపుతగులమందుఁ గలసినయల్లె తోఁ
చెదరు దారికాండ్రు నీతునందు.

[౩౮౮ - ౬౨౧]

చెమటఁ దోఁగిన పిఱుఁదులఁ జిక్కనంటు
కొన్నవలిపెంపుఁద్రోవఁ గన్గొనఁగలేక
పుడుకులాడుచు రిత్తయ తడవుచుండు
వాని చెయి గని చెలి నవ్వు వచ్చె నాకు.

[౩౮౯ - ౬౨౩]

ప్రణయదూతి చెప్పు పలుకులు విను వేళ
నద్దుకగులరా దటంచుఁబోలె,
దాని చెవులనుండి తటుకున నెగవిరాఁటు
గగురుపాటు నల్ల కల్వవిరిని.

[౩౮౯ - ౬౨౪]

ఇచ్చకాలు పల్కి మెచ్చించునట్టి దీ
జాతి ; నమ్మియుండఁజనదు దీనిఁ
గొడుక ! తమ్మయంత వెడలువుగాఁ జెవిఁ
బొడుచుకొనఁగ నెవరుఁ బోరు చూడు !

[౩౯౦ - ౬౨౫]

మొగిళు గుఱుమఁదోడఁగె ; నిగనిగఁ బచ్చిక
దారు లన్ని గప్పె ; నేఱు లెల్లఁ
బఱవఁజొచ్చె ; మగని తెరువుకై యెదురు ని
ల్చెదవె యిఁకను ? కవుడులేనిదాన !

[౩౯౨ - ౬౨౯]

కమలములను బట్టి కాల్చుట హేమంత
ఋతువు వేడి నిర్ధరింపరాదె ?
నడఁత చేత నెఱుకపడును నిజంబు లో
కులది, దాఁచిపెట్టుకొన్న నేమి ?

[౩౯౩ - ౬౩౦]

పాలకుండలు దెచ్చిన పడఁతితోడ
నుద్దులకు గొల్ల వాఁడు కూర్చొనఁగ, వాని
క్రొత్తపెండ్లాము చూడు! తల్గుల నడల్చి
నిండురోసాన దూడ లన్నిటిని విడిచె.

[౩౯౩ - ౬౩౧]

[సాఁగవచ్చును]

పాకీది

[కథానిక]

●

= శ్రీ అనిసెట్టి సుబ్బారావు =

౧

బడిగంట కొట్టగానే పిచ్చుకల్లాగా ఎగిరిపోతున్నారు పిల్లలు. సాయంత్రపు సూర్యుడు తడి మబ్బుల్లోంచి జారిపోతున్నాడు. బజారులో ఎర్రని పల్చని ఎండ ఇండ్లనీడలు పాచుకున్నది. పిల్లలు వీథి తిరిగి ఇళ్లవేపు మళ్లారు. పంతులుగారు సీనయ్య ఏపిల్లాణ్ణో పిలిచి శనగపప్పు నములుతూ సంచి చేతపట్టుకు రమ్మన్నాడింటివరకూ. కోటిగాడి మనస్సు నాగుతోనే పడదామని పెనుగులాడుతున్నది. చిక్కముఖం తో నాగుపై చెయ్యి తీసి ఆ కూరగాయలసంచి నెత్తుకున్నాడు కోటి.

నాగుకు పంతులుగారు సీనయ్యంటే మహా భయంగా వున్నా అతనికూడా కోటితో ఎగురుతూ పాడుతూ వెళ్లాలనే.

"మాస్టారూ! మాస్టారూ! మానాన్న నన్నూ... కోటినీ ... తీసుకురమ్మన్నాడండి...ఏమండోయ్!" అన్నాడు నాగు ప్రక్కగా చూస్తూ, ధైర్యం బిగబట్టి.

పంతులుగారు నాగుజేబులోంచి ఇంకోగుప్పెడు శనగపప్పు తీసి బొక్కుతూ "అరేయ్! నిజంగానా... చెప్పూ!" అన్నాడు. "ఐతే మీనాన్నగారూళ్లోనే వున్నారూ!—ఫో వెధవ!" అని గదిమాడు కోటిని.

భారం తప్పిపోయిందంటే చాలని కోటీ, నాగూ ఒక్క పెట్టున పరుగెత్తారు. ఇద్దరూ శనగపప్పు నములుతూ "జేబులో వూసుకున్నా తీసుకున్నాడ్రా!" అన్నారు పంతుల్ని గురించి.

"నాజేబులో కానీలన్నీ వీడి మహోస్నే పెట్టా. లేకపోతే బిళ్లంగోడు కొనుక్కునేవాణ్ణే!" అంటూ నవ్వుతూ మెడ నున్న పుస్తకాల సంచీ సర్దుకున్నాడు నాగు.

కిల్లీకొట్టుదగ్గర్నుంచి నాగుఇంటికి ఇంకో వీథి దూరం వెళ్లాలి. కొట్టుదగ్గర సిగరెట్టంటించుకొంటూ టెన్నీసుకు వెళ్లబోతున్నాడు నాగుతండ్రి. భాస్కరరావు. సుందరయ్యదూరాన్నుంచే కనిపెట్టాడు నాగూ, కోటీ పరుగెత్తుకురావడం. సైకిల్ హాండిల్ వోరగా పట్టుకొని భాస్కరరావుతో "అదుగోరోయ్! మీవాడొస్తున్నాడు ... ఎప్పుడో వాణ్ణొకణ్ణెవణ్ణో ఎత్తుకొస్తాడు...కోర్టుకు రమ్మనరాదూ... ఈ వెధవసరుకంతా వొదిలిపోతుంది. అటూ ఇటూ బంతులైనా ఎగరేస్తాడు." అన్నాడు. నాగుతండ్రి తలఎత్తి చూసేప్పటికే సుందరయ్య పిలుస్తున్నాడు: "ఓహోహో! మిస్టర్ నాగూ! హలో...హలో... ఇట్రావోయ్!" నాగు చిరునవ్వు నవ్వుకుంటూ రాగానే సుందరయ్య ఒళ్లోకి లాక్కున్నాడు. ముద్దుముద్దుగా మాటలు చెబుతూ "ఏమోయ్! బళ్లో ఇవ్వాళ ఎన్ని తన్నులు తిన్నావ్? మీ నాన్నేమీ అనడులే చెప్పు... నేనున్నానుగా— భాస్కరం! నీ క్షేమనాడు, చెబుతా డెన్ని తన్నులు తిన్నాడో" అని నాగును సీటుపై కెక్కించి క్రాపు దువ్వుతున్నాడు మెల్లగా. కోటి సైకిల్ కారేజీ పట్టుకొని నవ్వుతూ "చెప్పరా!" అన్నాడు మృదువుగా. సుందరయ్య కోటిగాడివంక చూచాడు. ఏవగించుకొంటూ అన్నాడు:

"నాగూ! పిల్లెవళ్లో రోజా వెంటేసుకొస్తావేంటి? వెధవలందరూ—భాస్కర్రావుగారేయ్! మీవాణ్ణి జాగ్రత చెయ్యాల్సిందే ఇక ... ఇప్పట్నించే ఆఫీసర్ల ఫాయిలాలో తిప్పితేగాని ఆ కళ పడ దసలు!"

భాస్కరరావు ఆపుత్రాణ్ణి పరికించి చూచాడు.

"ఏ డైవర్డో తెలుసా?" అన్నాడు సుందరయ్య కోటిని చూచి అసహ్యించుకొంటూ.

కోటిగాడు చిన్నబోయాడు. మనస్సు కుంచించుకుని, తలవంచుకొని తాకుతున్న సైకిల్ కారేజీ వదిలేసి మెల్లగా గోడప్రక్కగా వెళ్లి నుంచున్నాడు నాగుకోసమని. సుందరయ్యచొక్కాగుండీలు మెలి పెడుతూ నాగు దీన్ని గమనించనైనా లేదు. భాస్కరరావు పిప్పరమెంట్లు కొని జేబులో పోశాడు.

"మీనాన్న హెడ్‌క్లార్కవుతే నువ్వు తాసీల్దారువౌదువుగాని" అంటూ సుందరయ్య క్రిందికి దింపాడు.

"వస్తావా నాన్నా!" అన్నాడు వెనకనుంచి భాస్కరరావు.

వినిపించుకోకుండా, "ఉహూ!"అంటూనే కోటి వద్దకు పరుగెత్తాడు. కోటి ఇంతవరకూ కిల్లీకొట్టుదగ్గర భాస్కరరావు,సుందరయ్యలవేపే చూస్తున్నాడు. ఇగిరిపోయే జలవలె అతని మనస్సులో సంతోషం ఇంకిపోయింది. ఇద్దరూ నాగూఇంటివరకూ వచ్చేటప్పుడు ఏమీ చెప్పుకోలేదు. నాగు పిప్పరమెంట్లు తీసి ఇస్తున్నాడు. అందుకొంటున్నాడు కోటి.

మెట్లెక్కుతూ "కోటీ! మాఇంట్లో కూచుందాం రారా!" అన్నాడు.

"చీకటి పడుతున్నదిగా, మాఇంటిదగ్గర దీపాలుండవ్"

"లేకపోతే ఎట్లా? మాఇంట్లో బొమ్మలు చూద్దువు రారా" అని చెయ్యిపట్టుకున్నాడు నాగు.

"ఉహుఁహుఁ! వద్దురా...మాఅమ్మ వద్దన్నది... ఏఇంట్లోకి పోవద్దన్నది"

"ఏం?" అంటూ నాగూ నవ్వుతూ మెట్లెక్కి వెళ్లిపోయాడు.

"తాయం!"అని పిప్పరమెంట్లు నోట్లో విసురుకుంటూ, గంతేసి పరుగుతీశాడు కోటి.

౨

రైలురోడ్డు నానుకొని వాలిపోయ్యే పొలాల్లో పాకీవాళ్ల గుడిసెల కుప్ప వున్నది. క్రిక్కిరిసి, ఒకదానిపై ఒకటి విరుచుకుపడుతూ ఇప్పుడో ఎప్పుడో కూలిపోబోతున్నా యన్నట్లు. సగాలు విరిగిన ఆ గోడల్లోనే గేదెల అరుపులు, దూడల రొచ్చు! మురికిపిల్లలు ఆ బురదలోనే పాకీడబ్బాలు మోగిస్తూ ఆడుకుంటారు. ముసలమ్మలు మూల్గుతూ, పూస్తూ పొగాకు కాలుస్తుంటారు. వూరివారంతా ఆ ప్రాంతాలకే బహిర్దేశానికి వెడతారు. అవసరంగా పొలాల్లోనికి వెళ్లేవారు ముక్కులు బిగించుకొని కన్నైనా ఎత్తరు. పగటిరైలు పొగక్రక్కుతూ వెళ్లేది ఆ కుళ్లు కొంపల మీదనే, రాత్రిరైలు రవ్వలుచిమ్మేదీ వాటిపైనే.

సంజెచీకటి క్రమ్ముకొస్తున్నప్పుడు మాచి ఇళ్లల్లోనుంచి వంగి వంగి బయటిగట్టుమీదికి వచ్చింది. మాసీ చూడకముందే గొల్లుమన్నది. మళ్లీ వాడొచ్చాడు. పాకీడబ్బా అటు పడేసి తూలిపోతూ, ఇంటికి ఉరుకుతున్న కోటిరెక్క పట్టుకు లాగుతున్నాడు.

"ఏయ్! ఏయ్! నీకు చదువేంట్రా?... నీ బండ చదువు ... లే పైకి, చేతిలో జారిపోతావేం ... డబ్బా ఎత్తుకో! వూళ్లో కెళ్లిరా పో... నేను పోలేను. ఎప్పుడూ నేనేనా ... నేను పెద్దవాణ్ణోయ్ కుంకా!"

కోటి వొణికిపోతూ కెవ్వుమని కేకవేసి "అమ్మా" అన్నాడు. మాచి వెతగా పరుగెత్తి వచ్చింది. దానికి మొదట్నించీ ఆ భయమే! అందుకే గట్టుమీదికి వచ్చి కాచుకు చూస్తుంటుంది ప్రతిసాయంత్రమూ ఆతురతతో. దాని కడుపులో మంట వున్నది. అది పాకీపనిలో కాలం వెళ్లబుచ్చింది. యౌవనంలో విచ్చలవిడిగా సంచరించి భర్తకు కాకపోయింది. భర్త త్రాగుతూ, తిరుగుతూ సుడిగాలివలె బ్రతికాడు. చివరిదశలో క్షయతో మందైనా పోసుకోలేక ఆ

మూలుగుడులోనే ప్రాణం విడుస్తూ, మాచి చెయ్యి పట్టుకుని వేడుకున్నాడు: "మనం చూస్తున్నావుగదా... ఉన్న ఒక్కణ్ణీ ఈ గూడెంలో ఎదిగించి డబ్బా చేతికిస్తావా?... ఊపిరి పోయేటప్పుడైనా నన్ను చూడొచ్చావు... వాణ్ణిక్కడ వుంచితే నీ కడీ ప్రాప్తం వుండదు!" ఆ నాటినుంచి కోర్కెగా వున్న ప్రతిజ్ఞ కడుపు దహించింది మాచికి.

పొరపాటున కలిసినప్పుడెప్పుడూ పినతండ్రి కోటిరెక్క పట్టుకోక వదల్లేదు: మాచి కోటిని పినతండ్రిచేయి వదిలించి వెనుక దాచుకొని దీనమూర్తి అయింది.

"ఏం నాయనా! మీ అన్న చెప్పలా? మావాణ్ణెందుకు పుటమారుస్తావు... నాలుగేళ్లు పోతే నువ్వు మాత్రం కర్రంపట్టవూ? ఉన్నప్పుడే ఏం వూగినా..." అని కళ్లు తుడుచుకున్నది.

మాచి పిల్లాణ్ణి బడికి పంపుకున్న దంటే పాకీ గూడెంలో పిల్లకూ పిట్టకూ కన్నెర్ర. ఎత్తిపొడుస్తూ, వెక్కిరిస్తూ ఇరుగుపొరుగులంతా వీళ్లను ఒంటరితనంలోనికి తరిమారు.

పినతండ్రి వూగుతూ దగ్గరగా వచ్చి డబ్బా ఒకసారి తన్ని "మాచీ! చిన్నప్పుడు నన్నెంత సోగ్గా రేసం చేసేదానివే... ఇప్పుడంతా ఐపోయిందిలే— ఒరేయ్! ఒరే, నిన్నే! దాక్కుంటే ఎట్లా, డబ్బా పట్టుకుపో వూళ్లోకి... పలకా పుస్తకా లిటియ్ బళ్లో కెళ్లాలి!" మాచి జాగ్రతగా అతన్ని తప్పించుకు నడిచింది. డబ్బా ఎత్తుకొని ఏవేవో గొణుక్కుంటూ సందులో దూరా డతను.

మురికిగుడ్డనే నీళ్లల్లో ముంచి ఒళ్లంతా తుడిచింది మాచి. పైట పదిఅంగల దూరంలో మసగ్గా వెలుగుతున్న వీథిలాంతరువద్దకు చేరింది కోటిని చంకనెత్తుకొని. మూకుడులో ముద్దలు కలిపి పెడుతూంటే అన్నాడు కోటి:

"దిగుతాలే అమ్మా!" నేలపైకి దించమని.

"మాకన్నా! వొద్దులేయ్యా! బళ్లోకి వెళ్లేప్పుడూ వచ్చేప్పుడూ ఏం పరుగు తీస్తావో! జాగ్రతయ్యా! అటూఇటూ పరకాయించి రోడ్డు దాటు."

"ఏం! నాగూ, నేనూ ఒక్కసారే వస్తాం! బండీ లేదూ భయమూ లేదు... ఒక్క పరుగు పెడ్తే నాగుగారి మేడమెట్లదగ్గరి కొచ్చిపడతాం!"

"బంగారుచిలకవు నీకేం... నాగూ ఎవరు కన్నా?"

"ఎవరంటే! మేమిద్దరమూ ఒకటేగా! ఇదిగో పిప్పరమెంటు వాళ్ల నాన్న వాడి టేబుల్లో పోస్తే ఇద్దరం తిన్నాం..." తీసి, విరిగి మిగిలినది తల్లి పెదవుల్లోని కదిమాడు. తిరిగి అంటున్నాడు. ఒక్క పెద్ద నవ్వు నవ్వి "మాస్టారంటే నాగూకు భయమే లేదే... నన్ను నంచి ఎత్తుకురమ్మంటే 'మా నాన్నగారు కోటిని పిల్చుకురమ్మన్నా' రన్నాడు. ఇద్దరం వుడాయించాం."

మాచి ఆనందపడ్డది. స్మితం చేసింది. "ఐతే పెద్దపెద్ద సేయితాలు కుదుర్చుకుంటున్నావన్నమాట." సంతోషం పట్టలేక కోటిఒళ్లంతా ముద్దుపెట్టుకున్నది. ఓద్దంటున్నకొద్దీ ముద్దలు నోటిలో తురిమింది.

ఇంట్లో పిల్లాణ్ణి దించి ఆచీకటిగూళ్లన్నీ ప్రమిదకోసం తడిమింది. కనిపించలేదు. "ఇక్కడే వుండు, దీపం తెస్తా"నంటే బిక్కుబిక్కుమంటున్న దని, వుండలేనన్నాడు. వెంటపెట్టుకొని ప్రక్కసందులోనికి వంగి మూస్తే నలుగురెవరో 'పులిమేక' ఆటలో మునిగి వచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఈమె నెవ్వరూ గమనించలేదు. ఆదీపం పీలుపన దని పినతండ్రిసందులోనికి వచ్చింది. చిరిగిన చాపమీద రెండు ప్రమిదలూ దగ్గరగా చేర్చి ఏమిటో ధ్యాస చేర్చుతున్నాడు ఆదీపాలకు. తల ఎత్తి మాచి గట్టిగా "త్తా"అన్నాడు. మాచిగుండె అదిరింది. అతనింకా మైకంలోనే వున్నాడు. ఇల్లు చేరి ఆ చీకట్లోనే నేలపైన కోటిని కడుపులో పెట్టుకు నిద్రపోయింది.

3

ఉదయం పదిగంటలవేళకు భాస్కరరావుగారు ఆకుమడుపు అందుకొంటూ భార్యను "నాగ

"వచ్చాడా" అని అడుగుతున్నాడు. ఈలలు వేస్తూ దూకుళ్లు పెడుతూ వస్తూనే వున్నాడు నాగు. భాస్కరరావుగారికి మెట్లమీదినుంచి నాగుస్వరం వినిపించింది. "మధ్యాన్నం రారోయ్ కోటీ! ఇదుగో బలపంవిసురుతున్నా అందుకో"—అతని మనస్సును కలచివేసింది ఆపిలుపు. నాగు వస్తూ ఇంట్లో పడగానే అతను భార్యను గదిమాడు: "మన నాగూ చూశావా, వెధవపిల్ల లందరి స్నేహితమూ వీడూ ... వాణ్ణోక సారి భయపెట్టు."

ఆయన నాగును గమనించగా, ఎత్తుకోగా భార్య ఎరగ దింతవరకూ. ఆమెకు ఈ జాగ్రత కొత్తగా తోచింది. నాగు తనమీద దేదో పిడుగు పడుతున్నట్లు గ్రహించి గదిలో కెళ్లి ముడుక్కున్నాడు. ఆయన మళ్లీ భార్యను గద్దించాడు: "వాణ్ణిటు పిలూ...మూగమొద్దాలె నుంచుంటా వేం?" భార్య ముహం కందింది. కేక వేసి పిలవగానే నాగు బెదురు చూపులు చూస్తూ ముందుకు వచ్చాడు. తలగుడ్డ చుట్టుకుంటూ భాస్కరరావుగారు అరిచారు: "చెల్లితో ఇంటో ఆడుకో! పరాయిపిల్లలతో మాట్లాట్టం చూశానా ఒళ్లొలిచేస్తా!" నాగు కంపించిపోతున్నాడు. అకస్మాత్తుగా పారిపోతే బావుండు ననుకున్నాడు. భాస్కరరావుగారొక్కసారి నాగువంక చూసి "నిన్నే! ఆ కోటితో తిరగడంమానెయ్యి." నాగు నిలవలేకపొయ్యాడు; పరుగెత్తలేక పొయ్యాడు. గాలికి లేచిపోతూ గిరిటీలు కొట్టే ఆకులాగా వున్న దతని మనస్సు. వుండివుండి బావురుమన్నాడు. తల్లి దగ్గరగా వచ్చి కావులించుకొని "మా నాయనే! ఏడుపెందుకు ... నీ ఇష్టం వచ్చినవాళ్లతో తిరుగు" అని లాలిస్తూ వీపు చరిచింది. భాస్కరరావుగారు హూంకరించుకొంటూ మెట్లు దిగి ఆఫీసుకు వెళ్లిపొయ్యాడు.

ఎప్పటివలెనే కోటీ, నాగూ పీరప్పకొట్లోనే శనగపప్పు కొనుక్కుంటారు. ఒక్కజేబులోనే పోసుకు తింటారు. పరాయిపిల్లల్ని ఉడుకెత్తించడంలో ఇద్దరూ ఒకటే. పంతులుగారు సీనయ్యను బూకరిస్తారు ఒకే విధంగా ఇద్దరూను.

నాగు కోటితో కిల్లీకొట్టువేపు నక్కినక్కి చూస్తూ ఇంటివేపు నడిచినా తండ్రికంట బడ్డా డొకసారి. సుందరయ్య వేలుపెట్టి చూపుతున్నాడుగూడా. భాస్కరరావుగారు ఇంటికి ముక్కున తుపాను పెట్టుకు వచ్చా డారాత్రి. ఇల్లంతా దద్దరిల్లింది. తనని చేతితో ముద్దచేసి విసిరిపారేస్తాడేమో ననిపించింది నాగుకు.

మరునాటి ఉదయం నాగు బళ్లో చిరునవ్వుతూ వచ్చి కోటిప్రక్కన కూచోలేదు. దాచివుంచిన చోటును చేత్తో చరుస్తూ రమ్మని తల వూపాడు కోటి. గమనించనట్లు దూరంగా తొలిగి వెళ్లి కూచున్నాడు నాగు. పంతులుగారు సీనయ్య పాఠం ప్రారంభించాడు. లెఖ్ఖలు దిద్దించుకోలే దిద్దరూ. వరుసనే పలకలు పిలుస్తూ "కోటీ, నాగూ మీ లెఖ్ఖ లేవిరా?" అంటే కోటి తరువాత నాగు పలక అందివ్వలేదు. మొదట, నవ్వులేమో అనుకొని, కోటి, దూరంగా కూచున్న నాగుపైని రహస్యంగా చిన్నచిన్న రాళ్లు విసిరేవాడు. ప్రతిగా నాగు మళ్లీ వాటిని ఏరుకోలేదు. కోటిమనస్సు కారణం ప్రశ్నించుకొంటున్నది. ఎంత పెద్దగా పిలిచినా నాగు "ఊ" అంటూనే ఎటో చూసేవాడు.

సాయంత్రం బడిగంట విని భుజాలపైని చేతులు మెలిచి జోడుగా పరుగెత్తలేదు. పిల్లలగుంపులో అప్పుడే కలిసిపోతున్నాడు. కోటి పరిశీలించేలోపలే దూరమైనాడు. కోటిమనస్సు ఆతురపడుతున్నది. వెనకనుంచి పిలుస్తూ పరుగెత్తుకొనివస్తే విననట్లు ముహం తిప్పుకొని వెళ్లిపొయ్యాడు నాగు. కోటిని గుండెలో పొడిచినట్లయింది. లేతచీకటి ముసురుకుంటున్నప్పుడు మెల్లగా ఇంటిదారి పట్టి నడిచాడు.

ఆసాయంత్రం మళ్లీ పినతండ్రి పట్టాలవద్ద నిలవేశాడు. "అఖం!" అన్నాడు.

తల్లి బైటికివస్తూన్న సమయాన్నే కోటి "అమ్మా!"అని పరుగెత్తాడు. ఆతొందరలో పుస్తకాలు క్రిందికి జారిపోయినై. పలక ముక్కలై ఫ్రేము వదిలించుకున్నది. చూచి కోటి నెత్తుకొని పినతండ్రిని సమీపిస్తున్నప్పటికే అతను వంగి పుస్తకాలొక్కొక్కటే పాకీడబ్బాలో విసిరి "వెధవ! చేజారి

పోయ్యావ్...నీకర్మ చూసుకో... నీగతి చూసుకోరా...నీకు చదువెందుకు" అంటూ పలకముక్కలు లెక్కెస్తూ, తూలుతూ డబ్బాచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

నీళ్లకు వెళ్లే అమ్మలక్కలు కొంతమంది పరిహాసంగా "కోటిగాడి చదు వెంతవర కొచ్చింది" అని ప్రశ్నించారు.

మాచి ముఖం నిమురుతూ, ఏకుస్తూ కోటి "పుస్తకాలు మాడవే డబ్బాలో వేశాడు... మాడమ్మా! ఎట్లాగే! పలక ఎట్లా అమ్మా!" అంటున్నాడు ఎక్కిళ్లువిడుస్తూ. మాచి క్రుంగిపోతున్నది. క్రొత్త చొక్కా కుట్టించుదామని నెలరోజులనుంచీ చాకిర్లన్నీ చేసి, అన్నం కడుపులోనికి వెళ్లనివ్వక మిగిల్చిన అణాలు మళ్లీ ఎదురుచూస్తున్నై. తను పదిహేనురోజులనుంచి ఒంటిపూట పచ్చడిమెతుకు నంజింది. ఆ కుళ్లుసొరంగాల్లో ఎవరికీ గోచరించకుండా కడుపుమాడ్చుకొని దాచుకున్నది. పినతండ్రి శ్రేశిలు, పాడుగువారి ఏవగింపు తనను మంటలమధ్య కట్టివేసినట్లున్నది. కోటి కళ్లు కప్పుకొని ఏడుస్తున్నాడు. మాచికళ్ల వెనుక నరాలు జిమ్ముమన్నాయి. నీరు పొర్లింది. కోటికళ్లు అద్దుతూ ఇంట్లోకి తీసుకుపోతూ "దాన్దేమిలే!" అన్నది.

ఆరాత్రి మళ్లీ మసకవెలుతురులాంతరువద్దకు ఎత్తుకొనివచ్చి, అన్నం ముద్దలుచేస్తూ "రేపు మీ నాగును అడుగు నాయనా నాలుగునాళ్లు పుస్తకం చూపించమని...నే నింతలో కొనిస్తానుగా...నాలుగు నాళ్లే" దీనంగా, మెల్లగా అన్నది.

కోటి తల్లిని గట్టిగా కావలించుకున్నాడు. నాగు మెల్లెక్కి వెడుతూ ముఖం త్రిప్పుకోవడం మళ్లీ అనుభవిస్తున్నాడు.

"పలకగూడా అడుగుతావా" అన్నది తల్లి.

కోటిగొంతులో మాటలు ఏడుపు రాచుకొంటున్నై. "అమ్మా!" అని భోరుమన్నాడు. తల్లి నివ్వెరపోయింది. సముదాయిస్తూ ప్రశ్నిస్తే, నాగు పలకడట. మాచిచేతిలోని ముద్ద రాలిపడి మెతుకులై పోయింది. చేరవస్తున్నట్లున్న దూరపు దీపం దూరమే సాగిపోతున్నట్లనిపించింది. మాచి బ్రతిమలాడినా కోటి అన్నం ముట్టలేదు.

"నాగుతో ఎట్లా మాట్లాడేది..."

"నాగూ, నేనూ కలిసి తిరిగేవాళ్లమే అమ్మా."

"వాళ్ల నాన్నను చూస్తే నా కెందుకో భయమే...."

"నాగు ఎంత మంచివా డనుకున్నావ్..."— అని వెక్కిళ్లు పెట్టాడు. తల్లి ఇంట్లోకి వంగబోతున్నప్పుడు పినతండ్రి దీపం ఎత్తుకుపోతూ ఎదురైనాడు. మాచిభుజంమీదే కోటి నిద్రపోయ్యాడు. కోటిచుట్టూ చెయిచుట్టి ఆ చీకట్లో చాపమీద రాత్రంతా కళ్లు తెరిచేవుంది మాచి.

భర్త తన ఇంటిచుట్టూ, ఇంట్లోనూ తిరుగుతూ "జాగ్రత! జాగ్రత!" అని హెచ్చరిస్తున్నట్లున్నది. రాత్రంతా తన జీవితాలకు పశ్చాత్తాపంగా ఆడింది గుండె. సుడిసెల్లో పొగలాగా వెలువడుతున్న శబ్దాలూ, తనను నాటిగా గ్రుచ్చుకునే వెటకారాలూ వింటూ తెల్లవార్చుకున్నది.

౪

కోటి పాడిచేతులతో బడి కెడుతోంటే డబ్బా లెత్తుకొని వీధులకు చీలిపోతున్న కుర్రాళ్లలో ఒకడు డబ్బా చేతి కందివ్వబోయినాడు. ప్రక్కగా తప్పుకున్నాడు కోటి. మాచి చూస్తూ "ఒరేయ్! ఏమమ్మా మిడిసిపడతావ్...నీ తమ్ముడనుకో రేవూ... అంత పొగ రెందుకయ్యా!" అంటూండగానే మరో ఆమె చేతు లూపుతూ వచ్చి "ఉన్నూ ఉన్న! నువ్వ గాగ చదివిస్తున్నావని అందరూ పొగరుమోతులూ పోకిరీలూ..నోరు చేసుకు నేపు మర్యాదగాదు... ఐనా ఏ మేడుస్తాడో చూద్దాముగా చదివి..." అంటూ రాచుకొంటూ నడిచింది. ప్రక్కనే చోద్యం చూస్తున్న కొందరు "ఊరుకుంటా వేమే!" అన్నట్లు వుసిగొల్పారు. మాచిగొంతు మూసుకుపోయింది. లోపలికి వెళ్లిపోయింది సరాసరి. బైట తిరిగే పారుగమ్మలు "ఇంతేలే!" అన్నట్లు తలలు విసురుకొంటూ ఇళ్లు దూరారు.

కోటి వాకిట్లోనే నాగువంక చూశాడు. ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్న నాగు లోపలికి అడుగు పెట్టగానే తల వంచుకున్నాడు. తన స్థలంలో కూచుని దిక్కులు చూస్తూంటే పంతులుగారు గద్దించాడు పలకాపుస్తకాలకోసం. "నాగూ! నీ పుస్తకం చూపించరాదూ...ఇటు రా" అన్నాడాయన. నాగు ప్రక్కకు చేరకతప్పలేదు. కూచోగానే భుజంమీద చెయి వుంచి నాగుముఖంవంక చూచాడు కోటి. నాగువాకాల్లో నెత్తురు వుసిగా పరుగెత్తింది. కందిన ముఖంతో కోటిపైకి వొత్తిగిలి భుజంమీద తలవాల్చాడు. కోటి నవ్వుతూ పుస్తకం తెరిచాడు.

బడివేళ కాగానే మళ్లీ నాగు పిల్లలతో కలిసి వెళ్లిపోతున్నాడు. కేక వేస్తున్నా, చప్పట్లు చరుస్తున్నా, "ఓయ్!" అంటూనే దాటిపోయ్యాడు. కోటి పరుగెత్తుకొనివచ్చి పిలుస్తూంటే కిల్లీకొట్టుదగ్గర సుందరయ్య నాగుబుగ్గలు పట్టుకు నవ్వులాడుతున్నాడు. కోటి బెరుకుగా చూస్తూ పుచ్చుకున్న నాగుపుస్తకం అక్కడ పెట్టేసి నిశ్శబ్దంగా దారిపట్టాడు.

భాస్కరరావుగారు పళ్లు ఒత్తిపట్టి ఆతను మలుపు తిరిగేవరకూ కళ్లు గాలిలో పెట్టుకు చూచాడు.

నూచి ఆరాత్రి అన్నం పెడుతూన్నప్పుడు అన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకున్నది. ఏదోవిధంగా కోటిని సంతోష పెట్టి కృత్రిమసంతృప్తి పొందవలెనని వ్యర్థయత్నం చేసింది.

"నాయనా! నాగూకూడా మంచివాడేరా... నీతో ఎందుకు మాట్లాడడూ...ఏదో దూరదూరంగా వుంటున్నాడనేగానీ..." కోటి తల్లి ఒడిలో తలవుంచి నిద్రమంపులో "ఊ" అన్నాడు.

బైట ఎవరిదో లాంతరు నడిచిపోతూ, వెలుతురు వచ్చి నూచిముడుతలు తేరిన ముఖంమీద క్షణం ఆడింది. ఆమెవేదనను కండ్లకు కట్టింది. నలిగిన కళ్లలో వెలుతురు తడిగా మెరిసింది.

"లేవు పలకరించు నాయనా! నిద్దపడేవు... నాగు అంటే నీ కెంతో యిష్టం గదూ...పలకరిస్తావా!"

కోటి కళ్లు తెరిచి "సరే లేవే!" అంటూ ఒడిలోనే ప్రక్కకు ఒత్తిగిలాడు.

పడుకున్న నూచికి పూర్వస్మృతులు మళ్లీ జీవించాయి. తను విశృంఖలంగా మనస్సును పరుగెత్తించిన రోజులు తేరిచూస్తే ఇప్పు డీచలిలోకూడా గుండె వడిగా కొట్టుకుంటున్నది. భర్తతో తను కలిసివున్నప్పుడు జీవితాన్ని జలపాతంవలె గడిపింది. గుడిసెల్లోని బంధువులంతా ఏదో పని వున్నట్లు వచ్చి ప్రేమగా మాట్లాడేవారు. రహస్యంగా తననుగూర్చి ప్రసంగించేవారు. భర్తచావు దాపురించేనాటికి పిల్లాడికి రెండో ఏడు. పంజరంలోని పావురాయిని చిత్రవధ చేసినట్లు తనను తాను ధ్వంసంచేసుకున్నాడు భర్త. అతను కంటి ముందు తిరిగినట్లే కనిపించింది. అతని బరువైన అడుగుల చప్పుడు వినిపిస్తున్నది. త్రాగివచ్చి, గుడిసెల్లో అందరిపైనా తొడకొట్టడమూ, ఊరిలో ఎవరితోనో కయ్యానికిదిగి రక్తసిక్తవస్త్రాలతో రొజుకుంటూవచ్చి ఇంట్లో పడటమూ దృశ్యాలుగా తోస్తున్నాయి. అవసాన సమయాన అతని మాటలు మళ్లీ జ్ఞప్తికివచ్చి కంపించింది.

"నాకోటి! నాకన్న! నాఅదృష్టం!" అనుకొంటూ కోటిని గుండెకు ఒత్తుకొంటూ కన్నుమూసింది.

ఉదయం కోటి బళ్లోకెళ్లి నాగూను ఎప్పుడు పంతులుగారు దగ్గరగా రమ్మంటారా అని ఎదురు చూస్తున్నాడు. పంతులుగారు సీనయ్య లెఖ్ఖలపలకలు దిద్దుతూనే "కోటీ!" అన్నాడు. కోటి లేచి నిలిచాడు. పంతులుగారు సీనయ్య కళ్లజోడు పైకి లాగి తీరికగా చూస్తూ "దయచెయ్యొచ్చు!" అన్నాడు.

నాగు తల ఎత్తి చూచాడు.

మళ్లీ ఆయన—"ఏమిరా! నీక్కాదూ చెప్పేది! పో..."

కోటి వొణికాడు. "ఏమిటండీ?"

"పో బైటికి...ఇక్కడెవరూ లేరు తేరగా పాఠాలు చెప్పేందుకు..."

నిష్కారణమైన ఈ కోపానికి కోటి అంతర్నాళాలు జలదరించాయి. వొణుకుతున్న చేతులతో కోటి గొణిగాడు: "నాగు దగ్గర చూస్తానండి పాఠం. ...ఇవాళొక్కరోజేనండి... పుస్తకాలు రేపు తెచ్చుకుంటానండి."

కుర్చీమీదినుంచి కాళ్లు క్రిందికి దించి—"మా అయ్యగాని, ముందు బైటికి నడు...రేపట్నుంచీ బడికి రానక్కర్లేదు... తెలిసిందా...హాజరుపట్టీలో నీ పేరు కొట్టేశాం..."

కోటి ఇంకా నిలిచేవున్నాడు. నాగువంక చూచాడు...పంతులుగారి ముఖంలో దీని కేమైనా కారణం స్ఫురిస్తుం దేమోనని వెతికాడు.

"తెలిసిందా!" అన్నా డాయన పెద్దగా. "వెళ్లు...నాగుతో మాట్లాడావో, ఒళ్లు చీలుస్తాను జాగ్రత!"

నిర్విణ్ణుడై, వినమ్రుడై నుంచున్నాడు కోటి. క్లాసులో పిల్లలంతా పలకలు దిద్దడం, బలపాలు చాదడం మాని కోటివంక చూస్తున్నారు.

పంతులుగారు పీనయ్య విశ్రాంతి తీసుకునే కొన్ని నిముషాలు ఉదాసీనత వహించాడు. "నిన్నేరా అబ్బాయి,పో!తర్వాత భాస్కరరావుగారూరుకోరు".

కోటి, మెల్లగా చెప్పుకున్నాడు: "పొమ్మంటారా?"

"ఆహా!" అని నవ్వాడు పంతులుగారు.

నాగువంక చూస్తూ కోటి వాకిలిదాటి బైటికి వస్తున్నప్పుడు పిల్లలంతా అతనివంకనే చూస్తున్నారు. నాగు ఊపిరి బిగబట్టి తల వంచుకొని చదివిన పంక్తినే తిరిగితిరిగి చదువుతున్నాడు.

పదిగంటలవేళ బజారంతా నిండుగా వుంది. పల్చని ఎండ చిక్కనై వెచ్చనిగాలులు క్రక్కుతున్నది. గొడ్లకాపరి ఆవుల్ని, గేదెల్ని తోలుకుపోతున్నాడు. గంట విని పిల్లలంతా ఇళ్లకు చీలిపోతున్నారు.

వాకిలిప్రక్కగా ఒదుగుకొని కూచునివున్నాడు కోటి. పిల్లలంతా వేలితో చూపుతూ, గుసగుసలాడుతూ వెడుతున్నారు. నాగు గడప దిగగానే కోటి "నాగూ!" అని పిలుస్తూ లేచాడు. నాగు తిరిగి చూచాడు. ఇప్పు డేమి చెయ్యాలి? నాగుకు తోచలేదు. నుంచున్నాడు. కోటి దీనవదనంతో సమీపిస్తున్నాడు. నాగు కదలడం ప్రారంభించి, వడివడిగా నడిచి, పరుగెత్తుతున్నాడు. కోటి "ఇదేమిటి?" అనుకున్నాడు.

"నాగూ! ఓనాగూ! ఉండవోయ్" అని కేకలు వేస్తూ వెంబడించాడు. నాగు వీథి తిరిగి ఇంటివేపు ఒక్క పరుగు తీశాడు. అందలేదు. అతనట్లా పరుగెత్తుతూ ఉండటానికి కారణం ఏమీ స్ఫురించలేదు తిరిగివస్తున్న కోటికి. ఇంతసేపటినుంచీ గడప బైట కనిపెట్టుకు కూచుంటే నాగు పిలుపు వింటూనే, "ఆ!" అంటూనే తప్పించుకున్నాడు. మలుపు తిరిగేటప్పుడు నాగు ఏడుస్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. కలుసుకోవడానికి ప్రతిబంధకాన్ని నిర్మించుకొని కోటిమీది అనురాగంవల్లనే ఏడుస్తున్నా డని అతను గ్రహించలేదు.

కోటికి ఇంటికి ఒకే త్రోవ. ఎందుకో తెలియని బాధ ఒళ్లంతా ఆవరించి వెక్కిళ్లు పెడుతూ, నాగు వెళ్లిన దిక్కుగా చూస్తూ, చేతులు నులుముకొంటూ ఇంటికి వచ్చి ఆవురుమన్నాడు. త్రోవలో తల ఎత్తితే ఇవంతా కనిపెట్టి వుండిన ఏదో దొంగకన్ను పరిహసిస్తున్నట్లనిపించింది. పంతులుగారు పీనయ్య గద్దింపులకు మనస్సు దద్దరిల్లుతున్నది ఇంకా.

మాచి ఒక్కొక్కమాటా వింటూ క్రుంగిపోయింది. ఇరుగు పొరుగమ్మలు గోడలవెనుక చెవులు రిక్కించి వింటున్నారా అనుకున్నది. భర్త కడసారి చెప్తూ ఆమె చెయ్యి పట్టుకోవడం జ్ఞాపకానికి వచ్చింది. పంతులుగారు దేనికి వెళ్లిపొమ్మంటాడు? ఎప్పటికీ ఎందుకు రావద్దంటాడు? మాచికి పాలుపోలేదు. కరవలేనిపామును అందరూ త్రొక్కుతారు.

"నాగు ఏమన్నాడు నాయనా! మరి పంతులుగారితో చెప్పలేదూ... నీ ప్రక్కనే కూచోలేదూ ఇవ్వాళ కూడా?"

కోటి తల దించి అన్నిటికీ "ఊహూ" అంటూ చినిగిన పమిటచెరగు కళ్లకు కప్పుకున్నాడు.

"నీకర్మ! నాగును పలకరించమని రాత్రి చెప్ప లేదూ?"

"పలకరించానే!" స్వరం గాద్గదికమైనది.

"ఏమన్నాడు?"

"ఏముంది?"

"పో... నీకర్మ!" మాచి దిక్కుతోచని దుఃఖంలో వినబడ్డది.

ఇరుగమ్మ ఎవ్వరో వచ్చి అప్పుడే కోటితో నవ్వులాడుతున్నది చదువుముగించి.

౬

దూదిబిత్తులైన కాళ్లను మెల్లగా ఈడ్చుకొంటూ మాచి స్వయంగా బడివద్దకు వచ్చిచేరింది. సాయంత్రంగంట మ్రోగేవరకూ, తలుపు తెరుచుకున్న ప్రతీసారీ కష్టంమీద లేచి నుంచుంటూ, పంతులుగారు కాదని తెలియగానే కూలబడి ఎదురుచూస్తున్నది.

పిల్లలు బైటికి పార్లివస్తూ మాచిని చూచి వెక్కిరిస్తూ, నవ్వుతూ వెళ్లిపోతున్నారు. పంతులుగారు బెత్తం ఊపుతూ తలుపు తాళం వేస్తూండగానే మాచి చేతులు రెండూ కలిపి "అయ్యా! ఓఅయ్యా! మీరేనయ్యా పంతులుగారు!" అన్నది బావిలోనుంచి మాట్లాడిన స్వరంతో, బావిలో పడ్డదానివలెనే.

"ఏం?" అన్నాడు.

"కోటి మావాడేనండీ!"

"ఓహో! తెలిసింది... తెలిసింది. కోటిగదూ!... లాభంలేదు...ఐనా వాడికి చదు వెందుకే పిచ్చి ముండా..." చిరునవ్వు నవ్వాడు బెత్తాం గాలిలో విసురుతూ.

"ఏదో మావాణ్ణికూడా గట్టున పడేద్దామని... దయవుంచండయ్యా..."

"దేముడే దయుంచాలి...నాచేత కాదు... ఆభాస్కరరావుగారి నడుక్కోక పోయ్యావా, ఇక్కడ గొణక్కపోతే!"

"నాగుగారి తండ్రా?"

"ఎవరి తండ్రో...మా ప్రాణం తీస్తారు...పో పోవే ఇప్పుడు మీవాడిసంగతీ నీసంగతీనూ" పంతులుగారు పీనయ్య సాగిపోతున్నాడు.

"ఓ అయ్యా! భాస్కరరావయ్యగార్ని అడు క్కోమంటారా! ఐతే మీవల్ల కాదంటారా!"

వెనకకు చూచాడు మాచివంక. బెత్తం గిర్రున త్రిప్పాడు నేలమీద.

"పల్లాడగొడతాడు అయ న్నడిగితే, తెలుసా? వెళ్లు ముందు ..మీకు చదువు లెందుకే పిచ్చిముండా!" నవ్వుతూనే అన్నాడు.

మాచి వెలిగించుకున్న దీపపుఒత్తి క్రమంగా లోపలికి ముంచుకు పోతున్నది. వెలుగు సన్నగిలి దీపం రెపరెపలాడింది.

"ఐతే... ఏం చెయ్యమంటారు... ఏదైనా చెప్పండయ్యా!" సన్నగా దీనంగా, ప్రార్థనగా, అడిగింది.

ఆయన మాచిని సర్వవిధాలా అనుకరించాడు.

"ఏమంటారు" అన్నది మళ్లీ.

"ప్రయోజనం లేదు పో...పొరపాటున ఆయన దగ్గరి కెళ్లేవు...బ్రతికి ఇంటికి పోవు" బెత్తాంతో గాలికి గూడా అక్షరాలు నేర్పుతూ దారితీశాడు.

మాచి తిరిగి, వచ్చినత్రోవనే మెల్లమెల్లగా కాళ్లీడ్చుకొంటూ ఇల్లు చేరింది. క్రింద పడిపోతుం దేమో అన్నట్లు ఒకచేతితో గుండె పట్టుకున్నది. త్రోవపొడుగునా ఏమేమో గొణుగుకొంటున్నది. తెలిసీ తెలియనట్లు వెండ్రుకలలో వ్రేళ్లు దూర్చి విసుగ్గా ఆడిస్తూ తనకు తెలియకుండానే ఇంటివద్దకు వస్తున్నది.

ఇంటిబైట మసక వెలుతురు చిమ్ముతున్న లాం తరుప్రక్కగా కాళ్లలో తల దూర్చి కూచున్నాడు కోటి గట్టుమీద. మళ్లీ పినతండ్రి తప్పత్రాగి, పసిబట్టి కొనవూపిరితో వెంటబడ్డ త్రాచువలె లేస్తూ, పడుతూ

పాడుతూ, తూలుతూ వస్తున్నాడు. పరాపరి వచ్చి కోటిరెక్క పట్టుకు లాగుతూ—"పనిలోకి వెళ్లకుండా నిద్రపోతున్నావా కుంక ... ఇదుగో!" అని దబ్బా గట్టిగా వీలమీద కొడుతున్నాడు. "నేను పోలేను... ఎవరుచేసిచస్తా రీపని ... నీఅబ్బకంటె మిడిసిపడ తావా..." కోటి అతని కరకుచేతుల్లో మెలికలై తిరిగి పోతున్నాడు. "అమ్మా! అమ్మా!" అని ఏడుస్తున్నాడు.


మాచి గట్టుమీదికి వచ్చి ఏడుపు విని తలఎత్తి చూచింది. రాత్రిలో కప్పలాగా ఆమెలో బ్రతికిన భర్తకోరిక నిర్జీవమైపోతున్నది. ఆమెలో సహనం పూర్తిగా జారిపోయింది. మనస్సుకు ఇప్పటివరకూ పట్టిన గొడుగువంటి ఆశ వికావికలై చినిగిపోయింది. చూస్తూనే, దగ్గరగా వచ్చి, నిశ్శబ్దంగా రెండోరెక్క పట్టుకొని, విడిపించుకుపోతూ "ఏం! పోరాదూ?" అని వెకటుగా అన్నది. "మీ నాయనకంటె పాడుస్తావా నువ్వు!"

ప్రక్క ఇండ్లవాళ్లు, గట్టుమీద నడిచేవాళ్లు ఆగి విన్నారు ఆశ్చర్యంగా. ఇళ్లల్లోవారు నవ్వుకుంటూ బైటికివచ్చి ఆగారు. బరువైన కొయ్యను మాదిరిగా కోటిని ఇంట్లోకి లాక్కుపోతూంటే అతను పెనవేసుకొని "అమ్మా!" అంటున్నాడు.

మాచిరెప్పలనిండా నీరు నిండింది. లోపల చాప మీద కోటిని పడవేసి తను పడుకొంటూ—

"ప్రొద్దున్నే పాకీబండి తోలను పోదువు గాని ... మీ నాయన దానిమీదే వుండేవాడు" అన్నది.

ఆ రాత్రి మాచి ఒళ్లుతెలియని గాఢనిద్ర పోయింది.



ముక్త్యధ్వము

— శ్రీ సంపత్ —

పగిలి - పగిలి
ఛిట, ఛిట, ఛిట - కర్పరములు
పగిలి - పగిలి,
రగిలి - రగిలి
ఛట, ఛట, ఛట - చితిమంటలు
రగిలి - రగిలి,
తగిలి - తగిలి
తగిలినగాయానికె మరి
తగిలి - తగిలి,
పిగిలి - పిగిలి
పర, పర, పర - బలకవచం
పిగిలి - పిగిలి,
మిగిలి - మిగిలి
నాయెదలో - చితిచిహ్నమె
మిగిలి - మిగిలి,
కడచి - కడచి
వైతరణీ - విషపూయం
కడచి - కడచి,
పొడిచి - పొడిచి
నశియింపని - మూగగానలు
పొడిచి - పొడిచి,
విడిచి - విడిచి
నాకై ప్రతిభాపథములు
విడిచి - విడిచి,

నడచి - నడచి
జననీ దాస్య విముక్తికి
నడచి - నడచి,
వెదకి - వెదకి
క్రువ కోరిన - సుధకోసం
వెదకి - వెదకి,
చిదికి - చిదికి
చెడిపోయిన - నా నెత్తురు
చిదికి - చిదికి,
పిలిచి - పిలిచి
ఏదో సమరనిమంత్రణ
పిలిచి - పిలిచి,
వలచి - వలచి
భట నటనా పటుకదనం
వలచి - వలచి,
ఉరికి - ఉరికి
ఆభీల జ్వాలలలో
ఉరికి - ఉరికి.
పరమశ్శాంతి
పరమకాంతి
భరతావని పరమశ్శాంతి
భరతావని పరమకాంతి
పరమశ్శాంతి
పరమకాంతి.

ధరల కంట్రోలు

౨

= శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు =

ప్రభుత్వంవారు నేటి ధరలసమస్యను ఎలా పరిష్కరించాలి? కనిష్ఠగరిష్ఠధరలను నిర్ణయించటం వల్ల ఈ సమస్య పరిష్కారంకాదు. ముందు వెంటనే ప్రభుత్వం చేయవలసినపని ఒక్కటే. 'ఇండియన్ ఫైనాన్స్' పత్రికలో డాక్టర్ పి. యస్. లోకనాథం గారు ఇలా వ్రాశారు: "*The only way by which this inflationary tendency can be checked is increased production of all goods.*" మరొక సందర్భంలో ఇలా వ్రాశారు: "*If therefore, the monetary level of prices is to be checked currency circulation should be reduced.*"

ఈ విషయంమీదనే జార్జి బెర్నార్డుషా గారు ఇలా వ్రాశారు: "*The Government can go on issuing paper money until it is worthless. Where should this stop? It should stop the moment, there is any sign of a general rise of prices, because the only thing that can cause a general rise of prices is a fall in the value of money.*" ఇంకా ఇంతకన్నా ఎక్కువ స్పష్టంగా చెప్పారు: "*When prices all rise together the Government should withdraw the notes (paper money) from circulation until prices fall.*" ప్రభుత్వంవారు ధరలను కంట్రోలు చేయవలసిన అవసరము లేకనే చాలావరకు సమస్యను పరిష్కరింప వీలగును. పైగా వాణిజ్యపభ్యుడు వేసిన పేచీకూడా పారదు. అన్ని వస్తువుల ధరలూ తగ్గుతవి గనుక ఉత్పత్తిదారులకు ప్రత్యేక ఇబ్బందులు ఏమీ ఉండవు. ప్రభుత్వం ఈ పని చేయకుండా మరి కొంతకాలం ఉపేక్షిస్తే పరిస్థితులు ప్రమాదిస్తాయి.

"*If inflation reaches such a level that the fall in the value of money becomes obvious every one will try to protect himself against the further fall which is then expected. Every one will hold real things rather than money. Traders holding large stocks of goods will be reluctant to sell.*"

ప్రభుత్వం ఈ ప్రమాదం భారతదేశానికి రాదనే ధైర్యంమీదనే కావచ్చు, ఇంకా కొత్తనోట్లను జారీ చేయ సంకల్పించినట్లు తెలుస్తున్నది. ఆ పక్షంలో ప్రభుత్వం ఉత్పత్తినైనా ఎక్కువ చేయాలి. అందుకు సస్యాభివృద్ధిప్రచారం ద్వారా కొంత కృషి చేసింది. ఇంతకుపూర్వం సాగుక్రింద ఉన్న భూమికంటే ఇవాళటి రోజున ఎక్కువ ఉంది. ప్రభుత్వాధికారులు ఫలితములు సంతృప్తికరముగా ఉంటవని ఆశిస్తున్నారు. ఫలితములు ఎంత సంతృప్తికరంగా ఉన్నా ఈ అధికధరల వలన ఏర్పడిన బీభత్సస్థితి తొలగదు. వ్యాధి ఒకచోట ఉంటే చికిత్స మరొకచోట చేసినట్లే అవుతుంది.

ఇటీవల, ఈవిషయంమీదనే లక్నో విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్రాచార్యులైన శ్రీ డాక్టర్ రాధాకమల ముఖర్జీ గారు 'ఆహారపదార్థముల సప్లయి' అనే పుస్తకంలో ఇలా ప్రకటించారు: "భారతదేశానికి ఈ సంవత్సరం ఇంకా ౩౨.౮ లక్షల టన్నుల బియ్యం, ౮౩౦,౦౦౦ టన్నుల గోధుమలూ కావాలి. బియ్యం విషయంలో ప్రభుత్వప్రోత్సాహంవల్ల జరిగిన అధిక

ఆహారోత్పత్తి కార్యక్రమ ఫలితంగా ౨౫౦,౦౦౦ టన్నులు అధికంగా లభిస్తాయి. ఐనా ఇదివరకుకంటే ఇప్పుడు మనం ఎక్కువగా సింహళానికి ఎగుమతి చేస్తూ ఉన్నాము. ఈవిషయా లన్నింటినీ గమనించిన తరువాత తేలే విషయం ఏమంటే, ఇప్పటికీ ౬౩౦ లక్షల భారతీయులకు ఆహారపదార్థాలు దొరకవు."

ప్రజలందరికీ సరిపడే ఆహారపదార్థాలు ఉత్పత్తి ఐనా ధరలు తగ్గుతవని ఊహించటానికి ఆధారాలు ఏమీ కనిపించటం లేదు. పంచదారవిషయం చూడండి. చక్కెరకంట్రోలుఆఫీసరుగారు భారతీయు లందరికీ తగినంత చక్కెర మనకు ఉంది అని ప్రకటించినా మనకు చక్కెరకరవు తప్పనేలేదు. ధరలు రెట్టికి రెట్టింపు పెరగనూ పెరిగినవి. పైగా యం. యన్. రాయ్‌గారు అన్నట్లు ఉత్పత్తికీ, ధరలు పెరగటానికీ ప్రత్యక్షసంబంధం అట్టే లేదు. అందుచేత కేవలం ఉత్పత్తిని పెంచినంతమాత్రాన ఈ ధరలసమస్య పరిష్కారం కాదు. ప్రభుత్వం విధిగా చెలామణీలో ఉన్న నోట్లమొత్తాన్ని తగ్గించితీరాలి. తగ్గించటం ఎలాగ అన్న చర్చ కిచట అవకాశము లేదు.

ఈ సందర్భములో ఒక్క విషయాన్ని మనం గమనించాలి. ప్రస్తుతం మన ప్రభుత్వం చెలామణీలో ఉన్న నోట్లమొత్తమును తగ్గించేలాగా కనిపించదు. పైగా ఇంకా కొత్తనోట్లను ఎప్పటికప్పుడు జారీచేస్తూనే ఉంది. ఇతర వ్యవహారాలు ఎలా ఉన్నప్పటికీ, ప్రజల స్థితి నానాటికీ విషమిస్తూ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇంతలో తన కరెన్సీవిధానమును మార్చుకుంటుందని ఆశించటానికైనా వీలులేదు. ఒక్క నవంబరు రెండవవారములోనే ప్రభుత్వం ౮,౦౯,౫౬,౦౦౦ రూపాయలవిలువగల నోట్లను చెలామణీలోకి తీసుకు వచ్చింది. ఈ పెరుగుదలను పరిశీలిస్తూ 'ఇండియన్ ఫైనాన్స్' పత్రిక ఇలా వ్యాఖ్యానం చేసింది:

"Active note circulation has reached the Himalayan level of Rs. 535.46 crores. And there is ground for believing that the process of expansion in note circulation will continue without intermission at least so long as the war lasts."

యుద్ధం ముగిసేవరకూ ప్రభుత్వము చెలామణీలో ఉన్న నోట్లమొత్తమును ఎక్కువ చేస్తూనే ఉంటుందని ఆపత్రిక చేసిన విమర్శవల్ల స్పష్ట మౌతూంది. డాక్టర్ కుమారప్పగారు ఇండియాప్రభుత్వపు కరెన్సీ విధానాన్ని వివరిస్తూ ఇలా ప్రకటించారు:

"On its currency policy the Government is not concerned with the stability of the purchasing power of the Rupee, which effects the welfare of the people."

రూపాయివిలువ స్థిరంగా లేకపోవటంవల్ల ప్రజలకు కలిగే ఇబ్బందిని ప్రభుత్వం గమనించనే గమనించదు అని కుమారప్పగారు స్పష్టంగా చెప్పిన తరువాతకూడా ప్రభుత్వం కరెన్సీమొత్తాన్ని తగ్గించవచ్చునని అనుకోవీలు లేదు.

చెలామణీలో ఉన్న కరెన్సీమొత్తం దారుణంగా పెరిగిపోతూఉందన్న భావం దేశంలో బాగా వ్యాప్తిచెందింది. ఇలాంటి పరిస్థితి ఎంత ప్రమాదకరమో ఇదివరలో మనం గమనించాం. ధరల పెరుగుదల విషయమై ఆలోచించి కనిష్ఠగరిష్ఠధరలను నిర్ణయించటానికి పూర్వం కరెన్సీపెరుగుదల కొక పరిమితినైనా నియమించటం అవసరము. అది జరిగిన తరువాత ధరల నిర్ణయం జరగాలి. ధరలకంట్రోలుకూడా అవసరం. కనిష్ఠ, గరిష్ఠధరలను నిర్ణయించటం అవసరం అని రాధాకమల ముఖర్జీ గారూ అంగీకరించారు.

"Guarantee to the cultivator of the costs of agriculture through the fixation of prices—(i) minimum purchase prices of produce in the villages and (ii) maximum sale prices for consumers in urban areas."

వ్యవసాయదారులనుంచి కొనే పదార్థా లన్నింటికీ కనీసపుధరను నిర్ణయించాలి. కొనుగోలుదారులకు ఆ వస్తువులను అమ్మేటప్పుడు గరిష్ఠధరను నిర్ణయించి, ఆ ధరలకే విక్రయం జరిగేలా చూడాలి.

ధరల కంట్రోలు ఎలా జరగాలో శ్రీముఖర్జీగారు చక్కగా వివరించారు. ముఖర్జీగారు సూచించిన పద్ధతిని ధరలకంట్రోలు జరిగితే ఉత్పత్తిదారులకు ఏమీ నష్టం ఉండదు. ప్రభుత్వవాణిజ్యసభ్యులు ధరలను కంట్రోలు చేయటానికి తెలిపిన అభ్యంతరాలూ తొలిగిపోతాయి. ఈ నాడు ఉత్పత్తిదారులు కోరుతూ ఉన్నదీ తమ సరకుకు కనిష్ఠధరను నిర్ణయించమనే. కనుక గ్రామాలలో వస్తువులకు కనిష్ఠధరలను నిర్ణయించి పట్నాలలో గరిష్ఠవిక్రయధరను నిర్ణయించటం జరగాలి. వెంటనే జరగాల్సిన పని ఇది. కేవలము ధరలను నిర్ణయించటంతో ఉత్పత్తిదారుల, కొనుగోలుదారుల సమస్యలూ పరిష్కారం కావు. ప్రభుత్వ విధి అంతటితో పూర్తిగా నిర్వహింపబడినట్లూ కాదు. ఈ విషయాన్ని ప్రభుత్వ వాణిజ్యసభ్యులే అంగీకరించారు.

"Mere fixation of maximum prices cannot ensure that the consumers will in practice get the commodities at the controlled prices."

కేవలం గరిష్ఠధరలను నిర్ణయించినంతమాత్రాన వినియోగదారులకు ఆధరలకే సరుకు దొరుకుతుందనే నమ్మకం లేదని ప్రభుత్వాధికారులే అంగీకరించటం సంతోషింపదగిన విషయం. అయితే లాభం ఏమీ లేదు. లోపం ఎక్కడున్నదో తెలుసుకున్నా ఆ లోపాన్ని సవరించటానికి ఇంతవరకూ సరియైన ప్రయత్నం జరగలేదు. చేయవలసిన పని ఏమో తెలుసుకోకుండా లేరుకూడా.

"So long as the private trader controls the supplies, there is always an incentive for him to charge higher prices than the legal maximum."

చిన్న వర్తకుడు సప్లయిలను కంట్రోలుచేస్తూ ఉన్నంతకాలమూ అతను నిర్ణయింపబడిన గరిష్ఠ ధరకంటె ఎక్కువధరకే అమ్ముతూఉంటాడని వాణిజ్యసభ్యులు గుర్తించినా ఆ చిన్నవర్తకులను తొలగించటానికిగాని, సప్లయిలమీద వర్తకులకు గల కంట్రోలును తొలగించటానికిగాని ప్రయత్నంచేయకపోవటంవల్లనే పరిస్థితులు ఇంతగా విషమించాయి. ఇంతకు ముందు సూచింపబడిన రెండుపనులూ జరిగినవెంటనే ప్రభుత్వం ఈప్రయివేటు వ్యాపారస్థులనుంచి క్రయవిక్రయములను తొలగించుట అవసరం. కనుకనే ధరల కంట్రోలుసమస్యను సాకల్యంగా చర్చించిన శ్రీ యం. యస్. రాయ్‌గారు ఇలా వ్రాస్తున్నారు:

"Without trade control there can be no price control. Any successful control of prices presupposes restriction on the freedom of trade. Freedom of trade enables the trader to create artificial scarcity by withholding food and other necessaries of life from the market and later on sell them at a higher price."

వ్యాపారాన్ని కంట్రోలుచేయకపోతే ధరల కంట్రోలూ లేదనే. వ్యాపారస్వేచ్ఛ ఉన్నంతకాలమూ వ్యాపారస్థుడు కృత్రిమంగా ఆహారపదార్థాలు లేనట్టి స్థితిని కలిగించి అధికధరలకు అమ్మకం చేస్తాడు. కనుక ముందు వ్యాపారాన్ని కంట్రోలు చేయాలి.

శ్రీరాయ్‌గారు సూచించినట్లే చాలాకాలం క్రితం ప్రభుత్వంవారు ధాన్యమును క్రయవిక్రయములను గావించేవారందరికీ లైసెన్సు కావాలి అంటూ వ్యాపారాన్ని కంట్రోలుచేయుటానికి ప్రయత్నించారు. ఆవిధానమువల్ల మొదటి రెండుమూడు వారాలలో ఉపయోగం కలిగిందికాని తిరిగీ పరిస్థితులు యథాప్రకారంగానే ఉంటూవచ్చినయ్. వ్యాపారాన్ని కంట్రోలు చేయుటానికి ఒక్కటే మార్గం కనిపిస్తూ ఉన్నది. ప్రభుత్వవాణిజ్యసభ్యులు దాన్ని గమనించినా ఆ మార్గాన్ని ఎందుచేతనో ఇంతవరకూ అనుసరించలేదు. ఇప్పుడిప్పుడే ఫుడ్‌సప్లయి డిపార్టుమెంటు ద్వారా కొంత ప్రయత్నం జరుగుతూఉంది. దీని ఫలితాలు ఎలా ఉంటవో అప్పుడే ఏమీ చెప్పలేము.

"So long as the controlling authority does not control the supply and distribution of the commodities and is not in a position to sell in the market large quantities through recognised trade agencies at the controlled rates, the legal maximum cannot be made effective over a large range of market. Control over supply and distribution are therefore essential and vital corallaries to effective price control."

పై విషయాలను తెలిపినది అనధికారవర్గము వారు కారు. విప్లవకారులు అంతకుముందే కారు. ఇండియా ప్రభుత్వ వాణిజ్యసభ్యులే అలాంటి అభిప్రాయాన్ని ప్రకటించి ఉన్నారు. అయినా ఆ అభిప్రాయాలను అమలుజరపటానికి ఏమీ ప్రయత్నం జరగలేదు. 'గుర్తింపబడిన విక్రయసంఘాలు' అంటే ప్రభుత్వంనుండి లైసెన్సులను పొందిన వ్యాపారస్థులే అని వాణిజ్యసభ్యులు అనుకుంటేమాత్రం పొరబడినా రనక తప్పదు. పైగా ఈ వ్యాపారసంస్థలు ఎంతవరకూ లాభాలు చేసుకోటానికి ప్రయత్నిస్తవేగాని కొనేవారి ఇబ్బందులను ఆలోచించటానికి గాని, న్యాయంగా నిర్ణయింపబడిన ధరలకు విక్రయించటానికి గాని అంగీకరింపవు.

"As soon as trade agencies are given any place, the legitimate share of the trader must be admitted. The element of profit would then creep in and the rate of profit is always determined by the trader."

ప్రభుత్వమే మార్కెట్టులోకి దిగి క్రయవిక్రయాలను జరిపితేగాని ప్రయోజనం లేదు. పోటీ ఉన్నప్పుడే మార్కెట్టులో ధరలు మారుతూ ఉంటాయి. అవసరమైతే ఎక్కువ ధరలకే రైతులనుండి కొని తక్కువధరలకు అమ్మకం చేయాలి. ఇక వ్యాపారస్థులకు స్థానం లేదు మార్కెట్టులో. ప్రభుత్వం అమ్మే తక్కువధరలకే ప్రయివేటు వ్యాపారస్థులూ అమ్మకం చేయాలి. లేదా వ్యాపారాన్నయినా మానివేయాలి. వినియోగదారుల స్థితి కొంతవరకైనా బాగుపడుతుంది.

క్రయవిక్రయాలను జరపటానికి ప్రభుత్వంవారు కొత్తగా ఇప్పుడు సంస్థలను స్థాపించి వ్యాపారాన్ని ప్రారంభించవలసిన అగత్యమూ లేదు. ప్రతిజిల్లాలోనూ సహకారసంఘా లున్నాయి. ఇవే యథార్థంగా గుర్తింపబడిన వ్యాపారసంస్థలు. వీటి ద్వారానే వస్తువులను కొనటం, అమ్మటం జరగాలి. మద్రాసులో క్రిందటి రెండుమూడు మాసాలలోనూ మార్కెటింగు ఫెడరేషను స్థాపించి దానిద్వారా గ్రామాలలోని ఆహారపదార్థాలను కొని పట్నాలకు ఎగుమతి చేయించటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తూఉంది. పట్నాలన్నింటిలోనూ సహకారసంఘములు స్థాపన కాలేదు. బ్రిటనులో మాదిరి, ఇతరపాశ్చాత్య దేశాలలో మాదిరి, కన్స్యూమర్సు కోఆపరేటివ్ సంఘాలను ప్రతిపట్నంలోనూ స్థాపించాలి. గ్రామాలలో కోఆపరేటివ్ మార్కెటింగు ఫెడరేషను ద్వారానే సరుకులను కొంటూ, కన్స్యూమర్సు కోఆపరేటివ్స ద్వారా అమ్మకముచేస్తూ ఉంటే నేటి విషమస్థితి వెంటనే తొలగిపోగలదు.

ముఖ్యంగా ధరల సమస్య ఆహారపదార్థాలకు సంబంధించినంతవరకు వెంటనే పరిష్కారం కావాలి. 'ఆహారపదార్థాల సమస్య' రోజురోజూకూ మరీ తీవ్రమౌతూఉంది. ఇండియా ప్రభుత్వంకూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూఉంది. మార్చిమాసములో జాతీయ ప్రభుత్వ నిర్మాణము విషయమై ఢిల్లీలో సంప్రతింపులు జరుగుతూఉన్న కాలంలో తమ కర్తవ్యమునుగురించి అసెంబ్లీలోని కర్షకసభ్యుల సంఘాధ్యక్షులు కొన్ని సూచనలను చేయవలసిందిగా కోరారు. అప్పుడు దక్షిణభారతకార్మికకర్షక సమ్మేళనం తరఫున నేను పంపిన సూచనలలో ఫుడ్ సప్లై డిపార్టుమెంటు నిర్మాణం ఒకటి. అప్పుడు జరిగిన సంప్రతింపులు విఫలం కావటంతో ఇదీ ఎగిరిపోయింది. దీని అవసరాన్ని ప్రభుత్వంవారే గ్రహించి ఇప్పుడా శాఖను ఏర్పాటుచేశారు. కాని నిర్మాణానంతరం నేటివరకూ ఏమీ జరగలేదు. గతమాసంలో ప్రభుత్వ

వాణిజ్యసభ్యులు శ్రీ నళినీరంజన్ సర్కారుగారు ఆహారపదార్థాల సప్లయివిషయమై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూఉన్నారు. ఇప్పటికే పరిస్థితులు విషమించినవి. పైగా ఎప్పుడు ఈ సమస్య సంతృప్తికరంగా పరిష్కారం అవుతుందోకూడా తెలియటంలేదు. ఈ ఆహారపదార్థాల సప్లయిశాఖ చేసే పనులను ఒక ప్రకటనలో ప్రభుత్వంవారు ఇలా ప్రకటించారు :

"It will control prices, distribution and supplies, plan production, make purchases for the Army......"

ఆహార పదార్థాలకు సంబంధించిన అన్ని విషయాలనూ ఈ శాఖే విచారిస్తూ ఉంటుందని ప్రభుత్వ ప్రకటనలో ఉన్న పై విషయాలవల్ల తెలుస్తూ ఉంది. కాని ఈ శాఖ జయప్రదంగా ఈ పనిని నిర్వహించాలీ అంటే ఇప్పటి స్థితిని గమనించాలి.

"Between imperfect arrangements for control, inadequate transport because of war needs, cessation of supplies from outside India and the heavy demands of the Army for food, the people are much beset."

కంట్రోలు చేయటానికి సరియైన ఏర్పాట్లు లేకపోవటమూ, సంతృప్తి కరమైన సరఫరా సౌకర్యాలు లేకపోవటమూ మొదలైన కారణాలవల్ల నేటి విషమస్థితి ఏర్పడిందని స్టేట్స్‌మన్‌పత్రిక ప్రకటించింది. కనుక ప్రభుత్వం చేయవలసిన పనులు రెండే ఉన్నాయి.

"To see that the available supplies are distributed equitably among the entire population; to take immediate and vigorous measures, by imports and by increasing production, to make good the present national deficit."

దేశంలో ఉన్న ఆహారపదార్థాలు అందరికీ సమంగా అందేలాగా ప్రభుత్వం చూడాలి. తక్కువ అయిన పదార్థాలను ఉత్పత్తిని ఎక్కువచేసి ఇతర దేశాల నుండి దిగుమతిచేసి నేటి 'కరువును' తొలగించాలని హిందూపత్రిక హెచ్చరిస్తూ ఉంది. కాని ఇతర దేశాల నుండి దిగుమతికి ఇప్పుడు గల అవకాశాలు చాలా తక్కువ. కనీసం ఇతర దేశాలకు పోయే ఎగుమతుల నైనా ప్రభుత్వం ఆపాలి. దేశంలో తగినంత-అందరికీ సరిపోయినంత - ఆహారం ఉందని ప్రభుత్వ సభ్యులు భ్రమపడుతూ ఉన్నారు. సాధారణ పరిస్థితులలో నే బర్మా, సయాం, ఇండో-చీనా దేశాలనుంచీ, ఇతర దేశాలనుంచీ దిగుమతులు చేసుకుంటూ ఉన్న రోజుల లోనే భారతీయు లందరికీ సరిపడ్డ ఆహారపదార్థములు లభించలేదని శ్రీ రాధాకమల ముఖర్జీగారు ప్రకటించినారు. ఇక నేటి అసాధారణ పరిస్థితులలో దిగుమతులు పూర్తిగా నిలిచిపోయి, ఎగుమతులు ఎక్కువై, సైనికావసరాలు హెచ్చినప్పుడు ప్రజలందరికీ తగినంత సరుకు ఉందని తలచటం వాస్తవికస్థితిని గ్రహింపకపోవటమే. ఇటీవలనే లాహోరులో మాట్లాడుతూ ప్రభుత్వవాణిజ్య సభ్యులు శ్రీ నళినీరంజన్‌సర్కారుగారు ధరలకంట్రోలును గురించి ఇలా ప్రకటించారు:

"కంట్రోలువిధానంలో ఉన్న లోపాలను సవరించటానికి ప్రభుత్వంవారు సిద్ధంగా ఉన్నారు. ఆహారధాన్యాల సరఫరా అంతటిమీదనూ, ప్రజల అవసరాలమీదనూ ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉండాలి. అప్పుడే ఆహారపదార్థాల ధరల కంట్రోలు విధానం సక్రమంగా నెరవేరుతుంది. లభ్యమగు ఆహార పదార్థాల|విక్రయము -కంట్రోలు , ప్రజల అవసరాలకు పరిమితిని ఏర్పరచుట—ఈ రెండూ ధరలకంట్రోలుకు చాలా ప్రధానమైనవి."

రేషనింగుకూ, ధరల కంట్రోలుకూ ముడిపెడుతున్నారు శ్రీ సర్కారుగారు. భారతదేశంలో హెచ్చుమంది ఎప్పుడూ తమ అవసరాలకు తగినంత కొనుక్కోగల శక్తిలేకుండానే ఉంటున్నారు. ఇతర దేశములతో పోల్చి చూస్తే భారతీయులు వినియోగించుకొను ఆహారపదార్థముల మొత్తము బహుకొద్ది. సరియైన పోషణలేక, అవసరమైనంత ఆహారము లేకపోవటంవల్ల వ్యాధిగ్రస్తులగుచున్నా రనికూడా

ప్రజారోగ్యంమీద వెలువడిన ప్రభుత్వ నివేదికలే ప్రకటిస్తూ ఉన్నాయి. ఉత్పత్తిని హెచ్చుచేసి, దేశావసరాలకు ముందు ప్రాధాన్యత ఇచ్చి, ఎగుమతులను ఆపివేసి, ప్రజలందరకూ సమానంగా ఆహారపదార్థాలు, ముఖ్యంగా, పంపకం జరిగే టందుకు ఏర్పాట్లు చేయాలిగాని రేషనింగుద్వారా ఈ సమస్యను పరిష్కరింపబూనుట క్రమమైన విధానం కాదు. రేషనింగు అవసరమే కావచ్చును. కాని ఈ రోజున బ్రిటన్, అమెరికా మొదలైన దేశాల్లో రేషనింగు జరుగుతూ ఉందంటే వారు శాంతిసమయంలో ఎంతో అదనంగా ఉపయోగిస్తూ ఉండేవారు.

ప్రభుత్వవిధి యేమంటే—సరియైన ధరలకు, ప్రజలందరికీ సమానంగా, కనీసావసరములకు తగినట్లుగా ఆహారపదార్థాలను సప్లయిచేయాలి. అది ప్రయివేటు వ్యాపారసంస్థలద్వారా ఎన్నడూ సాధ్యంగాదు. ప్రభుత్వము సహకారసంఘాలను ఏర్పరచి, వాటిద్వారా సరుకులను కొనటం, అమ్మటం చేయించి, ఇప్పటికంటే ఆహారపదార్థముల సరఫరాలకు ఎక్కువ అవకాశాలను కలిగించి ప్రస్తుతవిషమస్థితిని తొలగించాలి.

ధరలకంట్రోలు క్లిష్టసమస్యే కావచ్చును. కాని వాణిజ్యసభ్యులు తలచినట్లు "కంట్రోలువిధానమును పూర్తిగా కొనసాగించటానికి సాధ్యంకావటంలేదు" అనరాదు. ముందు చెలామణిలో ఉన్న కరెన్సీని తగ్గించి, కనిష్ఠ, గరిష్ఠధరలను నిర్ణయించి, ఉత్పత్తిని ఎక్కువచేసి, ఎగుమతులను నిషేధించి, సహకారసంఘముల ద్వారానే క్రయవిక్రయములను సాగించి, ఆహారపదార్థముల సరఫరాకు ఎక్కువసౌకర్యములను కలిగించి, ఆమూలాగ్రంగా సంస్కరణలను ప్రవేశపెట్టితే సమస్య తేలికగానే పరిష్కారం కాగలదు. ప్రభుత్వం ఇలా చేయుటమూ అవసరం.



భగవద్భావము - విగ్రహారాధన

= శ్రీ వసంతరావు వెంకటరావు =

అనునిత్యమూ మానవుడు చేస్తూన్న ప్రయత్నములు సఫలీకృతములై మానవకృషి అనునిత్యప్రవాహానికి విఘ్నము లను ఆవకిట్టలు కల్పింపబడకపోతే మానవహృదయంలో భగవద్భావ మంకురించవలసిన అగత్యమే లేకపోయేది. మానవసామర్థ్యానికి అంతున్నదనీ, మానవాతీతములైన కొన్ని జగచ్ఛక్తులు బలవత్తరంగా నిత్యప్రవృత్తిలో నుండి మానవుని కీలుబొమ్మవలె ఆడించగల వను జ్ఞానం మానవునికి లేకపోతే తానే యావత్సృష్టికి నిరంకుశప్రభు వను అహంకారంతో తాండవించేవాడు. కాని ప్రకృతి ఒక మార్గ మవలంబించి సహజపరిణామ మొందుచుండగా, మానవుడు స్వాభ్యుదయానుకూలమగు పథ మనుసరింప ప్రయత్నిస్తాడు. జీవితోద్దేశ మేమైనప్పటికిని సుఖప్రదమై ఆనందదాయకమైన జీవితమే సర్వదా అభిలషించబడుచున్నది. దుర్నివారమైన ఆవాంఛయే ప్రకృతితో సంఘర్షించుటకు మానవుని ప్రోత్సహిస్తున్నది. కాలానుగుణంగా వాతావరణంలో, భౌతికావస్థలలో మార్పు కలుగుచుండుట సహజము. దుర్భర గ్రీష్మభీష్మాతపతాపానికి కోర్చిల్లకుండ శైత్యోపచారాలు చేసుకొని, తీవ్రహేమంతవేదకశైత్యానికి కొంకకుండ వణకకుండ ఉష్ణాధారాలు కల్పించుకొని, గజశుండసన్నిభవర్షధారాపాతముల బారి పడకుండ వాసయోగ్యగృహాలు నిర్మించుకొని అడుగడుగున మానవుడు ప్రకృతిశక్తుల నెదుర్కొనుచున్నాడు. అట్టి సందర్భమందు మానవుడు సంపూర్ణవిజయ మొందుటలేదు. మానవజాతికి విపజ్జనకములగు ప్రకృతివికారములను తాత్కాలికంగా నిరోధించగలిగినప్పటికిని భూలోకజీవితము బుద్బుదప్రాయమనీ, కరాళమృత్యుజ్వాల కాహుతి కాకతప్పదనీ ఆదిలో మానవుడు గ్రహింపక తప్పిందికాదు. ఆ ఆసన్నమృత్యుజ్ఞాన మూలంగా మానవహృదయంలో భారతమమైన వైకల్యము, అసహాయత ఉత్పన్నమైనవి. ఆ దౌర్బల్యంలో దృష్టి ఊర్ధ్వముఖ మయింది.

తలెత్తి పైకి చూడగా అనంతాకాశం గోచరించింది. ఆకాశానికి ఆద్యంతా లున్నట్లు లేవు. అట్టి ఆకాశంలో సూర్యచంద్రబింబాలు, నక్షత్రాలు కనిపించుచుండేవి. వాటివిషయమై ఆదిమమానవున కట్టి జ్ఞానమును లేకపోయినది. సూర్యచంద్రోదయాస్తమానములు, నక్షత్రచలనములు, అహోరాత్రములు మొదలగు మార్పుల భావము గ్రాహ్యమైనది కాదు. తన ఇచ్ఛానుసారంగా క్రియాలోలు డగుటకు మానవునికి ప్రకృతిశక్తు లొకప్పుడు దోహదమయేవి, ఒకప్పు డంతరాయం కలిగించేవి. కార్యములు సానుకూలమైనప్పు డానందించేవాడు; విఘ్నములు సంభవించినప్పుడు శోకించేవాడు. ఇట్లానందవిషాదపరంపరలకు లోనైనప్పుడు తనకన్న బలవత్తరమైన శక్తు లున్నాయని మనఃపూర్వకంగా అంగీకరించవలసివచ్చింది. తన ప్రతిబింబముచే ప్రకృతిలో చూచు మానవుడు అగోచరశక్తులకు రూపనామము లారోపించి, విఘ్నావిఘ్నకారు లని రెండు తెగలలోనికి విభాగించేడు. తనకు సాహాయ్యభూతమై నిర్విఘ్నకార్యసాధనకు తోడ్పడేవారు దేవత లనీ, నిరంతరవిఘ్న మాపాదించి విఫలమనోరథునిగా చేయువారు దయ్యము లనీ, రాక్షసు లనీ నిర్ణయించేడు.

కొంతకాల మయేసరికి వత్సరమారభ్య వత్సరాంతంవరకు భౌతికావస్థలు పరివర్తన మొందుచుండుట గమనించేరు. కాని, ఆపరివర్తనంలోనే పరావర్తక్రమం గోచరించింది. ప్రతివత్సరమూ వేసవిలో భాను డుగ్రుడై జలాశయముల నింకించుచున్నట్లు, వర్షాగమనంతో నదీనదాదులు జలపూరితములై గట్లుతెగి పారుచున్నట్లు, శరత్కాలచంద్రాతపం అపారహృదయాహ్లాదకరంగా పరిణమించుచున్నట్లు కనుగొన్నాడు. సస్యాభివృద్ధికి సమయానుగుణంగా నీరు, గాలి, సూర్యరశ్మి అవసరమని గ్రహించేరు. వాటిలో ఏది లోపించినప్పటికిని పంటలు ధ్వంసమౌచుండుటచేత గాలి, నీరు, సూర్యుడు మొదలగు ప్రకృతిశక్తులను దేవతలుగా పరిగణించి వాయువరుణసూర్యాదినామములతో ఉపాసనలు చేయనారంభించేరు.

రానురాను వివిధమానవసంఘా లేర్పడ్డవి. సంఘసామాజికుల రక్షణార్థము కొన్ని నియమా లేర్పాటుచేయబడ్డవి. కాని, "జాతస్యహి ధ్రువో మృత్యుః" అను సత్యం మానవహృదయాన్ని కలతపెట్ట నారంభించింది. ఈ ప్రపంచంలో కొంతకాలం జీవించి మృతించడమేనా, లేక జీవితానంతర మేమైనా కలదా అను ప్రశ్న బయలుదేరింది. పసిమివన్నెతో నవనవలాడు భౌతికశరీరం తుదకు కళేబరమై క్షీణించి ఛిద్రమౌట నిశ్చయము, అనివార్యము. మానవవేషం చాలించి భౌతికరంగంనుండి విరమించినపిదప జీవిగతి యేమౌనను సందియం ప్రబలమయింది. భూలోకానుభవం వ్యర్థంగా నశించిపోతుందన్న భావం కొందరికి రుచించలేదు. మృతించిన జీవి కర్మేంద్రియములకు చిక్కని అవస్థానం పొందుతాడనీ, పరలోకము చేరి భూలోకకర్మల ప్రతికర్మమునే అనుభవిస్తూ పునర్జన్మ మొందుతాడనీ సాహసమైన ప్రతిపాదనలు చేసేరు. జగన్నాటకరంగం భూలోక మొక్కటే కాదనీ, యావద్విశ్వమూ నాటకరంగమే అనీ స్థిరపడింది. అయితే ఈ విచిత్రనాటకానికి కర్త యెవరు? ఈ నాటకంలో పాత్రధారులు మానవు లొక్కరే కారు. అనేకజీవరాసులు, అజీవపదార్థములు, ప్రకృతిశక్తులు, నక్షత్రగ్రహాదినభోమండలమూర్తములు గలవు. ఇవన్నీ స్వకర్మ నిర్వహణంలో ఉన్నవి. "నియమంబైనను విక్రమింప డొకచో నీరేజమిత్రుండు, సంద్రము తానించుక మేరమీరదు, జగత్ప్రాణుండు వీచుక్ సదా, క్షమ సర్వంబు వహించు, నీరదము వర్షంబిచ్చు కాలానుసారముగా"-అంటే ఎవరి ప్రోద్బలం లేనిదే అవి ఆ ప్రకారంగా ప్రవర్తిస్తున్నవా? అసంభవము. సూర్యచంద్రనక్షత్రగ్రహాలను వీసమైన దార లేకుండ, గతులు తప్పనీయకుండ నడిపిస్తున్నది, మితిమీరకుండ సముద్రాన్ని అరికట్టి జగన్నాటకాన్ని ఆడిస్తున్నది భగవంతు డన్నారు. సామాన్యంగా రచనలో కృతికర్త గాని, చిత్రంలో తచ్చిత్రకారుడుగాని ఇమిడిఉండరు. కాని, ఈ విచిత్ర జగన్నాటకరంగంలోనే నాటకకర్త అంతర్లీనమైయున్నాడు. అణువు మొదలు బ్రహ్మాండం వరకు గల ప్రతివస్తువులోను భగవదంశ యున్నది.


అట్టి భగవంతుడు తన్నిర్వచనమాత్రేణ రూపరహితుడు, గుణరహితుడు, అగోచరుడు. సర్వాంతర్యామియేగాని ఎక్కడను కనిపించడు. మానవుని సంసారసాగరంనుండి, జీవప్రవాహ ప్రతిప్రవాహముల నుండి తరింపజేయు శక్తి భగవంతునికే గలదు. శరణ్యుడు భగవంతుడే. భగవద్ధ్యాన మెట్లు సాధ్యమౌతుంది?

ఒక భావముపై మానవహృదయం సాధారణంగా లగ్నంగాదు. ఇంద్రియాతీతమైన ఒక శక్తిపై మనస్సును కేంద్రీకరింపచేయుట కష్టము. ఏకాగ్రత, నైశ్చల్యము సులభసాధ్యమైనవి కావు. నిరాకార నిర్వికార నిర్గుణ భగవంతుని సామాన్యమానవులు భజించుటకుగాను భగవంతుని కొక మూర్తిమత్వ మిచ్చి వివిధ నామముల నేర్పాటు చేసిరి. నిరంతరమూ జరుగుచున్న సృష్టిస్థితిలయాల కధికారులు బ్రహ్మవిష్ణుమహేశ్వరు లన్నారు. ఒకే పరాశక్తి త్రిమూర్తులలో నున్నప్పటికిని దాని వ్యాపారమునుబట్టి వివిధలక్షణాలను ప్రదర్శిస్తుం దన్నారు. కాని మానవస్వభావం భిన్నాతిభిన్నమైనది. మానవాశయాలు బహుళమైనవి. ఆశయానుగుణంగా భగవన్మూర్తి యూహ్యము గానియెడల సాధన కుదురదు. అగుట మానవాకాంక్ష తీర్చుటకై విగ్రహారాధన మారంభింపబడిన దని

భావింపవచ్చును. దేవాలయములలో ప్రతిష్ఠింపబడిన లోహ శిలావిగ్రహాల నారాధించినప్పుడు, ఇండ్లలో పూజాగృహమందున్న చిన్న మూర్తుల నర్చించినప్పుడు మనస్సు నాకర్షించి వాటిపై లగ్నమొనరించుకొనుటకే ఆ మూర్తు లుపకరిస్తున్నవిగాని, ఆమూర్తులే భగవంతు డన్న మూఢనమ్మకంతో వాటి నెవరును పూజించుచుండుట లేదు. చిత్తచాంచల్యము నరికట్టి నిష్ఠ సమకూర్చుటకే విగ్రహా లుపయోగపడుచున్నవి. అంతమాత్రాన భగవంతుని రూపరాహిత్యానికి, నిర్గుణత్వానికి, సర్వవ్యాపకత్వానికి కళంక మాపాదింపబడలేదు. ఈ విషయ మింక ఉపమానపూర్వకంగా విచారించి, ఆ ఉపమాన మెంతవరకు సాగగలదో గమనించెదము.

అనేక ప్రకృతిశక్తులు గలవని ఆదినే మానవుడు గ్రహించేడు. కాని, వాటి తత్త్వముమాత్రము పూర్తిగా అవగాహన కాలేదు. అగ్నిజ్వాలల తీవ్రవేడిమి, ఝంఝామారుతుని అపారబలము, సూర్యుని మహోజ్జ్వలకాంతి గమనిస్తూండిన మానవులలో కొందరు వాటివిషయమై సమగ్రజ్ఞానమును సంపాదించినప్పటికిని దైవభావముతో వాటి నారాధిస్తున్న కారణంచేత మతగ్రంథాలలో గోప్యంగా ఆ జ్ఞానాన్ని భద్రపరిచేరు. భౌతికవిజ్ఞానులుమాత్రం ప్రకృతిని పరిశీలించి, ఇంద్రియాతీతమైన విషయాలను సూక్ష్మయంత్రాలతో గ్రహించి, పరిశీలనలను వివిధభాగములలోనికి కేటాయించి అనేకవిజ్ఞానశాఖలను కల్పించేరు. భౌతికవిజ్ఞానంలో ప్రధానమైన విషయ మేమనగా, పరిశీలనలపై నిర్మించబడిన సిద్ధాంతము ప్రయోగంచేత స్థిరీకృతం కావలసియున్నది. అట్లు కాకపోయినచో ఆసిద్ధాంత మామోదింపబడదు. అట్టి సిద్ధాంతాన్ని విసర్జించి ప్రయోగఫలితానుగుణమైన వేరొక సిద్ధాంతాన్ని పురస్కరిస్తారు. అంతేకాదు, నిరంతర జ్ఞానార్జనంతో దృక్పథం విస్తరిస్తుంది. నూతన పరిశీలనల కొకప్పుడు సిద్ధాంతం వర్తించదు. అట్టితరి సిద్ధాంతాన్ని సవరించి సమగ్ర మయ్యేటట్లు విపులీకరిస్తారు. ఈ ప్రకారంగా కాలక్రమేణ జ్ఞానసంకలనంతో సిద్ధాంతాలు మారుతూ ఉంటవి.


శక్తియొక్క స్వభావం అవగాహన చేసుకొనుటకు భౌతికవిజ్ఞాను లనేకప్రయోగాలు చేసిచేసి, శక్తి వివిధరూపములు ధరించగలదనీ, ఒకరూపంలో ఉన్న శక్తిని మరొకరూపంలోనికి పరివర్తన మొనరింపవచ్చునని తుదకు కనుగొన్నారు. ఆవిషయం ప్రయోగపూర్వకంగా నిరూపించవచ్చునేగాక, దైనందిన జీవితంలో ఆవిషయాన్ని అనేకవిధాల ఉపయోగిస్తున్నాము. రాపిడివల్ల వేడి జనిస్తున్నది. వేడిమివల్ల రైలువంటి యంత్రాలు నడుస్తున్నవి. వేడిమివల్ల విద్యుత్తు జనిస్తున్నది. ఒక రాగితీగను, ఒక ఇనపతీగను 'క' 'చ' లవద్ద కలిపి, ఒక తీగను తెంపి, దాని రెండు



చిత్రం ౧

కొనలను 'గ' అను గాల్వనీమాపకమునకు చిత్రం ౧ లో చూపినట్లు తగిలించి 'క' 'చ' లలో ఏదో ఒక కొనను వేడిచేయగా గాల్వనీమాపకపు ముల్లు కదులుతుంది. అందులోనుండి విద్యుత్తు ప్రవహించింది. అంటే, వేడివల్ల విద్యుత్తు జనించిన దని నిర్ణయము. విద్యుత్తువల్ల వేడి, వెలుతురు జనిస్తున్నవి. అది విద్యుద్దీపాలలో స్పష్టమౌతున్నది. ఒక తీగచుట్టను ఒక అయస్కాంత ధ్రువాల (Magnetic poles) వద్ద గిర గిర త్రిప్పినప్పుడు ఆతీగెలోనుండి విద్యుత్తు ప్రవహిస్తుంది. ఆతీగచుట్టలోనుండి విద్యుత్ప్రవాహాన్ని పంపితే అది గిరగిర తిరుగుతుంది. ఆసూత్రమే విద్యుత్-వీవనలో ఉపయోగింపబడుతూంది. విరళగంధకామ్లము (Dilute sulphuric acid) గల పాత్ర చిత్రం ౨ లో గల 'ఆ'. అందులో గంధకామ్లఅణువులు ఉదజనిఅయను (ion) లలోనికి, గంధకిత అయను (Sulphate ion) లలోనికి వియోగ మొందుతవి. ఆపాత్రలో దూరంగా 'రా' అను రాగిరేకును, 'నా' అను నాగ (zinc) పు రేకును ముంచి ఆరెంటిని ఒక తీగతో పైనుండి కలి

పివరొమొడల తీగలోనుండి విద్యుత్తు ప్రవహిస్తుంది. ఆమ్లిత జలంలోనుండి విద్యుత్ప్రవాహాన్ని పంపినపుడు జలాణువు దాని రచకములైన ఉదజని ఆమ్లజని అణువుల లోనికి రాసాయనికవియోగ మొందుతుంది. ఇట్లు రాసాయనికశక్తి విద్యుత్తులోనికి, విద్యుత్తు రాసాయనిక శక్తిలోనికి మారగలదు. ఈ ప్రకారంగా భిన్నభిన్న రూపములలో శక్తి వ్యక్తమౌచున్నప్పటికీ ప్రతిరూపంలో నున్న శక్తి రూపాంతరం పొందగలదని ప్రాయోగికంగా రుజువయింది.



చిత్రం. ౨

అంతేకాదు: కర్మేంద్రియములకు వ్యక్తంగాని విశేషరూపములలో ఉన్న శక్తిని ఉపకరణముల ద్వారా కనుగొన్నారు. ఆకాశవాణిలో ఉపయోగింపబడుచున్న బ్రాడ్‌కాస్టింగు తరంగాలను రేడియో కనిపెట్టగలదు కాని మన ఇంద్రియములు కనిపెట్టలేవు. అతినీలలోహిత (Ultra-violet) కిరణాలను చూస్తే కండ్లు ఉడుకులెక్కుతవి. బేర్యప్లటినసయనదము (Barium Platinocyanide) అను పదార్థముతో పూయబడిన ఫలకము లేనిదే X-కిరణాలను గమనించలేము. అతిసూక్ష్మమైన యంత్రసాహాయ్యంతో గాని గామాకిరణాలను, కాస్మిక్ కిరణాలను తెలుసుకొనలేము. ఈ కిరణములలో కొన్ని అపారశక్తివంతము లైనవి. చాలవర కీకిరణములు జగద్వ్యాప్తమై యున్నవి. మహోజ్జ్వలజ్వాలోత్పాదకములైన నక్షత్రములు అపరిమితప్రమాణంలో ఉష్ణాదిశక్తులను దిగ్వలయం వ్యాపింపజేస్తున్నవి. దశలక్షకోట్ల మైళ్ల దూరాలలో ఉన్న నక్షత్రములు విరామములేకుండ ప్రసరిస్తున్న శక్తి యావదాకాశంలో సంచార మొనరిస్తున్నది. శక్తిప్రసారవ్యాప్తం కాని ఆకాశము యావజ్జగత్తులో రవంతైనను లేదు.

ద్రవ్యమునకు, శక్తికి గల అవినాభావము సుమారీశతాబ్దంలోనే కనుగొనబడింది. యావద్ద్రవ్యమూ పరమాణువులతోను, అణువులతోను నిర్మితమైన దని ప్రాయోగికంగా భౌతికవిజ్ఞానులు కనుగొన్నారు. సుమారు ౯౨ మూలపదార్థముల (Elements) వివిధ సంయోగముచే విశ్వమందలి ద్రవ్య మేర్పడిన దని విజ్ఞానుల అభిప్రాయము. ప్రతి మూలపదార్థమూ పరమాణువులతో ఏర్పడింది. ఒక మూలపదార్థంలో ఉన్న పరమాణువులు ఒకే భారము, లక్షణము కలిగియున్నవి. పరమాణువు అభిన్నమగు సూక్ష్మకణంగా భావింపబడేది. కాని, దాని కొక నిర్మాణ మున్న దని ఇటీవల రుజువయింది. సూక్ష్మయంత్రాలతో పరమాణువును భిన్నంచేసి పరీక్షించగా ఆ భిన్నసూక్ష్మకణములకు విద్యుదావేశ (Electric charge) మున్నట్లు తెలిసింది. వాటిని విద్యుత్కణములుగా భావించేరు. వాటిని ఎలెక్ట్రాను (Electron) లంటారు. ఆ విద్యుత్కణములే పలుచని రేకులమీద పడినప్పుడు కాంతితరంగాలవలె ప్రవర్తించినట్లు ఛాయాచిత్రాలవల్ల తెలిసింది. ఎట్లనగా: ఒక సూక్ష్మరంధ్రముద్వారా కాంతికిరణజాలమును పంపి బహిర్గతకాంతియొక్క ఛాయాచిత్రము తీయగా ఏకకేంద్రం గల అనేకవలయములు ఛాయాచిత్రంలో గోచరిస్తవి. ఆ దృగ్విషయమును వివర్తనము (Diffraction) అంటారు. తరంగస్వభావం గల కాంతివివర్తనవలయముల (Diffraction rings) ను కలిగించగలదు. విద్యుత్కణపరిమాణాని కనుగుణమైన రంధ్రములు గల పలుచనిరేకులలోనుండి ఎలెక్ట్రానులను పంపినప్పుడు ఏకకేంద్రవలయములే ఛాయాచిత్రంలో గోచరిస్తవి. అనగా, విద్యుత్కణప్రవాహము కాంతికిరణజాలంవలె ప్రవర్తించింది. అనుట ఎలెక్ట్రానును విద్యుదావేశము గల కణముగా భావించుట కవకాశం లేదు. ఏది విద్యుత్కణంగా భావింప

బడుతూందో అదొక తరంగసమూహ మని అంగీకరించ వలసివచ్చింది. పరమాణువులో ఎలెక్ట్రాన్లు ఉన్నవి. ఎలెక్ట్రాన్లు శక్తిసమూహము. ద్రవ్య మను కట్టడము పరమాణువు లను ఇటికలతో నిర్మింపబడింది. కాని, ఆ ఇటికలలో ద్రవ్యత్వం లేదు. ఆ ఇటిక ఒక శక్తి ఖండము. అనుట శక్తితో ద్రవ్య మేర్పడినది.

శక్తియొక్క చరిత్ర మహాద్భుతగాథ. తరంగ రూపంలో శక్తి వ్యక్తమౌతూంది. కాని ఒక్కొక్క ప్పుడు కఠినద్రవ్యకణమంత ద్రవ్యత్వం ప్రదర్శిస్తుంది. రెండు బంతులు ఢీకొన్నప్పుడు ఒకదాని ఆవేగం (Momentum) రెండవదానికి బదిలీ అవుతుంది. ఢీకొన్న తరువాత వాటి దిక్కు (Direction), వేగము (Velocity) కూడ మారవచ్చును. అవెట్లు మారునో గతిసూత్రముల (Laws of dynamics) వల్ల కనుగొన గలము. X కిరణములు పరమాణువుమీద పడి నప్పుడు అందులో ఎలెక్ట్రాను కొంత శక్తిని గ్రసించి పరమాణువును వీడిపోతుంది. ఎలెక్ట్రాను ఒక దిక్కుగా పోతుంది; X కిరణములు అన్ని దిశల విక్షేపింపబడతవి. X కిరణముల పతన (Incident) దిక్కునకు లంబ (Perpendicular) దిశలో విక్షిప్త మైన ప్రసారమును పరిశీలించగా దాని తరంగదైర్ఘ్యము పతనకిరణముల తరంగదైర్ఘ్యముకన్న తక్కువని తెలి సింది. ఆ పరిశీలనను సమర్థించుటకు ఆర్థర్ కాంప్టను ఒక సాహసమైన సిద్ధాంతమును ప్రతిపాదించేడు. X కిరణజాలంలో గల కాంతిఖండములు కణము లట్లు ప్రవర్తించగలవనీ, అవి ఎలెక్ట్రానుపై పడినప్పుడు ఆ రెండును రెండు బంతులవలె ఢీకొంట వనీ సిద్ధాంతీ కరించాడు. శక్తిఖండములను క్వాంటము(quantum) లంటారు. X కిరణక్వాంటము ఎలెక్ట్రానును ఢీకొని తన శక్తిలో కొంత ఎలెక్ట్రానున కిచ్చి తను విక్షిప్తమైన దన్న వాదంతో, అవి ఢీకొనుముందు ఎలె క్ట్రానునకు, క్వాంటమునకు గల శక్తిని, ఆవేగమును గణించి, ఢీకొన్నతరువాత ఎలెక్ట్రానునకు, విక్షిప్త క్వాంటమునకు గల శక్తిని, ఆ వేగమును గతిసూత్రముల వల్ల గణించి తన్మూలంగా విక్షిప్తక్వాంటముయొక్క తరంగదైర్ఘ్య మెంత హెచ్చుకావలెనో కనుగొని, ప్రాయోగికంగా కొలిచిన విక్షిప్త ప్రసారంయొక్క తరంగ దైర్ఘ్యము పతనప్రసారంయొక్క తరంగదైర్ఘ్యం కన్న ఎంత అధికమయిందో కనిపెట్టగా రెండును సరి పోయినవి. X కిరణప్రసారము ద్రవ్యకణములట్లు ప్రవ ర్తించగల క్వాంటములతో నిర్మితమైన దని నిర్వి వాదంగా రుజువయింది. అనుట, శక్తిలో ద్రవ్యత్వ లక్షణము లున్నవి.

ఖగోళజ్ఞులు జగద్వ్యాప్తినిగురించి కనుగొన్న విషయములను తెలిసికొందము. ఆకాశంలో వెలుగు చుక్కలట్లు కనుపడు నక్షత్రాలు లక్షలకొలది మైళ్ల నిడివిగల ద్రవ్యగోళము లనీ, వాటి నావరించియున్న మహోజ్జ్వలవాయువులు శతసహస్ర-మైళ్లు ఊర్ధ్వ ముఖంగా దూసికొనిపోతున్న వనీ వాటి ఛాయా చిత్రాలు తీసి నిరూపించడమయింది. ఆ పరితప్తద్రవ్యం యొక్క తాపక్రమము (Temperature) కొన్ని వేల నుండి కోట్లవరకు అంశ లుండవచ్చునని విజ్ఞానులు నిర్ణ యించేరు. అనంతాకాశంలో అతిసమీపంగా ఉన్న రెండు నక్షత్రాల దూరము ౨,౫౦౦,౦౦౦ కోట్ల మైళ్లు. అసహాయనేత్రానికి కొన్నివేలకన్న అధికంగా నక్షత్రాలు గోచరించవు. కాని, ఒకవిజ్ఞాని లెక్క ప్రకారంగా ఒక్కొక్క గోచరనక్షత్రానికి అధమం ౮ కోట్ల నక్షత్రాలవంతున అగోచరంగా ఆకాశగర్భ గహ్వరములలో దాగిఉన్నవి. జగత్తను మహార్ణవంలో నక్షత్రసమూహా లను దీవు లున్నవి. వాటిని గెలాక్సీ లంటారు. ఒక్కొక్కదీవిలో సుమారు శత సహస్ర కోటి నక్షత్రము లున్నవి. ప్రతిదీవిలో ఉన్న నక్షత్ర ములు గురుత్వాకర్షణ బలబంధనములచే ఒక బృహ త్కూటముగా చేర్చబడ్డవి. కాని దీవులకు దీవులకు ఆకర్షణ మున్నట్లు కనిపించదు. ఈ గెలాక్సీ లన్యోన్యం గా విముఖములై ఆకాశార్ణవంలో చెదరిపోతున్నవి. అపరిమిత దూరములలో ఉన్న గెలాక్సీలు అత్యధిక దూరీకృతము లౌచున్నవి. జగదాకాశమునకు మేర లేనట్లు కనిపించినది. అట్టితరి, ఆకాశమునకు వక్రత్వ మారోపించి, భూతలంవలె ఆకాశముకూడ వక్రముగ నున్న దన్న భావమును పురస్కరించి ఆకాశము నియత (finite) మని, అపర్యంత (Unbounded) మని

జర్మనువిజ్ఞాని ఐన్‌స్టైను ఒక వాదమును ప్రతిపాదించేడు. గెలాక్సీల చెదరికచేత విశ్వము విస్తృతమౌచున్నప్పటికీ, ఆకాశమునకు పర్యంతములు లేవుగాన అది అనంతం గాదని వాదము. ఈ విధంగా జగత్తును భౌతికవిజ్ఞానం చిత్రించింది.

అధ్యాత్మజ్ఞానానుసారంగా సర్వవ్యాప్తమైన భగవచ్ఛక్తి యున్నది. భౌతికజ్ఞానానుగుణంగా సర్వవ్యాప్తమైన విద్యుదయస్కాంతశక్తియున్నది. విద్యుచ్ఛక్తిని మానవు డుత్పన్నంచేసి అనేకవిధముల ఉపయోగిస్తున్నాడు. కాంతి కావలసినప్పుడు విద్యుద్దీపాన్ని, గాలి కావలసినప్పుడు విద్యుద్వ్యజనమును, విశేషబలం కావలసినప్పుడు విద్యుదయస్కాంతమును (Electro - magnet), వేడి కావలసినచో విద్యుదుష్ణకారిని ఉపయోగిస్తున్నాము. విశ్వవ్యాప్తమైన భగవచ్ఛక్తిని గ్రహించు సాధనము మనసుకన్న వేరొండు లేదు. ఏ విధంగా ఆ శక్తియొక్క సాహాయ్యమును పొందుదామన్నా కేవల మనస్సంకల్ప బలంచేతనే పొందవలసియున్నది. దాని కేకాగ్రత నిరంతరాభ్యాసముకన్న ఇతరసాధనసంపత్తి లేదు. సమయోచితంగా అక్కరకు వచ్చునట్లు భౌతికశక్తిని మానవుని కందజేయు ఉపకరణము లనేకము లున్నవి. ఆత్మశక్తిని ఎవరిమట్టుకు వారే సంపాదించుకొనవలసింది గాని, తత్సంపాదనకు యుక్తమగు యంత్రములు, సాధనములు లేవు.

మానవుడు కామప్రేరితుడు. విద్య, ధనము, బలము మొదలగు వాంఛితార్థములను బడయుటకు నిత్య ప్రయత్నమొనరిస్తున్నప్పుడు సర్వవ్యాప్తమైన జగచ్ఛక్తి సాహాయ్య మభిలషింపక తప్పదు. భౌతికశక్తిని ఉపకరణములద్వారా వినియోగించుకొనుచున్నట్లు జగచ్ఛక్తిని విగ్రహములద్వారా ఉపయోగించుకొనుటకు ఆక్షేపణ ముండరాదు. మనోబలంచేతనే సంపాదించవలసినది జగచ్ఛక్తి. అందుకు సాధన మవసరము. సాధనకు ప్రథమసోపానము స్థూలలక్ష్యము. విగ్రహాన్ని లక్ష్యంగా నియమించుకొని తద్వారా జగచ్ఛక్తి నిష్టసిద్ధికై ఉపయోగించుకొనవచ్చును. విద్యుదుపకరణాలలో కాంతికి విద్యుద్దీపాన్ని ఎంచుకొనినట్లు జ్ఞానాభివృద్ధికి సరస్వతీలక్ష్యం ద్వారా జగచ్ఛక్తి నర్థించుటలో దోషంలేదు.

ఈ దృక్పథంలో చూచినప్పుడు విగ్రహప్రతిష్ఠయొక్క అంతరార్థం కొంత స్ఫురిస్తుంది. అతినిష్ఠతో జపంచేసి, ఆత్మశక్తి నుత్పన్నంచేసి దాని నొక మూర్తిలో గుప్తపరిచిన మహాత్ములు మానవకోటికి మహోపకారులు. ఎవరెవరి మనోబలాని కనుగుణంగా సామాన్యులు కృషిచేసి ఆ గుప్తశక్తిని స్వాభ్యుదయమునకై ఉపయోగించుకొనవచ్చును. యంత్రకళాభిజ్ఞులు వివిధ సూక్ష్మోపకరణములను సృజించి మానవుల కందజేసి సుఖజీవనం సులభసాధ్యంచేయుచున్నట్లు మహాత్ములు భగవచ్ఛక్తిని వివిధ విగ్రహముల మూలంగా సామాన్యుల కందజేయుచున్నారు.

ఏవిగ్రహాన్ని ఆరాధించినప్పటికైనను దానిని నిమిత్తమాత్రంగా భావించి జగద్వ్యాప్తమైన భగవచ్ఛక్తినే స్తుతించుచున్నట్లు గమనింపవచ్చును. ఏ స్తోత్రం విమర్శించినప్పటికిని ఆసత్యం విశదమౌతుంది. అగస్త్యమునికృత సరస్వతీస్తోత్రంలో ఈవిధంగా సరస్వతీదేవి స్తుతింపబడింది:

సరస్వతి నమస్తుభ్యం సర్వదేవి నమోనమః,
శాంతరూపే శశిధరే సర్వయోగే నమోనమః. ౧

నిత్యానందే నిరాధారే నిష్కళాయై నమోనమః,
విద్యాధారే విమలాయై శుద్ధజ్ఞానే నమోనమః. ౨

శుద్ధస్ఫటికరూపాయై సూక్ష్మరూపే నమోనమః,
శబ్దబ్రహ్మి చతుర్హస్తే సర్వసిద్ధ్యై నమోనమః. ౩

ముక్తాలంకృతసర్వాంగ్యై మూలాధారే నమోనమః,
మూలమంత్రస్వరూపాయై మూలశక్త్యై నమోనమః. ౪

మనోన్మణి మహాయోగే వాగీశ్వరి నమోనమః,
వాగ్భ్యై వరదహస్తాయై వరదాయై నమోనమః. ౫

వేదాయై వేదరూపాయై వేదాంతాయై నమోనమః,
గుణదోషవివర్జిన్యై గుణదీప్త్యై నమోనమః. ౬

సర్వజ్ఞానే సదానందే సర్వరూపే నమోనమః,
సంపన్నాయై కుమార్యైచ సర్వజ్ఞానే నమోనమః. ౭

రోగనాశిన్యై ఉమాదేవ్యై యోగానందే నమోనమః,
దివ్యజ్ఞానే త్రినేత్రాయై దివ్యమూర్త్యై నమోనమః. ౮

అర్ధచంద్రజటాధారి చంద్రబింబే నమోనమః,
చంద్రాదిత్యజటాధారి చంద్రబింబే నమోనమః. ౯

అణురూపే మహారూపే విశ్వరూపే నమోనమః,
అణిమాద్యష్టసిద్ధాయై ఆనందాయై నమో నమః. ౧౦

జ్ఞానవిజ్ఞానరూపాయై జ్ఞానమూర్త్యై నమోనమః,
నానాశాస్త్రస్వరూపాయై నానారూపే నమోనమః. ౧౧

పద్మదాపద్మవాసిన్యై పద్మరూపే నమోనమః,
పరమేష్ఠ్యై పరామూర్త్యై నమస్తే పాపనాశిని. ౧౨

మహాదేవ్యై మహాకాళ్యై మహాలక్ష్మ్యై నమోనమః,
బ్రహ్మవిష్ణుశివాయైచ బ్రహ్మనార్యై నమోనమః. ౧౩

కమలాసనపత్న్యైచ కామరూపే నమోనమః,
కపాలికర్మదీప్తాయై కర్మదాయై నమోనమః. ౧౪

దీని భావమేమి? 'అణురూపే, సూక్ష్మరూపే, మహారూపే, విశ్వరూపే, వేదాయై, వేదరూపాయై, వేదాంతాయై' మొదలగుపదములలో ఏదైనను ఒక వ్యక్తికి వర్తింపజాలవు. జగద్వ్యాప్తమైన మహాశక్తినే స్తుతించుచున్నట్లు స్పష్టము. విద్యాధిదేవతయగు సరస్వతిని ధ్యానించుచున్నప్పుడైనను వివిధావిర్భావములు గల జగచ్ఛక్తియే ధ్యానించబడుచున్నది. ఈవిషయం గుర్తించినప్పుడు విగ్రహారాధనయొక్క ఔచితి స్పష్టమౌతుంది.

కేవల భౌతిక విజ్ఞానదృష్టితో సృష్టి స్థితి లయ కారణమైన జగచ్ఛక్తి నూహించుకొన ప్రయత్నించినను, ఆ ప్రయత్నము క్రిందివిధంగా పరిణమించక తప్పదు:

అణువులో బ్రహ్మాండ మమరించి బ్రహ్మాండ
    మణువని చూపు మాయావినోద,
పలలక్షలుగనున్న తారకాగోళముల్
    చెడకుండ గారడీచేయువాడ,
పరమాణు గర్భస్థ బహుసూక్ష్మ కణములన్
    మించుగా త్రిప్పి క్రీడించువాడ,
అపరిమితాకాశమందు రవంతేని
    శూన్యములేకుండ చూచువాడ,
ద్రవ్యమున శక్తి, శక్తిలో ద్రవ్యఘటిత
ఆకసము కాలమున, కాల మాకసమున
ద్వైత మద్వైతమందు, అద్వైతసరణి
ద్వైతమున చూపు మాయలవాడ హౌర!

రచనలో కృతికర్త, చిత్రమున చిత్ర
కారుడును కానరారు నిక్కముగ, కాని
నీవు సృష్టించినట్టి విశ్వావయవము
లందు సర్వత్ర నీవె ప్రత్యక్షమౌదు!

సార్వత్రికాకర్ష శక్తియే సడలిన
    నక్షత్రసంఘర్షణము జనించు,
పరమాణు వాత్మగర్భము చీల్చుకొని వికా
    వికలౌచు క్షణములో భిన్నమగును,
గ్రహతారకాపరిభ్రమణంబులేకున్న
    కాలభావంబె వ్యర్థముగ దోచు,
విద్యుదయస్కాంతవీచీ ప్రవాహమ్ము
    లేకున్న విశ్వమే లేకపోవు,
వనుచు నీశక్తి వర్ణించుకొనినయపుడు
నిన్నెఱుగ నెంచి, యూహించునెరవు లేక
తల్లడిల్లుదు నయ్య నితాంత మేను,
శక్తివో? ద్రవ్యమువో? నీవు స్పందమౌదో!

ప్రకటన

ఈ క్రిందకనబరచిన నెంబర్ల వారికి ఈనెల (1943 సం. జనవరినెల) తో ఇదివరకు "భారతి"కి, చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈ నెలాఖరులోగా మనియార్డరుచేయ గోరెదము. ఇకమీాద వి. పి. లను పంపుట మానివేసినాము. కనుక సదరు చందాదారులనుండి మరుసటినెల 6-వ తేదీలోగా మా కార్యాలయమునకు చందాధనము చేరకున్న పత్రికపంపుట నిల్పివేయ వలసి వచ్చునని మనవిచేస్తున్నాము.

C 7, D 7, G 9, H 50, 63, 87, K 9, N 13, P 27, 29, 30, 31, 37, 38, S 96, 97, V 21, Y 8.

మేనేజరు
"భారతి"

మైనారిటీసంఘముల సమస్య-పాకిస్థానము

3

= శ్రీ ఆచంట సూర్యనారాయణమూర్తి =

మద్రాసు, బొంబాయి, ఒరిస్సా, మధ్యరాష్ట్రములు, బీహారు, సంయుక్తరాష్ట్రములు, వాయవ్యసరిహద్దురాష్ట్రములందు కాంగ్రెసువారు స్వచ్ఛమైన కాంగ్రెసుపార్టీ ప్రభుత్వములను నెలకొల్పిరి. ముస్లింలీగువారితో సంధి కుదుర్చుకొనవలెనని యెన్ని ప్రయత్నములు చేసినను ఉపయోగము లేకపోయినది. ఈసంధిప్రయత్నములు విఫలములగుటకు అనేక కారణములు గలవు.

పార్లమెంటరీ పద్ధతి

కాంగ్రెసువారు శాసనసభలయందలి తమ బలమును జూచుకొని పార్లమెంటరీపద్ధతినే తూచాలు తప్పకుండ భారతదేశమున అనుకరింప సమకట్టిరి. పార్లమెంటరీపద్ధతి ననుసరించి శాసనసభయం దెక్కువ బలముగల పక్షమువారు ప్రభుత్వము నేర్పరతురు. శాసనసభయందలి ఎక్కువమంది సభ్యుల విశ్వాసము వారియెడ నుండునంతకాలము వారు మంత్రిత్వమును సాగింతురు. ఏరోజున వారిబలము తగ్గనో, ఆరోజు నుండి వారు ప్రభుత్వమును చాలింతురు. ఈపద్ధతి ఇంగ్లండు దేశమున చిరకాలమునుండి నడచుచున్నది. ఇట్టిపద్ధతి ననుసరించి జయప్రదముగా ప్రభుత్వము సాగింపబడుటకు నిర్దిష్ట రాజకీయపక్షము లుండవలెను. ఇంగ్లండు దేశమున ఇట్టి పక్షములు గలవు. అన్ని పక్షములవారికిని మాతృదేశాభిమానము, దాని ఐక్యత, దాని పురోభివృద్ధి గాగల ముఖ్యసూత్రముల యెడ ఏకాభిప్రాయము గలదు. వారివారి కార్యక్రమ విధానములందు మాత్రము భేదములు గలవు. అందరి అంత్య ఆశయముమాత్రము ఒకటియే. ఇట్టి రాజకీయ పక్షము లుండుటచే పార్లమెంటరీపద్ధతిప్రభుత్వము ఇంగ్లండునందు చక్కగా జరుగుచున్నది. భారతదేశమున కాంగ్రెసు, మితవాదులు (నేషనల్ లిబరల్ ఫెడరేషను) తప్ప మిగిలినవా రందరును మతముల ననుసరించి పక్షముల నేర్పరచిరి. ఇట్టి పరిస్థితులుగల దేశమునందు పార్లమెంటరీపద్ధతినే చాదస్తముగా అనుకరించి, స్వచ్ఛమైన కాంగ్రెసుపార్టీ ప్రభుత్వములను ప్రారంభించుట కాంగ్రెసువారు కావించిన పొరపాటని కొందరు రాజకీయవేత్తలు తలపోయుచున్నారు. పైగా భారతీయ-ఎన్నికలోకమున ప్రత్యేక నియోజకవర్గము లున్నవి. ప్రత్యేక నియోజకవర్గములు ఆయా సంఘముల ప్రత్యేకతను పోషించుట కేర్పరుపబడినవి. అవి సాంఘిక ఐక్యతకు విరుద్ధములు. ఐనను, ఆ విధానమును లక్నో సంధియందు కాంగ్రెసువారే అంగీకరించియుండుటచే, ఆయాసంఘముల ప్రత్యేకతను వారు గుర్తించియుండినట్లు తేటతెల్లమగుచున్నది. ప్రత్యేక నియోజకవర్గవిధాన మున్నచోట పార్లమెంటరీపద్ధతి సాగుట కష్టము. ఎన్నికలందు మాత్రమే ప్రత్యేకత నొసగినంతమాత్రమున సంతోషించునంతటి తెలివితక్కువవా రెవరును ఉండరు. ఎన్నికలను గావించుట ప్రభుత్వమునందు పాలును గైకొనుటకేకదా! అధికారము చేజిక్కినవెనుక ముస్లింలీగుతో సమష్టిమంత్రివర్గములను ప్రారంభింపని కాంగ్రెసుపట్ల ముస్లింలీగువారికి విరోధము పెరిగినది. ప్రత్యేక నియోజకవర్గము ఎన్నికవిధానమునం దున్నప్పుడు సమష్టిమంత్రివర్గము ప్రభుత్వవిధానమునం దుండితీరవలెనని వారి వాదము. సమష్టిమంత్రివర్గములు పార్లమెంటరీపద్ధతికి విరుద్ధములు. అయినను దేశమునందలి క్లిష్టపరిస్థితుల ననుసరించి నడచుకొనుట ఉత్తమము. పార్లమెంటరీపద్ధతికి పుట్టినిల్లగు ఇంగ్లండునందుకూడ

అవసరమునుబట్టి ౧౯౧౫, ౧౯౩౧, ౧౯౪౦ సం.లలో సమష్టిమంత్రివర్గము లేర్పరుపబడినవి. ఇంతకును మనకు ప్రధానమైనది ప్రజాస్వామ్యము గాని ప్రజాస్వామ్యమునందలి ఒక విధానము కాదు. పార్లమెంటరీపద్ధతియే ప్రజాస్వామ్యమున కధిష్ఠానదేవత గాదు. పార్లమెంటరీపద్ధతి కాని ప్రజాస్వామ్యములు ప్రపంచకమున అనేకములుగలవు. చిన్న దేశమగు స్విడ్జర్లండు అనేకవిషయములలో మనదేశమును బోలియున్నది. ఆదేశమున అనేకములగు మైనారిటీసంఘములు గలవు. అచ్చట పార్లమెంటరీపద్ధతి రాజ్యాంగవిధానము లేదు. సమష్టిమంత్రివర్గములు గలవు. స్విడ్జర్లండు రాజకీయవిధానము నట్లే మనదేశమున అనుకరించుటకు వలనుపడదు. పడకపోయినను కొన్ని సంగతుల నాదేశ రాజ్యాంగనిర్మాణచరిత్రమునుండి గ్రహించుట ఉత్తమము. సమష్టిమంత్రివర్గముల నొల్లకపోవుటయేకాక, తమపక్షములో జేరిన మహమ్మదీయులకే మంత్రివర్గములందు స్థానముల నొసగెదమని కాంగ్రెసువారనిరి. ఇది కేవలము విరుద్ధమగు చర్య కాకపోయినను, ముస్లింలీగును తత్ప్రయత్నముద్వారా నిర్మూలించి, నిజపక్షమును బలపరచుకొన కాంగ్రెసువారు యత్నించుచున్నట్లు ముస్లింలీగువారు శంకించిరి.

కాంగ్రెసువారు ఎన్నికలలో పాల్గొనినను, శాసనసభలయందు ప్రవేశించినను, మంత్రిపదవుల నంగీకరించినను వారు బ్రిటిషుప్రభుత్వమువారితో భారతదేశస్వాతంత్ర్యసంపాదనకై గావించుచున్న పోరాటమునందలి వివిధఘట్టములుగా నెరుగవలెనని ప్రకటించిరి. ముస్లింలీగువారు ఈ వాదము నంగీకరించలేదు. కాంగ్రెసువారు ఎన్నికలలో విజయము నొంది నిజముగా ప్రభుత్వముకొరకే ప్రభుత్వమును సాగించుచుండిరని ముస్లింలీగువారు తలపోసిరి. ఆ ప్రభుత్వమున తమకు తావు లేదు కదా అని వాపోయిరి. మంత్రిపదవుల నంగీకరించుటగూడ బ్రిటిషు ప్రభుత్వముతో సల్పుచున్న పోరాటమునందలి ఒక వ్యూహముగ కాంగ్రెసువారు తలపోయుటచే, సాధ్యమైనంతవరకు సంఘీభావము గల బాధ్యతాయుత మంత్రివర్గములనే కాంగ్రెసువారు తాము ఎన్నికలందు విజయము గాంచిన రాష్ట్రములందు నెలకొల్పిరి.

జిన్నాసాహెబు విజృంభణ

భారతీయ ప్రజాసముదాయమునకు హిందువులైనను, మహమ్మదీయులైనను రాజకీయ ఆర్థికసమస్యలొక్కటే గావున ఆర్థిక కార్యక్రమముద్వారా మహమ్మదీయ జనబాహుళ్యముతో సంపర్కమేర్పరచుకొని, కాంగ్రెసు పక్షముపట్ల విశేషముగా మహమ్మదీయులకు అభిమానము గలుగునట్లు చేయవలెనని కాంగ్రెసువారు (Muslim mass contact) ప్రయత్నములను ప్రారంభించిరి. ఇప్పటికి దాదాపు ౩౦ సం.ల నుండి ప్రత్యేక నియోజకవర్గ విధానము వలన ఎడబాటు నొందిన మహమ్మదీయ ప్రజల నొక్కసారిగా కాంగ్రెసుపక్షమున కాకర్షింప ప్రయత్నించుట సాహసము. ఈ నూతనోద్యమము ముస్లింలీగువారిని రేకెత్తించినది. ఒక్కపెట్టున, జిన్నాసాహెబు విజృంభించి, 'అల్లాహో అక్బర్' అని భేరీ మ్రోగించి, మలబారుకొండనువీడి బొంబాయి బజారులలోనికి దుమికెను. ఎన్నడును మసీదనిన నెట్టిదో యెరుగని జిన్నాసాహెబు రోజున కైదుసార్లు మసీదునకు పోవుట ప్రారంభించెను. పల్లెటూరి మహమ్మదీయుని సలామునైనను అందుకొనని జిన్నాగారు మహమ్మదీయ పల్లెలకుబోయి తోడిమహమ్మదీయులతో చెట్టాపట్టాలు వైచుకొని కలసి మెలసి తిరుగ ప్రారంభించెను. జిన్నాసాహెబుపై మహమ్మదీయుల కత్యంతమగు అభిమానము చేకూరెను. మహమ్మదీయసంఘమున జిన్నాసాహెబు పలుకుబడి పెరిగెను. తన పలుకుబడి నభివృద్ధిచేసుకొనుట కాతడు మహమ్మదీయమతాభిమానమును పురికొల్పెను. తన పలుకుబడిని రూపుమాప ప్రయత్నించిన కాంగ్రెసుపై జిన్నాకు విరోధము ప్రబలెను. మహమ్మదీయ జనబాహుళ్యసంపర్కోద్యమసందర్భమున జరిగిన పోటీయందు కాంగ్రెసుకంటె ముస్లింలీగువారికి ఎక్కువ విజయము చేకూరెను. విజయము చేకూరుటయేకాక ముస్లింలీగుకు ప్రత్యేకబలము ప్రాప్తించి, మహమ్మదీయనాయకత్వముగూడ సంప్రాప్తించెను.

విద్యాగంధములేని ప్రజలకు ఓటునిచ్చు అధికారమువలన గలుగు దోషములన్నియు భారతదేశమున కలిగినవి. ౧౯౦౯-వ సం. న ఏ స్వల్ప ప్రజలో ఎన్నికలందు పాల్గొనిరి. ఎన్నికలవలన — అందును ప్రత్యేక నియోజకవర్గములు గల ఎన్నికల వలన—గలుగు ముప్పు లంతగా వ్యాపింపలేదు. ౧౯౧౯-వ సం. న ౩౦ లక్షల ప్రజలకు వోటునిచ్చు అధికార మేర్పడినది. అంతవరకు ను ఏ పాప మెరుగని ప్రజలు, వోటు నిచ్చుటకు వచ్చి తాము వివిధ మతస్థులమని గుర్తించిరి. ప్రత్యేక నియోజక వర్గములున్నచోట సంఘీభావ మేర్పడుట సర్వకల్ల. ౧౯౩౭-వ సం.న ౩ కోట్ల ౫౦ లక్షలకు పైగా ప్రజలకు వోటునిచ్చుహక్కు ప్రాప్తించినది. ఇంతమంది ప్రజలకు మత శాఖా భావము లేర్పడిన వన్నమాట. ఇది ప్రత్యేక నియోజకవర్గ విధానమునగల తీరని ముప్పు.

౧౯౩౭-వ సం. జూలై నెల లగాయతు ౧౯౩౯-వ సం. అక్టోబరు నెలవరకు కాంగ్రెసువారు, పైన పేర్కొనిన ఏడు రాష్ట్రములందును, కొంతకాలము అస్సాము సింధురాష్ట్రములందు సమష్టిప్రభుత్వములను సాగించిరి. పంజాబు, బెంగాలు రాష్ట్రములందు తప్ప మిగిలిన దేశమందంతటను కాంగ్రెసువారిపలుకుబడి, ప్రతిష్ఠ అధికమైనవి. దేశమందు వారి అధికారము ప్రబలెను. దేశాభ్యుదయమున కనువగు అనేక సంస్కరణములను వారు గావించిరి. మైనారిటీసంఘములవారి ప్రత్యేక హక్కులయెడ వారు ప్రత్యేకాదరాభిమానములను జూపిరి. కాని ముస్లింలీగువారికి మాత్రము కన్నెఱ్ఱగా నుండెను. తమకు రాజ్యపరిపాలనయందు భాగము లేదు కదా యని వారు కించ నొందిరి. తమకు మేలు చేయు ప్రభుత్వముండినంతమాత్రమున వారు తృప్తి నొందలేదు. ప్రభుత్వమునందే తమకు భాగము కావలెనని కోరిరి. ఈ కోరిక నింత స్పష్టముగా పైకి చెప్పక, కాంగ్రెసువారు మహమ్మదీయులయెడ దురంతములను గావించుచుండిరని ప్రచారము చేయ ప్రారంభించిరి. కాంగ్రెసు మంత్రివర్గములందు మహమ్మదీయులు లేకపోలేదు. కాని వారందరును కాంగ్రెసుపార్టీయందు చేరిన మహమ్మదీయులేగాని మహమ్మదీయులకే ప్రతినిధులగు మహమ్మదీయులు కారు.

ఇంతలో రెండవ ప్రపంచ సంగ్రామము ప్రారంభమైనది. రాష్ట్రీయప్రభుత్వములతో సంప్రదింపకయే కేంద్రప్రభుత్వమువారు భారతదేశమును యుద్ధమునందు పాల్గొనునట్లు చేయుటచే కేంద్ర ప్రభుత్వ నిరంకుశచర్యపై తమ నిరసనభావమును ప్రకటించుచు అన్ని రాష్ట్రములయందలి కాంగ్రెసువారును తమ తమ పదవులకు రాజీనామా నొసగిరి.

‘పిరుపూరు నివేదిక’

కాంగ్రెసువారు రాజీనామాల నొసగిన మరునాడే ముస్లింలీగువారు ‘బంధవిముక్తిదినోత్సవ’ములను దేశమందంతటను జరిపిరి. ఇక ముందు ముస్లిం లీగును ఉపేక్షించి బ్రిటిషుప్రభుత్వమువారుగాని, కాంగ్రెసు పార్టీవారుగాని మంత్రివర్గములను స్థాపించకుండుటకై ముస్లింలీగువారు తీవ్రాందోళనమును ప్రారంభించిరి. కాంగ్రెసుప్రభుత్వసమయమున మహమ్మదీయులకు గలిగిన దురన్యాయములను నిశోధించుటకు ఒక కమిటీని నియమించిరి. ఆకమిటీవారు ఉన్నవీ లేనివీ చేర్చి ఒక నివేదికను ప్రకటించిరి. దీనినే ‘పిరుపూరు నివేదిక’ యందురు. ఇందలివిషయములు సత్యదూరములు. ఆయా రాష్ట్రముల గవర్నరు పదవుల నలంకరించిన ఆంగ్లేయ మహాశయులు పలువురు కాంగ్రెసుమంత్రివర్గములవారు నిష్పక్షపాతబుద్ధితో ప్రభుత్వములను సాగించిరని ప్రకటించిరి. పిరుపూరునివేదికయొక్క ప్రధానాశయము వేరు. సత్యములగు దురాచారములను ప్రకటించి, తమ మైనారిటీహక్కులను రక్షించుకొనుట ముస్లింలీగువారి కర్తవ్య మెప్పుడును గాదు. ఈ లేనిపోనినిందను కాంగ్రెసునందు మోపి మహమ్మదీయులకు కాంగ్రెసుపట్ల అభిమానము లేకుండజేయుటయే వారి కర్తవ్యము.

పాకిస్థాన్ తీర్మానము

అంతటితో వాగక, తనమాట దేశమందంతటను ప్రతిధ్వనింపజేయుటకును, తన స్వరూపమును ప్రపంచమంతయు వీక్షించుటకును ౧౯౪౦-వ సం. మార్చి ౨౩-వ తేదీని లాహోరునగరమున ముస్లింలీగు ఎలుగెత్తి స్వయంనిర్ణయసూత్రము నాధారముగా గైకొని పాకిస్థాన్ తీర్మానమును గావించినది. “భావిభారత

రాజ్యాంగ నిర్మాణవిధానము ఈదిగువ నుదాహరించిన సిద్ధాంతము ననుకరింపనిదే మహమ్మదీయుల కంగీకారముకాదు. భారతదేశమున, వాయవ్య ప్రాచ్య ప్రాంతములవలె, మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగా గల సైసర్గిక సంయుక్త భాగములు వేరుగా విభజింపబడి, 'స్వతంత్ర రాష్ట్రములు'గా చేర్చబడవలెను. అట్టి స్వతంత్రరాష్ట్ర నిర్మాణభాగములు రాష్ట్రస్వాతంత్ర్యమును, ప్రభుత్వాధికారములను గలిగి యుండవలెను." ఈతీర్మానమునం దుపయోగింపబడిన భాష స్పష్టముగాలేదు. ఇది కేరొక మహమ్మదీయ రాష్ట్రముల ఫెడరేషనును భారతదేశమున నెలకొల్ప నుద్దేశించుచున్నట్లు కన్పట్టుచున్నది. వారు ప్రత్యేక స్వతంత్ర మహమ్మదీయరాష్ట్రములను గోరుచున్నారో, ప్రత్యేక మహమ్మదీయరాష్ట్రముల ఫెడరేషనును గోరుచున్నారో ఇదమిత్థముగా ముస్లింలీగువారు నిర్వచింపలేకుండిరి.

పాకిస్థానువిధాన విమర్శనము

మహమ్మదీయ మైనారిటీ సంఘసమస్య పరిష్కారమే పాకిస్థానముయొక్క ముఖ్యోద్దేశమగుచో ఆ ఆశయము నెరవేరుట దుర్లభము. మహమ్మదీయులు భారతదేశమున ఆసేతుహిమాచలమువరకు వ్యాపించియుండిరి. తూర్పు, పశ్చిమ, వాయవ్యభాగములందు అధికసంఖ్యాకులగు మహమ్మదీయులుగల రాష్ట్రములకు సంపూర్ణ స్వాతంత్ర్యము నొసగి, ప్రత్యేక ఫెడరేషనుగా చేర్పరచినంతమాత్రమున, దేశమందంతటను గల మహమ్మదీయ మైనారిటీ సంఘసమస్య పరిష్కరింపబడదు. స్వదేశసంస్థానములమాట నటుండనిచ్చి ప్రత్యేకముగా బ్రిటిషుఇండియా రాష్ట్రములనే పరికించినచో వివిధభాగములందు వారిసంఖ్య యీదిగువ నుదాహరించినరీతిని గలదు:

రాష్ట్రము		జనసంఖ్యయందలి మహమ్మదీయులవంతు-నూటికి :
అజ్మీరు-మేర్వారా	...	౧౭.౩
అస్సాము	...	౩౧.౪
బెలూచిస్థానము	...	౮౭.౦
బెంగాలు	...	౫౪.౧
బీహారు	...	౧౨.౦
ఒరిస్సా	...	౧.౯
ఛోటానాగపూరు	...	౬.౧
బొంబాయి	...	౮.౩
మధ్యరాష్ట్రములు	...	౩.౮
కూర్గు	...	౬.౧
ఢిల్లీ	...	౩౩.౦
మద్రాసు	...	౬.౨
వాయవ్యపరిహద్దు	...	౯౫.౮
పంజాబు	...	౫౬.౫
సింధు	...	౭౩.౭
సంయుక్తరాష్ట్రములు	...	౧౭.౧

ఏరాష్ట్రమునందును పూర్తిగా మహమ్మదీయులే లేరు. దేశము మొత్తముమీద మహమ్మదీయులు అల్పసంఖ్యాకులైనను కొన్నిరాష్ట్రములందు వారే అధికసంఖ్యాకులు. ఆరాష్ట్రములందు హిందువులు, సిక్కులు మొదలుగాగలవారు అల్పసంఖ్యాకులు. పాకిస్థాను ప్రణాళిక ననుసరించి భారతదేశమున గల తూర్పు, పశ్చిమ, వాయవ్య మహమ్మదీయరాష్ట్రములకు స్వాతంత్ర్యము ప్రాప్తించినను అచ్చటి మైనారిటీసంఘముల సమస్య పరిష్కరింపబడదని తేటతెల్లమగుచున్నది.

మహమ్మదీయు లెక్కువగానున్న రాష్ట్రములందలి హిందువులును, హిందువు లెక్కువగానున్న రాష్ట్రములందలి మహమ్మదీయులును విడిపోయి, మూటా ముల్లె కట్టుకుని, తారుమారుగా మకాములను మార్చుకొనవలెనన్నను సులభముకాదు. తరతరముల నుండి ఆయాచోట్లలో పుట్టిపెరిగి నివాసముల నేర్పరచుకొని నివసించుచున్న ప్రజలు ఈపద్ధతి నంగీకరించుట అసంభవము. మలబారు మహమ్మదీయుడు పంజాబుప్రాంతమునకు మారినచో, పంజాబీభాష రాని మూలమున దమిక్కడికైనను మారడు. పంజాబు హిందువు పంజాబురాష్ట్రమును వీడి మహారాష్ట్ర ప్రాంతమున నివాసము నేర్పరచుకొనిన ఆభాష నెరుగమిచే బాధలకు లోనగును. హిందువులును,

మహమ్మదీయులును వేరువేరుభాషలను మాట్లాడుటచే వారు విడిపోయి స్వతంత్ర రాష్ట్రముల నేర్పరచుకొనవలెననుటకు తావులేదు. పంజాబు రాష్ట్రమునందున్న హిందువులు, మహమ్మదీయులు, సిక్కులుగూడ పంజాబీభాషనే మాట్లాడుదురు. బెంగాలునందలి హిందువులు, మహమ్మదీయులుగూడ బెంగాలీభాషనే మాట్లాడుదురు. వాయవ్య పరిహద్దురాష్ట్రములందలి హిందువులు, మహమ్మదీయులుగూడ పష్తోభాషనే మాట్లాడుదురు. ఇట్లే వివిధ ప్రాంతములందలి ప్రజలు వేరు వేరు మతస్థులైనను ఆయా రాష్ట్రభాషలనే మాట్లాడుదురు. ప్రస్తుతము అమలులోనున్న రాష్ట్రములు ఒక సిద్ధాంతము ననుసరించి కాక కేవలము ప్రభుత్వ సదుపాయముల ననుసరించి మాత్రమే యేర్పరుప బడినవి. కాని కాంగ్రెసు సంస్థా నిర్మాణమున మాత్రము రాష్ట్రములు భాషననుసరించి పాటింపబడుచున్నవి. భాషాప్రయుక్త రాష్ట్రద్వయమును కాంగ్రెసువారే తొలుత ప్రతిపాదించిరి. వాని నిందు పేర్కొనెదను.

రాష్ట్రము	భాష	రాజధాని
అజ్మీరు - మేర్వారా	హిందూస్థానీ	అజ్మీరు
ఆంధ్ర	తెలుగు	మద్రాసు
అస్సాము	అస్సామీ	గౌహతి
బీహారు	హిందూస్థానీ	పాట్నా
బెంగాలు	బెంగాలీ	కలకత్తా
బొంబాయి (పట్నము)	మహారాష్ట్రము, గుజరాతీ	బొంబాయి
ఢిల్లీ	హిందూస్థానీ	ఢిల్లీ
గుజరాత్	గుజరాతీ	అహమదాబాదు
కర్నాటక	కన్నడము	ధార్వారు
కేరళ	మలయాళము	కల్లికోట
మహాకోసల	హిందూస్థానీ	జబ్బలపూరు
మహారాష్ట్ర	మహారాష్ట్రము	పూనా
నాగపూరు	మహారాష్ట్రము	నాగపూరు
వాయవ్యపరిహద్దు	పష్తో	పిషావరు
పంజాబు	పంజాబీ	లాహోరు
సింధు	సింధి	కరాచి
తమిళనాడు	తమిళము	మద్రాసు
సంయుక్త	హిందూస్థానీ	లక్నో
ఉత్కళ	ఓఢ్రము	కటక్
విదర్భ (బీరార్)	మహారాష్ట్రము	అకోలా

భారతదేశమును మతములను బట్టి రాష్ట్రములుగా భాగించుట అసంభవము. ఏచోటునను ఒకే మతస్థులు లేరు. ముస్లింలీగువారు తాము పట్టిన కుందేలునకు మూడేకాళ్లని గట్టిగా పట్టుపట్టినచో సాధ్యమయినంతవరకు ఒకే మతస్థులుండు రాష్ట్రముల నేర్పరచుటకు ప్రయత్నింపవగును. సాధ్యమయినంతవరకు మాత్రమే, పూర్తిగా ఒకే మతస్థులుండు రాష్ట్రముల నేర్పరచుట దుస్సాధ్యమని పదేపదే చెప్పుట పునరుక్తియగును. సాధ్యమయినంత వరకు ఒకే మతస్థులుండు రాష్ట్రముల నేర్పరుప దలచినచో పంజాబు, బెంగాలు రాష్ట్రములను ఒక్కొక్కదానిని రెండింటిక్రింద భాగింపవలసియుండును. ఈ విషయము బెంగాలు పంజాబు రాష్ట్రముల జనాభా సంగతులను పరిశీలించినచో బోధపడును.

[పంజాబు]

నూటికి ౫౦ కంటె ఎక్కువగా మహమ్మదీయులుగల జిల్లాలు.		జిల్లా జనసంఖ్యయందు నూటికి మహమ్మదీయుల వంతు.
లాహోరు	...	౫౯.౯
స్యాల్‌కోట్	...	౬౨.౧
గుజరాన్‌వాలా	...	౭౦.౭
షేఖ్‌పూర్	...	౮౪.౮
గుజరాత్	...	౬౩.౭
షాపూర్	...	౮౨.౮
ఝీలమ్	...	౮౯.౦
రావల్‌పిండి	...	౮౫.౮
అటక్	...	౯౧.౦
మియానువాలి	...	౮౭.౦
మాంటొగొమరి	...	౬౯.౧
లాయల్‌పూర్	...	౬౨.౫
ఝంగ్	...	౮౩.౧
ముజఫర్ ఘుడ్	...	౮౬.౫

డేరాఘాజీఖాన్	...	౮౬.౧
బిలోచ్ సరిహద్దు	...	౯౯.౯
ముల్తాన్	...	౮౦.౨

నూటికి ౫౦ కంటె తక్కువగా మహమ్మదీయులుగల జిల్లాలు		జిల్లాజనసంఖ్యయందు నూటికి మహమ్మదీయుల వంతు
హిస్సార్	...	౨౭.౬
రోహతక్	...	౧౭.౧
గుడ్‌గాంవ్	...	౩౨.౧
కర్నాల్	...	౩౦.౫
అంబాలా	...	౩౦.౬
సిమ్లా	...	౧౫.౮
కాంగ్రా	...	౫.౦
హోషియార్పూర్	...	౩౨.౮
జాలంధర్	...	౪౪.౩
లూధియానా	...	౩౫.౧
ఫిరోజపూర్	...	౪౪.౮
అమృతసర్	...	౪౬.౯
గురుదాస్‌పూర్	...	౫౦.౦

పంజాబునందలి ముప్పై జిల్లాలలోను ౧౭ జిల్లాలందు నూటికి సగముపైగా మహమ్మదీయులు గలరు. ఈజిల్లాలను చేర్చి మహమ్మదీయు లెక్కువగానుండు ఒక రాష్ట్రముగా చేయనగును. మిగిలిన ౧౩ జిల్లాలలోను మహమ్మదీయుల సంఖ్య నూటికి సగముకంటె తక్కువగా గలదు. ఈజిల్లా లన్నిటిని వేరొక రాష్ట్రముగా చేయనగును.

[బెంగాలు]

నూటికి ౫౦ కంటె ఎక్కువ మహమ్మదీయులు గల జిల్లాలు.		జిల్లా జనసంఖ్యయందు నూటికి మహమ్మదీయులవంతు.
నాడియా	...	౬౧.౬
ముర్షిదాబాదు	...	౫౫.౫
జెస్సోర్	...	౬౨.౦
రాజషాహి	...	౭౫.౭
రంగపూర్	...	౭౧.౦
బోగ్రా	...	౮౩.౫
పబ్నా	...	౭౬.౯
మాల్దా	...	౫౪.౨
ఢాకా	...	౬౯.౮
మయమన్‌సింగు	...	౭౬.౬
ఫరీద్‌పూర్	...	౬౫.౧
బాకర్‌గంజ్	...	౭౨.౪
టిప్ర	...	౭౬.౦
నోవాఖలి	...	౭౬.౫
చిటగాంగ్	...	౭౬.౭

నూటికి ౫౦ కంటె తక్కువ మహమ్మదీయులుగల జిల్లాలు		జిల్లాజనసంఖ్యయందు నూటికి మహమ్మదీయుల వంతు
బర్ద్వాన్	...	౧౮.౯
బీర్ భూమి	...	౨౬.౬
బాకూడ్రా	...	౪.౭
మిడ్నపూర్	...	౭.౫
హూగ్లి	...	౧౭.౦
హౌరా	...	౨౧. ౧
హౌరాపట్నము	...	౨౧. ౩
౨౪ పరగణాలు	...	౩౪. ౬
ఢాకా పట్నము	...	౪౧. ౩
కలకత్తా	...	౨౫. ౯
కలకత్తాపల్లెలు	...	౧౯. ౦
ఖుల్నా	...	౪౯. ౩
జల్‌పాయిగురి	...	౨౩. ౯
డార్జిలింగు	...	౨. ౫
డినాజ్‌పూర్	...	౫౦. ౫

బెంగాలులోని ముప్పై జిల్లాలలోను ౧౫ జిల్లాలయందు మహమ్మదీయులు ఎక్కువగాను, ౧౫ జిల్లాలయందు తక్కువగాను గలరు. బెంగాలునుగూడ రెండు భాగములుగా భాగింపనగును.

పంజాబు, బెంగాలు రాష్ట్రముల విభజనమునకు ముస్లింలీగువారు అంగీకరింతురను నమ్మకము లేదు. ఒకవేళ వారు అంగీకరించి, పంజాబు,బెంగాలురాష్ట్ర

ములను చీల్చి చిన్నచిన్న రాష్ట్రములుగా జేసినను ఆచీలికలందుగూడ-మహమ్మదీయు లెక్కువగా నుండు రాష్ట్రములందు హిందువులు, హిందువు లెక్కువగా నుండు రాష్ట్రములందు మహమ్మదీయులు నుండుట తప్పక పోవుటచే తిరిగి ఆ చీలికలందుగూడ మైనారిటీసంఘముల సమస్య యథాప్రకారమే యుండును. చీలి పోవుటచే మైనారిటీసంఘములవారు సన్నగిలి బలహీనులుగామాత్రము మారుదురు. పాకిస్థాను సిద్ధాంతమును ప్రయోగింపదలచిన యీరాష్ట్రములందే యీ సమస్య పరిష్కరింపబడనప్పుడు మిగిలిన రాష్ట్రములందలి సమస్య విషయమునుగూర్చి వేరే వ్రాయ నవసరము లేదు. తూర్పు పశ్చిమ వాయవ్య రాష్ట్రములకు స్వాతంత్ర్యము ప్రాప్తించినంత మాత్రమున మిగిలిన రాష్ట్రములలోని మహమ్మదీయసమస్య సమసిపోదు.

మహమ్మదీయులధికముగాగల రాష్ట్రములందుండు హిందువులను హిందువు లధికముగా నుండు రాష్ట్రములందుండెడి మహమ్మదీయుల హక్కుల రక్షణమునకు తాకట్టుగా నుపయోగింపవలెనని మహమ్మదీయ రాజకీయవేత్తలు తెలియపరిచిరి. మహమ్మదీయ రాష్ట్రములందున్న హిందువులకు కష్టములు ప్రాప్తించునను భయముచే హిందూ రాష్ట్రములలోనున్న మహమ్మదీయులను అచ్చటి హిందువులు గౌరవింపవలెను. ఒక రాష్ట్రమునందుగల మైనారిటీసంఘమువారు వేరొక రాష్ట్రమునందున్న మైనారిటీసంఘమువారి రక్షణకొరకై ఖైదీలుగా నుపయోగింపబడుదు రన్నమాట. వెనుక సింధురాష్ట్రమును బొంబాయిరాష్ట్రమునుండి విడదీసి ప్రత్యేకగవర్నరు రాష్ట్రముగను, వాయవ్య పరిహద్దు రాష్ట్రములను గవర్నరు రాష్ట్రములుగను జేయవలెనని మహమ్మదీయనాయకులు గావించిన ఆందోళనము యొక్క ముఖ్యోద్దేశముగూడ ఇదే. ఈ సూత్రమును పలువురు మహమ్మదీయనాయకులు నిర్మొగమాటముగా ప్రకటించిరి. ఇది కడు క్రూరమగు సూత్రము. ఒకరి తప్పులకు మరొకరిని బాధ్యులుగా జేయుట తోడేలు మేకపిల్లను జేసిన మోస్తరగును. పాకిస్థానవిధానమునందుగూడ ఈ సూత్రము ఇమిడియున్నట్లు తోచుచున్నది. వివిధరాష్ట్రములకు సంపూర్ణస్వాతంత్ర్యము చేకూరిన ఈ సూత్రము బలము నొందును. పైగా రాష్ట్రములకు సమన్వయము కలుగజేయు కేంద్రము లేనిచో, ఈ సూత్రమునందలి క్రూరత్వము హెచ్చుపెరుగుట కవకాశ మున్నది. ఇది అమానుష సూత్రము. నాగరికతకు విరుద్ధము. ఈ అభిప్రాయమును పూర్తిగా మార్చుకొనినగాని అంతర్వైమనస్యములు సమసిపోవు.

హిందువులును, మహమ్మదీయులును ఒకజాతివారు కారనియు, ఎన్నడును కలసిమెలసి యుండలేదనియు జిన్నాగారు చేయుచున్న ప్రచారము సత్యదూరమైనదని చరిత్ర చాటుచున్నది. హిందువులును, మహమ్మదీయులును వేరువేరు మతస్థులైనను ఒకేజాతికి చెందినవారు. పలువురు మహమ్మదీయులు ఒకానొకప్పుడు హిందువులు. కారణాంతరములచే మహమ్మదీయ మతమును స్వీకరించిరి. నేటికిని పలువురు మహమ్మదీయులు హిందూ ఆచారములనే పాటించుచున్నారు. మతమును మార్చుకొనినంతమాత్రమున జాతి మారదు. మహమ్మదీయులు భారతదేశమునే మాతృభూమిగా జేసికొనిన దాదిగా హిందువులు మహమ్మదీయులతో కలసిమెలసి ప్రవర్తించుచుండిరి. మొగలాయీలకాలమున ఈ కలయిక పేరుగన్నది. మొగలాయిసమ్రాట్టుల తల్లులు, భార్యలు రాజపుత్ర స్త్రీ లన్న సంగతి కాదనినమాత్రమున మారదు. సాంఘిక, విజ్ఞాన, మత, కళావిషయములందు హిందూమహమ్మదీయులు కలసిమెలసి ప్రవర్తించిరి. క్రీ. శ. ౧౪౪౦—౧౫౧౮ మధ్య కబీరు మహాశయుడు హిందూమహమ్మదీయ సఖ్యతను తాత్విక సాధనలతో నిరూపించి పెంపొందించెను. గురునానక్ మహాశయుడు రెండుశాఖలను జేర్చి నూతనశాఖను సృష్టించెను. అంతేకాక తుకారామ్, చైతన్యులు లాటి మహాభక్తుల పలుకులు హిందూ మహమ్మదీయ సఖ్యతాదర్శములతో నిండియున్నవి. రాజకీయ విషయములందు గూడ వారు గణనీయమగు సఖ్యతను గలిగి యుండెడివారు. అందరకును తెలిసిన అక్బరుచక్రవర్తి చరిత్రను పేర్కొనుట అనవసరము. చరిత్రకారులచే హిందూమతద్వేషిగా నిరూపింపబడిన ఔరంగజేబు సైన్యమునం దనేక హిందువు లుండెడివారు. వారు రాజభక్తితో యుద్ధభూమియందు శత్రువులగు హిందువులతో

పోరు సలిపెడివారు. అంతేకాక మహమ్మదీయ మత ద్వేషిగా నిరూపింపబడిన శివాజీసైన్యమున గూడ మహమ్మదీయు లుండెడివారు. వారు యుద్ధభూమి యందు శత్రువులగు మహమ్మదీయులనే ఎదుర్కొనెడివారు. మహమ్మదీయులు, హిందువులు కలసి ఒకేనవాబు దగ్గర గాని, ఒకే సంస్థానాధీశుని చెంతగాని కొలువు చేయుచుండెడివారు. హిందువులు, మహమ్మదీయులు కలసి మెలసి ఎన్నడును ప్రవర్తింపలేదను వాదము నిరాధారమైనది.

ఈ మధ్య ౧౯౪౩-వ సం. నవంబరు తుదివారములో జలందర్ నగరమున జరిగిన మహమ్మదీయ విద్యార్థుల సమావేశసందర్భమున జిన్నా గారు గావించిన అధ్యక్షోపన్యాసము వారి మిత్రులను, శత్రువులనుగూడ నిర్విణ్ణుల నొనర్చినది. జాతీయమైనారిటీసంఘములు, అంతర్గతజాతీయ మైనారిటీసంఘములను నూతన విభాగము గావించి, అంతర్గతజాతీయమైనారిటీ సంఘములకు స్వయంనిర్ణయసూత్రము ననుసరించి ప్రత్యేక రాష్ట్రస్వాతంత్ర్యమును గోరుహక్కు లేదని సిద్ధాంతీకరించిరి. ఈ నూతన సిద్ధాంతము ననుసరించి పంజాబు, బెంగాలురాష్ట్రములలోని మహమ్మదీయేతరులకు నోరెత్తి మాట్లాడుటకైనను హక్కు లేదు. ముస్లింలీగు అధ్యక్షులు రోజారోజా నూతన నిర్వచనములను, సిద్ధాంతములను సృష్టించుచుందురు.

పాకిస్థానుసిద్ధాంతము నంగీకరించి యావద్భారత భూమికిని సంబంధించు తూర్పు, పశ్చిమ, వాయవ్య సరిహద్దుభాగములను ఒకే మతస్థుల చేతియందుంచుట వలనుపడదు. పైగా అట్టిమతస్థులు, పర దేశమును మాతృదేశముగా నెన్నుకొనుచున్నప్పుడు, సరిహద్దురాష్ట్రముల వారి వశమునందుంచుట అవివేకము. ప్రపంచమున గల దేశములలో సహజ నైసర్గిక సరిహద్దులతో గూడిన సుస్వరూపముగల భారతభూమిని కురూపిగా జేసి, భగవంతు డొసగిన సౌష్ఠవస్వరూపమును విధ్వంసము గావించి ఏకైక దేశమును రెండుభాగములుగా జీల్చుట కెవ్వరును అంగీకరింపరు.

వివిధ స్వతంత్ర రాష్ట్రములు వివిధ సైన్యములతో, వివిధ రాజ్యాంగ విధానములతో, వివిధనాణెములతో భారతదేశమున వెలసినచో, గడియారము వెనుకకు తిరిగినట్లగును.

ఈ మధ్య జరిగిన క్రిప్సురాయబారమునందలి షరతుల ననుసరించి, అఖిలభారత ఫెడరేషనునందు జేరుటకు, జేరకపోవుటకు వివిధరాష్ట్రములు స్వయముగా నిర్ణయించుకొనుట కవకాశ మీయబడినది. ఇది కడు శోచనీయమగు షరతు. సాధారణముగా స్వతంత్రరాష్ట్రములు జేరి ఫెడరేషను నేర్పరచుకొనినచో వాని స్వాతంత్ర్యమునందలి కొంతభాగమును ఫెడరేషను కొసగు వాడుక గలదు. భారత దేశమున ఫెడరేషను, అట్లేర్పడక, కేంద్ర ప్రభుత్వమే ఫెడరేషనుగా మారదలచి వివిధరాష్ట్రములకు, రాష్ట్ర స్వాతంత్ర్యము నొసగుచున్నది. ఫెడరేషను అమలులోనికి రానిక్రితమే, నిన్న మొన్నటివరకు కేంద్ర ప్రభుత్వపు చెప్పుచేతలలోనుండి, యీనాడు ఫెడరేషను కారణమున, రాష్ట్ర స్వాతంత్ర్యమును ఆ కేంద్రమే ప్రసాదించిన గైకొను రాష్ట్రములకు పూర్తిగా నట్టిరాబోవు ఫెడరేషనునుండి విడిపోవు హక్కు నొసగుట వివాహము కానిక్రితమే విడాకు లిచ్చుకొనుటవంటిదగును.

ఈ చరిత్రను పరిశోధనదృష్టితో పరికించిన వారికి పాకిస్థానుసిద్ధాంతము నంగీకరించుటవలన అణుమాత్రమైనను మహమ్మదీయ మైనారిటీ సంఘముల సమస్య పరిష్కరింపబడదని స్పష్టమగును. అంతేకాక, అనాదినుండి ముస్లిం లీగువారు చేయుచున్న ప్రచారము సమంజసములగు తమ మైనారిటీ హక్కులరక్షణకొరకు కాక కేవలము రాజకీయాధికారమును అభివృద్ధిచేసుకొనుటకే యని కూడ తేటతెల్లమగుచున్నది. అందుచే ముస్లిం లీగు వారెంత తీవ్రముగా ప్రచారము చేసినను, జాతీయులగు భారతీయులు ఏకగ్రీవముగా భారతదేశ విభాగోద్యమమును ధైర్య సాహసములతో నెదుర్కొన సంసిద్ధులై యుండుటయం దాశ్చర్యము లేదు.

మాన్యుని రామభక్తు నభిమానధనాగ్రణి సత్కవీంద్రమూ
ర్ధన్యుని మాన్యలైన కవితాతనుజన్యులఁ గన్నవారిలో
ధన్యతముం డెవం డన నితం డొకఁడే యన వన్నెకెక్కఁ గౌం
డిన్యసగోత్రుఁ బోతకవి డెందమునందుఁ దలంతు ముందుగన్.

కవు లెవ్వారును దెల్గుసేయుటకు సంకల్పించనేలేని భా
గవతగ్రంథము నివ్వగుగ్గిళుల ద్రాక్షాపాకరమ్యంబుగాఁ
దవురీతిం దెలిఁగించి యుంచిన మహోదారుండు మా పోతరా
ట్కవితావల్లభుదివ్యమూర్తికి నమస్కారంబు గావించెదన్.

మా కేనన్నది లక్కమాంబదియు జన్మంబుల్ కదన్ ధన్యముల్
కా కున్నే? భువి నాంధ్రభాగవతవిఖ్యాతామృతస్థాలిచే
నాకమ్ముం బొనరించి మించు సుతుఁ గన్నా రద్దిరా! అట్టి సు
శ్లోకున్ పోతనమంత్రిపేరికవిరాజున్ భక్తితోఁ గొల్చెదన్.

మాయురె! వ్యాసమహాని యనమానముగా రచియించు పండు టెం
కాయలవంటి శ్లోకములు గల్గినభాగవతమ్ము నిమ్మగాఁ
బాయసభాండమో, అరఁటిపండులపల్లెమొ నా రచించె నే
ధీయువతిప్రియుం; డతని డెందమునందుఁ దలంతుఁ బోతనన్.

ఆతతపుణ్యగణ్యుఁ గొనియాడుదుఁ బాడుదుఁ దచ్చరిత్ర; మా
పోతనతాత భాగవతమున్ తెలిఁగింపఁగఁ గూరుచున్నచో
మాతగతిన్ విధాతృసతి మానుషియై యరుదెంచి ప్రీతితో
నాతనిచేతిగంటమును, ఆకులుఁ గైకొని వ్రాయునంట! ఔ
రా! తొలుజన్మ నాతఁడు సరస్వతి నెంతగఁ గొల్చెనోకదా!

శ్రీనాథుం డొకకాలమం దితని దారిద్ర్యమ్ము వీక్షించి "బా
వా! నీ భాగవతాఖ్యకన్యకకుఁ బెంపారంగ వెల్గోటిభూ
జానిన్ నాయకుఁగా నొనర్చితివ విస్తారమ్ముగా విత్తమున్
నే నిప్పించెద; విత్తమూలము జగన్నిర్మాణ మన్ మాట నీ
కేనా చెప్పెడివాఁడ? దానిఁ గొని నీ యిల్లాలినిన్ బిల్లలన్
సానందంబుగఁ బెంచుకొంచుఁ గవితావ్యాసంగముం జేయు; మ

హ్యో! నీవంటి కవీశ్వరుం డిటులు కృష్యుద్యోగముం జేయుచున్
గ్లానిం బొందుచుఁ గుందు టేల? కవిలోకమ్ముం గనుంగొమ్ము; నా
రానందమ్మును పొందుచుండ రెటు రాజాలంబముం బొంది యే
దీనత్వమ్మును లేక; నా నుడులు బుద్ధిన్ లెస్స యోజింపుమా
దీనం బోయెడి దేమి లేదుసుమ! పృథ్వీనేత విష్ణుండుగా
మానుల్ వల్కరె? కాన నా పలుకులన్ మన్నింపవే!" నావుడున్.

"బాల రసాలసాల నవ పల్లవ కోమలఁ గావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికు లైన నేమి గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికు లైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై."

అని సోత్ప్రాసముగా వచించి తనుఁ బ్రత్యాఖ్యాతునిం జేయ వచ్చినదారిం బడి వెల్లిపోయెనఁట! యా శ్రీనాథుఁ; డామీఁద; నాతనిమాటల్ గమనించి యేరికయినన్ తన్నమ్మునో యేమొ యంచును జింతించుచు వచ్చి వాణి యట నశ్రుల్ నించుచుం దోఁచుడున్.

"కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చె దో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! ఓ మదంబ! ఓ
హాటకగర్భురాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్ల క
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్మ భారతీ!"

అని యోదార్చెను కాక భారతిని; ధైర్య మ్మూని "మాయమ్మరో! నను నీ కిట్లు పరీక్ష చేయఁ దగునే? నాబుద్ధితోఁ గూడి రాముని శ్రీపాదములందు నా కృతిసుతన్ మోదమ్ముతో నుంచి యాతని జామాతగ నెంచుకొంచును కదన్ ధన్యుండ నైతింగదా! ధనధాన్యమ్ములకోన మే మొకపడున్ దైన్యంబునుం బొందకుండను గాపాడుచు నుందుగాదె మముఁ; గష్టం బెట్టిదో నే నెఱుంగను; సర్వస్వము నాకు నీవె యను టొక్కండేకదా; నేను నమ్మినసత్య మ్మది; నీయెఱుంగనిది యేమీ లేదుగా! నాకుఁ; లేదని దైన్యమ్మునఁ జేయి చాఁచి యొరులన్ యాచింప; మాయర్థ మిమ్మని బాధించెడివారు లేరు నను; నే నర్థింపకుండన్ లభిం

చినదానిం బదివేలుగాఁ దలఁచి నిశ్చింతంబుగాఁ గాలయా
పనముం జేయుదు నిన్ దలంచుకొనుచున్; పైవారికిన్ బీద న
య్యును నిక్కమ్మగు భాగ్యవంతుఁడను నే నొక్కండనే యంచు లోఁ
దనివిం జెందుచు నుందు నీ వెఱుఁగవా? తల్లీ!" యటం చన్న పో
తనమంత్రిప్రవరుం డొకండె కవిమూర్ధన్యుండు ధన్యుండు నా
తని మద్గోత్రమహత్తరుం డనెడి తాత్పర్యంబుతోఁ గొల్చెదన్.

అస్మత్పూర్వుల స్వప్నమందును, కురాజ్యాధీశులన్ శ్రీమదా
పస్మారగ్రహమూఢచిత్తులఁ దృణప్రాయమ్ముగా నెంచి బ్ర
హ్మాస్మత్పూర్వుని శ్రీహరిన్ స్వకృతికన్యానాథునిం జేసినాఁ
డస్మద్గోత్రమహత్తరుం దెలతుఁ బోతామాత్యవిద్వత్కవిన్.

నీవే ధన్యుఁడ వద్దిరా! సహజపాండిత్యుండవై భారతీ
దేవీదివ్యపదారవిందముల హృత్పీఠమ్మున న్నిల్పి త
ద్దేవీదర్శన మాచరించి కృతిపుత్త్రిన్ జానకీజానికిన్
దేవేరిం బొనరించి మించితివి ప్రీతిం బోతరాట్సత్కవీ!

వ్యాసుఁడు గాఢపాకమున వ్రాసిన భాగవతమ్ముఁ దెల్గునన్
వ్రాసెడువారు పుట్టరని బాగుగ యోజన చేసిచేసి మా
కేసనమంత్రిసత్తమునికిం బ్రియనందనుఁడై జనించి తా
వ్రాసెను తేనె లూరు మృదుపాకములో సకలాంధ్రు లుబ్బఁగన్.

శివునిన్ విష్ణువు నొక్కమాదిరిగనే చిత్తంబునం దెంచుచున్
దవురీతిన్ భజియించుచుండె ననుటన్ తద్గీతపాదమ్ములే*
వివరించుంగద! వేఱ చెప్పవలెనే విద్వాంసుఁడౌ పోతరాట్
కవిరాజున్; తదభేదబుద్ధికి నమస్కారమ్ము గావించెదన్.

భూదేవినిఁ గొలుచుచు భా-షాదేవిని హృదయమందు స్మరియించుచు ల
క్ష్మీదేవిని లక్షింపని - మాదేవునిఁ బోతరాడమాత్యునిఁ దలఁతున్.

దయయున్ సత్యము శాంతిదాంతులు మహౌదార్యమ్ము ధైర్యమ్ముఁ దృ
ప్తియుఁ బాండిత్యముఁ దాల్మి యాంధ్రకవితోద్రేకమ్ము హ్రీయున్ మహా

* "చేతులారంగ శివునిఁ బూజింపఁడేని - నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని"


శయుఁడౌ పోతనయోగిపుంగవునకున్ సాజమ్ము లౌనట్టి య
వ్యయకీర్తిస్థిరదేహధారికి నమోవాకమ్ము గావించెదన్.


పరవనితను జననివలెను- పరధనమును చిల్లపెంకుపగిదిని భూతో
త్కరమును తనవలెఁ గను బమ్మెరపోతనవంటిసుజనమిత్రుఁడు గలఁడే?

బాల్యమునందు నీకృతిని భాగవతమ్మును పెక్కుమార్లు సా
కల్యముగాఁ బఠించితిని, గాఢముగా మతి కెక్కె, జన్మసా
ఫల్యముఁ దీయనౌ తెనుఁగుబానకు దోహదమున్ లభించె; నే
మూల్య మొసంగి త్వదృణవిముక్తుఁడ నౌదును? పోతరాట్కవీ!

శ్రీమహిళావతార మగు సీతను మాతగ, విష్ణుమూర్తి శ్రీ
రామునిఁ దండ్రిగా మది నిరంతరమున్ భజియించుచుండి యా
రామునిపేర నీదుకృతిరత్నసుతన్ వెలయించినావు నీ
వేమితపమ్ముఁ జేసితివొ యేమొసుమా మును పోతరాట్కవీ!

ఆర్తిం బొందనివాఁ; డెలుంగఁడఁట దైన్యం బొక్కనాఁడున్; స్వయం
ప్రాప్తం బైనది లేశ మైనఁ బదివే లంచున్ మనఃపూర్తిగాఁ
దృప్తిం బొందినవాఁడు; రాఘవపదాధీనాంతరంగుండు; ని
ర్లిప్తుం డై మనె; నట్టివానిఁ దలఁతున్ శ్రీపోతనామాత్యునిన్.





వేదాంతదర్శనము :

శ్రీ

భేదాభేదవాదము

= శ్రీ పూర్ణానంద =

ప్రవేశిక :

వేదాంతసూత్రములకు భేదాభేదపరమగు భాష్యమును రచించిన ఆచార్యుని పేరు భాస్కరుడు. అనంత విస్తృతమగు సంస్కృత సాహిత్యగగనమున లోకభాస్కరుడు, శ్రౌతభాస్కరుడు, హరిభాస్కరుడు, భగవంతభాస్కరుడు, జ్యోతిష్యభాస్కరుడు, భదంతభాస్కరుడు, మిశ్రభాస్కరుడు, శాస్త్రిభాస్కరుడు, దీక్షితభాస్కరుడు, రాయభాస్కరుడు, ఆనందభాస్కరుడు, నాథభాస్కరుడు, దేవభాస్కరుడు అను సంజ్ఞతో నొప్పు అనంత భాస్కరోదయమైనది. ఇందు వేదాంతి భాస్కరుడు 'సిద్ధాంతశిరోమణి' రచయితయగు జ్యోతిష్యభాస్కరుని పూర్వపురుషుడని ఐతిహాసికుల పరిశ్రమవలన తెలియుచున్నది. ఈయన కన్యాకుబ్జాధీశ్వరుడగు రామభద్రుని పుత్రుడగు మిహిరభోజుని (క్రీ.శ. ౮౪౦-౮౯౦) రాజ్యపాలనా ప్రథమకాలమునకు చెందియుండెను. ఆ రాజా ఈయనకు 'విద్యాపతి' యను బిరుదము నొసగెను. ఈయన తండ్రి పేరు త్రివిక్రముడు. భట్టభాస్కరుడను ప్రసిద్ధనామమున ఈయన పండితసమాజమున ప్రసిద్ధికెక్కియున్నాడు. ఇంతకెక్కుడుగ ఈయనజీవితము తెలియవచ్చుట లేదు. ఈయన రచించిన గ్రంథము కూడ సూత్రభాష్య మొక్కటియే లభించుచున్నది. ఛాందోగ్యభాష్యము, తదితర వేదాంతగ్రంథములు అలభ్యములు.

పెక్కుతావుల భాస్కరభాష్యమున పఠింపబడిన సూత్రపాఠములను పరీక్షింప శాంకర శ్రీభాష్య పాఠములతో భేదించుచుండుట కనుగొనగలము. సంప్రదాయభేదము ననుసరించి పాఠభేదము పొసగుట వింతకాదు. భాస్కరుని సిద్ధాంతములును, కాలమును గూడ శంకరరామానుజులకు మధ్యస్థమైయుంట గమనింపదగిన విశేషము.

ఈయనమతమున పరమానంద ప్రాప్తియే పరమపురుషార్థము. బ్రహ్మజ్ఞానముననే పురుషార్థోపలబ్ధి. ఉపాసనవలన బ్రహ్మజ్ఞానము లభించును. బ్రహ్మసాక్షాత్కారమున జీవునకును, బ్రహ్మమునకును గల భేదము అంతరించును. ఇదియే ముక్తావస్థ. సంసారావస్థయందు వీరిరువురును భిన్నులు.

అధికారి:

ధర్మజ్ఞానానంతరము బ్రహ్మవిచారమున కధికారము లభించును. కర్మవిచారము పరిసమాప్తియైనతోడనే బ్రహ్మజిజ్ఞాస ఆరబ్ధమగుచున్నది. ధర్మ–బ్రహ్మమీమాంసలు రెండును గలసి ఒక శాస్త్రము. జ్ఞానకర్మసముచ్చయము సూత్రకారుని అభిమతము.[1] కర్మఫలము క్షణికమే యైనను, జ్ఞానయుక్తమైన అక్షయమగుచున్నది.[2] కర్మవలన జ్ఞానమును, జ్ఞానమున ముక్తియును లభించుచున్నవి.

విషయము:

బ్రహ్మమే విచార్యవిషయమును, పరమపురుషార్థమును అగుచున్నది. ఇయ్యది ఉపాసనవలన బ్రహ్మముతో నభిన్నబోధకలిగిన సమకూరును. జీవుడును, బ్రహ్మమును భిన్నులును, అభిన్నులునుగూడ. ముక్తస్థితియందు సంసారవికారము లన్నియును తొలగిపోవ జీవబ్రహ్మముల కభేదము కలుగును. ఇదియే అభిన్నత. కార్యరూపమున నానాత్వబోధ, కారణరూపమున అభేదము. ఇట్టి భేదాభేదవిషయమునే భాస్కరమత ముపదేశించుచున్నది. ఇయ్యది అపర్యము. కర్మసహితమగు జ్ఞానమువలన శరీరాదులయం దుండు ఆత్మబుద్ధి తొలగిపోవును; శరీరపాతానంతరము సర్వజ్ఞత్వ, సర్వశక్తిసంయుతత్వములతో గూడి నిరతిశయసుఖ సంవేదనతో నొప్పు ముక్తి లభించును. నిర్విషయముక్తి అంగీకార్యము కాదు. అంతకంటె ఇతరులు చెప్పురీతిగ 'సృగాలత్వం వనే వరం'. అయ్యది పురుషార్థము కాదు. ముక్తపురుషుడు సర్వాత్మకు డగును.

సంబంధము:

ఉపనిషత్తులకును, బ్రహ్మమునకును ప్రతిపాదక ప్రతిపాద్యసంబంధ మున్నది. బ్రహ్మము ప్రతిపాద్యము, శ్రుతి ప్రతిపాదకము. లౌకికదృష్టాంతములు వేదార్థమొనర్చుకట్ల తగవు. శ్రుతి యొక్కటియే బ్రహ్మవిషయమున ప్రమాణార్హము. తదితరములు అనర్హములు.

ప్రయోజనము:

సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్త్వములతో గూడిన నిరతిశయమగు ఆనందప్రాప్తియే ప్రయోజనము. అనాత్మవిషయములగు దేహాదులయం దుండు ఆత్మబుద్ధి తొలగిన, శరీరవిమోక్షణానంతర మియ్యది లభించును.

బ్రహ్మము:

భాస్కరమతమున బ్రహ్మము సగుణము, నిరాకారము. సల్లక్షణబోధ లక్షణాయుక్తము. సత్యజ్ఞానానంతమగు చైతన్యమాత్రము, రూపాంతర రహితము. ఇయ్యది అద్వితీయము. ప్రళయకాలమున సర్వవికారములును బ్రహ్మమున ఉపసంహృతము లగును. నిరాకారమగు బ్రహ్మమునే ఉపాసించునది; దీనిని శుద్ధముగను, కారణరూపముగను చింతింపనగును. కాని, బ్రహ్మమే కార్యరూపమున జీవప్రపంచములుగ పరిణమించుచున్నది. అది యెట్లన: బ్రహ్మమునకు భోగ్యశక్తి, భోక్తృత్వశక్తి అను రెండు శక్తు లున్నవి. భోగ్యశక్తియే అచేతనమగు ఆకాశాదులుగను, భోక్తృశక్తియే

---

1. అత్రహి జ్ఞానకర్మసముచ్చయాత్ మోక్షప్రాప్తిః సూత్రకారస్యాభిప్రేతా.

—భాస్కరభాష్యమ్.

2. స్వతః క్షణికస్యాపి కర్మణో జ్ఞానరస విద్ధస్యాక్షయఫలత్వా న్న క్షీయతే ఇత్యుచ్యతే.

—భా. భా.

చేతనము జీవరూపముగను పరిణతినందుచున్నది.[3] బ్రహ్మమునకీశక్తి నైసర్గికము; కల్పితము కాదు.[౪] ఆయన అంతర్యామి రూపమున నియంత. బ్రహ్మము జగద్రూపమున పరిణతమైనను, ప్రపంచాకారముగ ఆకారిత మవదు.

జగత్తు:

జగత్తు బ్రహ్మాత్మకము. కాని, బ్రహ్మము జగద్రూపమును బొందుచుండుట లేదు. బ్రహ్మమే జగత్తుయొక్క నిమిత్తకారణమును, ఉపాదానకారణమును గూడ. ఈవిషయమును స్థాపించు విశేషసూత్ర మొకటి, ఇతర గ్రంథములలో లేనిది, అధికముగ భాస్కరునిచేత పఠింపబడినది. ఆసూత్రము: 'అస్థూల మన ణ్వ హ్రస్వ మదీర్ఘ మశబ్ద మస్పర్శ మరూప మవ్యయమ్.' ఈ సూత్రవ్యాఖ్యానసందర్భమున 'ఆకాశో వై నామ రూపనిర్వహితా' మన్నగు సృష్టిశ్రుతుల తాత్పర్యము అరూపమగు బ్రహ్మమును ప్రతిపాదించుటయందే యనియు, ఈవిషయము ఇట్టి బ్రహ్మమే ధ్యేయ మనియు వక్కాణించియున్నాడు.

జీవుడు:

జీవుడు బ్రహ్మముయొక్క అంశము. మఱియొక రీతిగ చెప్పవలసిన, బ్రహ్మముయొక్క భోక్తృత్వ శక్తియే జీవుడు. సమస్తవికారరహితమును, కారణాత్మకమును అగు బ్రహ్మమును అనుధ్యాన మొనర్చిన, నేనే బ్రహ్మమును అని భావించిన, జీవునకు బ్రహ్మభావము కలుగుచున్నది. దేహాదులయం దుండు ఆత్మభావము తొలగిన, శరీరపాతానంతరము జీవుడు బ్రహ్మమున లయమగుచున్నాడు.

ముక్తి:

ఉపాసనాఫలమే ముక్తి. ఇయ్యది 'అహం బ్రహ్మాస్మి' అను భావముతో కారణాత్మకమగు నిర్వికారబ్రహ్మమును ఉపాసింప లభించుచున్నది. అప్పుడు బ్రహ్మలక్షణములగు సర్వజ్ఞత్వాదికములు కలుగును. జీవన్ముక్తి అసంభవము. జ్ఞానికిగూడ ఉత్క్రమణ మున్నది. జ్ఞానకర్మల సముచ్చయ మవలంబనీయము. జ్ఞానము ఆపేక్షికము; అఖండము కాదు. భేదజ్ఞానము కూడ జ్ఞానమే. అజ్ఞానము కాదు. అహంగ్రహోపాసన అంగీకార్యము. శూద్రులకు బ్రహ్మవిద్యాధికారము లేదు.

సమాప్తి:

కర్మలను జ్ఞానకారణముగ అంగీకరించుటలో శ్రీకంఠ రామానుజ భాస్కరుల కైక్య మున్నది. శాంకరదర్శన మీవిషయమును అంగీకరింపదు. భాస్కరుని భేదాభేదవాదమును, నింబార్కుని ద్వైతాద్వైతమును ఒకే తరగతికి చెందినవి. ఈవిషయమున భర్తృప్రపంచ, యాదవప్రకాశుల నామములుగూడ స్మృతికి దగులును. కాని, నింబార్కుని బ్రహ్మము సగుణము, సవిశేషము; భాస్కరుని బ్రహ్మము నిర్గుణము, సవిశేషము. ఇట్టి నిర్గుణ సవిశేషశబ్దములను ఆధునికు లగు బ్రహ్మసమాజ మతస్థులుగూడ వ్యవహరించుచున్నారు. నిరాకారమగు బ్రహ్మమున శక్తి నంగీకరించు భాస్కరుని వాక్యముల కద్వైతులు ఆశ్చర్యము నందగలరు. ముక్తిని గురించి భాస్కర శ్రీకంఠు లొకేరీతిగ చెప్పుచున్నారు. కొన్ని శాక్తతంత్రములుగూడ భేదాభేదమును సమర్థించుచున్నవి. శ్రీరామానుజుడు విష్ణుపరముగను, శ్రీకంఠుడు శివపరముగను సూత్రభాష్యము నొనర్చియున్నారు. కాని, భాస్కరుడు శంకరుని వలెనే బ్రహ్మపరముగ వ్యాఖ్యాన మొనర్చెను.

మొదటనుండి తుదివఱకు శాంకరభాష్యమును ఖండించుటయందే భాస్కరుడు విశేషముగ ప్రయత్నించియున్నాడు. శాంకరమును ప్రచ్ఛన్నబౌద్ధమని

---


౩. ఈశ్వరస్య ద్వే శక్తీ భవతో భోగ్యశక్తి రేకా భోక్తృశక్తి శ్చాపరా. భోగ్యశక్తిశ్చ సాకాశాదిరూపే ణాచేతన పరిణామాపత్తేః, భోక్తృశక్తిః సాచేతనా జీవరూపే ణావతిష్ఠతే.

౪. అంతర్యామి పరమాత్మనో నియంతృరూపా శక్తిః పారమార్థికీ, నహి సా కేనచిత్ కల్పితా.

—భా. భా.

భాస్కరుడే మొదట వాకొనినాడు. భాస్కరుడు త్రిదండిసన్న్యాసమును, తదనుకూలమగు పాంచరాత్ర మతమును సమర్థించియున్నాడు.

తదితరవిషయము లెట్లున్నను, భేదాభేదవాదము అద్వైతపరములగు వ్యాఖ్యలకును, ద్వైతపరములగు వ్యాఖ్యలకును సఖ్యమును కూర్చునదైయున్నది. కనుక, ఈ భావపరిపోషకములగు దర్శనములను ఆధునికులగు పాశ్చాత్యవిద్వాంసులుగూడ నిర్మించియున్నారు. సమన్వయమును సమకూర్చునదియగుటచే పలువుర దృష్టి నియ్యది ఆకర్షింపగలుగుచున్నది.



మ న క థ

౩. మన సూర్యుడు, భూమి

= శ్రీ 'వాసు' =

ఈ వ్యాసంలో సూర్యమండలమూ, మన భూమీ -వీటియొక్క పుట్టుకను తెలుపుతాను.

మన భూమి సూర్యమండలములోని ఒకానొక చిన్న భాగమని మనకు తెలుసు. కాని యీ సూర్యమండలమే మన ప్రపంచములో ఒక చిన్న భాగము.

ప్రపంచమంటే-? సామాన్యులమయిన మన దృష్టిలో ఖగోళవీథిలో కనుచూపుమేరవరకూ మనకు కనిపించే ప్రదేశమంతా ప్రపంచము; బ్రహ్మాండము. కాని శాస్త్రజ్ఞుల దృష్టిలో చాలా ప్రపంచాలున్నాయి.

* * *

చుక్కలతో కూడుకునివున్న నిర్మలాకాశంలో మన నడినెత్తిన పొడుగ్గా, తెల్లగా, నీలిరంగు దుప్పటిమీద పొలికిన పాలధారకుమల్లే దూదిపింజలలాటి ప్రదేశం స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే 'పాలపుంత' (Milky Way).

మొదటి వ్యాసంలో నెబ్యులీలను గురించి వ్రాశాను. ఈ పాలపుంత ఒక పెద్ద నెబ్యులా. పాలపుంతలో మన సూర్యమండలము వొక చిన్న భాగము. మన సూర్యమండల గ్రహకుటుంబములాంటి ఖగోళగోళకూటములు యీ పాలపుంతలో వేనకు వేలు వున్నై!

శాస్త్రజ్ఞులు యీ పాలపుంతను, యీ పెద్ద నెబ్యులాను 'మనప్రపంచము' అని పిలుస్తున్నారు. ఈ నెబ్యులా మన సూర్యమండలగ్రహాలకుమల్లే తన చుట్టూ తాను తిరుగుతున్నదనికూడా వారు గట్టిగా అనుమానిస్తున్నారు.

నెబ్యులీలు మన పాలపుంతగాక యింకా యెన్నో (సుమారు ౨,౦౦౦,౦౦౦ వరకూ) వున్నట్లు తెలుస్తుంది. వీటిలో యెన్నెన్ని రకాలున్నవో మొదటివ్యాసంలోనే మనకు తెలిసింది.

ఎన్నో ప్రపంచాలు

ఒక్కొక్క నెబ్యులా ఒక్కొక్క ప్రపంచమని శాస్త్రజ్ఞుల నమ్మకం. సముద్రంలోని ద్వీపాలకుమల్లే యీ నెబ్యులీద్వీప ప్రపంచాలు ఖగోళసముద్రంలో వున్నయ్యట.

ఈద్వీపాలలో మన పాలపుంత వొకటి. దీనినక్షత్ర మండలాలలో మన సూర్యమండల మొక చిన్న భాగము. శాస్త్రజ్ఞులు సూర్యుడొక పెద్ద నక్షత్ర

మంటున్నారు. ఆయనకాంతి స్వతః వున్నదేగాని అరువు తెచ్చుకున్నది కాదుగదా? అందుకని!

* * *

సూర్యమండలమూ, సూర్యుడూ, నక్షత్రాలూ— వీటి పుట్టుకనుగురించి కొన్ని శతాబ్దాలనుండీ యెందరో మేధావులు ఆలోచిస్తూనే వున్నారు. ఎన్నో సిద్ధాంతాలు చేశారు. కాని యీవిషయంలో చేరు సర్ జేమ్స్ జీన్స్ సిద్ధాంతానికి వున్న గౌరవం యితర సిద్ధాంతాలకు లేదు. ఈసిద్ధాంతం ఖగోళవిషయాలలో చాలావాటిని శాస్త్రయుక్తంగా, సహేతుకంగా వివరించడంవల్ల చాలామంది శాస్త్రజ్ఞులు దీనిని ఒప్పుకున్నారు. మరే యితరసిద్ధాంతమూ యీమాత్రమైనా యీవిషయంలో యిదమిత్థమని తేల్చి చెప్పలేకపోయింది.

సర్ జేమ్స్ జీన్స్ సిద్ధాంతం

ఈ ఆంగ్ల శాస్త్రజ్ఞుడి సిద్ధాంతంయొక్క సారాంశ మిది:

“ఒక్కొక్క నెబ్యులా గిరగిర తిరగడంవల్ల యీ నెబ్యులాయొక్క ఆకారం మారుతుంది. మొదట దూదిపింజకుమల్లే నిర్దిష్టాకారంలేని నెబ్యులా క్రమంగా గుండ్రగా మారుతుంది. గిరగిర తిరుగుతున్న వేగంవల్ల యీ గుండ్రని నెబ్యులా, అతివేగంగా తిరుగుతున్న బొంగరం యెలా చక్రంలాగా కనిపిస్తుందో ఆవిధంగానే గుండ్రని చక్రములాగా తిరుగుతుంది.

ఖగోళంలో మనకు కనిపించే నెబ్యులీలు కొన్ని వాయుపదార్థాలతో కూడివున్నాయని మనకు తెలుసు. చక్రములాగా అతివేగంగా గిరగిర తిరుగుతున్న యీ నెబ్యులీలలో చాలాభాగం యింకా యీదశ (వాయుపదార్థదశ!) లోనే వున్నా, అక్కడక్కడ, వివిధ భాగాలలో, యీవాయుపదార్థాలు ద్రవ, ఘనదశలలోకి మారివుండాలి (నీటి ఆవిరి నీరుగానూ, మంచుగానూ మారినట్లు!).

ఇలా కొంతకాలం గడిచింది. చక్రంలాగా గిరగిర తిరుగుతున్న యీ నెబ్యులా అంచులనుండి భ్రమణవేగంవల్ల కొన్ని ముక్కలు లేచిపోయివుంటై.

కత్తులు సానపట్టేరాయి మీదినించి ఒరిపిడివల్ల పుట్టే నిప్పురవ్వలు రాయి యెలా తిరుగుతుందో ఆవైపే తిరుగుతై— ఆరిపోయ్యేవరకూ. రాయి కుడినుంచి యెడమకు తిరుగుతుంటే యివీ అలాగే తిరుగుతై. క్రిందినుంచి పైకి తిరిగే సానరాయినుంచి పుట్టే నిప్పురవ్వలు క్రిందినుంచి పైకే తిరుగుతై!

ఒక ప్రత్యేకమార్గంలో తనచుట్టూ తాను వేగంగా తిరుగుతున్న యేవస్తువునుంచైనా హఠాత్తుగా విడిపోయిన ఆవస్తువుయొక్క భాగాలు ఆ ప్రత్యేకమార్గంలోనే తిరుగుతై.

ఈ సూత్రంప్రకారం నెబ్యులాఅంచునుంచి విడివడిన ముక్కలు నెబ్యులా తిరుగుతున్న మార్గంలో తిరుగుతై! కాలక్రమేణా ఒక్కొక్క ముక్కలో వున్న పదార్థాలు వాయుదశలోనుండి ద్రవదశలోకీ, ఘనపదార్థస్థితికీ వస్తై. వీటియొక్క అయస్కాంత సంబంధమైన ఆకర్షణశక్తి హెచ్చుతుంది.

మన సూర్యుడూ, తక్కిన పెద్ద పెద్ద నక్షత్రాలూ యివన్నీ యిలా పుట్టివుండాలి.”

—సర్ జేమ్స్‌జీన్స్ తన సిద్ధాంతాన్ని గణితశాస్త్రనిబద్ధములయిన సూత్రాలతో సమర్థించాడు. సహేతుకంగా ఋజువుచేశాడు. శాస్త్రజ్ఞులు ఆయన మేధాశక్తిని పొగిడారు.

డాక్టర్ హాబుల్

ఇది యిలా వుండగా అమెరికన్ శాస్త్రజ్ఞుడు డాక్టర్ హాబుల్ కార్నెజీ విద్యాలయంలోని దూరదర్శినీయంత్రసహాయంతో ఖగోళములోని వివిధ నెబ్యులీలను ఫోటోతీసే మార్గము కనిపెట్టాడు. ఈయన ఫోటోలు వివిధాకారములైన నెబ్యులీలు ఖగోళములో వున్నట్లు తేల్చినై. దూదిపింజలకుమల్లే, గుండ్రని బంతులవలె, బండిచక్రాలమాదిరి, చక్రాల ఆకారంలో వుండి చుట్టూ నక్షత్రాలతో కూడివున్నవి;—యెన్నో ఆకారాలు గల నెబ్యులీలను డాక్టర్ హాబుల్ ఫోటో తీశాడు. ప్రతినెబ్యులా వివిధదశలలో వుంటుందనీ, ఆకారంలో మారుతుందనీ ఈయన సిద్ధాంతీకరించాడు. డాక్టర్ హాబుల్‌యొక్క ఫోటోలు జీన్స్ పండితుడి

సిద్ధాంతాన్ని బలపరిచినై. ఆయన మేధాశక్తిని ప్రపంచానికి వెల్లడించినై.

సూర్యుడి పుట్టుక

ఈ సిద్ధాంతంప్రకారం, కొన్నిలక్షలకోట్ల సంవత్సరాలక్రిందట, పాలపుంతలోని ఒక భాగాన్నించి మన సూర్యుడు పుట్టాడు. పాలపుంతలో కనిపిస్తున్న పెద్దవైన యితరనక్షత్రాలన్నీగూడా యిలాగే జన్మించినై.

సూర్యమండలం యెలా యేర్పడింది?

సూర్యమండలగ్రహాలు సూర్యుడిలోనుంచి యేర్పడినై. అయితే నెబ్యులాలోనుంచి సూర్యుడు యేర్పడిన విధానానికీ దీనికీ భేదం వుంది. సూర్యమండలగ్రహాల పుట్టుకకు ఒక్క సూర్యుడుమాత్రమే కారణం గాదు. సూర్యుడియొక్క భ్రమణవేగంవల్ల యివి సూర్యుడినుండి ముక్కముక్కలుగా విడివడలేదు. ఆదికాలంనాడు ఖగోళవీథిలో సూర్యుడి సమీపంలోకి ఒక పెద్దనక్షత్రము దారితప్పి వచ్చివుండడం వల్ల మన సూర్యమండలగ్రహాలు యేర్పడినై. ఎలాగూ? ఎందుకనీ?

ఈవిషయం విచారించేముందు అయస్కాంతవస్తువులకు సహజంగా వున్న కొన్ని లక్షణాలను మనము తెలుసుకోవాలి.

అయస్కాంతవస్తువుల మూడు ముఖ్యలక్షణాలు

ఒక చిన్న సూదంటురాయిచుట్టూ అన్నిదిక్కులా, వివిధదూరాలలో—౧, ౨, ౩, ౪, ౫, ౬ అంగుళాలు—చిన్నచిన్న యినపముక్కలు వుంచుదాము. వీటిలో ౪ అంగుళాలకన్న యెక్కువదూరములో వున్నవాటిని సూదంటురాయి ఆకర్షించలేకపోయిందనుకుందాము. ఇప్పుడు యీసూదంటురాయికంటె యింకా కొంచెం పెద్దదాన్ని చిన్నసూదంటురాయి స్థానంలో వుంచామనుకోండి. ౫, ౬ అంగుళాల దూరంలో వున్నవాటినిగూడా యీసూదంటురాయి ఆకర్షించిందనుకుందాము. ౭, ౮, ౯, ౧౦, ౧౧, ౧౨ అంగుళాల దూరంలో యీపెద్దసూదంటురాయి చుట్టూ మరికొన్ని యినపముక్కలు వుంచుదాము. వీటిలో ౧౦ అంగుళాల దూరంవరకూ వున్న ముక్కలన్నీ యీసూదంటురాయి ఆకర్షించిందనుకోండి. ౧౧, ౧౨ అంగుళాల దూరంలో వున్నవాటిని మాత్రం యిది ఆకర్షించలేకపోయిందనుకోండి.

దీని అర్థం? మొదటి (చిన్న) సూదంటురాయియొక్క ఆకర్షణశక్తి తనచుట్టూ ౪ అంగుళాలవరకూ వ్యాపించివుంది; రెండవదాని శక్తి ౧౦ అంగుళాలవరకూ వ్యాపించివుంది. ఆకర్షణశక్తి వ్యాపించివున్న ప్రదేశాన్ని ఆకర్షణక్షేత్ర (**Magnetic field**) మని పిలుస్తారు.

ప్రతి అయస్కాంతవస్తువుకూ ఆకర్షణక్షేత్రము వుంటుంది. పెద్దదైన అయస్కాంతవస్తువుకు పెద్ద ఆకర్షణక్షేత్రమూ, చిన్నదానికి చిన్నదీ వుంటుంది. ఇది అయస్కాంతవస్తువులన్నిటికీ, సూర్యుడికీ, సూర్యమండలగ్రహాలకూ వున్న ప్రకృతిలక్షణము.

ఇంకొక ముఖ్యలక్షణము—అయస్కాంతవస్తువుయొక్క ఆకర్షణశక్తి. వొక్క పరిమాణము (పెద్ద, చిన్న భేదము) ను బట్టేకాక దూరాన్నిబట్టిగూడా వుంటుంది. ఒక పెద్ద సూదంటురాయికీ చిన్న సూదంటురాయికీ మధ్యగా వొక యినపముక్క వుంచామనుకోండి. ఈ యినపముక్క చిన్న సూదంటురాయికి దగ్గరగా వుందనుకోండి. ఏ మౌతుందో తెలుసా? యినపముక్క చిన్నసూదంటురాయిచేత ఆకర్షింపబడుతుంది. ఎందుచేతంటే, యిది యినపముక్కకు దగ్గరలో వుండుటవల్ల.

మరివొక ముఖ్యలక్షణము — అయస్కాంతవస్తువులు ద్రవపదార్థాలను ఘనపదార్థాలకన్న యెక్కువ సులువుగా ఆకర్షిస్తై.

సముద్రపు పోటు

సముద్రానికి పోటు వుందని మనకు తెలుసు. సముద్రపునీరు పొంగడానికీ, చంద్రోదయానికీ సంబంధం వుంది. చంద్రుడు ఉదయించినప్పుడూ, బాగా కనిపిస్తున్నప్పుడూ సముద్రజలము పొంగుతుంది. చంద్రుడు గూడా ఒక అయస్కాంతగోళమే. చంద్రుడికి ఆక

ర్షణక్షేత్రము వుంది. దీని ఆకర్షణక్షేత్రములోకి భూమి రాగానే సముద్రపునీరు పొంగుతుంది. భూమి చంద్రుడికన్న చాలా పెద్దదవడంవల్ల చంద్రుడు భూమిని తన దగ్గఱకు లాక్కోలేడు. కాని ద్రవపదార్థమైన సముద్రపునీటిని కొంతవరకూ లాగగలుగుతుంది. అందుచేతే చంద్రుడు ఉదయించగానే సముద్రపునీరు కొన్ని అడుగుల యెత్తున లేస్తోంది.

చిన్నదైన చంద్రుడి ఆకర్షణవల్లే సముద్రపుపోటు కలుగుతుంటే యెన్నో రెట్లు పెద్దదయిన సూర్యుడివల్ల సముద్రజలం పొంగొద్దూ? — నిజమే! కాని సూర్యుడు భూగ్రహానికి చాలా దూరంలో వుంది. అందుచేత మన భూగోళపు సముద్ర జలంమీద సూర్యుడు తన శక్తి పూర్తిగా చూపలేడు. కాని కొంత సముద్రపు పొంగు లేకపోలేదు.— మనకు కనిపించదు, చంద్రుడి విషయానికి వలె!

అయస్కాంత వస్తువులయొక్క రెండవ, మూడవ లక్షణాలు సముద్రపుపోటు విషయంలో స్పష్టంగా కనిపిస్తున్నై!

*   *   *

అయస్కాంత వస్తువుల యీ మూడు లక్షణాలూ తెలుసుకున్న తరువాత, యిప్పుడు సూర్యుడి నుండి మన సూర్యమండలగ్రహా లెలా యేర్పడినవో చులకనగా తెలుసుకోవచ్చు.

ఆదికాలపు ఖగోళవీధిలో సూర్యుడు — ఒక పెద్దతార

ఆదికాలంలో, కొన్ని లక్షలకోట్ల వర్షాల క్రిందట ఖగోళవీధిలో దారితప్పిన ఒక పెద్దతార సూర్యుడిసమీపానికి వచ్చిందన్నాను. ఆ నాటి సూర్యుడి చుట్టూ యేలాటి గ్రహాలున్నూ లేవు.

ఖగోళవీధిలో సమీపంగా వున్న యీ రెండు అయస్కాంత గోళాలమధ్య సహజంగా సంఘర్షణ వుంటుంది. ఒకదాన్నొకటి లాగడానికి ప్రయత్నించి వుంటై. దారితప్పిన యీ తార మళ్లా తన నిర్ణీతమార్గానికి వెళ్లింది. కాని యీలోపుగా వొక చిన్న పని చేసింది.

ఆదికాలపునాటి సూర్యుడిలోని పదార్థాలు కణకణ కాగుతున్న ద్రవపదార్థదశలో వున్న లోహాలు. ఈతార సూర్యుణ్ణి ఆకర్షించలేక పోయినా ఈలోహద్రవాలలోని ఒకభాగము, అకస్మాత్తుగా ఒక్క క్షణకాలం తారసించిన నక్షత్రముయొక్క ఆకర్షణశక్తివల్ల, అలలాగా (చంద్రుడివల్ల సముద్రజలము పొంగినట్లే) లేచివుంటుంది. ఖగోళవీధిలో దారితప్పిన యీ తార తన దోవన తాను పోగానే సూర్యుడినుండి లేచిన యీలోహపుముక్క ఖగోళంలో పడిపోయివుంటుంది—సూర్యుడి ఆకర్షణక్షేత్రములోకి!

సూర్యుడిలోనుండి ఒక లోహపుముక్క

ఈ లోహపుముక్క సూర్యుడిచుట్టూ—సానరాయిసూత్రాన్ని బట్టి - సూర్యుడు తిరుగుతున్నట్లే అపసవ్యంగా తిరగడం ప్రారంభించింది. గిరగిర తిరుగుతూవుండడంవల్ల సాగింది. ద్రవపదార్థదశలో వున్న లోహాలు క్రమంగా గట్టిపడడం మొదలుపెట్టినై. పాకం గట్టిపడని జిలేబిముక్కస్థితిలో వుంది యీలోహపుముక్క ప్రథమదశ.

ఇలాటి జిలేబిముక్కను చేతితో మెల్లిగా సాగదీస్తే కొంతవరకూ సాగి ఎక్కడో అక్కడ సన్నగిలి క్రమంగా ఆ సన్నగిలిన చోట తునిగిపోతుంది.

తిరుగుతున్న వేగంవల్ల మెల్లిగా ఖగోళవీధిలో సాగుతున్న యీలోహపుముక్కగూడా అక్కడక్కడ సన్నగిలివుండాలి. సన్నగిలని భాగాలుగూడా కొన్ని వుండివుండాలి. ఈస్థితిలో ఒక తాళంలాగా వుంది యీలోహపుముక్క. సన్నగిలిన ప్రదేశాలు తావళపుదార మనుకోండి. లావుగా వున్నవి పూసలనుకోండి.

లోహమాల - సూర్యమండలము

ఈలోహమాలలోని యీపూసలసంఖ్య పది. కాలక్రమేణా యీపూసలు విడిపోయినై. లోహమాలలోనుంచి క్రమంగా విడిపోయిన యీ లావుభాగాలు తేమంతట తాము తిరుగుట ప్రారంభించినై. భ్రమణవేగంవల్ల గుండ్రగా మారినై. వీటిలోని పదార్థాలు గడ్డకట్టటం ప్రారంభించినై. వీటి ఆకర్షణశక్తి

యెక్కువయింది. ఇవి అయస్కాంతగోళాలుగా మారినై. సూర్యుడి ఆకర్షణక్షేత్రములోనుంచి బైటికి వెళ్లలేకపోయినా, తమ శక్తినంతా వినియోగించి నిర్ణీతమార్గాలలో, ఖగోళవీథిలోని తమ స్థానాన్ని కాపాడుకుంటూ సూర్యునిచుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఆనాటినుంచీ నేటివరకూ వున్నై. మనసూర్యమండలం యీవిధంగా యేర్పడింది.

మనభూమి పుట్టుక

ఈ పదిముక్కలలో వొకటి మనభూమి. తక్కినవి యితరగ్రహాలు, ఉపగ్రహాసమితి. తక్కిన వాటితోపాటు ఎర్రని జేగురుముద్దల్లే మండుతూ గిర గిర తిరిగింది.

మొదటివ్యాసంలో ప్రతిగ్రహానికీ చంద్రులు (ఉపగ్రహాలు) వున్నారని తెలుసుకున్నాము. ఈ చంద్రులు యీగ్రహాలలోనుంచి విడిపడ్డ భాగాలు.

ఖగోళంలో అత్యుష్ణమైన పరిస్థితులలో గిర గిర తిరుగుతున్న ఆదికాలపు భూగ్రహము నేటిస్థితికి యెలా వచ్చిందో వచ్చే వ్యాసాలలో తెలుపుతాను.

చందమామ

= శ్రీ పురిపండా అప్పలస్వామి =

చందమామ
చందమామ
చల్లని నీపాటలన్ని
తెల్లని నీ నవ్వులన్ని
ఏ తారాకోమలికో,
ఏ దిగంతమోహినికో!

నీలి నీలి సాగరాల
నీరవ భూమీధరాల
హిమకణాల సుమదళాల
మిలమిల తళతళ తళతళ
లేనిగూఢ రాగములో
ఏ రహస్య వేదనలో
చందమామ!
చందమామ!!

కలగూరగంప

పూర్వయుగ పారిశుద్ధ్యము

నాగరికతయం దగ్రస్థానము వహించు నింగ్లాండు మొదలగు పాశ్చాత్యదేశములు ఎనుబది తొంబది సంవత్సరముల క్రిందటివరకును పారిశుద్ధ్యప్రాశస్త్యము నెఱుగక యనారోగ్యవాతావరణమున పొరలాడుచుండి రని మనము సర్వసామాన్యముగా నెఱుగము. పారిశుద్ధ్య విషయమున గొన్ని యనాగరకజాతులకంటెను గూడ, వారి స్థితి యధ్వానముగా నుండె ననినచో నంత విశ్వసనీయముగ గాన్పింపకపోవచ్చును. మనవలె ననుదినము స్నానము చేయవలయు ననెడు వల్పవిషయము వారికి దెలియకుండుట హాస్యాస్పదముగా నుండును. పూర్వపు రోమనులకంటెను, ఈజిప్టుదేశస్థులకంటెనుగూడ వారు మఱియు హీనదశయం దుండిరి. శ్రీమంతులగు నాంగ్లేయులు చాలమంది మురికికాలువలయందు నివసించుచుండి రని ఖ్యాతిగాంచిన యాంగ్లరచయితయొకడు ౧౮౩౬ లో వ్రాసియున్నాడు. ఇయ్యది యతిశయోక్తి కాదు. పారిశుద్ధ్యమునం దగ్రగణ్యులు రోమనులు. ఆంగ్లభాషయందలి 'శానిటేషన్' (Sanitation) అను పదమును వారే కల్పించిరి. ఆ పదమున కర్థము ఆరోగ్యము.

ఆరోగ్య విషయమునందు రోమనుల కెంతటి యభిమాన మున్నను, వారికి పాఠము నేర్పినవారు వారికంటెను పూర్వము నెలసిన 'ఎట్రుస్కను' జాతివారు. పారిశుద్ధ్యమునందే కాక రాజమార్గములు నిర్మించుటయందును, నీటివసతులు కల్పించుటయందునుగూడ వారికి రోమనులు అప్పుపడియున్నారు. రోమనుల పారిశుద్ధ్య మసాధారణము, అత్యుత్తమము. వారు గడించిన సువిశాల సామ్రాజ్యమునందు వారి నాగరికత విలసిల్లెను. కాని, రోమను సామ్రాజ్యము విచ్ఛిన్నమైనంతనే, వారి నాగరికతకూడ శిథిలమయ్యెను. బహుశాఖాయుతముగా విస్తరిల్లిన వారి పారిశుద్ధ్యసంవిధానమును, నీటి సరఫరాయును, రాజమార్గములునుగూడ ధ్వంసమయ్యెను. అనేకశతాబ్దుల పర్యంతము యూరపుఖండ మంతయు నారోగ్యవిషయమున హీనాతిహీనదశయం దుండెను. పై నుదాహరించిన చందమున వారే యత్యంత ప్రాచీన నాగరికతకంటెను మాత్రముగాక యనేకాటవిక జాతులకంటెను గూడ నధ్వానము.

రోమనులకు రూపనామములు లేనికాలమున (క్రీ. పూ. ౩౦౦౦-౧౫౦౦) నుచ్చదశయం దుండిన క్రీటుదేశస్థు లారోగ్యశాస్త్రమునందు ప్రవీణులై తమ పట్టణములను స్వర్గప్రాయముగా నొనరించిరట్లు నేటి పరిశోధనలవలన తెలియుచున్నది. నాసస్సు అను నగరమునందలి మురికినీటి కాలువల పద్ధతి యద్భుతముగా నున్నది. పౌరుల గృహములనుండియు, మేడలనుండియు వెలువడు వాడుకనీరు మట్టిగొట్టములనుండి వచ్చి పెద్దవియగు శిలానాళములను జేరును. నగరమునం దంతటను అల్లిబిల్లిగా వ్యాపించిన యీగొట్టములన్నియు శిలానిర్మితగంభీరప్రవాహమునందు గలియును. మట్టిగొట్టముల గుఱించి గమనింపవలసిన విషయ మెద్దియన, ౩౫౦౦ సంవత్సరములు గడచినను నేటికిని అట్టులే నిలిచియున్నవి. అందు గొన్ని సుస్నిగ్ధమృణ్మయనాళములు (Earthen-ware) గూడ గలవు. ఐదవమగుల నిడుపుగల మృణ్మయస్నానఘట మొకటి నాసస్సుపట్టణమున గాన్పించెను.

ఈజిప్టుబాబిలోనియాదేశస్థులుగూడ పారిశుద్ధ్య విషయమున ముందంజవేసినట్లు కాన్పించును. బాబి

లోను సామ్రాజ్యాంతర్భాగమైన నిప్పూరు అనుపట్టణము నందలి వీధులును, గృహములును ఇటికకాలువలను కలిగియున్నవి. ఇండ్లయందు వాడిన నీరు పైనున్న కాలువలలోనికి ప్రవహించును. ౬౫౦౦ సంవత్సరములు గడిచినను, ఆ మట్టిగొట్టము లింకను నూతన నిర్మాణములవలె నిలిచియుండు టెంతయు నాశ్చర్యకరము.

ప్రాచీన హైందవ నాగరికత సహితము పారిశుద్ధ్యమున కుచితమైన యాధిక్య మొందగెను. సర్ జాన్ మార్షలునామధేయుడు ౧౯౩౧ లో ప్రచురించిన 'మొహెంజదారో...' అను గ్రంథ ముత్కృష్టమైనది. హైందవులు క్రీ.పూ. ౩౦౦౦ సంవత్సరములకు పూర్వమే ప్రశంసార్హమైన నాగరికత గాంచియుండి రని పరిశోధనలవలన స్పష్టమయ్యెను. మనకు ప్రకృతాంశము పారిశుద్ధ్యము గనుక దాని గుఱించియే విచారింతము. ఆ ప్రాంతమునందలి విశాలతమ భవనమును బహిర్గత మొనరించి పరిశీలింప నా క్రింద నీదుట కనువైన చక్కని గుండము కాన్పించెను. ఇటిక, సున్నము, శిలాజిత్తులతో నయ్యది ఖచ్చితముగా నిర్మింపబడి యున్నది. చెంతనున్న బావి జలము నొసగును. వాడిన నీటిని వెడలించుటకై యారడుగుల యున్నతి గల తూము అమరియున్నది. ప్రజాళి యొనరించు కర్మకలాపమునకై యద్దానిని వారు నిర్మించియుందురు. అనేక గృహములందు స్నానమందిరములు గలవు. ఆ జలమంతయు గొట్టములనుండి వెడలి, నగరాధికారులు నిర్మించిన స్నిగ్ధమృన్నాళములలో జేరి, ప్రజారోగ్యమునకు భంగము కొరయకుండ నిర్ణీతస్థలమునకు బోవును. ప్రజారోగ్యమునకై తన్నగరాధికారు లొనరించిన ప్రయత్నము లద్భుతములు. చెత్తచెదారములను దీసి వేయుటకు వలయు నుపాయము లరసిరి. మేలురకపు సున్నములను, ఇటికలను, శిలలను గూడ వినియోగించి శాశ్వతముగా నిలుచునట్లు లొనరించిన కాలువల నిర్మాణము ప్రజాసౌఖ్యారోగ్యవర్ధకమై శ్లాఘనీయమై యున్నది. ఈవిషయ మైదు వందలసంవత్సరముల నాటి యుదంత మని గ్రహింతుమేని మన ప్రాచీననాగరికతను దలంచి యుప్పొంగగలము.

ప్రాచీనగ్రీసు దేశమునందుగూడ నిట్టి నాగరక చిహ్నములు గలవు. గ్రీసుదేశము తత్పూర్వము విలసిల్లిన క్రీటుమైసీను దేశముల ననుకరించెను. క్రీ. పూ. ౫వశతాబ్దినుండియు నా దేశమునందలి పెద్దపట్టణము లందు వ్యాయామగృహములును, శీతోష్ణజలసమృద్ధము లగు స్నానఘట్టములును నుండెను. అయ్యవి ప్రజాక్షేమంకరులైన నగరాధికారులు నిర్మించినవి. అవి గాక, గృహస్థులు శిలావినిర్మితస్నాన మందిరములను, స్నానోపయోగములైన సుస్నిగ్ధమృత్తికాఘటము లను (Portable earthenware bath tubs) కలిగి యుండిరి.

ఏథెన్సు మొదలగు నుత్తమనగరములందు నీటివసతులు చక్కగా నుండెను. జలవాహికలు సాధారణముగా భూగర్భముననే యుండెను. ఈసందర్భమున రోమనుల యభిరుచి ప్రశంసనీయము. రోమనునగర పారిశుద్ధ్యము ప్రశంసనీయము. రాజధానియం దున్న మురికినీటి కాలువ లన్నియు గలియుటకై ౧౪ అడుగుల యెత్తును, ౧౧ అడుగుల వెడల్పును గల గొప్ప మదుమును వారు ౨౫౦౦ సంవత్సరముల క్రిందట నిర్మించిరి. ప్రజలు స్నానమాడుటకై గొప్పవసతుల నేర్పఱచిరి. 'కాన్స్టాంటైను' చక్రవర్తికాలమున నొక్క రోమునగరమునందే ౮౦౦ స్నాననిలయములు నిర్మింపబడియుండెనట. 'డయోక్లీషియను'అను రోమను సార్వభౌముడు ౩౨౦౦ జనులు స్నానమాడుటకు దగినట్లు ఒక మైలు చుట్టును స్నానఘట్టములను నిర్మించెను.

పూర్వయుగప్రజాళి యీవిధముగా పారిశుద్ధ్య విధానమునం దభిమానము వహించి నాగరికులై విలసిల్లిరి.

మొసలికంటి సంజీవరావు.

కవుల కథలు

1. సైరాకూస్ రాజయిన హయరో తన ఆస్థాన మహాకవియైన సైమనైడీసును (క్రీ.పూ. ౫౫౬–౪౬౮) ఒకనాడు "దేవుఁడనగా నేమి" యని ప్రశ్నించెనట. ఆ ప్రశ్నకు ఆ కవి వెంటనే సమాధానము చెప్పక ఒక

రోజు గడువు కోరెను. మరుసటిరోజు అడుగగా, యోచన చేయుట యింకను ముగియలేదని మరి రెండు రోజులు గడు వడిగెను. ఆ గడువు గడవగానే మరి నాలుగురోజులు, అదియు నయినపిమ్మట ఇంకొక వారము—ఈరీతిగా అడిగినప్పుడెల్ల వెనుకటికంటె రెండింతలుగా గడువుకోరుచున్న అతనిని చూచి రాజువు ఆశ్చర్యము నేసెను. చివరకిదిగా దని రాజు కవిని నిలువ దీసి "ఇదంతయు నేమిటి? ఒక ప్రశ్నకు జవాబు చెప్పుటకు ఇన్ని గడువులేల? నీ యుద్దేశ్యము యినను ఏమి?" అని అడిగెను. అందుకు కవి యిచ్చిన జవాబిది: "రాజేంద్రా! నేనేమి చేయుదును? ఆలోచించినకొలది ఆ విషయము అంతకంతకు గహనమైనదిగా, ఇది మిథ్య మని తేల్చి చెప్పలేనంత కఠినతరముగా కనబడుచున్నది"

2. యూరిపిడిస్ (క్రీ. పూ. ౪౮౦-౪౦౬) మిక్కిలి ధైర్యశాలి. ఒకనాడు అతడు వ్రాసిన నాటక మొకటి ప్రదర్శింపబడుచుండెను. ప్రదర్శనముమధ్య లో ఏదో ఒక భాగము తీసివేయవలెనని ప్రేక్షకులు గోలచేయ మొదలుపెట్టిరి. అది చూచి యూరిపిడిసు ఉగ్రుడై రంగముమీది కెక్కి "మహాజనులారా! నా పని మీకు పాఠము నేర్పుట; అంతేకాని మీనుండి పాఠము నేర్చుకొనుట గాదు." అని గర్జించెనట. సభ యంతయు సద్దు మణగెనట.

3. డ్యాంటి (౧౨౬౫-౧౩౨౧) ఒకనాడు ఒక వీథినిబడి పోవుచుండగా ఎవడో ఒక కమ్మరి తన కొట్టులో కూర్చొని యాదాలాపముగా అతని పద్యములను కొన్నిటిని గట్టిగా పాడుకొనుచుండుట అతనిచెవుల బడెనట. కాని, ఆ కమ్మరి ఆ పద్యములను ఉన్నవి ఉన్నట్లు పాడక కొన్ని పదములను వదలియు, కొన్నిటిని సొంతముగా కల్పించి, బంతులకు బంతులు తలక్రిందులు చేసియు ఇష్టము వచ్చినట్లుగా పాడుచుండెనట. డ్యాంటికి ఇది చూచి అరికాలిమంట నెత్తికెక్కెను. వెంటనే అతడు ఆ కమ్మరికొట్టులో దూరి అక్కడనుండిన ఉలి, సుత్తి, సమ్మెట మొదలైన ఉపకరణముల నన్నిటిని తీసి విసురుగా వీథిలో పారవేయ మొదలుపెట్టెను. అప్పుడు ఆ యిద్దరికిని ఈ క్రిందిరీతిగా వాగ్వాదమాయెను.

కమ్మరి—ఏమయ్యా! నీకేమి పిచ్చి గిచ్చి పట్టలేదా యేమి? ఇదేమి టీ పని?

డ్యాంటి—బహు పెద్దమనిషివేకాని, నీవుచేయుచున్న ఆ పనిమాత్ర మేమిటో ముందు చెప్పుము.

కమ్మరి—నా పని నేను చేసుకొనుచున్నాను. అందులో తప్పేమి? నీవే నా పనిముట్ల నన్నిటిని పాడుచేయుచున్నావు!

డ్యాంటి—నీ పనిముట్ల జోలికి నేను రాకూడదని యెడల నా పనిముట్లజోలికి నీవును రాకూడదు.

కమ్మరి—నీ పనిముట్లను నేటిని నేను ముట్టితి నయ్యా, వింతగా మాటలాడుచున్నావుగాని!

డ్యాంటి—నా పుస్తకములోని పద్యములను నీవు చదువుచున్నావు. కాని, నేను వ్రాసినవి వ్రాసినట్లుగామాత్రము నీవు చదువుట లేదు. నీ యిష్టము వచ్చినట్లు వదరుచు వాటి రూపే చెడగొట్టుచున్నావు. అదేలనో చెప్పుదువా మరి!

అతనితో వృథా తంటా యెందుకు అని ఆ కమ్మరి అంతతో చాలించి ఇంకేదో పాట నుపక్రమించెనట.

[ప్రబుద్ధ కర్ణాటక]

యస్. వి. రంగణ్ణ.

ప్రపంచములో ఇండియాస్థానము

ఇండియాలో ప్రపంచమంతటికిని వలయునంత గొప్ప తేతోటలు గలవు. ఇండియా ఉత్పత్తిచేయు తేయాకు ప్రపంచమునం దంతయు గుణమునందును, వాసనయందును పేరుపొందిన దగును. లోకమున అన్నిరకముల తేయాకును ఉత్పత్తిచేయు దేశములలో ఇండియా ప్రధానమగుచున్నది. ఇట్టి ప్రాధాన్యము యాదృచ్ఛికముగా గలిగినది కాదు. అది యిండియాలో ఉత్పత్తియగు తేయాకు యొక్క గొప్పతనముచే గలుగుచున్నది. నేల, శీతోష్ణస్థితి మున్నగు సౌకర్యములు ఇండియాలో ఉన్నవి. ఇండియా ఇప్పుడు 400 మిలియను పౌండ్ల తేయాకు ఉత్పత్తి చేయు

చున్నది. ప్రపంచమునందలి తేయాకు వర్తకమునందు ఇది ½ భాగమగును. ప్రపంచమునందలి అన్నివర్తకములలో 100 కి 1 భాగము తేయాకు వర్తకము. చీనాయందు తప్ప ప్రపంచమందంతటను ఒక్కొక్క సంవత్సరమును సుమారు 200,000,000,000 కప్పుల తేయాకు వ్యయమగుచున్నది. ఇండియాలోని ఉత్పత్తిలో సగమునకు పైన గ్రేటుబ్రిటనులోనే వ్యయపడుచున్నది.

నూరు సంవత్సరములకు మున్ను పరిమితి తెలియని తేయాకువర్తకము గల ఇండియా ఇప్పుడు ప్రపంచమున కంతకు సంపదగినంతటి స్థితికి వచ్చెను. అమెరికా యంతయు వ్యాపించియున్న ఇండియా తేయాకు వర్తకమే దీనికి కారణము. అమెరికాకు ఇండియా తేయాకుయొక్క యెగుమతి 50 సంవత్సరములకు మున్నుండినదానికంటె ఇప్పుడు పదింత లధికమయ్యెను.

ఇప్పుడు ఇండియాలో సుమారు 1,000,000 ఎకరములుగల తేతోటలు సుమారు 5,000 గలవు. ఇవి సుమారు 100 కోట్ల రూపాయల పెట్టుబడి గలవగును.

సర్వదేశ సామాన్య నిబంధనల చొప్పున ఇండియా 1936-37 లో రమారమి 309 మిలియను పౌండ్ల తేయాకు ఎగుమతి చేసెను. 1937-38 లో ఇండియా 328½ మిలియను పౌండ్లకు కొంచెము అధికముగానే తేయాకు ఎగుమతి చేసెను. 1926 నుండి 1932 వరకు ఇండియాలోని తేయాకు ఉత్పత్తి సరాసరి 405 మిలియను పౌండ్లు; కొన్ని సంవత్సరములలో తేయాకు ఇంకను అధికముగానే పైరగుచుండెను. 1932 లో సుమారు 85,5 మిలియను పౌండ్ల తేయాకు వ్యయపడినట్లు ఉద్దేశింపబడుచున్నది. 1936-37 లోని లెక్కలచే, ఇండియా, బర్మాయును చేరి 93,6 మిలియను పౌండ్ల తేయాకు వ్యయపడినట్లు తెలియుచున్నది. అనగా 1 సంవత్సరమునకు ఒక మనుష్యుడు 4 ఔన్సులకు కొంచెము అధికముగా లోగొనును. ఇది స్వదేశ వర్తకమును తెలుపుటయే కాక దానిని విస్తరింపవలయుననియు తెలుపుచున్నది.

తేయాకును ఉత్పత్తిచేయు ముఖ్యప్రదేశములు ఇండియా, సిలోను, చైనా, జపాను, ఫార్మోసా, ఫ్రెంచి, ఇండో-చైనా, ఆసియాలోని జావా, సుమిత్రా, ఆఫ్రికాలోని నెటాలు, న్యాసాలాండు నగును. తేయాకువర్తకము సోవియట్ రష్యాలో నందు జార్జియాలోను కొంచెము జరుగుచున్నది. ఇండియాలో అస్సామునందలి ఈశాన్యభాగమున గల దేశములను, బంగాళమునను సుమారు 85% తేయాకు ఉత్పత్తి యగుచున్నది. ఐక్యమాగాణము, చోటా నాగపూరు, కొడగు, త్రిపురం, మైసూరు, కొచ్చిన్, మదరాసు, తిరువాన్కూరు, పంజాబు మున్నగు ప్రదేశములందు తక్కినవి ఉత్పత్తి చేయబడుచున్నవి.

కుట్టుమిషనును కనిపెట్టినకర్మవీరుడు

మనిషి మంచిచెడ్డలను అతని వేష.భాషలనుబట్టే గ్రహించవచ్చు నంటారు మనవాళ్లు.

అంటే వేషానికి ఎంతటి ప్రాధాన్యం వుందో గ్రహించండి.

అధునాతననాగరకతలో రోజురోజుకూ వేషంలో మార్పులు, కొత్తకొత్తపద్ధతులు వస్తున్నాయి. అవీ క్షణాలమీద!

దీనికంతా కారణం ఇది యంత్రయుగం కావటమే! ఈయంత్రయుగంలో కుట్టుమిషనుకు ఎటువంటి స్థానం వుందో వేరే చెప్పక్కర్లేదు.

అటువంటి కుట్టుమిషనును కనిపెట్టిన వ్యక్తి జీవితవిశేషాలు తెలుసుకోటం అవసరం కాదూ?

కుట్టుమిషనును కనిపెట్టిన వ్యక్తి ఎలియాస్ హూవె అనే అమెరికన్. ఆయన ౧౮౧౯ లో పుట్టాడు. ఆయనతండ్రి ఒక పిండిమరతో కాలం గడుపుతూండేవాడు. పెంగుడూ, పెళ్లామూ, ఎనిమిదిమందిపిల్లలూ— వీరందరికీ ఆ పిండిమరే జీవనాధారం కావాల్సివచ్చింది. అందుచేత బిడ్డల్ని చాలా చిన్నతనంలోనే పనుల్లో ప్రవేశపెట్టేవాడు ఎలియాస్ తండ్రి. అవిధంగానే ఎలియాస్ కూడా తన ఆరవఏటనే పనికి కుదురుకున్నాడు.

సెలవురోజుల్లో తన తండ్రిమిల్లులోనే మిషనుదగ్గర పనిచేస్తూండేవాడు.

పదహారోఏట అతను లోవెల్ నగరానికి పోయి అక్కడ రెండేళ్లపాటు ఒక పత్తిమిల్లులో పనిచేశాడు. తర్వాత ఒక కర్మాగారంలో పనికికుదిరాడు. అక్కడి పని అతని మనసుకు నచ్చింది. అక్కడ పనిచేస్తూండ గానే ౨౧-వ ఏట పెళ్లయింది అతనికి.

పనైతే నచ్చినదే — కాని వరుమానం బహు స్వల్పం. మూడేళ్లు తిరిగేసరికి ముగ్గురుబిడ్డలు కలిగారు. సంసారజంజాటం జాస్తీ అవటంతో మనిషి డీలాఅయిపోయాడు. ఏమైతేనేమటు కేం చేస్తాడూ? ఆ రాబడిలోనే పొదుపుగా వ్యవహరిస్తూండేవాడు. బలహీనతతో పని భారం అయింది. మరింత శ్రమపడాల్సివచ్చింది. ఒక్కొక్కప్పుడు తిండిమాట తలవకుండా పనిచేస్తూండేవాడు.

ఇట్లా వుంటూవుండగా ౨౫-వ ఏట ఒక రోజున తోటిపనివా డొకడు ఏదో మాటలసందర్భాన "ఎవరన్నా బట్టలుకుట్టేమిషనును కనిపెడితే ఎంత బాగుంటుందీ?" అన్నాడు.

ఈమాట ఎలియాస్‌బుర్రలో మంచి సంచలనం కలిగించింది. ఆపని తనే ఎందుకు చెయ్యరాదూ అనిపించింది అతనికి. సరే ఇక అందుకు నిశ్చయించుకుని ఆలోచించడం ఆరంభించాడు.

ముందు ఒక రోజున తన భార్య బట్టలుకుట్టే తీరు జాగ్రత్తగా పరిశీలించాడు. దాన్ని పట్టి రెండు వేపులా మొనా, మధ్య కంతా కల సూదితో పని చేసే యంత్రం ఒకటి తయారుచేశాడు. కాని అది పనికిరాలేదు.

అకస్మాత్తుగా ఓ కొత్త అభిప్రాయం తట్టింది. ఏమంటే — ఒక దారానికి బదులు రెండుదారాలు వాడితే బాగుంటుందని. మొనదగ్గరే కంత కల సూదిని తయారుచేశాడు. దానికి తగ్గ యంత్రం తయారు చేశాడు. అతని ఆశయం పండబారింది. వాంఛితం నెరవేరింది. పట్టరాని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయాడు. ఆ తబ్బిబ్బులో ఉద్యోగానికి ఉద్వాసన చెప్పి స్వస్థానం చేరాడు. అక్కడ తను కనిపెట్టిన పనిముట్టును పరిపూర్ణం చేయాలని ఉద్దేశం. ఒక చిన్న దుకాణం పెట్టి కొద్దికొద్దిగా డబ్బు సంపాయించటం ప్రారంభించాడు.

కాని అన్నీ అనుకున్నట్టు సాగుతాయా? తానొకటి తలిస్తే దైవ మొకటి తలవడంవల్ల అతని ఇల్లు పరశురామప్రీతి ఐంది. అదృష్టవంతుకుకనక తన మిషన్ మోడల్ మినహా మిగిలిన సర్వం తుడిచిపెట్టుకు పోయింది. ఎలియాసుకు ఏమీ తోచలేదు. దిగాలు పడిపోయాడు మానవుడు. ఎటొచ్చీ, కటికచీకట్లో మిణుగురుపురుగులాగా, ఆమిషన్ మోడల్ ఒకటి మిగిలింది. తన జీవితాశయాలకు దానినే ఆధారం చేసుకున్నాడు. మరి ముందు పొట్టగడవట మెట్లా?

అట్టి కష్టకాలంలో దైవవశాత్తూ ఒక కట్టెల వర్తకుడు అతనికి ఆసరా అయాడు. ఆ సహాయంతో ఎలియాస్ మరో కర్మాగారం పెట్టి ఆరునెలల్లో తన మిషను తయారుచేశాడు. ఆమిషనుమీద రెండు పూర్ని సూట్లు కుట్టాడు. అతని వాంఛితం నెరవేరింది.

ఒక వరవడిని పడిపోతున్నవాడికి ఒక కొత్తదనం గోచరించటంతోటే అది వింతగా కనపడి, అతడు దాన్ని నిరసించటం జరుగుతున్నదేగా! అదే విధంగా ఈకుట్టుమిషనుకూ ప్రతిఘటన తగిలింది. అటువంటి సమయంలో దాన్ని ప్రచారంలోకి తీసుకురావటానికి మంచి యుక్తి, తెలివితేటలూ అవసరం. ఆగుణాలు ఎలియాసులో లేవు. తత్ఫలితంగా జరిగిందేమిటో గమనించండి.

తన వాంఛితం నెరవేరిందన్న పొంగుతో ఎలియాస్ ఆమిషనును తీసుకుని బోస్టన్ వెళ్లాడు. అక్కడి దర్జీ వాళ్లు దాని సౌలభ్యం గమనించకూడా పైన చెప్పిన కారణాలవల్లా, తమ పని పడిపోతుందనే భయంవల్లా ఎవరూ దాన్ని కొనటానికి ఇష్టపడలేదు. ఆమిషనును పట్టుకుని అతడు ఆపట్నంలోని కొట్టు కొట్టుకూ తిరిగాడు. ఊహుఁ! ఏమీ ప్రయోజనం లేకపోయింది. ఇంతవరకూ ఎలియాసుకు ఆసరాగా వున్న ఆయన ఇది చూసి ఏమీ గిట్టేటట్టు లేదని తలిచి తన భాగస్వామిత్వం వదులుకుని ఎలియాసును మరెక్కడికన్నా దయచేయమన్నాడు.

ఇది జరిగేసరికి ఎలియాసుకు నవనాడులూ కుంగిపోయినట్లయింది. చేతిలో సెంటుకూడా లేదు. సహాయం చేసే స్నేహితులూ లేరు. చేసేదిలేక సంసారాన్ని పోషించుకునేందుకుగాను ఇంజన్ డ్రైవరు ఉద్యోగంలో చేరాడు. కొన్నాళ్లు గడిచేసరికి జబ్బు చేసిం దతనికి. భార్యకూడా ఆరోగ్యం క్షీణించింది. అయితే ఎప్పుడూ ఎలియాస్ కుటుంబం ఇరుకూ పొరుకూ తలలో నాలికలా మెలుగుతూండేదికావటం వల్ల వాళ్లు ఈకష్టకాలంలో ఈ సంసారానికి ఆదరంతో ఆదుకున్నారు.

ఎట్లాగైతేనేం, ఎలియాస్ తిరిగీ కోలుకున్నాడు. అయితే అతని మనస్సు ఎప్పుడూ తన మిషను విషయమే యోచించేది. శరీరానికి దార్ఢ్యం చిక్కటంతోటే అతడు తన మిషనుకు అమెరికాలోకన్నా ఇంగ్లండులో ఎక్కువ గిరాకీ ఉంటుందనే ఉద్దేశంతో అక్కడికి ప్రయాణం కట్టాడు.

కాని, ఎలియాస్ పని 'రామేశ్వరం పోయినా శనేశ్వరుడు వదలలే' దన్నట్లు అయింది. ఇంగ్లండులోనూ అతని మిషనును ఎవరూ కొనటానికి ఇష్టపడలేదు. ఎలియాస్ నిస్పృహతో నిక్కటిల్లుతూండగా చీప్ సైడ్‌లోని ఒక ఆసామి అతని స్థితిని గమనించి ఏబుద్ధికో ఆమిషనును ౨౫౦ పౌన్లకు కొని, అతనికి వారానికి మూడు పౌన్ల జీతం కల ఉద్యోగం ఒకటి ఇచ్చాడు. ఎనిమిది మాసాలు ఆవుద్యోగంతో గడిచిపోయాయి. ఎలియాస్ ఆఆసామికర్కశత్వానికి తాళుకోలేకపోయాడు. చెప్పకుండా పెళ్లాంబిడ్డలను వెంటపెట్టుకుని లేచిచక్కాపోయాడు. చేతిలో పెన్నీ అయినా లేక ఎలియాస్ తన సంసారంతో సహా నిరాహారంగా వున్న రోజులుకూడా వున్నాయి ఆ పరిస్థితుల్లో. ఈ స్థితి అతన్ని స్వగృహోన్ముఖుణ్ణి చేసింది. కాని వచ్చేదీ? ఎట్లాగో తంటాలు పడి తన మిషన్ మోడలును ఒకదాన్ని తయారుచేసి ఆలుబిడ్డల్ని ఇంటికి పంపటానికి తగినంత సొమ్ముకు దాన్ని అమ్మాడు. తర్వాత కొన్నాళ్లకు పెళ్లానికి ప్రాణంమీదికొచ్చిందని విని అతడుకూడా అమెరికాకు వెళ్లిపోయాడు.

అతడు న్యూయార్కు చేరేసరికి జేబులో ౩ క్రౌనుమాత్రం వుంది. ఇంకా ౨౫౦ మైళ్లు ప్రయాణించాలి. ఏం చేస్తాడూ? దైవంమీద భారం వేసి అతను ఆ పట్నంలోని ఒక యంత్రాగారంలోకి పోయి రైలు ఖర్చుకు సరిపోయేది సంపాయించుకునేదాకా పని చేశాడు. తీరా ఇంటికి చేరేసరికి ఇల్లాలు దివికేగింది. నిరాశతో అతని హృదయం వ్రయ్యలైంది. అయినా మిషనువిషయంలో అతని దీక్ష సడలలేదు. కొద్ది రోజుల్లో అతను ఇంకో మోడల్ తయారు చేశాడు. అది తయారవుతూండగానే అప్రయత్నంగా బ్లిస్ అనే ఒక వ్యాపారస్థుని అండ అతనికి లభించింది. ఆ అండతో అతను కొన్ని మిషన్లను తయారు చేసి వాటిని అట్టా అట్టా అమ్మాడు. దైవం చల్లనిచూపులు పరపాడు అతనిమీద. క్రమక్రమంగా అతని మిషన్లకు గిరాకీ హెచ్చింది. పన్నెండేళ్లు తిరిగేసరికి 'మిలియనైర్' (కోటీశ్వరుడు) అయ్యాడు!

౧౮౬౭ లో 'పారిస్ ఎక్సిబిషన్' బంగారు పతకాన్నీ, తర్వాత కొంతకాలానికి 'క్రాస్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్'నూ పొందాడు. ఈ గౌరవం పొందిన కొలదిరోజులకే అతడు పరమపదించాడు.

నేడు చూడండీ! ప్రపంచంలోని ప్రతి మారుమూలపల్లెలోనూ కుట్టుమిషను కనపడుతుంది మహానుభావుడు ఎలియాస్ హొవె కృషిఫలాన. ఇతన్ని మరవగలమా?

సత్యశర్మ.



✽ విమర్శనము ✽

కాయధాన్యములు

కర్త: రావుసాహేబ్ గోటేటి జోగిరాజు గారు. ప్రకాశకులు: మేనేజరు, శ్రీ గ్రామసేవా ముద్రాలయము, కొండెవరంపోస్టు, తూర్పుగోదావరి జిల్లా. పుటలు ౧౮౯. వెల ౧ రూపాయి.

'పప్పులు' వాడని యిల్లు తెలుగుదేశమునందు లేదు. మానవశరీరనిర్మాణమునకు, దేహదార్ఢ్యమునకును అత్యవసరమయిన మాంసకృత్తులను సరఫరా చేయు కాయధాన్యములుగా (పప్పుదినుసులు) విరివిగా నుపయోగింపబడు కంది, పెసరలతో ప్రారంభించి, క్రమముగా మినుము, సెనగ, అనుము, సోయాఅనుము, అలచంద, ఉలవ మొదలయినవి ఈ గ్రంథమునందు వివరింపబడియున్నవి. ఈ కాయధాన్యజాతుల కన్నిటికిని దాదాపు ఒకేరకమైన లక్షణము లున్నవని తెలిసికొనుట చదువరులందు ఆపంటలను స్వయముగా పరీక్షించవలెనను కుతూహలము కలిగించును.

ఒక్కొక కాయధాన్యపుపంటయు జయప్రదముగా పైరగు నేలలను, చల్లుట మొదలు కోతవరకును కృషియందు పరికించవలసిన జాగ్రతలను తమ చిరానుభవమువలన గ్రంథకర్త చక్కగ పొందుపరచిరి. ఈ పంటలయొక్క కోత, కైలు మొదలగు విషయములయందు చూపవలసిన శ్రద్ధయు, పైర్లను వాడుకకు తయారుచేయుటలో వివిధపద్ధతులను సూచించు అధ్యాయములు ఆర్థికవిజయము నభిలషించు వ్యవసాయదారులెల్లరు అభినందించవలసియున్నది. పంటల సాగునకు సంబంధించిన ఆదాయవ్యయపట్టికలలో సమకూర్పబడిన వివరములును, అనుబంధమునందు పేర్కొనబడిన కాయధాన్యజాతుల సంఘట్టనములును ఎల్లరకును మిక్కిలి ఉపయోగపడగలవు.

ఆహారద్రవ్యముల పరిమితియందు అసాధారణ సంపద గల సోయాఅనుమునుగురించి ప్రత్యేకవిషయములు కూర్పబడినవి.

శాస్త్రీయపద్ధతులపై ఎక్కువ ఆహారపదార్థములను పండించవలసిన నేటి పరిస్థితులలో కాయధాన్యములను ఎప్పుడు, ఎట్లు పైరుచేయవలెనో యీ గ్రంథము విశదీకరించుచున్నది. తెలుగుజిల్లాలలో వ్యాపకమును దెలుపు పట్టికలనుబట్టి యీ పంటల విస్తీర్ణము నెక్కువచేయు ప్రదేశములనుకూడ నిర్ణయింపవచ్చును. ఇట్టి అవసర సమయమున ఇందులోనుండు అమూల్యమైన విషయములు తెలిసికొనుట కాయధాన్యములు పండించువారికే కాక వర్తకులకు, సర్కారు ఉద్యోగస్థులకుగూడ అత్యంతలాభకరము. ఇది ప్రతియింటను ఉండదగినది. పెక్కుబొమ్మలు కూడ ఉన్నవి.

కో. నా.

బ్రహ్మమీమాంసాసూత్రశ్రీకరభాష్యమ్
[చతుస్సూత్రి]

శ్రీపతి పండితాచార్య ప్రణీతము. పండిత చిదిరెమఠం వీరభద్రశర్మగారిచే పరిష్కృతము. శివధర్మగ్రంథమాల, ౭౨౬౮ సజన్‌లాల్‌వీథి, సికింద్రాబాదు. పుటలు ౧౧+౧౨౦. మూల్యము రూ. ౦-౧౨-౦.

జయతి పరాశరసూనుః
సత్యవతీ హృదయనందనో వ్యాసః,

యస్యాస్యకమలగలితం
వాఙ్మయ మమృతం జగత్ పిబతి.

అను శ్లోకార్థమును సార్థకముచేయు గ్రంథము వేదాంతసూత్రములు. శ్రీ శంకరాచార్యులతో నారంభించి అర్వాచీనులగు ఆచార్యులవఱకు తమతమ సిద్ధాంతములను ప్రకటించుటకు ఈ గ్రంథమే ప్రధాన రంగస్థల మైనది. వ్యాసుడు మథించిన వేదసర్వామృతమును విభిన్నసిద్ధాంతపాత్రికల బూరించి, తాపత్రయ తప్తులగు జీవులకు హృదయశాంత్యర్థ మనుగ్రహించుచున్న దీయాచార్యబృందము.

ఇట్టి కార్యభారమును గైకొని జయయుక్తముగ నిర్వహించిన శ్రీపతిపండితుని ప్రచేష్టయే శ్రీకరభాష్యము. శ్రీపతిపండితుడు మనిన తావు విజయవాడ; కాలము క్రీ. శ. ౧౦౪౨; ఏకోరామాచార్యశిష్యపరంపరలోనివాడు అని తమ పీఠికయందు ప్రకాశకులు సిద్ధాంతీకరించియున్నారు. అగుచో, ఇత డాంధ్రుడు. వల్లభనింబార్కులే కాక మఱియొక తెలుగుబిడ్డకూడ భాష్యకారులతో నెట్టపట్టములు వై మెఱెనుచున్నాడు! ఈ విషయ మాంధ్రులకు ముదావహము.

ఈ భాష్యము విశేషాద్వైత మనబడును, వీర శైవమతస్థాపకముగ నున్నది. శంకర, భాస్కర, రామానుజులకు తరువాత రచింపబడిన దగుటచే కాబోలు, ఆయా భాష్యచ్ఛాయ లిందు గోచరించుచున్నవి — భాషావిషయమున, సిద్ధాంతములగూడ. శంకరుని వాక్యరీతి, భాస్కరుని సిద్ధాంతముల చినుకు, రామానుజుని విశేషణాడంబరము, వాచస్పతిబింకము ఇందున్నవి. శంకరుని జగన్మిథ్యాత్వమును తదితరాచార్యులు వెలిపెట్టి అపార్థమొనర్చి ఖండించిన రీతియే ఇటగూడ నవలంబింపబడినది. శంకర రామానుజులకు బౌధాయన వృత్తి ఉపజీవిక యైనట్లు శ్రీపతికి అగస్త్యవృత్తి. ఈ రెండునుగూడ ప్రస్తుత మలబ్ధములు. శ్రీపతి శ్రీభాష్యమును స్త్రీభాష్యమని ఆక్షేపించి శ్రీకరమగు ఈ భాష్యమును విరచించినాడట !! బావమరదుల సరససల్లాపములవలె చల్లగ నుండు ఆక్షేపణలు విద్యావ్యసనమునకు ప్రోద్బలకములే యగును కాని, 'సరసము విరసము' కాకూడదు.

ప్రకాశకులు గ్రంథమును ఆంధ్రలిపిలో సంస్కృతభాషయందు ప్రచురించుటవలన దీని ప్రయోజనము పరిమితమగుచున్నది. సంస్కృతము తెలిసిన తెలుగువారికే దీని ఉపయోగము. అట్లుగాక, నాగరీలిపిలో వెలువరించియుండిన, దర్శనశాస్త్రాభిమానులగు యావత్ప్రపంచవాసులకును ఉపయోగపడెడిది. లేక, ఆంధ్రానువాద మున్నచో తెలుగువా రందరికిని అక్కరకు వచ్చెడిది. సంపూర్ణగ్రంథమును నాగరలిపిలో వెలువరింతుమని ప్రకాశకులు దెలిపియున్నారు. అది నిర్దుష్టముగ పాఠభేదములతో నుండునని తలచుచున్నాము. శ్రీహయవదనరావుగారు వెలువరించిన ప్రతి దోషజుష్టమని ప్రకాశకులతోబాటు మేమును అంగీకరించుచున్నాము. సంపాదకుల సదిచ్ఛ కార్యరూపమున బలపడుగాక !

పూర్ణానంద.

శ్రీ వివేకానంద జీవితచరిత్ర

[ద్వితీయ ముద్రణము]

రచయిత : మాధవచైతన్య బ్రహ్మచారిగారు. ప్రకాశకులు : శ్రీ రామకృష్ణ మఠాధ్యక్షులు, మైలాపూరు, మద్రాసు. వెల రు. ౧-౮-౦.

లోకప్రసిద్ధిబడసిన వివేకానందస్వామిజీవిత మిందలి వస్తువు. ఆంధ్రభాషావచనరచనలో మంచి నైపుణ్యమును సంపాదించుకొన్న మాధవచైతన్య బ్రహ్మచారిగారు గ్రథనకర్త. కాబట్టి ఇట్టి యుద్గ్రంథమునకు ఎట్టి యభిప్రాయమును అనవసరమే. పిట్టకథలా, కైలువాఙ్మయపుకథలా చదువుట కలవాటుపడిన గాథమనస్కులకును దీనిని జూచుట తటస్థించిన యెడల సాంతముగా గాకున్నను కొంతవరకైన జదువ నభిలాషకలిగి స్వల్పమాత్రమైనను లాభమును పొందగలరు. నరేంద్రు (వివేకానందు)ని విద్యాభ్యాసకాలపుదశ, వెంటనే వైరాగ్యజననము, శ్రీ రామకృష్ణుని సందర్శనము, మిత్రుల సంక్షోభవనము, స్వదేశవిదేశయాత్రాచరణము, లండను అమెరికా దేశములందు ప్రచారకార్యకరణము - ఇత్యాది సందర్భ

ములలో సంఘటిల్లిన వృత్తాంతములను చదువుటచే ఎటువంటివారికిని భారతీయవిజ్ఞానముపై అభిమానము జనింపకపోదు. అదిగాక ఇక్కడి విజ్ఞానశాస్త్రీయ బీజములను దూర దేశములందు వెదజల్లినలాగే ఆ దేశీయుల కర్మనిష్ఠాపరత్వమును అవగాహనము చేసికొని తదను సారము ఇక్కడను గురువుపేర పెక్కు సంస్థలను నెలకొల్పి వాటిద్వారా ఈ దేశమునందును ఆధునిక పద్ధతులమీద కార్యకరణశక్తిని ఉద్బోధింపజేయుట ఈ గ్రంథమునందలి ఒక విశేషాంశము. దీనిని ఆంధ్ర, మద్రాసు, అణ్ణామలై విశ్వవిద్యాలయముల కార్య కర్తలు గుర్తించి తమ పాఠ్యగ్రంథములందు చేర్చుట మిగుల ఆమోదింపదగినది.

శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారి సన్మానసంచిక

సంపాదకులు: మామిడిపూడి వెంకటరంగయ్య గారు. ప్రకాశకులు: ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక సంఘము.

కడచిన నెల ౧౩-వ తారీఖున గుంటూరునందు జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్థ మహాసభ యందు డా. సర్ కట్టమంచి రామలింగారెడ్డిగారిచే శ్రీ పంతులుగారికి సమర్పింపబడిన సన్మానసంచిక. ఇందు శ్రీ అయ్యంకివారు ముఖ్యముగా ఆంధ్ర గ్రంథాలయముల విషయమునను, మరియు అనేక దేశోప కారక కార్యములందును గావించిన ప్రయత్నములను అభినందించుచు ఆంధ్రదేశమందలి విద్వాంసులు వ్రాసిన వ్యాసరాజములు పెక్కులు గలవు. దీనినిజదువు వారందరును ఇట్టి సమాజోపకారకములైన కార్యము లందు ఎట్టి మార్గముల నవలంబింపవలసినదియు, ఎట్టి మనఃస్థైర్యము, ఎట్టి సహనము పూనియుండవలసిన దియు లోనగు విషయములను గ్రహింపగలుగుదు రన టకు సందియము లేదు.

శ్రీ వివేకానంద సింహగర్జనము

రచయిత: మాధవ చైతన్య బ్రహ్మచారిగారు. ప్రకాశకులు: శ్రీరామకృష్ణ మఠమువారు, మైలా పూరు, మద్రాసు. వెల రు. 0-0-6.

శ్రీ వివేకానంద సంపూర్ణ గ్రంథమాలనుం డియు, వారి జీవిత చరిత్రనుండియు నెత్తి ప్రత్యేకముగ ముద్రింపబడిన చిన్న పుస్తకము. ఇందలి వాక్యరత్న ములు మననము చేయతగినవి.

ఇలవేల్పు

గ్రంథకర్త: ధనికొండ హనుమంతరావుగారు, తెనాలి. వెల రూ. ౦-౮-౦. సామాజికవస్తు సంకలిత మైన ఒక చిన్న నవల. నడక కుంటులేక నడచినది. కథ సామాన్యముగా నున్నది.

విప్లవజ్వాల

విప్లవగీతాలసంపుటి. రచయిత: వట్టికొండ రంగయ్య గారు, వీరులపాడు, కృష్ణాజిల్లా. వెల ౫ అణాలు.

నవ్వులు - పువ్వులు

బాలవాఙ్మయమునకు చేరిన కొన్ని పాత, కొత్త పాటల సంపుటీకరణము. సంకలించినది: గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు, ఘంటశాల. వెల ౪ అణాలు.

గ్రంథస్వీకారము

సారంగధర చరిత్రము

చేమకూర వేంకటరాజప్రణీతము. జీతకా టీకాసహితము. టీకాకర్త: విద్వాన్ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, ప్రధానాంధ్ర పండితులు, వి. ఆర్. సి. హైస్కూలు, నెల్లూరు. ౬౦౦ పుటల గ్రంథము. వెల రూ. ౨-౮-౦.

ధర్మజ్యోతి

చిన్న పద్యకావ్యము. గ్రంథకర్త: తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు, పండితుడు, బోర్డు హైస్కూలు, పొన్నూరు, గుంటూరుజిల్లా. వెల ౦-౮-౦.

ప్రవరుడు
(మాయావిలసనము)

పద్యకావ్యము. గ్రంథకర్త: సామవేదం జానకిరామ శర్మగారు, సాహిత్యమండలి, ఏలూరు. వెల ౦-౮-౦.

అమరావతీ శిల్పములు

[మద్రాసు మ్యూజియము ఆర్కియలాజికల్ క్యూరేటరు శ్రీ సి. శివరామమూర్తిగారు 'అమరావతీ శిలా శిల్పములు' అను పేర ఇంగ్లీషుభాషలో క్రొత్తగా రచించిన గ్రంథమును- సవిమర్శ చిత్రరేఖా రచనా ప్రతిబింబమును ఆమూలాగ్రముగా నాలోకించి యానందించి వారికి నేను వ్రాసిన లేఖములోని పద్యము లీక్రిందివి:]

నాఁ డమరావతీపురి ననల్పచమత్కృతి శిల్పకల్పనల్
వేఁడొ ఘటింపఁజేసెను బ్రవీణుఁడు, నేఁటికిఁ జెల్లె రెండువే
లేఁడులు, కాని లోకము గ్రహింపద తన్మహిమంబు, శిల్పపుం
బోఁడుము, లిప్డు నీవు వెలిపుచ్చితి వచ్చెరువయ్యె! నాయనా!

ఆశల కెక్కఁ బ్రాఁకెఁ బరమాద్భుతశిల్పము నాఁడె యెట్లు త
న్నాశము గల్గెనో తలఁచినన్ మది నీరగు, నీవ యూాడువే
మో శివరామమూర్తి యపు డుండి ఘటించినవాఁడ, విప్డు త
న్నాశము నోర్వఁజాలక పునర్జననంబున నుద్ధరించితో!

నాశపఱుచుట సుకరంబె నాయనా! సు-నంఘటనమన్న నది పునర్జన్మమెత్తి
చేయఁదగినది నీ వెంత చేసితోయి! - యేమి డెందమో నీడెంద మెఱుఁగనోయి!

పాయక యెన్నొ యేండ్లు కనుపండువులై యమరావతీశిలల్
నాయెదుటన్ నిలంబడె ననల్పపుశిల్పముతోడ, వాని నేఁ
బాయఁగలేక యెట్లొ యెడఁబాసితిఁ జెన్నపురిం ద్యజించి; నీ
చే యిపు డక్కా-అంతఁ దోఁచెన్ గనిపించితి వీమహాకృతిన్.

దివ్యతేజోధార దిగజార్చు బుద్ధదివ్యస్వరూపముల కాహ్లాదమంది
బహుజాతకకథానుబంధచిత్రమ్ముల మహనీయతకు మేను మఱచిపోయి
అతికుచాభోగమ్ము నతనాభి నవుమోము గల్గు తెల్గునెలంత కళల కలరి
సింహమధ్యాశ్లేష చిత్రచిత్రిత యక్షచిత్రకల్పనకు నచ్చెరువుచెంది
చెలఁగి పల్నాటిచలువఱాల్ చిత్రకరుల-యులుల వెన్నమైనములయి కరఁగె ననుచు
మురియుచుందు, నామురుపులు పుస్తకమున-రాశిపోసితే! యిటు శివరామమూర్తి!

వే టూ రి ప్ర భా క ర శా స్త్రి

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.